ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 6-2-2019 బుధవారం సిటీ సంపుటి 45 . సంచిక 177 రూ. 6-50 పేజీలు 20+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



తల్లి గర్భం నుంచి చరమాంకం వరకు ప్రతి దశలోనూ సంక్షేమాన్ని అమలుచేస్తున్న స్ఫూర్తిదాయకమైన ప్రభుత్వం మాది

– యనమల

రాష్ట్ర బడ్జెట్

(ఓట్ ఆన్ అకౌంట్)

2019-20

బడ్జెట్ మొత్తం (రూ.కోట్లలో):
2,26,177.53

రెవెన్యూ వ్యయం:
1,80,369.33


మూలధన వ్యయం:
29,596.33

ఓ వైపు సకల జనుల శ్రేయస్సు..
మరోవైపు ఆర్థిక సంక్లిష్టతలు..
ఇంకోవైపు ఎన్నికల ముంగిట నిలిచిన రాజకీయ అనివార్యత..

ఈ మూడింటినీ సమతౌల్యం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం భారీ కసరత్తే చేసింది. సంక్షేమ మంత్రాన్ని జపిస్తూ భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఓటర్లను ఆకట్టుకోవడమే లక్ష్యంగా 'ఎన్నికల పద్దు'ను ఆవిష్కరించింది. వివిధ వర్గాలపై వరాల వర్షం కురిపించింది. రైతన్నకు గుండె ధైర్యం ఇచ్చే ప్రయత్నం చేసింది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచింది. సకల జనులకూ 'కేటాయింపుల విందు భోజనం' వడ్డించింది.

విద్య, వైద్యం, సాగునీరు.. ఇలా దేనికీ లేదనకుండా కీలక రంగాలన్నింటికీ పుష్కలంగా కేటాయింపులు చేసింది. ముందుముందు ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా.. ఇప్పటికే ప్రకటించిన పథకాల్ని ప్రజలకు చేరువ చేయడానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఓట్ ఆన్ అకౌంట్‌లో నిధులు కేటాయించింది. కేంద్రం నుంచి ఆశించిన సాయం అందనప్పటికీ.. కేటాయింపుల విషయంలో మాత్రం ఆర్థిక మంత్రి యనమల ఎక్కడా వెనక్కి తగ్గలేదు. పైపెచ్చు గత ఏడాది కన్నా ఈ బడ్జెట్లో 35,113 కోట్లు అధికంగా చూపారు.

సంక్షేమ సవారీ



చిత్రం: బాలు

బడ్జెట్ దశ, దిశ అదే

రైతులు, సామాజిక వర్గాలు, సంక్షేమ రంగాలకు భారీగా పెరిగిన కేటాయింపులు

ఇవీ లక్ష్యాలు...

సమాజ వికాసం | కుటుంబ వికాసం | సుస్థిర అభివృద్ధి

కులాలవారీ కార్పొరేషన్లకు (రూ.కోట్లలో)

బీసీ కులాల కార్పొరేషన్లు...	3,000
కాపులు...	1,000
బ్రాహ్మణులు...	100
క్రైస్తవులు...	100
వైశ్యులు...	50
క్షత్రియులు...	50
ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు...	720

సంక్షేమ పథకాలకు (రూ.కోట్లలో)

పసుపు-కుంకుమ ...	4,000
సామాజిక భద్రత పింఛన్లు...	12,819
నిరుద్యోగ భృతి...	1,200
చంద్రన్న పెళ్లి కానుక...	428
ఇమామ్‌లు, మౌజన్లకు...	100
చంద్రన్న బీమా...	354
మహిళలకు వడ్డీలేని రుణాలు...	1,100
అన్న క్యాంటీన్లు...	300

కీలక రంగాలకు (రూ.కోట్లలో)

వ్యవసాయం....	12,732.97
జలవనరులు....	16,852.27
గ్రామీణాభివృద్ధి...	35,182.61
వైద్య ఆరోగ్యం...	10,032.15
సెకండరీ విద్య...	22,783.37
ఉన్నత విద్య...	3,171.63
గృహనిర్మాణం...	4,079.10
బీసీ సంక్షేమం...	24,468.64
సాంఘిక సంక్షేమం...	21,228
మహిళ, శిశు సంక్షేమం..	3,408.66
పట్టణాభివృద్ధి...	7,979.34

6 కొత్త పథకాలు (రూ.కోట్లలో)

అన్నదాత సుఖీభవ	5,000
ఇళ్లస్థలాలకు భూసేకరణ	500
ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు	400
డ్రైవర్ల సాధికార సంస్థ	150
పట్టణాల్లో మౌలిక సదుపాయాలు	100
క్షత్రియ సంక్షేమం	50

అన్నదాత సుఖీభవ పథకం తెస్తున్నాం. వ్యవసాయాన్ని లాభసాటిగా తయారుచేసి రైతుకు అండగా నిలుస్తాం.

– చంద్రబాబు

ప్రత్యేక కథనాలు 2,6,7,8,9, 10,11 పేజీల్లో



కోల్‌కతా రగడకు తాత్కాలిక తెర!

- సీబీఐ విచారణకు కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ హాజరవ్వాలన్న సుప్రీంకోర్టు
- ఆయన్ను అరెస్టు చేయొద్దని స్పష్టీకరణ
- తదుపరి విచారణ 20కి వాయిదా
- తమదంటే తమదే విజయమంటూ మమత, భాజపా ప్రకటనలు
- నిరసన విరమించిన దీదీ
- కేంద్రంపై పోరాటం కొనసాగిస్తాం: చంద్రబాబు

12లో

కోల్‌కతాలో మంగళవారం మమతా బెనర్జీతో కలిసి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



క్షేత్రస్థాయికి వెళ్లండి.. ఎన్నికలకు సిద్ధం కండి

- కాంగ్రెస్ నేతలకు రాహుల్ సూచన
- ప్రియాంక పర్యటనకు అంగీకారం
- నెలాఖరుకల్లా అభ్యర్థులు: రఘువీరా

3లో

నేడు తిరుపతిలో వైకాపా సమరశంఖారావం సభ



పార్టీ ప్రతినిధులతో జగన్ భేటీ

ఎన్నికలకు సన్నద్ధం చేయడమే లక్ష్యం

ఆర్టీసీలో సమ్మె లేదు

- 25 శాతం తాత్కాలిక ఫిట్‌మెంటు
- తర్వాత ఎన్జీవోలు, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులతో సమానంగా ఫిట్‌మెంట్
- 2020 నాటికి వేతన సవరణ బకాయిలన్నీ చెల్లించాలని నిర్ణయం
- ఉగాదినాటికి బకాయిల తొలి వాయిదా చెల్లింపు
- రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక సంఘాల ఐకాసల చర్చలు ఫలప్రదం


16లో

పోలీసుల అదుపులో కిరీటాల దొంగ?

నిందితుడు పాత నేరస్థుడిగా గుర్తింపు

3లో

తేలుతున్న గోవిందరాజస్వామి ఆలయంలో చోరీ వ్యవహారం



పోలవరం డీపీఆర్-2పై ముందడుగు

8న దిల్లీలో సాంకేతిక సలహా కమిటీ భేటీ

3లో

ప్రతికూలతలోనూ ప్రగతి పథం

- నీటిపారుదల, వ్యవసాయోత్పత్తి, ఉత్పాదకత ఆహారభద్రత, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం
- రైతులు, మహిళలు, యువత, వృద్ధుల సంక్షేమానికి పెద్దపీట
- బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి యనమల

ఈనాడు – అమరావతి

ప్రతికూల పరిస్థితుల్లోనూ అనుకున్న విజయాలను సాధించామని రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. శాసనసభలో మంగళవారం ఆయన 2019-20 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ప్రసంగించారు. రాజధాని అమరావతిలో వరుసగా మూడో బడ్జెట్ ప్రవేశపెట్టడం ఎంతో గర్వకారణంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. నాలుగున్నరేళ్ల ప్రయాణంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని తెలిపారు. హేతుబద్ధత లేకుండా విభజన చేయడంతో పాటు ఆదాయవ్యయాలను సరిగా పంచలేదని మంత్రి వివరించారు. ఇదే బడ్జెట్‌ను శాసనమండలిలో పురపాలక మంత్రి నారాయణ ప్రవేశపెట్టారు. శాసనసభలో ఆర్థిక మంత్రి యనమల ప్రసంగంలోని ముఖ్యాంశాలివి..



శాసనసభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడుతున్న ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు

- పసుపు-కుంకుమ కింద రాష్ట్రంలోని 93.31 లక్షల మంది స్వయంసహాయక సంఘాల మహిళలకు రూ.9,381 కోట్ల లబ్ధి చేకూరుతుంది.
- రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పేరుతో మరో వినూత్న కార్యక్రమానికి రూ.ఐదు వేల కోట్లు ప్రతిపాదిస్తున్నాం.
- రూ.24వేల కోట్ల రుణభారం నుంచి రైతులను ప్రభుత్వం విముక్తులను చేసింది. చివరి రెండు వాయిదాలు రైతుల బ్యాంకు ఖాతాలకు త్వరలో జమ చేస్తాం. ఉద్యాన రంగంలో 2.23 లక్షల మంది రైతులకు రూ.384 కోట్ల రుణ ఉపశమనం కల్పించాం.
- ఆహార పరిశ్రమలకు రూ.300 కోట్లు... పశు గ్రాసం, ఆహారాభివృద్ధికి 2019-20లో రూ.200 కోట్లు ప్రతిపాదిస్తున్నాం.
- నిరుద్యోగ యువతకు 'ముఖ్యమంత్రి యువ నేస్తం' పథకంతో 4.30 లక్షల మంది లబ్ధి పొందనున్నారు.
- ఉద్యోగాల సృష్టి, నియామకాలు పారదర్శకంగా ఉండేలా ఆన్‌లైన్‌లో ఉంచుతున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కావడం గర్వకారణం.

"తల్లి గర్భం నుంచి జీవితాంతం వరకు ప్రతి దశలోనూ సంక్షేమాన్ని అమలు చేస్తున్న స్ఫూర్తిదాయక ప్రభుత్వమిది. వ్యాపార, వాణిజ్యాభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించడంతో పాటు పేదరిక నిర్మూలన, ఆహారభద్రత, రైతులు, అసంఘటిత కార్మికులు, ఎస్సీ ఎస్టీలు, బడుగు బలహీన, వెనుకబడిన వర్గాలు, మహిళలు, శిశువులు, యువత, దివ్యాంగులు, హిజ్రాలు, వయోవృద్ధులకు సాధికారత కల్పించడానికి చేపట్టిన చర్యలు, పాటించిన విధానాలు సత్ఫలితాలనిచ్చాయి.

నీటిపారుదల, వ్యవసాయోత్పత్తి, ఉత్పాదకత, ఆహార భద్రత, అందరికీ పక్కా ఇళ్లు, సురక్షిత తాగునీరు, పారిశుద్ధ్యం, నిరంతర విద్యుత్, రహదారుల నిర్మాణం, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య భద్రత, జీవనోపాధి అవకాశాలు, సామాజికభద్రత, పట్టణ, గ్రామీణాభివృద్ధి రంగాలలో రాష్ట్రం వేగవంతమైన అభివృద్ధిని నమోదుచేసింది. **- యనమల**

- రజక, నాయీబ్రాహ్మణ, వడ్డెర, కృష్ణబలిజ, వాల్మీకి, బోయ, భట్రాజ, శాలివాహన, కల్లు గీత సమాఖ్యలను సహకార ఆర్థికసంస్థలుగా మార్చుతున్నాం.
- దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ వారి పునరావాసం, కృత్రిమ అవయవాల ఏర్పాటుకు 2019-20లో రూ.70 కోట్లు కేటాయిస్తున్నాం.
- ఎస్సీ ఉపప్రణాళికకు 2018-19కంటే అదనంగా 28 శాతం పెంచుతూ రూ.14,367 కోట్లు ప్రతిపాదిస్తున్నాం. ఎస్టీ ఉపప్రణాళికకు కూడా 29 శాతం అదనంగా రూ.5,385 కోట్లు, బీసీ ఉపప్రణాళికకు 2018-19 కంటే 33 శాతం అదనంగా రూ.16,226 కోట్లు కేటాయిస్తున్నాం.
- ఎన్టీఆర్ వైద్యసేవ పథకానికి ప్రస్తుత కేటాయింపులు రూ.వెయ్యి కోట్లను రూ.1,200 కోట్లకు పెంచుతున్నాం.
- ఆరోగ్య సంస్థల్లో సదుపాయాల అభివృద్ధి, ఔషధాల కొనుగోలుకు రూ.300 కోట్లను రూ.402 కోట్లకు పెంచుతున్నాం.
- మానవవనరుల విభాగానికి రూ.29,955 కోట్లు కేటాయిస్తున్నాం. మొత్తం బడ్జెట్‌లో ఇది దాదాపు 11.5 శాతంగా ఉంది.
- అమరావతి నుంచి అనంతపురం వరకు గ్రీన్ ఫీల్డ్ కింద 384 కి.మీ. రహదారిని రూ.20 వేల కోట్లతో అభివృద్ధి చేసేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ నుంచి అనుమతి లభించింది.
- రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీలు, అప్పటి ప్రధాని హామీల అమలు, కేంద్ర పన్నుల్లో మన వాటా కోసం చేసే పోరాటంలో వెనకంజ లేదు. ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే యాచకులం అంతకన్నా కాదు.

ఒకటడిగితే రెండిచ్చాం

- తెలుగురాష్ట్రాలకు 50 ఏళ్లలో అందనంత సాయం చేశాం
- అసమానతలు రూపుమాపడమే భాజపా లక్ష్యం
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

నారాయణగూడ, న్యూస్‌టుడే: కేంద్రం నుంచి గత 50 సంవత్సరాల కాలంలో అందనంత సహాయాన్ని తెలుగు రాష్ట్రాలకు ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం అందించిందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యానించారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు 'ఒకటి' అడిగితే 'రెండు' ఇచ్చామన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు భాజపాకు రాజకీయంగా మద్దతు ప్రకటించకపోయినా, ఇరురాష్ట్రాల అభివృద్ధి విషయంలో కేంద్రం రాజీపడలేదన్నారు. అగ్రవర్ణాల పేదలకు 10% రిజర్వేషన్లు ఆయా వర్గాల్లోని వెనుకబాటుతనాన్ని దృష్టిలో ఉంచుకొని కల్పించినవే తప్ప.. కులప్రాతిపదిక ఇచ్చినవి కాదని స్పష్టం చేశారు. ఈ రిజర్వేషన్లు కల్పించినందుకు తెలంగాణ ఓసీ సంక్షేమ సంఘం, రెడ్డి ఐక్యవేదిక, వైశ్యవికాస వేదికల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో 'కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీ'కి అభినందన సభ ఏర్పాటు చేశారు. అనంతరం తెలంగాణ ఓసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, వైశ్య వికాస వేదిక వ్యవస్థాపకులు కాచం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ప్రధాని పక్షాన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సత్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్థికంగా, సామాజికంగా.. అన్ని విధాలుగా వెనుకబడిన అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విప్లవాత్మకమైందని ఆయన అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లకు విఘాతం కలగకుండా, అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు ఇచ్చామని, ఆర్థిక, సామాజిక అసమానతలను రూపుమాపడమే భాజపా లక్ష్యమని అన్నారు.

సంక్షేమ మంత్రం

- ఈ రంగానికే పెద్ద పీట
- ఆరు కొత్త పథకాలకు నిధులు
- కోడ్ వచ్చినా ఇబ్బంది లేకుండా కేటాయింపులు
- రూ.5 వేల కోట్లతో 'అన్నదాతా సుఖీభవ'
- 'పసుపు-కుంకుమ'కు భారీగా నిధులు
- నిరుద్యోగ భృతి రూ. వెయ్యి నుంచి రూ. 2 వేలకు
- పంచాయతీరాజ్, వ్యవసాయరంగాలకూ ప్రాధాన్యం
- పింఛన్లకు గణనీయంగా పెంపు
- 2019-20 సంవత్సరానికి రూ.2.26 లక్షల కోట్లతో భారీ బడ్జెట్

ఈనాడు – అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ మంత్రం పఠించింది. ఎన్నికల తంత్రానికి పదును పెట్టింది. సాధారణ ఎన్నికలు ముంగిట్లో నిలిచిన నేపథ్యంలో దూకుడు పెంచింది. ఓటర్లను ఆకట్టుకోవడమే లక్ష్యంగా... సంక్షేమానికి అగ్ర ప్రాధాన్యమిస్తూ.... 'ఎన్నికల పద్దు'ని రూపొందించింది. ఇటీవల కాలంలో అధికారికంగా ప్రకటించిన, అనధికారికంగా వెల్లడించిన సంక్షేమ పథకాలకు భారీ కేటాయింపులు చేసింది. అదే సమయంలో ప్రభుత్వ ప్రాధాన్యరంగాలైన వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి వంటి వాటికి ఇతోధికంగా నిధులు పెంచుతూ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు 2019-20 సంవత్సరానికి మంగళవారం శాసనసభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఎన్నికల కోడ్ వచ్చినా ఇబ్బంది లేకుండా... మార్చి నెలలో లేదా ఏప్రిల్ మొదటి వారంలో ఇప్పటికే ప్రకటించిన పథకాలు అమలు చేసేందుకు వీలుగా నిధులు కేటాయించారు. అమల్లో ఉన్న ఇతర సంక్షేమ పథకాలను బాగా విస్తరించారు. కేటాయింపులు అనేక రెట్లు పెంచారు. చంద్రబాబు ప్రభుత్వమంటే అభివృద్ధి ప్రాజెక్టులకు, సంస్కరణలకు పెద్ద పీట వేస్తుందని పేరు. దానికి తగ్గట్టే... అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలో సంక్షేమానికి కొంత ప్రాధాన్యమిచ్చినా... ఆ తర్వాతి రోజుల్లో అభివృద్ధి, పరిశ్రమలు, మౌలిక వసతుల ప్రాజెక్టులకే ఎక్కువ నిధులు వెచ్చించింది. దానికి కాస్త భిన్నంగా... ఇది ఎన్నికల సంవత్సరం కావడంతో... గత నాలుగైదు నెలల నుంచి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ఉదారంగా ఖర్చు పెడుతోంది. సామాజిక పింఛన్ల కింద ఇస్తున్న మొత్తాన్ని రెట్టింపు చేసింది. డ్వాక్రా మహిళలకు పసుపు-కుంకుమ కింద రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం వంటి అనేక సంక్షేమ పథకాలను అమల్లోకి తెచ్చింది. ఈ బడ్జెట్‌లో ఆయా కార్యక్రమాలకు అగ్రతాంబూలం ఇచ్చింది. వివిధ వర్గాలకు ఆరు కొత్త సంక్షేమ పథకాలను ప్రకటించింది.

రాష్ట్రంలో 86 లక్షలకుపైగా ఉన్న రైతులను ఆకట్టుకోవడానికి రూ.5,000 కోట్లతో 'అన్నదాతా సుఖీభవ' పథకాన్ని తీసుకువచ్చింది. దీని విధి విధానాలు వెల్లడించాల్సి ఉంది. ఎన్నికలకు ముందే దీనిని అమల్లోకి తెచ్చే ఉద్దేశంతో నిధులకు ఇబ్బంది లేకుండా కేటాయింపులు చేసింది. తమ సామాజిక వర్గంలోని పేద వారిని ఆదుకోవడానికి సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని ఇటీవలే తెదేపాకి చెందిన క్షత్రియ ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరగా... రూ.50 కోట్లు కేటాయించింది. ఆటోడ్రైవర్లకు జీవితకాల పన్ను, ట్రాక్టర్లకు త్రైమాసిక పన్ను ఇటీవలే రద్దు చేసిన ప్రభుత్వం... వారిని మరింతగా ఆదుకునేందుకు రూ.150 కోట్లతో 'డ్రైవర్ల సాధికార సంస్థ'ను ఏర్పాటు చేసింది. 'పసుపు-కుంకుమ' పథకానికి గత బడ్జెట్‌లో రూ.1700 కోట్లు కేటాయించగా... ఈ సారి దానిని రూ.4 వేల కోట్లకు (135.29%) పెంచింది. ఈ పథకం కింద డ్వాక్రా మహిళలకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని మూడు విడతలుగా అందిస్తోంది. ఆ మేరకు చెక్కులను ముందస్తుగా ఇచ్చేసింది. వీటిలో తొలివిడత చెక్కుల్ని మహిళలు ఇప్పటికే బ్యాంకుల్లో మార్చుకుంటున్నారు. మిగతా రెండు విడతల చెల్లింపులు మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగేలా కేటాయింపులు చేసింది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు వంటి వారిని ఆదుకునేందుకు సామాజిక పింఛన్లను రెట్టింపు చేసిన ప్రభుత్వం... వీటికి కేటాయింపుల్ని 155.77 శాతానికి పెంచింది. గత సారి పింఛన్లకు రూ.5012 కోట్లు కేటాయించగా.... ఈ సారి ఆ మొత్తాన్ని రూ.12,819.18 కోట్లకు పెంచింది. వనరుల సమర్థ వినియోగం ద్వారా సంక్షేమానికి ఎక్కువ నిధులు కేటాయించగలుగుతున్నామని, సాంకేతికతను వాడటం ద్వారా పథకాల దుర్వినియోగాన్ని అరికడుతున్నామని ఆర్థిక మంత్రి యనమల తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఆధార్‌తో అనుసంధానం చేయడం వల్ల పౌర సరఫరాల వ్యవస్థలో రూ.2,585 కోట్లు ఆదా చేశామని చెప్పారు.

రెవెన్యూలోటు రూ.2,099 కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం 2019-20 ఆర్థిక సంవత్సరానికి రూ.2,26,177 కోట్లతో భారీ బడ్జెట్ ప్రవేశపెట్టింది. 2018-19 బడ్జెట్ అంచనాల కంటే ఇది రూ.35,113 కోట్లు అధికం. రాష్ట్ర విభజన తర్వాత 2014-15 నుంచి ఏటా సగటున రూ.15 వేల కోట్లు చొప్పున కేటాయింపులు పెరుగుతుండగా.... 2018-19లో ఒక్కసారిగా రూ.34,064.21 కోట్లకు పెంచారు. రెవెన్యూ వ్యయాన్ని రూ.1,80,369 కోట్లుగా... మూలధన వ్యయాన్ని రూ.29,596 కోట్లుగా పేర్కొన్నారు. రుణాల చెల్లింపులకు రూ.14,917 కోట్లను చూపించారు. 2018-19 సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.2,494.12 కోట్ల రెవెన్యూలోటు చూపించగా.... ఈసారి రూ.2,099 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. 2018-19 సవరించిన అంచనాల ప్రకారం ద్రవ్యలోటు రూ.29,141.72 కోట్లు... ఈ సారి అది రూ.32,391 కోట్లకు పెరిగింది. రాష్ట్రానికి సమకూరే ఆదాయంలో... కేంద్ర పన్నుల్లో వాటాల రూపంలో రూ.36,360 కోట్లు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో రూ.60,721 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయ వనరుల నుంచి రూ.75,438 కోట్లు వస్తుందని అంచనా వేశారు.

ప్రాధాన్య రంగాలకు భారీగా నిధులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్య రంగాలకు నిధులు భారీగా పెంచింది. గ్రామాలను... సిమెంట్ రోడ్లు, మురుగునీటి పారుదల వ్యవస్థ, ఇంటింటికీ కుళాయి నీరు వంటి మౌలిక వసతులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. దానిలో భాగంగానే.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.31,208.82 కోట్లు (50.10% అధికం) ఇవ్వగా... వ్యవసాయం, అనుబంధ రంగాలకూ కేటాయింపులు ఎక్కువ చేసింది. వ్యవసాయ, మార్కెటింగ్ రంగాలకు రూ.12,732.97 కోట్లు (26.10% పెంపు), అనుబంధ రంగాలకు రూ.1743.02 కోట్లు (16.62% పెంపు), కార్మిక, ఉపాధి కల్పన శాఖకు రూ.1225.75 కోట్లు (50.43% పెంపు) కేటాయించింది. గత బడ్జెట్‌తో పోలిస్తే 20 శాతం కంటే పెంచిన శాఖల్లో... వెనుకబడిన తరగతుల సంక్షేమం (32%), ఆర్థిక (20%), సాధారణ పరిపాలన (45.56), పరిశ్రమలు-వాణిజ్యం (33.82%), ప్రణాళికా విభాగం (26.96%), రెవెన్యూ శాఖలు (33.66%) ఉన్నాయి. నైపుణ్యాభివృద్ధి సంస్థకు 10.72 శాతాన్ని తగ్గించారు.



అసెంబ్లీలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు. చిత్రంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర

ఈ బడ్జెట్‌లో కొత్తగా ప్రకటించిన, విస్తరించిన సంక్షేమ పథకాల ముఖ్యాంశాలు..!

- పేదలకు గృహ నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు రూ.500 కోట్లు
- చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలకు రూ.400 కోట్లు
- వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోయినప్పుడు రైతుని ఆదుకునేందుకు ఉద్దేశించిన 'మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్' రూ.500 కోట్ల నుంచి రూ.వెయ్యి కోట్లకు పెంపు
- పశువుల బీమా రూ.50 కోట్ల నుంచి రూ.200 కోట్లకు...
- 21 బీసీ ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా ప్రకటించడంతో పాటు ఇటీవలే మరో తొమ్మిది కార్పొరేషన్లను వెల్లడించిన ప్రభుత్వం... వాటికి రూ.3 వేల కోట్లు నిధులిచ్చింది.
- నిరుద్యోగ యువతకు ప్రస్తుతం ప్రతి నెలా రూ.వెయ్యి చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తున్న ప్రభుత్వం.... త్వరలో దీన్ని రూ.2 వేలకు పెంచాలని భావిస్తోంది. దానికి తగ్గట్టుగా రూ.1200 కోట్లు చూపించింది.
- పేదలకు మూడు పూటలా ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లను గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించనున్న ప్రభుత్వం కేటాయింపుల్ని రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్లకు...
- అసంఘటిత రంగంలోని కార్మికులు ప్రమాదంలో మరణిస్తే వారి కుటుంబాల్ని ఆదుకునేందుకు ఉద్దేశించిన చంద్రన్న బీమాకు రూ.140 కోట్ల నుంచి రూ.354.02 కోట్లకు...
- వైశ్య కార్పొరేషన్‌కి రూ.30 కోట్ల నుంచి రూ.50 కోట్లకు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.75 కోట్ల నుంచి రూ.100 కోట్లకు, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కి రూ.75 కోట్ల నుంచి రూ.100 కోట్లకు పెంపు.
- వివిధ వెనుకబడిన వర్గాలకు చెందిన వధువులకు వివాహ సమయంలో ఆర్థిక సహాయం అందించే చంద్రన్న పెళ్లికానుకకు నిధులను రూ.132.22 కోట్లకు పెంచింది.

గ్రహం అనుగ్రహం

6–2–2019 బుధవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; శుక్ల పక్షం
విదియ: తె. 5.42 తదుపరి తదియ
ధనిష్ఠ నక్షత్రం: ఉ. 7.52 తదుపరి శతభిషం
అమృత ఘడియలు: తె. 2.26 నుంచి 4.12 వరకు
వర్జ్యం: మ. 3.49 నుంచి 5.35 వరకు
దుర్ముహూర్తం: మ. 11.52 నుంచి 12.37 వరకు
రాహుకాలం: మ. 12.00 నుంచి 1.30 వరకు
సూర్యోదయం: ఉ.6-35; సూర్యాస్తమయం: సా.5.54
చంద్రదర్శనం

చలి - పులి


ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విశాఖపట్నం	16.6	31.4
హైదరాబాద్	16.9	30.9
శ్రీకాకుళం	17.0	28.0
గుంటూరు	17.6	32.4
కడప	18.0	34.0
కర్నూలు	18.2	34.1
రాజమహేంద్రవరం	19.0	34.0
అనంతపురం	19.1	33.2
తాడేపల్లిగూడెం	20.0	28.0
విజయవాడ	20.2	31.1
తిరుపతి	20.4	31.5
నరసాపురం	20.8	31.6
ఒంగోలు	21.7	31.6
నెల్లూరు	22.0	32.0

కశ్మీరు, హిమాచల్‌ప్రదేశ్‌లలో భూకంపాలు

శ్రీనగర్, సిమ్లా: కశ్మీరుతో పాటు హిమాచల్‌ప్రదేశ్‌లో మంగళవారం భూకంపాలు సంభవించాయి. ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం చోటుచేసుకోలేదు. కశ్మీరులో మంగళవారంరాత్రి 10.17 గంటలకు కొన్ని సెకన్లపాటు భూమి కంపించడంతో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. శ్రీనగర్‌కు 118కిమీ దూరాన, వాయవ్య కశ్మీరులో భూమికి 40కిమీ దిగువన భూకంప కేంద్రాన్ని గుర్తించామని అధికారులు తెలిపారు. భూకంపలేఖినిపై తీవ్రత 5.6గా నమోదైందన్నారు. మరోవైపు హిమాచల్‌ప్రదేశ్‌లోని చాంబ, మండిలలో వరుసగా 3.2, 3.8 తీవ్రతతో కూడిన భూకంపాలు సంభవించాయి.

వాళ్లు నేరస్థులు కాదు.. విద్యార్థులు

- ఈ అంశంమీదే అమెరికా అధికారులతో చర్చిస్తున్నాం
- 28 రాష్ట్రాల్లో అరెస్టులు జరగడంతో న్యాయసహాయం కష్టమవుతోంది
- అన్ని సంఘాలతో కలిసి పరిష్కారానికి కృషి చేస్తున్నాం
- 'ఈనాడు'తో కాబోయే తానా అధ్యక్షుడు జయ్ తాళ్లూరి



జయ్ తాళ్లూరి

ఈనాడు, హైదరాబాద్: 'అమెరికాలో ఇమిగ్రేషన్, భద్రతా విభాగాలు అరెస్టు చేసిన విద్యార్థులు నేరస్థులు కాదని అధికారులతో గట్టిగా చర్చిస్తున్నాం. సీపీటీ ఇచ్చారు కాబట్టే, వారు తాత్కాలిక ఉద్యోగాలు చేస్తున్నారని, ఇవ్వకుంటే చేయరు కదా.. అని వాదిస్తున్నాం' అని ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా)కు కాబోయే అధ్యక్షుడు జయ్ తాళ్లూరి అన్నారు. తమ వద్ద ఉన్న జాబితా ప్రకారం 130 మంది పోలీసుల అదుపులో ఉన్నారన్నారు. అమెరికాలో 28 రాష్ట్రాల్లో విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారని, అన్నిచోట్లా న్యాయవాదులను నియమించాల్సి రావడం సమస్యగా పరిణమిస్తోందని జయ్ అన్నారు. అయినా, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దీనిపై అన్ని తెలుగు సంఘాలతో కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. భద్రాచలానికి చెందిన జయ్ ఏడాది క్రితం జరిగిన తానా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందారు. ఆయన ఈ ఏడాది జులైలో అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆ పదవిలో 2021 జులై వరకు ఉంటారు. అమెరికాలో తెలుగు విద్యార్థుల అరెస్టు గురించి ఆయన 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ముఖాముఖి సారాంశం ఆయన మాటల్లోనే..

తల్లిదండ్రుల ఆర్థిక చేయూత అవసరం

అమెరికాలోని వర్సిటీల్లో రుసుములు ఎక్కువ ఉండటంతో తల్లిదండ్రులపై భారం పడకూడదని విద్యార్థులు వర్సిటీల్లో చేరిన నాటి నుంచే సంపాదన వైపు దృష్టి సారిస్తున్నారు. సంపాదించాలనే తపనతో నిబంధనలను ఉల్లంఘిస్తే అసలుకే ఎసరు వస్తుంది. అమెరికాలో స్థిరపడాలనే కలలు కల్లలవుతాయి. అమెరికాలో ప్రవేశం తర్వాత పిల్లలు ఫీజులకు డబ్బులు అడగకుంటే అక్కడ ఏం చేస్తున్నారనేదీ తల్లిదండ్రులే ఆరా తీయాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించొద్దని చెప్పాలి. కొంతకాలమైనా వారికి ఆర్థికంగా అండగా నిలవాలి.

వీసా మార్పు మనవాళ్లకు ప్రయోజనమే

వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2020 అక్టోబరు 1 నుంచి ప్రారంభం) హెచ్1బీ వీసాల జారీలో మార్పులు చేస్తుండటం మంచిదే. దానివల్ల అమెరికాలో చదివిన విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. ఇప్పటివరకు 65 వేల సాధారణ హెచ్1బీ వీసాలను విదేశీ ఉద్యోగులకు, 20 వేల వీసాలను ప్రత్యేకంగా అమెరికాలో చదివిన విదేశీ విద్యార్థులకు కేటాయిస్తున్నారు. ఇక నుంచి 65 వేలలో కూడా విద్యార్థుల దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వనుండటం వల్ల అదనంగా 16% (5,340 మంది) విదేశీ విద్యార్థులకు దక్కుతాయి. హెచ్1బీ వీసాల్లో గరిష్ఠ వాటా భారతీయ విద్యార్థులకే అందుతుంది. రానున్న ఏప్రిల్ 1 నుంచి వీసాలకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అందువల్ల అమెరికా చదువుకు వచ్చే విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని అనుకోవడం లేదు.

ఉత్తమ వర్సిటీల్లోనే ఉజ్వల భవిష్యత్తు

ఉత్తమవర్సిటీల్లో చదివితే ఉజ్వలభవిష్యత్తు ఉంటుందని తల్లిదండ్రులు, విద్యార్థులు గమనించాలి. అందుకు జీఆర్‌ఈ, జీమ్యాట్ లాంటి స్కోర్ల ఆధారంగా ప్రవేశాలు కల్పించే వర్సిటీలను ఎంచుకోవడం మంచిది. ఇప్పుడు ఫర్మింగ్టన్ విశ్వవిద్యాలయం తరహాలో ఇంకా ఎన్ని ఉన్నాయో చెప్పలేం. జాగ్రత్తగా ఉండటం శ్రేయస్కరం.

'వెల్ బీయింగ్ సిటీ' అవార్డుల పోటీలో

అమరావతికి మొదటి ర్యాంక్

ఈనాడు, అమరావతి: కెనడాలోని మాంట్రియల్‌కి చెందిన 'న్యూ సిటీస్' సంస్థ నిర్వహిస్తున్న 'వెల్ బీయింగ్ సిటీ' అవార్డుల పోటీలో ఒక విభాగంలో తుది పోటీలో నిలిచిన నాలుగు నగరాల్లో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మొదటి ర్యాంక్ దక్కించుకుంది. 'ఆర్థికాభివృద్ధి- అవకాశాలు' కేటగిరీలో అమరావతికి తొలి ర్యాంకు దక్కింది. తర్వాతి స్థానాల్లో షికాగో (అమెరికా), జుబ్‌జానా (స్లొవేనియా), పుణె(భారత్) ఉన్నాయి. 'న్యూ సిటీస్' సంస్థ మొదటిసారి ఈ పోటీలు నిర్వహిస్తోంది. మొత్తం నాలుగు కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తుండగా ప్రపంచవ్యాప్తంగా 27 దేశాలకు చెందిన 100 నగరాలు తలపడుతున్నాయి. ఈ విభాగాల్లో 16 నగరాల్ని తుది పోటీకి ఎంపిక చేశారు. 'ఆర్థికాభివృద్ధి-అవకాశాలు' కేటగిరీలో అమరాతి ఫైనలిస్ట్‌గా ఎంపికైంది. ఈ విభాగంలో అమరావతి మొదటి ర్యాంకులో నిలిచిందని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రతి కేటగిరీలో ఒక నగరాన్ని, మొత్తంగా అన్ని విభాగాల్లో కలిపి ఒక అత్యుత్తమ నగరాన్ని ఏప్రిల్‌లో ఎంపిక చేస్తారు. 2019 జూన్ లేదా జులైలో మాంట్రియల్‌లో జరిగే అంతర్జాతీయ వేడుకలో అవార్డులు అందజేస్తారు.

ఇదీ సంగతి!



పోలవరంపై 8న దిల్లీలో సాంకేతిక సలహా కమిటీ భేటీ

ఈనాడు-అమరావతి: ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న పోలవరం పథకం డీపీఆర్-2ను ఆమోదించే ప్రక్రియలో ముందడుగు పడింది. రూ.57,940 కోట్ల అంచనాతో సమర్పించిన ప్రాజెక్టు నివేదికకు 'సాంకేతిక సలహా కమిటీ' (టీఏసీ) ఆమోదమే కీలకం. ఈ డీపీఆర్‌పై చర్చించేందుకు ఈ నెల 8న టీఏసీ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర జల వనరుల శాఖ కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు సమాచారం ఇచ్చారు. కేంద్ర జల సంఘం నుంచి ఇంకా నోట్ రావాల్సి ఉందని, ఒకటి రెండు రోజుల్లో అది అందుకుంటామని జల వనరుల శాఖ అధికారులు తెలిపారు. పోలవరంపై సోమవారం ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్ష సమావేశంలోనూ ఈ విషయం ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. పోలవరంపై ఇప్పటికే రాష్ట్రం రూ.4000 కోట్ల వరకు చేసిన ఖర్చు మొత్తం కేంద్రం నుంచి రావాల్సి ఉంది. అది రెండో డీపీఆర్ పరిధిలోనే ఉంది. ఆ డీపీఆర్ ఆమోదిస్తేనే ఆ నిధులు వస్తాయి. పోలవరం ఆగిపోతే అది కేంద్ర బాధ్యతే అవుతుందని ప్రభుత్వం తరఫున లేఖ రాసేందుకు ఏర్పాట్లు చేశారు.

55,343 కోట్లతో రాజధాని ఆర్థిక ప్రణాళిక

- **ఆమోదించిన రాష్ట్ర ప్రభుత్వం**

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో మౌలిక వసతుల అభివృద్ధి, పరిపాలన నగర నిర్మాణానికి రూ.55,343 కోట్లతో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) రూపొందించిన సమగ్ర ఆర్థిక ప్రణాళికను ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. ఈ మొత్తంలో రూ.51,687 కోట్లు మూలధన వ్యయం కాగా, రూ.3,656 కోట్లు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో చెల్లించాల్సిన వడ్డీ. మూలధన వ్యయంలో ప్రధాన రహదారులు, గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రాజధాని మీదుగా వెళుతున్న హైటెన్షన్ విద్యుత్ లైన్లను దారి మళ్లించడంవంటి పనులకు రూ.19,769 కోట్లు, రాజధాని రైతులకు స్థలాలు కేటాయించిన లేఅవుట్లలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.17,910 కోట్లు, అమరావతిలో ప్రభుత్వ భవనాల సముదాయానికి రూ.14,008 కోట్లు ఖర్చవుతుందని సీఆర్‌డీఏ అంచనా వేసింది. ఈ మొత్తంలో రూ.37,112 కోట్లను వివిధ ఆర్థిక సంస్థలు, వాణిజ్యబ్యాంకుల నుంచి సీఆర్‌డీఏ రుణాల రూపంలో సమకూర్చుకోనుంది. రాజధానిలో సీఆర్‌డీఏ వాటాకు వచ్చే భూమిలో వివిధ సంస్థలకు కేటాయించగా మిగిలిన 5020 ఎకరాలను తనఖాగా ఉంచి రుణం తెచ్చుకోవాలన్నది ప్రతిపాదన. రాజధాని అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 2018-19 నుంచి 2025-26 వరకు రూ.12,600 కోట్లను ఈక్విటీ, గ్రాంటు రూపంలో సమకూర్చనుంది. రీటెయిల్ బాండ్ల ద్వారా సీఆర్‌డీఏ రూ.500 కోట్లు సమీకరించేందుకూ ప్రభుత్వం అనుమతినిచ్చింది. దీనికి ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుంది.

రూ.4,900 కోట్లతో సచివాలయం, హెచ్‌వోడీ భవనాలు

రాజధానిలోని పరిపాలన నగరంలో రూ.4,900 కోట్ల వ్యయంతో సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాల భవనాల నిర్మాణానికి సీఆర్‌డీఏకు అనుమతినిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. సచివాలయం, హెచ్‌ఓడీ కార్యాలయాల కోసం ఐదు టవర్ల పనులు ఇప్పటికే మొదలయ్యాయి. వాటి నిర్మాణ వ్యయం రూ.4,900 కోట్లుగా, తెచ్చిన రుణాలపై ప్రాజెక్టు నిర్మాణ సమయంలో చెల్లించాల్సిన వడ్డీ రూ.504.20 కోట్లుగా సీఆర్‌డీఏ పేర్కొంది. ఈ మొత్తంలో 20 శాతం ప్రభుత్వ గ్రాంటుగా, మిగతా 80 శాతం రుణంగా పేర్కొంది.

ప్రపంచబ్యాంకు ప్రాజెక్టుకు ఆమోదం

అమరావతిలో ప్రపంచబ్యాంకు ఆర్థిక సహకారంలో మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టు అమలుకు సీఆర్‌డీఏకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. ప్రపంచబ్యాంకు నుంచి సీఆర్‌డీఏ 50 కోట్ల డాలర్ల రుణం తీసుకుంటోంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్‌గ్రాంటుగా 21.5 కోట్ల డాలర్లు సమకూర్చనుంది. ఇది విదేశీ ఆర్థికసాయంతో చేపట్టే ప్రాజెక్టు(ఈఏపీ) కాబట్టి దీనికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సీఆర్‌డీఏ అనుమతి కోరింది.

కార్పొరేషన్లు లేని వర్గాలకు ప్రాధాన్యం

బీసీ సంక్షేమశాఖకు సీఎం ఆదేశం

ఈనాడు డిజిటల్, అమరావతి: కొత్తగా ఏర్పాటు చేసిన బీసీ కార్పొరేషన్లలో వేటి పరిధిలో ఉన్నారో స్పష్టత లేని సూర్య బలిజ, కూరాకుల, జక్కుల కులాల వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా అమలు చేసే రాయితీ రుణాలు, సంక్షేమ పథకాల్లో ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మంగళవారం బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శికి జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టం చేశారు. కార్పొరేషన్ల పరిధిలోకి రానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అందులో స్పష్టం చేశారు. బీసీల్లోని పలు కులాలకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది. వీటి పరిధిలోకి రాని కులాలకు ప్రభుత్వ సాయం అందాలని ఆయా వర్గాల నుంచి అభ్యర్థనలు, ప్రతిపాదనలు వచ్చిన నేపథ్యంలో సీఎం స్పందించి పైమేరకు ఆదేశాలిచ్చారు.

పోలీసుల అదుపులో కిరీటాల దొంగ..!

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: నగరంలోని గోవిందరాజస్వామి ఆలయంలో మూడు ఉత్సవ విగ్రహాలపై ఉన్న కిరీటాలను చోరీ చేసిన దొంగను పోలీసులు పట్టుకున్నారు. ఈ చోరీకి పాల్పడింది పాత నేరస్థుడు మత్తయ్యగా వారికి సమాచారం అందింది. అతను గతంలోనూ తిరుపతిలోని ప్రధాన ఆలయాలతో పాటు, చిన్నచిన్న దేవాలయాల్లో చోరీలకు పాల్పడి పోలీసులకు పట్టుబడ్డాడు. తమిళనాడుకు వెళ్లిన ప్రత్యేక బృందం అదుపులో నిందితుడు ఉన్నాడని తెలిసింది.

ఎన్నికలకు సిద్ధం కండి

- **ఏపీ కాంగ్రెస్ నేతలకు రాహుల్ సూచన**

ఈనాడు, దిల్లీ: క్షేత్రస్థాయికి వెళ్లి ప్రచారం ప్రారంభించాలని ఏపీసీసీ నేతలకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సూచించారు. సార్వత్రిక ఎన్నికలకు సమాయత్తం కావాలని, నిరంతరం ప్రజల్లో ఉండాలని చెప్పారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు ఊమెన్ చాందీ, పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, సుబ్బరామిరెడ్డిలు మంగళవారం రాహుల్‌తో భేటీ అయ్యారు. పార్టీ పరిస్థితులపై అధ్యక్షుడు వారిని ఆరా తీశారు. అంతకు ముందు ఊమెన్‌చాందీ, రఘువీరారెడ్డిలతో రాహుల్ గాంధీ ప్రత్యేకంగా సమావేశమై కమిటీ ఏర్పాటుపై చర్చించారు. రాష్ట్ర పార్టీ ప్రతిపాదనల్ని అధ్యక్షుడికి అందజేశారు. అనంతరం రఘువీరారెడ్డి మీడియాతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల నిమిత్తం పీసీసీ తరఫున ఎనిమిది కమిటీలకు ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. 'ఎన్నికలకు ముందు ఒకసారి సీడబ్ల్యూసీ విస్తృత సమావేశం నిర్వహించాలని అధిష్ఠానం భావిస్తోంది. దీనిని విజయవాడలో ఏర్పాటుచేసి 5కోట్ల మంది ప్రజలకు మరోసారి భరోసా ఇవ్వాలని కోరాం. సానుకూలంగా స్పందించారు. 'ప్రత్యేక హోదా భరోసా' ప్రజాయాత్ర 13 జిల్లాల్లో చేయాలని నిర్ణయించాం. ఒకరోజు రాహుల్ గాంధీ, మరోరోజు ప్రియాంక గాంధీ రావాలని కోరగా తప్పకుండా వస్తామని హామీ ఇచ్చారు. నెలాఖరు కల్లా అభ్యర్థుల్ని ప్రకటిస్తాం' అని రఘువీరారెడ్డి స్పష్టంచేశారు.

ప్రియాంకకు ప్రత్యేక కార్యాలయం

- **యూపీ పార్టీ నేతలతో చర్చలు**

దిల్లీ: ప్రియాంకా గాంధీకి అధికారికంగా ఓ కార్యాలయం ఏర్పాటైంది. అక్బర్‌రోడ్డులోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలోని తన ఆఫీసు నుంచి ఆమె అధికారిక కార్యక్రమాలు మొదలుపెడతారు. పార్టీ ప్రధాన కార్యదర్శి హోదాలో ఆమె గురువారం ఇక్కడ జరిగే రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల బాధ్యులు, ప్రధాన కార్యదర్శులసమావేశానికి తొలిసారిగా హాజరుకానున్నారు. లోక్‌సభ ఎన్నికల వ్యూహరచనలో భాగంగా అధ్యక్షుడు రాహుల్‌గాంధీ గురువారం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాహుల్ కార్యాలయానికి పక్కనే ఆమెకు ఆఫీసును కేటాయించారు. ప్రియాంకకు తూర్పు యూపీ పార్టీ వ్యవహారాల బాధ్యతలను, జ్యోతిరాదిత్య సింధియాకు పశ్చిమయూపీ పార్టీ వ్యవహారాల బాధ్యతలను కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అప్పగించిన విషయం తెలిసిందే.

నేడు తిరుపతిలో వైకాపా సమర శంఖారావం సభ

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి సన్నద్ధమయ్యారు. సమరశంఖారావం పేరుతో అన్ని జిల్లాల్లోనూ సభలు నిర్వహించనున్నారు. పార్టీకి చెందిన ప్రతినిధులతోనే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నా... ఎన్నికల ప్రచారంగానే ఇవి కొనసాగనున్నాయని వైకాపా వర్గాలు తెలిపాయి. బుధవారం తిరుపతిలో నిర్వహించనున్న చిత్తూరు జిల్లా సమావేశానికి సుమారు 40 వేల మంది హాజరవనున్నారని పార్టీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. ప్రతీ నియోజకవర్గం నుంచి కనీసం 2500 మంది చొప్పున పార్టీ బూత్ కమిటీల ప్రతినిధులు, కార్యకర్తలు సమావేశానికి వస్తారని చెప్పారు. వీరందరినీ ఎన్నికలకు సన్నద్ధం చేయడం, వైకాపా ఎన్నికల హామీలను ప్రకటించడం, ఎన్నికల ప్రక్రియలో కార్యకర్తలు, బూత్‌కమిటీల ప్రతినిధులు అమలు చేయాల్సిన వ్యూహాలపై జగన్ వివరిస్తారు. 7న కడపలో, 11న అనంతపురంలో, 13న ప్రకాశం జిల్లాల్లో జరిగే సభల్లో ఆయన పాల్గొననున్నారు.

ఈనాడు

వాహన కాలుష్యానికి కళ్ళెమేదీ?

నగరీకరణ వేగవంతమై చైనాలో కన్నా అధికంగా భారత్‌లో వాహన కాలుష్య సమస్య పెచ్చరిల్లుతోంది. ఎన్నో సంపన్న దేశాల్లో పట్టణీకరణ శీఘ్రతరమయ్యే కొద్దీ వాహన ఉద్గారాల తీవ్రత తగ్గుముఖం పడుతుండగా, ఇండియాలో అందుకు విరుద్ధ దృశ్యాలు దిమ్మెరపరుస్తున్నాయి. జిల్లాలవారీగా రవాణా వ్యవస్థలు, ప్రయాణ వసతుల తీరుతెన్నుల్ని మదింపు వేసిన తాజా అధ్యయన నివేదికొకటి చాటుతున్న యథార్థాలివి! లోగడ చైనాలోని షాంఘై, జియాంగ్సు తదితర నగరాల్లో కనుచూపు మేరలో ఏముందో కానరాని విపరీత వాయుకాలుష్యం మూలాన గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయేది. నేడక్కడ కఠిన నియంత్రణ చర్యలు పకడ్బందీగా అమలవుతూ పరిస్థితి మెరుగుపడుతుండగా, దేశంలో వాహన కాలుష్యం కట్టు తప్పుతున్నట్లు స్పష్టమవుతోంది. సగటు భారతీయ ఉద్యోగి కార్యాలయానికి వెళ్ళే క్రమంలో దాదాపు 20కిలోల మేర బొగ్గుపులుసు వాయు విడుదలకు కారకుడవుతున్నాడంటున్న సరికొత్త అధ్యయనాంశాల ప్రకారం- హరియాణాలోని గురుగ్రామ్ జిల్లాలో నమోదైన పరిమాణం ఎకాయెకి 140 కిలోలు. దేశంలోని పదహారు జిల్లాల్లో కార్బన్-డై-ఆక్సైడ్ సగటు తలసరి విడుదల 93 కిలోల దాకా ఉందంటున్న గణాంకాలు- ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాదుల కన్నా దిల్లీలో వాహన ఉద్గారాలు రెండున్నర రెట్లనడం నివ్వెరపరుస్తోంది. దేశ రాజధానిలో పౌరుల సామాజికార్థిక స్థాయి, ప్రైవేటు వాహనాల వినియోగం రేటు కారణంగా వాహన కాలుష్యం గాడి తప్పుతున్నదంటున్న నివేదిక- ఇదమిత్థ దిద్దుబాటు చర్యల్నీ ప్రస్తావిస్తోంది. పటుతర ప్రజారవాణా వ్యవస్థ, ఎలెక్ట్రిక్ వాహనాలకు ప్రోత్సాహం- ఒక్క దిల్లీలోనే కాదు... దేశవ్యాప్తంగా ఇతర నగరాలు, పట్టణాల్లోనూ చురుగ్గా సాకారమైతేనే, కోరలు చాస్తున్న వాయుకాలుష్య భూతాన్ని అదుపులో పెట్టగలిగేది!

ఒకటిన్నర పుష్కరాల క్రితం ఇండియాలో వాయుకాలుష్యం ఏటా లక్ష అర్ధాంతర మరణాలకు పుణ్యం కట్టుకునేది. 2010 నాటికే ఆరు లక్షలకు పైబడిన కాలుష్య మృతుల సంఖ్య ఇంకా విస్తరిస్తూనే ఉంది. అందుబాటులోని విస్తృత సమాచారాన్ని పరిశీలించి భారత వైద్య పరిశోధన మండలి సహా వివిధ సంస్థలు ఇటీవల నిగ్గుతేల్చిన వివరాల ప్రకారం- దేశీయంగా ప్రతి ఎనిమిది మరణాల్లో ఒకటి వాయుకాలుష్యం కారణంగా చోటు చేసుకుంటున్నదే. ఏడాది కాలంలో నమోదైన అటువంటి చావులు 12 లక్షల 40 వేలు! దేశంలో వాహనాల సంఖ్య ఏటా 22 శాతం చొప్పున పెరుగుతుండటం వల్ల వాయు కాలుష్యానికి పట్టపగ్గాలు లేకుండా పోతున్నాయన్న కేంద్ర రవాణా మంత్రి గడ్కరీ, సంక్షోభానికి ప్రబల హేతువనదగ్గ అంశాన్ని గాలికొదిలేశారు. ప్రజా రవాణా సేవల పటిష్ఠీకరణలో వైఫల్యమే అడ్డే కార్లు, ఆటోలు, ప్రైవేటు వాహనాల ఉద్ధృతిని ప్రజ్వరిల్లజేసిందన్నది చేదునిజం. నమోదిత మోటారు వాహనాల సంఖ్య 22 కోట్లకు ఎగబాకిన ఇండియాలో ప్రతిరోజూ 630 టన్నుల సల్ఫర్ డై ఆక్సైడ్, 270 టన్నుల నైట్రోజన్ ఆక్సైడ్, సుమారు రెండు వేల టన్నుల కర్బన ఉద్గారాలు గాలిని విషధూమంగా మార్చేస్తున్నాయి. విరుగుడు చర్యల్లో భాగంగా 2030 నాటికి అంతటా విద్యుత్ వాహనాలే ఉండాలని కేంద్రం ప్రణాళికలు అల్లుతోంది. ఆలోగానే మార్పు రావాలంటున్న కొన్ని రాష్ట్రాలు బస్సుల బదులు ఎలెక్ట్రిక్ వాహనాల వినియోగానికి కసరత్తు చేస్తున్నాయి. అందులో భాగంగా పెద్ద నగరాలు, పట్టణాలు, జాతీయ రహదారుల వెంబడి వీలైనన్ని ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు వినిపిస్తున్నాయి. వాహన, వాయు కాలుష్యాన్ని సమర్థంగా నియంత్రించే క్రమంలో స్థానిక పురపాలికల్నీ, విశ్వవిద్యాలయాలను సైతం కీలక భాగస్వాములుగా చేసి క్యాలిఫోర్నియా యంత్రాంగం సాధించిన స్ఫూర్తిదాయక విజయాలనుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విలువైన గుణపాఠాలెన్నో నేర్వాల్సి ఉంది!

దాదాపు మూడు దశాబ్దాలుగా వ్యక్తిగత కార్లకు అనుమతి పత్రాల జారీ పద్ధతిని కట్టుదిట్టంగా అమలుపరుస్తున్న సింగపూర్- 2030కల్లా 75 శాతం ప్రయాణాలు బస్సు, రైలు మార్గాల ద్వారానే జరగాలని లక్షిస్తోంది. పరిశుభ్ర వాయు శాసనాల్ని రూపొందించి అవసరానుగుణంగా మరిన్ని బిగింపులకు ప్రాధాన్యమిచ్చి అమెరికా, యూకే, కెనడా, ఇజ్రాయెల్ వంటివి విశేష ఫలితాలు సాధిస్తున్నాయి. పకడ్బందీ ప్రజారవాణా వ్యవస్థను ఆవిర్భవింపజేసి, ప్రయాణాన్ని ప్రమోదంగా మలచేలా శ్రద్ధాసక్తులు కనబరుస్తూ పౌరుల్లో పర్యావరణ పరిరక్షణ స్పృహ వ్యక్తమయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్న దేశాల్లో- వాయు నాణ్యత ఆరోగ్య ప్రమాణాలను పెంచుతోంది! పాత మోటారు వాహనాలను నిషేధించడం ద్వారా 2030 నాటికి వందకోట్ల టన్నుల కర్బన ఉద్గారాల్ని నియంత్రించి, 6000 కోట్ల డాలర్ల దాకా విదేశ మారకద్రవ్యాన్ని భారత్ ఆదా చేసుకోగల వీలుందన్న 'నీతి ఆయోగ్' సిఫార్సు ఆ మధ్య దేశంలో ప్రకంపనలు పుట్టించింది. కోట్లాది ప్రజల జీవికకు ఇబ్బందులు కలగని రీతిలో పరిష్కార మార్గాలను కేంద్రం అన్వేషించాల్సి ఉంది. వాస్తవానికి 'నీతి ఆయోగ్' యోచనకన్నా ముందే ఆకర్షణీయ నగరాల యోజన తెరపైకి వచ్చింది. 2020 నాటికి నూరు ఆకర్షణీయ నగరాల నిర్మాణ ప్రతిపాదన నాలుగేళ్లనాడే వెలుగుచూసింది. అరగంట లోపే పని ప్రదేశాలకు వెళ్ళగలిగేలా రవాణా ఏర్పాట్లతో జిల్లాలవారీగా పట్టణ పునరుజ్జీవన ప్రణాళికలు చురుగ్గా పట్టాలకు ఎక్కేదెప్పుడో! వాహన కాలుష్య సమస్య పెను సంక్షోభమై జాతి నెత్తిన ఉరుముతున్నప్పుడు- పటుతర ప్రజారవాణా వ్యవస్థలు, కార్యాలయాలకు చేరువలోనే సకల మౌలిక వసతులతో జనావాస ప్రాంతాల అభివృద్ధి పరంగా జాప్యం అనర్థదాయకమే అవుతుంది. రవాణా రంగ నిపుణులు, సాంకేతిక ఉద్దండుల సాయంతో సమగ్ర దీర్ఘకాలిక వ్యూహాన్ని నిబద్ధతతో అమలుపరిస్తేనే వాహన, వాయుకాలుష్య పెనుగండం నుంచి దేశం క్షేమంగా గట్టెక్కుతుంది!

చదువుల తీరు... మారాలి నేడు

కంప్యూటర్ సైన్స్, కృత్రిమ మేధ, బిగ్ డేటా, స్వయంచాలిత యంత్రాలు (ఆటోమేషన్) నేడు అన్ని రంగాలనూ శాసిస్తూ కొత్త పరిశ్రమలను, వృత్తి ఉద్యోగాలను సృష్టిస్తున్నాయి. 21వ శతాబ్దిని తీర్చిదిద్దుతున్న ఈ శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలంటే సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమాటిక్స్ (స్టెమ్) కోర్సులు అత్యంత ఆవశ్యకం. దీన్ని దృష్టిలో ఉంచుకుని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇలా అన్నారు- 'సైన్స్ అంటే కేవలం ఒక పాఠ్యాంశమో, మూలకాల పట్టికో లేక తరంగ దైర్ఘ్యాల వివరణో అనుకుంటే పొరపాటు. అది లోకాన్ని విశిష్ట కోణం నుంచి దర్శించే సాధనం. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి, అన్వేషించడానికి, వ్యవహారం నెరపడానికి తోడ్పడుతూ చివరకు ఆ ప్రపంచాన్నే మార్చడానికి ఉపకరించే విధానం'!


ఎప్పటికప్పుడు కొత్త కోర్సులు

శాస్త్రజ్ఞులు, ఇంజినీర్లు, నవీకరణ సాధకుల ప్రతిభ, ప్రయత్నాలు దేశ ప్రగతికి చోదక శక్తులుగా పని చేస్తాయి. నిన్న అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి పాశ్చాత్య దేశాలైనా- నేడు చైనా, భారత్‌లైనా శాస్త్ర సాంకేతిక రంగాల్లో జోరుగా పురోగమిస్తున్నాయా అంటే అది స్టెమ్ చలవే. ఈ దేశాలు అంతర్జాతీయంగా అగ్రశ్రేణిలోకి చేరడం వెనక స్టెమ్ హస్తం ఉంది. రోజురోజుకూ సంక్లిష్టమవుతున్న ఈ ప్రపంచంలో స్టెమ్ కోర్సులు నేర్పే సమస్యా పరిష్కార శక్తికి ఎనలేని ప్రాధాన్యం ఉంది. కొత్త కొత్త సేవలు, ఉత్పత్తులను సృష్టించే సామర్థ్యాన్ని ఈ కోర్సులు యువతరానికి అందిస్తాయి. వారికి ఆధునిక నైపుణ్య సామర్థ్యాలను అలవరచే బాధ్యత అధ్యాపకులదే. నేడు రేపు మన సమాజానికి ఎదురయ్యే సవాళ్లను అధిగమించాలంటే విద్యారంగాన్ని మరింత పరిపుష్టం చేయాలి. ఈ అంశంపై భేదాభిప్రాయాలు ఉండనక్కర్లేదు కానీ కేవలం స్టెమ్ కోర్సులతోనే జాతి జీవితం నందన వనం కాబోదు. అవినీతి, పన్ను ఎగవేతలు, వ్యాపారంలో మోసాలు, డేటా దుర్వినియోగం, ఉన్నత శ్రేణి అధికారులు- యాజమాన్యాల అవకతవకలు సైంధవుల్లా అడ్డుపడతాయి. ఈ కుంభకోణాల గురించి పదే పదే పత్రికలు, టీవీ ఛానళ్లలో వస్తున్న వార్తలు దీనికి నిదర్శనం. కాబట్టి స్టెమ్ ఒక్కటే సరిపోదని, స్టీమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఆర్ట్స్, మ్యాథ్స్), ఎస్టీమ్ (ఎంట్రప్రెనార్‌షిప్, సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఎథిక్స్, మ్యాథ్స్)లు కావాలని మేధావులు ప్రబోధిస్తున్నారు. వీటిలో ఎస్టీమ్ ఈ మధ్య బాగా వెలుగులోకి వచ్చింది. ముఖ్యంగా ఎంట్రప్రెనార్‌షిప్ (వ్యవస్థాపక సామర్థ్యం) లేనిదే స్టెమ్‌కు ఉనికే లేదు. స్టెమ్ సామర్థ్యాలను ఉపయోగించి వ్యవస్థాపకులు అమెజాన్, ఫేస్‌బుక్, ఫ్లిప్‌కార్ట్ వంటి జగజ్జేత సంస్థలను సృష్టించి ఉద్యోగ, వ్యాపారావకాశాలను ఇబ్బడిముబ్బడిగా విస్తరించారు. కానీ, వ్యవస్థాపకతకు నైతిక విలువలు తోడవనిదే నిజమైన ప్రగతి సిద్ధించదు. ఇంజినీరింగ్ పట్టభద్రుడైన అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్ వ్యవస్థాపక సామర్థ్యంతోనే వ్యాపారాన్ని అమెరికా నుంచి అంతర్జాతీయ మార్కెట్లకు, వివిధ దేశాల్లోని స్థానిక మార్కెట్లకూ విస్తరించారు. ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ తన సంస్థను జన జీవితంలో కీలక అంతర్భాగం చేయగలిగారు. వ్యక్తిగత సమాచారం ఇతరులకు పొక్కకుండా నిరోధించలేకపోయారని, ఖాతాదారుల సమాచారం దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు తీసుకోలేకపోయారని తీవ్ర దుమారం రేగింది. నిస్సాన్ కార్ల కంపెనీ అధినేత కార్లోస్ ఘోసన్ ఆర్థిక అవకతవకలకు పాల్పడి సమస్యల్లో ఇరుక్కున్నారు. నైతిక విలువలు పాటించకపోతే ఏమవుతుందో వీరి ఉదంతాలు హెచ్చరిస్తున్నాయి. నీతినియమాలకు పట్టం కట్టే వ్యవస్థాపకులు విపణులను సమర్థంగా, పారదర్శకంగా మార్చగలరు. స్టెమ్ కోర్సులకు వ్యవస్థాపకత, నైతిక విలువలు జత కలిసినప్పుడు యువతరం స్ఫూర్తి పొందుతుంది, తమ శక్తిసామర్థ్యాలను పూర్తిగా వినియోగంలోకి తెచ్చి వ్యక్తిగత, జాతి వికాసాల సాధనలో కీలక పాత్ర పోషించగలుగుతారు. ఏ వ్యాపారం పెడితే విజయవంతమవుతుందో ఊహించగల సృజనాత్మకత వ్యవస్థాపకుడిలో ఉండాలి. తన ఆలోచనను ఆచరణలో పెట్టి విజయ శిఖరాలకు చేరే నేర్పరితనం ఉండాలి. లక్ష్యసాధనకు అహర్నిశలు శ్రమించాలి. అప్పుడు మాత్రమే వారు వ్యవస్థాపకులుగా రాణిస్తారు. నష్ట భయాన్ని అధిగమించి లాభాలు ఆర్జించడమే అన్ని వ్యాపారాల లక్ష్యం. కానీ, ఈ బాటలో నైతిక విలువలకు కట్టుబడి ఉండటం, నీతిగా ధనార్జన



సాంకేతికతకు తోడుగా నైతిక విలువల బోధన

చేయడం చాలా ముఖ్యం. సత్ప్రవర్తనతో మెలగడం ఆవశ్యకం. నైతిక విలువలు, ఉన్నతాశయాలు, సదుద్దేశాలు ఒక్కటే చాలవు. వాటికి వ్యవస్థాపక సామర్థ్యం, ముందుచూపు, లోతైన ఆలోచన తోడవకపోతే ఏమవుతుందో మహమ్మద్ బిన్ తుగ్లక్ ఉదంతం చూసి తెలుసుకోవచ్చు. క్రీ.శ 1326 సంవత్సరంలో తుగ్లక్ తెచ్చిన ఆర్థిక సంస్కరణలు తీవ్ర నష్టం మిగిల్చాయి. సుల్తాన్‌లో ఆచరణీయ దృక్పథం, వ్యవస్థాపకత లోపించడం ఈ దుస్థితికి మూలకారణాలు. గంగా-యమున మైదాన ప్రాంత రైతులపై భారీగా పన్ను వడ్డింపు, రాజధానిని దిల్లీ నుంచి దౌలతాబాద్ (దేవగిరి)కి మార్చడం వల్ల వేల మంది ప్రజలు ఆకలి, ఈతిబాధలతో మరణించారు. తుగ్లక్ బంగారు, వెండి నాణాల స్థానంలో రాగి, ఇత్తడి నాణాలను ముద్రించడంతో ఆర్థిక వ్యవస్థ దెబ్బతినిపోయింది. వ్యాపారంలో నైతిక విలువలు పాటించకపోతే ఏమవుతుందో సత్యం కంప్యూటర్స్ రామలింగరాజును చూసి తెలుసుకోవచ్చు. కంపెనీ ఖాతాల్లో రాజు గోల్‌మాల్ చేశారని 2009లో ఆరోపణలు వచ్చాయి. 2015లో రాజుతోపాటు 10 మంది కంపెనీ అధికారులు దోషులని నిరూపితమైంది. నేరపూరిత కుట్ర, మోసాలు, అక్రమ ధన చలామణీ, నమ్మక ద్రోహం, అవినీతి, నిధుల కైంకర్యం వంటి ఆరోపణలను ఎదుర్కొంటున్న నీరవ్ మోదీ కేసు పెద్ద సంచలనమైన సంగతి తెలిసిందే. వజ్రాల వ్యాపారి అయిన నీరవ్ నీతినియమాలను గాలికి వదిలేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు ఉన్నతాధికారుల నీతిబాహ్య విధానాల వల్లనే అతడు ఇంతటి మోసానికి పాల్పడగలిగాడు. ఇవాళ భారత న్యాయ వ్యవస్థతోపాటు ఇంటర్‌పోల్, ఎఫ్‌బీఐ, లాస్‌ఏంజెల్స్, న్యూయార్క్, కెనడా పోలీసులు పరారీలో ఉన్న నీరవ్ మోదీ కోసం గాలిస్తున్నారు. అతడిలో వ్యవస్థాపక సామర్థ్యంకన్నా మోసకారితనమే హెచ్చనడానికి ఇంతకన్నా రుజువేముంది? ఇకనైనా స్టెమ్ కోర్సులకు నీతినియమాలు, వ్యవస్థాపకతలను రంగరించి విద్యార్థులకు బోధిస్తే, భవిష్యత్తులోనైనా నిజాయతీపరులైన వ్యాపార, పారిశ్రామికవేత్తలు ఆవిర్భవిస్తారు.



వ్యాపార నైపుణ్యాలూ నేర్వాలి

భారతీయ ఇంజినీరింగ్ పట్టభద్రుల్లో 80 శాతానికి ఉద్యోగాలకు కావలసిన నైపుణ్యాలు లేవని ఐబీఎంతో సహా పలు అధ్యయనాలు తేల్చాయి. సరికొత్త సాంకేతికతలతో అద్వితీయ వ్యాపార నమూనాలను చేపట్టి, విజయం సాధించే సత్తా భారతీయ అంకుర సంస్థలకు లేవని 77 శాతం వెంచర్ పెట్టుబడిదారులు భావిస్తున్నారని ఫోర్బ్స్ పత్రికలో ప్రచురితమైన ఒక వ్యాసం వెల్లడించింది. 2015 నుంచి దేశంలో ప్రారంభించిన అంకుర సంస్థల్లో 1,503 సంస్థలు దుకాణం మూసేయడం దీనికి నిదర్శనం.

అనుకరణతో ఎన్నాళ్లు?


ఫేస్‌బుక్, గూగుల్, ట్విటర్ స్థాయి సంస్థలు భారత్‌లో ఒక్కటంటే ఒక్కటైనా లేదు. అదే చైనాలో అలీబాబా, టెన్సెంట్ వంటి జగజెట్టి సంస్థలు ప్రపంచమంతటికీ విస్తరిస్తున్నాయి. భారత్‌లోనూ అయిదు యూనికార్న్ సంస్థలు (పేటీఎం, ఓలా, ఓయో, బైజు, స్విగ్గీ) ఉన్నా, 2016లో ఫోర్బ్స్ పత్రిక 25 నవీకరణ సాధక కంపెనీల్లో చోటుచేసుకున్న ఒకే ఒక భారతీయ సంస్థ- ఆసియన్ పెయింట్స్ మాత్రమే. అసలు మన దేశంలోని కంపెనీలు నవీకరణకు, సృజనాత్మకతను పెంచి పోషించడంకన్నా విదేశాల నుంచి అరువు తెచ్చుకున్న నమూనాలతోనే బండి లాగిస్తుంటాయి. విదేశాల్లో విజయవంతమైన వ్యాపార నమూనాలను ఇక్కడా అనుసరిస్తే తేలిగ్గా డబ్బు సంపాదించవచ్చుననే ఆరాటం తప్ప ఏదైనా కొత్తది చేసి చూపాలనే తపన కనబడదు. అందువల్ల ప్రారంభంలో మన అంకుర సంస్థలు పెట్టుబడి పెట్టినవారు కూడా తరవాత వాటి నిర్వాకం చూసి తమ డబ్బు తాము వెనక్కు తీసేసుకుంటారు.

భారత్‌లో ఈ-కామర్స్, ఆహార సాంకేతికత, సరకుల బట్వాడా రంగాల్లో ఎక్కువ అంకుర సంస్థలు వచ్చాయి. కొత్తదనం లేక వాటిలో అత్యధికం విఫలమయ్యాయి. స్టీమ్ కోర్సుల్లో వ్యవస్థాపకతను, నైతికతను చేర్చి ఎస్టీమ్ కోర్సులుగా మారిస్తే తప్ప ప్రపంచస్థాయిలో పోటీపడే మేటి సంస్థలను సృష్టించలేం. అంతర్జాతీయ స్థాయిలో నవీకరణ సాధించిన దేశాల జాబితాలో భారత్ పరిస్థితి గురించి ఎంత తక్కువ చెప్పుకొంటే అంత మంచిది. అమెరికాకు చెందిన మేధావుల సంస్థ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఇన్నొవేషన్ ఫౌండేషన్ 56 దేశాలతో రూపొందించిన ఈ జాబితాలో భారత్ అట్టడుగున ఉండటం సిగ్గుచేటు. 130 కోట్ల జనాభా కలిగిన భారత్ వంటి సువిశాల విపణిలో ప్రజల అవసరాలకు సృజనాత్మక పరిష్కారాలు చూపగల వ్యాపారులకు విజయావకాశాలు పుష్కలంగా ఉంటాయి. భారతీయుల అవసరాలు, అభిరుచులు, అలవాట్లు ఏమిటో పూర్తి అవగాహన కలిగినవారు గొప్పగా రాణిస్తారు. అలాంటి అవగాహన కేవలం సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ (స్టెమ్) వల్లనే రాదు. వీటికి ఆర్ట్స్‌ను జోడించి స్టీమ్ కోర్సులను బోధించాలని పాశ్చాత్య దేశాల్లో గుర్తిస్తున్నారు. స్టెమ్ కోర్సు ఒక ఉత్పత్తి లేదా సేవను రూపొందించే సత్తాను ఇస్తే, సమాజానికి కావలసిందేమిటో మనుషుల ఆసక్తులేమిటో పసిగట్టే సత్తాను స్టీమ్ కోర్సు ఇస్తుంది. వ్యవస్థాపకత, నైతికతలను జోడించే ఎస్టీమ్ కోర్సు జనహితానికి రాజమార్గం వేస్తుంది. అందువల్ల నేడు టెక్నాలజీ పరిశ్రమలు పెద్దయెత్తున ఆర్ట్స్ పట్టభద్రులను చేర్చుకుంటున్నాయి. వీరు సేల్స్, మార్కెటింగ్, ఖాతాదారుల సేవ, కార్పొరేట్ కమ్యూనికేషన్స్, మానవ వనరులవంటి విభాగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. కొందరైతే సాఫ్ట్ వేర్ డెవలపర్లుగానూ రాణిస్తున్నారు.

- ఎం.చంద్రశేఖర్

(రచయిత- విద్యారంగ నిపుణులు)


పౌరుల చేతిలోకి పోరాటం



సందీప్ పాండే

గంగా నదిని పరిరక్షించాలని పోరాడుతూ ఆమరణ నిరాహార దీక్షకు దిగిన ప్రొఫెసర్ జీడీ అగర్వాల్ (స్వామీ గ్యాన్ స్వరూప్ సనంద్) 2018 అక్టోబరు 11న కన్నుమూశారు. నదీమతల్లులను కాలుష్యం నుంచి కాపాడుకోవడమంటే మానవాళి భద్రమైన జీవనానికి బాటలు వేయడమే. కాలుష్యం బారినపడి విషతుల్యంగా మారుతున్న గంగానదిని రక్షించుకోవాల్సిన బాధ్యతను ప్రభుత్వాలు విస్మరించినందువల్లే పౌర సమాజం క్రియాశీలమైంది. గంగా పరీవాహక ప్రాంతంలో అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయాలని కోరుతూ రెండు దశాబ్దాలుగా ఉద్యమాలు జరుగుతున్నాయి. మాత్రే సదన్ ఆశ్రమానికి చెందిన స్వామి నిగమానంద్ 2011లో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి 115వ రోజున మరణించారు. కేరళకు చెందిన బ్రహ్మచారి ఆత్మబోధానంద్ అనే 26ఏళ్ల యువ సన్యాసి ఇదే డిమాండ్‌తో 2018 అక్టోబరు 24నుంచి ఆమరణ నిరసన దీక్షకు కూర్చున్నారు. అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా 2017నుంచి పోరాడుతున్న ఆత్మబోధానంద్‌ను ఒక దశలో ప్రభుత్వం జైలులోనూ పెట్టింది. గంగానదిని సంపూర్ణంగా ప్రక్షాళిస్తే దేశంలోని ప్రతి పదిమందిలో కనీసం నలుగురు వ్యక్తులు ప్రత్యక్షంగా లబ్ధి పొందుతారని అధ్యయనాలు చెబుతున్నాయి. నిరసన దీక్షలతో రోడ్డెక్కి కొందరు ప్రాణత్యాగాలు చేసుకునేదాకా వ్యవహారాన్ని తెగలాగడమే విషాదం!

నానావిధ పరిశ్రమల ద్వారా వచ్చి చేరుతున్న వ్యర్థ జలాల కారణంగా గంగానది నిర్జీవంగా మారుతోంది. ఈ సమస్యను పరిష్కరించి నదీ జలాలను స్వచ్ఛంగా మార్చడమే లక్ష్యంగా 'నమామి గంగా' కార్యక్రమం ప్రారంభమైంది. గంగలోకి పారుతున్న మురుగును శుద్ధి చేయడం కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలు తగినంత సామర్థ్యం లేక చతికిలపడ్డాయి. భారీయెత్తున ఉత్పత్తి అవుతున్న మురుగును శుద్ధి చేసే సామర్థ్యం ఈ కేంద్రాలకు ఉండటం లేదు. 'నమామి గంగా' ప్రాజెక్టు మొత్తం వ్యయంలో సుమారు సగం సొమ్మును అంటే రూ.11,176.81 కోట్లు వెచ్చించి రోజుకు దాదాపు 117కోట్ల లీటర్ల మురుగునీటిని శుభ్రం చేసేందుకు శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ జాతీయ గంగా శుద్ధి మిషన్ అంచనాల ప్రకారం గంగానదిలో రోజుకు 290 కోట్ల లీటర్ల మురుగు కలుస్తోంది. తొలుత ఏర్పాటు



'గంగ'కోసం ఉద్యమ ఘోష

చేసుకున్న లక్ష్యాన్ని చేరుకోవడమే అసాధ్యంగా మారిన పరిస్థితులు నేడు మనముందున్నాయి. ఇక 290 కోట్ల లీటర్ల మురుగును శుద్ధిపరచి గంగానదికి ప్రాణదానం చేయగల స్థాయిని అందుకోవాలంటే మరెంత కాలం పడుతుందో తెలియని పరిస్థితి. ఆలోగా మురుగు పరిమాణం అనూహ్య స్థాయులకు చేరుతుందనడంలో సందేహం లేదు. పర్యావరణ ఉద్యమకారులను ఆందోళనపరుస్తున్న గణాంకాలివి. గంగానది ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేని వాతావరణం కల్పిస్తే కనీసం కొంతకాలానికైనా నదీమతల్లి సహజసిద్ధతను సంతరించుకుంటుందని పర్యావరణవేత్తలు వాదిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఆ దిశగా కదలడమే లేదు. మురుగు నీరు నేరుగా గంగా నదిలో కలవకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ఉద్యమకారులు వాదిస్తున్నారు.

గంగానది పైభాగాన హిమాలయాల్లో హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల నిర్మాణంవల్ల పెనువరదలు సంభవించి 2013లో తీవ్ర నష్టం వాటిల్లింది. మరోవంక గంగా నది పొడవునా డ్యామ్‌లు, బ్యారేజీలను నిర్మించడంవల్ల సహజ ప్రవాహానికి తీవ్రమైన అడ్డంకులు ఏర్పడుతున్నాయి. నదిపై విచ్చలవిడిగా ప్రాజెక్టులు నిర్మించడంవల్ల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్న హెచ్చరికలను ప్రభుత్వాలు చెవినపెట్టాల్సిన తరుణమిది. నది పొడవునా వందలాది పరిశ్రమలు రసాయన వృథాను నేరుగా గంగలోకి విరజిమ్ముతున్నాయి. వీటికితోడు గంగకు ఆనుకుని ఉన్న నగరాలు, పట్టణాలకు చెందిన గృహాలనుంచి చేరుతున్న మురుగు అంతా ఇంతా కాదు. రాజీవ్ జమానానుంచి ఈ సమస్యను అధిగమించడంకోసం ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. పెరుగుతున్న జనాభా కారణంగా ఈ సమస్య అంతకంతకూ ముదురుతోంది. హరిద్వార్, రూర్కీ ప్రాంతాల్లోని నదీ జలాలు కనీసం మునక వేయడానికి కూడా పనికిరాని విధంగా మారుతున్నాయి. గంగా నది చుట్టూ పరిశ్రమలు, అక్రమ మైనింగ్, వాణిజ్య కార్యక్రమాల ద్వారా డబ్బు చేసుకోవడంకోసం కార్పొరేట్లు ఎప్పటినుంచో ప్రయత్నిస్తున్నాయి. గంగా వాణిజ్యీకరణ కారణంగా నది తన సహజ స్వరూపాన్ని, స్వభావాన్ని వేగంగా కోల్పోతోంది. ప్రైవేటు వ్యక్తుల ప్రయోజనాలను కాపాడటం మీద ఉన్న శ్రద్ధ- ప్రభుత్వాలకు దేశ ప్రజల జీవనాడిగా ఉన్న గంగా నది పరిరక్షణపై లేకపోవడం శోచనీయం. గంగా శుద్ధి కార్యక్రమాన్ని నిబద్ధంగా పట్టాలకు ఎక్కించి, నదీజలాలను కలుషితం చేస్తున్న అక్రమార్కుల భరతం పడితే తప్ప- జీవనదికి మనుగడ ఉండదు!

(రచయిత- రామన్ మెగసెసే పురస్కార గ్రహీత)

ఈనాడు లేఖలు

పక్కదారి పట్టించే ప్రకటనలు

రాష్ట్రానికి వస్తున్న భారతీయ జనతాపార్టీ జాతీయ నాయకులు ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఎంతో సాయం చేసిందన్నట్లుగా మాట్లాడుతున్నారు. అన్ని రాష్ట్రాలకు మాదిరిగా అందజేసే నిధుల గురించి చెబుతూ ప్రజలను పక్కదారి పట్టించడానికి యథాశక్తి ప్రయత్నిస్తున్నారు. రాష్ట్ర విభజన వల్ల నష్టపోయినందుకు చట్టంలో ఇస్తామన్న వాటి గురించి ప్రజలు ప్రధానంగా ప్రశ్నిస్తున్నారన్న విషయం భాజపా నాయకులు గ్రహించాలి. మిత్ర పక్షంగా కొంతకాలం ఓపిక పట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు సర్దుబాటు ధోరణితో వ్యవహరించడాన్ని భాజపా చులకనగా తీసుకుంది. దాదాపు ముప్పైసార్లు దిల్లీకి వెళ్లి చేసిన విన్నపాలన్నీ బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. భాజపా చేస్తున్న రాజకీయం అర్థం కావడంతో విధిలేని పరిస్థితుల్లో ఆ పార్టీతో చంద్రబాబు తెగతెంపులు చేసుకున్నారు. రాష్ట్రానికి కేంద్రం ఇవ్వాల్సిన నిధులు లక్ష కోట్ల రూపాయలకు పైగానే ఉన్నాయని మేధావులు సైతం చెప్పడాన్నిబట్టి మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అన్యాయం సులభంగా బోధపడుతోంది.

- ఎస్.రాజేశ్ కుమార్, ఏలూరు

అనుమానాస్పద దాడులు

కేంద్ర దర్యాప్తు సంస్థ బృందం సభ్యులు, పశ్చిమ్ బంగ పోలీసుల మధ్య కోల్‌కతాలో నెలకొన్న ఘర్షణపూరిత వాతావరణం- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య క్షీణిస్తున్న సంబంధాలకు నిదర్శనంగా నిలుస్తోంది. అయిదేళ్ల క్రితం ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోదీ మాట్లాడుతూ, వంద రోజుల లోపు రాజకీయ నాయకులపై ఉన్న వ్యాజ్యాలను కొలిక్కి తీసుకువస్తామన్నట్లు మాట్లాడారు. అప్పట్లో మోదీ చిత్తశుద్ధి పట్ల ప్రజలు ఎంతో నమ్మకం ఉంచారు. అయిదేళ్లలో ఆ దిశగా తీసుకున్న చర్యలు నామమాత్రం. 2జీ స్కాములో నిందితులకు సైతం శిక్షలు పడలేదు. వారు నిర్దోషులుగా విడుదలయ్యారు. డీఎమ్‌కే నాయకులను మంచి చేసుకోవడానికే ప్రభుత్వం 2జీ స్కాము విషయంలో చూసీచూడనట్లు వ్యవహరించిదన్న ఊహాగానాలూ వినిపించాయి. రాజకీయ అవినీతిపై ఇన్నాళ్లూ మీనమేషాలు లెక్కించి, ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష నాయకుల పాత కేసులను దుమ్ము దులిపి కేదస, ఈడీ, ఆదాయపన్ను అధికారులు జరుపుతున్న దాడులు రాజకీయ ప్రేరేపితాలన్న సందేహాలు సహజంగానే ప్రజల్లో కలుగుతున్నాయి.


- వి.వెంకటేశ్వరరావు, యూసుఫ్‌గూడ, హైదరాబాద్

మరణించీ జీవించు!

'పుణ్యాత్ములు, మహానుభావులు, పండితులు, ధర్మాత్ములు కీర్తిశరీరాలతో జరామరణాలను అతిక్రమించిన యోగుల్లా సర్వదా ప్రకాశిస్తూనే ఉంటారు' అంటాడు భర్తృహరి. కీర్తికాంక్ష కలవారు జీవించేది మరణంవరకే. విద్య, సంపద, పదవివల్ల పేరు ప్రఖ్యాతులు లభించవు. లభించినా అవి శాశ్వతమైనవి కావు. జ్ఞానం, సచ్ఛీలం, సత్కర్మ, సత్యసంధత, నిరాడంబరత వల్లనే యశస్సు ఒనగూడుతుంది.

చిత్తశుద్ధి, సంస్కారం, మేధస్సు కలవాడు వినమ్రుడై పదిమందిలో మంచివాడనిపించుకుంటాడు. పోతన మహాకవి సామాన్య జీవన విధానానికి శ్రీనాథకవి సార్వభౌముడే అచ్చెరువొందాడు. తన భౌతిక సంపదకు బతికినన్నాళ్లు తానొక ధర్మకర్తగానే మనిషి భావించుకోవాలి. మనిషి కీర్తి వెంటపడక, కర్తవ్య దీప్తి వెంటపడాలి. వృత్తిని దైవంగా, ప్రవృత్తిని ధర్మబద్ధమైనదిగా భావిస్తే, మన్నన దానంతట అదే లభిస్తుంది. ఏ పని వెనకైనా కీర్తి కాముకత ఉంటే- దానికి విలువే లేదు... గెలుపూ ఇవ్వలేదు. పైగా అటువంటి కీర్తి కాంక్షాపరులు నలుగురిలో చులకనైపోతారు.

'కీర్తికాంక్షకు మోహమే మూలం. ఆ మోహమే బుద్ధిహీనతకు వినాశానికి దారి తీస్తుంది' అంటాడు వాసుదేవుడు. కీర్తి కోసం అహంకారపూరితుడై బలిచక్రవర్తి పాతాళాన పడిపోయాడు. కౌరవ సైన్యంలో ద్వేషం, వ్యక్తిగత ఖ్యాతి కోసం పాకులాడేవారు ఉండటం వల్ల వారంతా కురుక్షేత్రంలో పరాజితులయ్యారు. 'విశ్వశ్రేయస్సు కోసమే కావ్యరచన' అన్న సత్సంకల్పంతో నిర్మలచిత్తంతో లోక కల్యాణం కోసం రామాయణ, మహాభారత రచన చేసిన వాల్మీకి, వ్యాస మహర్షులు చిరయశోశిఖరాయమానులయ్యారు. సామాన్యుడైన విదురుడు హితమైన బోధలతో మాన్యుడయ్యాడు. అమేయమైన భక్తివల్ల శివుడికి తన కన్ను అప్పగించి కన్నప్ప లోకవంద్యుడయ్యాడు. త్యాగయ్య, అన్నమయ్య, రామదాసు తమ జీవితాలను కీర్తికోసం పరమాత్మకు అంకితం చేయలేదు. ఆదిశంకరులు ప్రధాన జీవన లక్ష్యాలను ఖ్యాతికోసం ప్రచారం చేయలేదు.



అంతర్యామి

ఎవరైనా మృత్యుదేవతకు బానిసలే. మంచి మరణం ధర్మవ్రతుడికే లభిస్తుంది. ఆ ధర్మమే మరణం తరవాత అతణ్ని బతికిస్తుంది. పాప జీవితం గడిపినవాడే మరణానికి భయపడతాడు. మమకారం వీడినవాడు మరణం ముందు ధైర్యంగా నిలబడతాడు. చచ్చిన తరవాత నలుగురే మోస్తారు. బతకడంలో తేడా వస్తే లోకం అంతా మోస్తుంది చరిత్రహీనుడంటూ!

మరణ సమయంలో నిశ్చింతగా పోయేవాడు జీవితాన్ని గెలిచినవాడే. అతడే ఆధ్యాత్మిక చక్రవర్తి. ఉన్నతమైన ఆసనం మీద కూర్చున్నంత మాత్రాన ఎవరూ గొప్పవారు కారు. ఉన్నతమైన ఆలోచనలు, ఆశయాలుండి కింద కూర్చున్నవాడే మహాత్ముడు, మహోన్నతుడు అంటాడు భాస్కర శతక కర్త. సాధన, ప్రయత్నం, దృఢ సంకల్పం, దీక్ష అనేది లేకుండా కీర్తి కండూతితో వక్రమార్గంలో సన్మానాలు, సత్కారాలు అందుకోవడానికి తాపత్రయపడటం- ఎండమావిలో నీటికోసం అన్వేషించడం లాంటిదే! స్వావలంబనతోపాటు పారమార్థిక చింతన ఉన్న మనిషిని మాత్రమే ఖ్యాతి వరిస్తుంది. ప్రతిభ ఉంటే ప్రశంస పరుగెడుతూ వస్తుంది. ప్రశంస కోసమే పరుగులు పెట్టేవాడు ప్రతిభకు దూరమైపోతాడు. మనోవాక్కాయ కర్మల్లో పవిత్ర ప్రవర్తన కలవాడే మరణానంతరం చిరస్మరణీయుడవుతాడు. మరణించాక జీవించాలంటే బతుకంతా తపస్సు చేయాలి!

- చిమ్మపూడి శ్రీరామమూర్తి

జయరాం హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

- ప్రధాన నిందితుడు రాకేష్‌రెడ్డి
- సహకరించింది అతని వాచ్‌మ్యాన్
- ఇందులో శిఖా పాత్ర లేదు
- ప్రాథమిక విచారణే పూర్తయింది
- మరింత లోతుగా విచారించాల్సి ఉంది
- జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి వెల్లడి

నందిగామ - న్యూస్‌టుడే

పారిశ్రామికవేత్త, కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్ చిగురుపాటి జయరాం హత్య కేసులో ప్రాథమిక విచారణ మాత్రమే జరిగిందని, మరింత లోతుగా దీన్ని విచారించాల్సి ఉందని కృష్ణా జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి వెల్లడించారు. అరెస్ట్ చేసిన నిందితులను కోర్టు అనుమతితో తిరిగి కస్టడీకి తీసుకుంటామన్నారు. మృతుడి మేనకోడలు శిఖాచౌదరికి హత్యతో సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆర్థిక లావాదేవీల వల్లనే హత్య జరిగిందన్నారు. కేసులో హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్రాంతానికి చెందిన ప్రధాన నిందితుడు రాకేష్‌రెడ్డి, అతని వాచ్‌మ్యాన్ దున్నే శ్రీనివాస్‌లు కారులో విజయవాడ వైపు వెళ్తుండగా కృష్ణా జిల్లా నందిగామ మండలం అనాసాగరం వద్ద పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సాయంత్రం నందిగామ డీఎస్పీ కార్యాలయంలో వారిని ఎస్పీ, డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్‌లు మీడియా ముందు ప్రవేశపెట్టారు. కేసు వివరాలను ఎస్పీ వివరించారు.

గతనెల 31న రాత్రి 11.10 గంటలకు నందిగామ మండలం ఐతవరం వద్ద ఏపీ ఇజీ 0620 నెంబర్ కారులో జయరాం వెనుక సీటులో పడి ఉండగా హైవే మొబైల్ పోలీసులు వెళ్లి పరిశీలించారని ఎస్పీ చెప్పారు. ఆయనను జయరాంగా గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చామన్నారు. హత్యచేసి ఉంటారంటూ ఆయన మామ గుత్తా పిచ్చయ్యచౌదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసును నమోదు చేశామన్నారు. పది బృందాలతో దర్యాప్తు ప్రారంభించామన్నారు. రాకేష్‌రెడ్డి హైదరాబాద్‌లో స్థిరాస్తి వ్యాపారం, సెటిల్‌మెంట్లు చేస్తుంటాడని చెప్పారు. అతనిపై పలు కేసులు ఉన్నాయన్నారు.

రాకేష్ నుంచి దఫదఫాలుగా రూ.కోట్ల అప్పులు

జయరాంకు చెందిన టెట్రాస్ పోలిమర్స్ కంపెనీ 2015లో లాకౌట్ అయిందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సమయంలో రాకేష్‌రెడ్డి ఆయనకు పరిచయం అయ్యాడని చెప్పారు. 2016లో రాకేష్ నుంచి రూ. 2.25 కోట్లు, తిరిగి 2017లో రూ.1.12 కోట్లు జయరాం అప్పుగా తీసుకున్నాడని చెప్పారు. అనంతరం జయరాం అమెరికాకు వెళ్లారన్నారు. 2018 అక్టోబరులో భారత్‌కు వచ్చిన జయరాం మరో రూ.80లక్షలు కావాలని, హామీగా తన ఇల్లు రాసి ఇస్తానని చెబితే రాకేష్ ఆ మొత్తం ఆయన బ్యాంక్ ఖాతాకు బదిలీ చేశాడు. గడువు తీరినా జయరాం ఆ సొమ్ము తిరిగివ్వలేదు. అనంతరం 2018లో జయరాం అమెరికా నుంచి రాకేష్‌రెడ్డికి ఫోన్‌చేసి టెట్రాస్ కంపెనీలో గొడవలు జరుగుతున్నాయని, పరిష్కరించమని కోరారు. శిఖాచౌదరి నీకు ఫోన్ చేస్తుందని చెప్పారు. అలా రాకేష్‌కు ఆమె పరిచయం అయింది. ఆరు నెలల క్రితం గొడవలు వచ్చాయని, ప్రస్తుతం వారివురి మధ్య సంబంధాలు లేవని ఎస్పీ పేర్కొన్నారు. జయరాం తీసుకున్న రూ.4.17కోట్లు వడ్డీ కలిపి రూ.ఆరు కోట్లు రాకేష్‌కు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. 2018 అక్టోబరుతో గడువు ముగిసినా ఆ మొత్తం ఇవ్వకుండా, జయరాం ముఖం చాటేశాడు. ఈ పరిస్థితుల్లో జయరాం భారత్‌కు ఎప్పుడు వస్తాడా అని రాకేష్ నిఘా పెట్టాడు.

హత్య జరిగిందిలా..

జయరాం గత నెల 29న హైదరాబాద్‌లోని శిఖాచౌదరి ఇంటికి వచ్చాడని తెలుసుకున్న రాకేష్‌రెడ్డి ఆయనకు ఫోన్ చేసినా తీయలేదు. ఈ నేపథ్యంలో గతనెల 30న రాకేష్‌రెడ్డి వీణ అనే పేరుతో వేరే నెంబర్ నుంచి జయరాంకు మెసేజ్ పంపించాడు. స్పందించిన ఆయనను తన ఇంటికి రప్పించాడు. ఇవ్వాల్సిన డబ్బు గురించి డిమాండు చేస్తూ గతనెల 29, 31 తేదీల్లో నిర్బంధించాడు. రూ.50లక్షలు ఇస్తామని జయరాం చెప్పినా రాకేష్ అంగీకరించలేదు. తనకివ్వాల్సిన డబ్బు రాబట్టేందుకు ఆయనతో చాలమందికి ఫోన్లు చేయించాడు. ఈ క్రమంలో శిఖాకు సైతం ఆయన ఫోన్ చేశాడు. గత నెల 30న జయరాం తన సన్నిహితుడికి ఫోన్‌చేసి డబ్బులు చాలా అవసరమని కోరాడు. ఆయన హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్ వద్దకు వచ్చి రూ.6లక్షలు మాత్రం రాకేష్‌కు ఇచ్చి వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో జయరాం గత నెల 31న బయటకు వెళ్లేందుకు యత్నించగా రాకేష్‌రెడ్డి ఉదయం 11 నుంచి 12 గంటల మధ్యలో ఆయనను కొట్టడంతో ముక్కు, నోటి వెంట రక్తం కారింది. జయరాం సోఫాలో పడిపోగా రాకేష్ ఆయన ముఖంపై గట్టిగా అదుముతూ కిందకు నొక్కాడు. వాచ్‌మ్యాన్ శ్రీనివాస్.. జయరాం కాళ్లు పట్టుకుని కదలకుండా సహకరించాడు. దీనివల్ల ఊపిరాడక జయరాం మృతి చెందారు. అనంతరం వాచ్‌మ్యాన్ గదిని శుభ్రం చేశాడు. మృతదేహాన్ని రాకేష్ కారులో హైదరాబాద్ నుంచి నందిగామ మండలం ఐతవరం వద్దకు తీసుకొచ్చాడు. రోడ్డు ప్రమాదం జరిగిందని నమ్మించేందుకు కారుతోపాటు వదిలివెళ్లాడు. హత్య గురించి హైదరాబాద్ నల్లకుంట సీఐ శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం ఏసీపీ మల్లారెడ్డిలకు రాకేష్‌రెడ్డి ఫోన్‌చేసి చెప్పి కేసు నుంచి బయటపడేందుకు వారి సలహాలను తీసుకున్నాడని ఎస్పీ తెలిపారు. హత్యతో శిఖాచౌదరికి సంబంధం ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. కేసు విచారణ కొనసాగుతోందని, నిందితులను పోలీస్ కస్టడీకి తీసుకుని పూర్తి విచారణ చేస్తామన్నారు. కేసును 302, 419, 342, 346, 348, 384, 201, 202 రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ త్రిపాఠి వివరించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న కృష్ణా జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

ఇబ్రహీంపట్నం ఏసీపీపై బదిలీ వేటు

ఈనాడు, హైదరాబాద్: జయరాం హత్య కేసులో ప్రధాన నిందితుడు రాకేష్‌రెడ్డితో సంబంధాలున్నాయన్న ప్రాథమిక సమాచారంతో రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఇబ్రహీంపట్నం సబ్‌డివిజన్ ఏసీపీపై బదిలీ వేటు పడింది. ఏపీ పోలీసులు తెలిపిన వివరాల ఆధారంగా ఏసీపీ ఎస్.మల్లారెడ్డిని బదిలీ చేసినట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్ తెలిపారు. రాకేష్‌రెడ్డితో మల్లారెడ్డి మాట్లాడిన అంశాల ఆధారంగా ఆయనపై తదుపరి చర్యలు చేపట్టనున్నామని వివరించారు. జయరాంను హత్య చేశాక హంతకుడు రాకేష్‌రెడ్డి ఇబ్రహీంపట్నం ఏసీపీ మల్లారెడ్డి, నల్లకుంట పోలీస్‌ఠాణా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుతో పలుమార్లు మాట్లాడారని నందిగామ పోలీసులు హైదరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లకు రెండు రోజుల క్రితం సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలోనే పోలీస్ ఉన్నతాధికారులు వారిద్దరిని బాధ్యతల నుంచి తప్పించారు.

తెదేపాపై ఎమ్మెల్యే ఆమంచి కినుక!

- వైకాపాలో చేరతారంటూ ప్రచారం
- నేడు సీఎంతో భేటీ

ఈనాడు డిజిటల్, ఒంగోలు: చీరాల ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ తెదేపాపై నిరశన గళం ఎత్తారు. పార్టీని వీడి, వైకాపాలో చేరేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఆ నేపథ్యంలోనే మంగళవారం తన నివాసంలో ముఖ్య అనుచరులు, నాయకులతో సుమారు మూడు గంటలపాటు చర్చించారు. తెలుగుదేశం పార్టీలో తనకు ఎదురైన ఇబ్బందులు, పార్టీని ఎందుకు వీడాలనుకుంటున్నదీ, వైకాపా తరఫున వచ్చిన ఆహ్వానం తదితరాలను తన అనుచరులకు వివరించి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పార్టీలో తాను ఇమడలేనని, తన ప్రత్యర్థులకు పెద్దపీట వేస్తూ, ఉద్దేశ పూర్వకంగానే తనపై ఉసిగొల్పుతున్నారని వ్యాఖ్యానించినట్టు తెలిసింది. పార్టీలో ఇబ్బందులు పడేకంటే బయటకు వెళ్లడమే ఉత్తమమని నాయకులకు చెప్పినట్టు సమాచారం. ఈ క్రమంలోనే ఆయన తెదేపాను వీడి వైకాపాలో చేరతారని, జగన్‌ను కలవనున్నారని ప్రచారం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న పార్టీ ముఖ్యులు ఆమంచితో చర్చించేందుకు మంత్రి శిద్దా రాఘవరావును పంపారు. గంటన్నరపాటు ఇద్దరూ చర్చించారు. అయినా ఎమ్మెల్యే మెత్తబడలేదు. ముఖ్యమంత్రితో మాట్లాడి పరిష్కరించుకోవాలని శిద్దా సూచించడంతో బుధవారం సాయంత్రం చంద్రబాబుతో ఆమంచి భేటీ అవుతారని తెలిసింది. సీఎం చంద్రబాబుతో మాట్లాడిన అనంతరం చివరగా.. కార్యకర్తలు, అనుచరులతో మాట్లాడి తన నిర్ణయం చెబుతానని అన్నారు. తనపై పోటీచేసి ఓడిపోయిన పోతుల సునీతకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చినప్పటినుంచి ఆమంచి పార్టీలో అసంతృప్తిగానే ఉంటున్నారు. పార్టీ సమన్వయ సమావేశాలకు, ముఖ్య సమావేశాలకు హాజరుకావడం లేదు.

కమీషన్ల కోసమే పోలవరం సందర్శన

ముఖ్యమంత్రిపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా ధ్వజం

పాలకొండ, న్యూస్‌టుడే: కమీషన్ల కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోలవరాన్ని సందర్శిస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. శ్రీకాకుళం జిల్లా పాలకొండలో మంగళవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర నిధులతో పోలవరం నిర్మాణం చురుగ్గా సాగుతోందని అన్నారు. గుత్తేదారులతో కమీషన్లు మాట్లాడుకునేందుకే ముఖ్యమంత్రి పోలవరం వెళుతున్నారని ఆరోపించారు. తండ్రీకొడుకులు కలిసి రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని ధ్వజమెత్తారు. ప్రజల సొమ్ముతో ఓట్లు కొనుక్కునే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేపడుతున్నారన్నారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా కన్నా చేపట్టిన బస్సు యాత్ర మంగళవారం శ్రీకాకుళంనుంచి ప్రారంభమై చిలకపాలెం మీదుగా పొందూరు, రాజాం, పాలకొండ మీదుగా సాగింది. అక్కడి నుంచి వీరఘట్టం మీదుగా విజయనగరం జిల్లాకు చేరుకుంది.

ఆహార శుద్ధి పరిశ్రమలకు రూ.350 కోట్ల రాయితీలు విడుదల చేశాం

పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: ఆహార శుద్ధి పరిశ్రమలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ గత నాలుగేళ్లలో రూ.350 కోట్ల రాయితీలు విడుదల చేశామని పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఆహార శుద్ధి పరిశ్రమల సముదాయాల పనుల్లో పురోగతిపై మంగళవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, ఇబ్బందులుంటే వాటిని తొలగించే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జనసేనలోకి విద్యావేత్త కె.వి.విష్ణురాజు

ఈనాడు, అమరావతి: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో మంగళవారం విద్యావేత్త కె.వి.విష్ణురాజు ఆ పార్టీలో చేరారు. అనంతరం ఆయన్ని జనసేన సలహా మండలి ఛైర్మన్‌గా నియమించారు. సామాజిక సేవలో అంకిత భావం ఉన్న కె.వి.విష్ణురాజు అనుభవం పార్టీ విధానాల రూపకల్పన, ప్రజాసేవకు ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఏడుగురు సభ్యులు ఉండే కౌన్సిల్‌లో విద్యావేత్తలు, సామాజికవేత్తలు ఉంటారని, ఈ బృందానికి విష్ణురాజు నేతృత్వం వహిస్తారని ప్రకటించారు.

జనసేన కార్యాలయంపై దాడి

గోరంట్ల(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు నగరంలోని గోరంట్ల ఇన్నర్ రింగ్ రోడ్డులో నూతనంగా నిర్మించిన జనసేన జిల్లా పార్టీ కార్యాలయంపై సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మద్యం సీసాలు విసిరేసి పరారయ్యారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంగళవారం ఉదయం అక్కడకు చేరుకుని నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ.. తమ అధినేతకు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూడలేకే కొందరు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. 24 గంటల్లో నిందితులను పట్టుకోవాలని, లేకపోతే పార్టీ నాయకులు, కార్యకర్తలతో ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. నల్లపాడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ గురుకులాల్లో 742 పోస్టులకు అనుమతి

ఈనాడు డిజిటల్- అమరావతి: వివిధ జిల్లాల్లోని 65 బీసీ సంక్షేమ గురుకులాలకు 742 బోధన, బోధనేతర పోస్టులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటిలో 65 ప్రధానోపాధ్యాయ పోస్టులు కూడా ఉన్నాయి. తెలుగు, ఆంగ్లం, హిందీ, గణితం, భౌతికశాస్త్రం ఉపాధ్యాయులు 455, స్టాఫ్ నర్సు 65, వ్యాయామ ఉపాధ్యాయులు 65, గ్రంథపాలకులు 65, ఆర్ట్ టీచర్ పోస్టులు 65 ఉన్నాయి. వీటిని ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేస్తారు.

చంద్రబాబు మెప్పు కోసమే పిటిషన్

హైకోర్టులో 'లక్ష్మీస్ ఎన్టీఆర్' నిర్మాత కౌంటర్

ఈనాడు, హైదరాబాద్: తమ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు మెప్పు కోసమే తెలుగుదేశం ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ 'లక్ష్మీస్ ఎన్టీఆర్' చిత్రంలోని పాటను తొలగించాలంటూ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారని ఆ సినిమా నిర్మాత పి.రాకేశ్‌రెడ్డి మంగళవారం హైకోర్టుకు నివేదించారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కిందికి రాదని, విచారణార్హత లేని ఆ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. ఎన్టీఆర్ జీవిత చరిత్రకు సంబంధించి రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో నిర్మిస్తున్న 'లక్ష్మీస్ ఎన్టీఆర్' చిత్రంలో 'దగా...దగా.. కుట్ర..' అనే పాటను సినిమాతోపాటు, సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్ నుంచి తొలగించాలని కోరుతూ పిఠాపురం ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ ఇటీవల ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం ఆదేశాల మేరకు సినిమా నిర్మాత మంగళవారం కౌంటరు దాఖలు చేశారు.

సీపీఎస్ రద్దు కోరుతూ రేపు అసెంబ్లీ ముట్టడి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛను విధానాన్నే అమలుచేయాలంటూ గురువారం అసెంబ్లీని ముట్టడించనున్నట్లు ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు ప్రతాప్ ప్రకటించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈ ఆందోళనలో పాల్గొనాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సీపీఎస్‌కు సంబంధించిన 653, 654. 655జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ఆర్డీఏ చట్టం నుంచి రాష్ట్రం బయటకు వస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్రంలోని 1.84లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు ఏ క్షణమైనా సమ్మెకు సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు.

ద.మ.రైల్వే జీఎంగా మల్య బాధ్యతలు



గజానన్ మల్యా

ఈనాడు,హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా నియమితులైన గజానన్ మల్య బాధ్యతలు చేపట్టారు. ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్స్ (ఐఆర్ఎస్ఎంఈ)కి చెందిన గజానన్ 1979 బ్యాచ్ అధికారి. బిహార్‌లోని జమాల్‌పూర్ ఇండియన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెకానికల్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సంస్థ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన్ను ద.మ.రైల్వే జీఎంగా కేంద్ర ప్రభుత్వం సోమవారం నియమించింది. 4వ తేదీ రాత్రి జమాల్‌పూర్‌లోనే ఆయన కొత్త బాధ్యతలు స్వీకరించారు. గతంలో దక్షిణమధ్య రైల్వేలో సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా కూడా పనిచేశారు.

వివిధ మార్గాల్లో వేసవి ప్రత్యేక రైళ్లు

ఈనాడు, హైదరాబాద్: వేసవి రద్దీ నేపథ్యంలో వివిధ మార్గాల్లో మరో 142 ప్రత్యేక రైలు సర్వీసులను నడిపించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే మంగళవారం ప్రకటించింది. మార్చి 1 నుంచి మే నెలాఖరు వరకు ఈ రైళ్లు రాకపోకలు సాగిస్తాయని తెలిపింది. కాకినాడ టౌన్-రాయచూరు (80 సర్వీసులు), కాకినాడ టౌన్-కర్నూలు సిటీ (52), నర్సాపూర్-హైదరాబాద్ (05), హైదరాబాద్-విజయవాడ (05 సర్వీసులు)ల మధ్య ఈ ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయని సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ తెలిపారు.

పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవోగా ఆర్కే జైన్ కొనసాగింపు

ఈనాడు, దిల్లీ: పోలవరం ప్రాజెక్టు సీఈఓగా ఆర్కే జైన్‌ను కొనసాగిస్తూ కేంద్ర జలవనరులశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గోదావరి నదీ యాజమాన్య మండలి ఛైర్‌పర్సన్‌గా ఉన్న ఆయనకు ఆరు నెలల కాలానికి పోలవరం ప్రాజెక్టు సీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గత సెప్టెంబర్ 18న ఉత్తర్వులు జారీ చేశారు. ఆ గడువు ఈ నెలతో ముగిసిపోతుండటంతో ఆయనను తదుపరి ఉత్తర్వులు వెలువరించేంతవరకు గానీ, ఆ స్థానంలో మరొకరిని నియమించేంత వరకు గానీ పొడిగిస్తున్నట్లు జల వనరుల శాఖ మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

9 నుంచి విరసం 'సాహిత్య పాఠశాల'

హైదరాబాద్, న్యూస్‌టుడే: నల్గొండలోని ఎస్‌బీఆర్ ఫంక్షన్‌హాలులో ఈనెల 9,10 తేదీల్లో సాహిత్య పాఠశాలను నిర్వహించనున్నట్లు విప్లవ రచయితల సంఘం (విరసం) కార్యవర్గ సభ్యులు రాంకీ, జగన్, రాము తెలిపారు. సంబంధిత గోడపత్రికను మంగళవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. 9న విరసం కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి ప్రసంగిస్తారని తెలిపారు. ప్రజా కళామండలి నాటిక, నాటక ప్రదర్శనలు, కవి సభ నిర్వహిస్తామన్నారు. 10న ఆచార్య కాశిం, కృష్ణ ప్రసంగిస్తారన్నారు. సాయంత్రం 5.30 గంటలకు జరిగే బహిరంగ సభలో యాకుబ్, కల్యాణ్‌రావు, రత్నమాల, పాణి పాల్గొంటారని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విరసం ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

హత్యలో శిఖా పాత్రను తేల్చాలి

- నా ఇంట్లోకి ఆమె ఎందుకు ప్రవేశించిందో తెలియాలి
- కేసును హైదరాబాద్‌కు బదిలీ చేయాలి
- జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదులో జయరాం భార్య పద్మశ్రీ

ఈనాడు, హైదరాబాద్; న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్ : తన భర్త హత్యపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసులదేనని చిగురుపాటి జయరాం భార్య పద్మశ్రీ అన్నారు. హత్య హైదరాబాద్‌లోనే జరిగింది కాబట్టి కేసును ఇక్కడికి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి ఆమె జూబ్లీహిల్స్ ఠాణాకు వచ్చి ఫిర్యాదు చేశారు. జయరాంకు ప్రాణ హాని జరిగిన సమయంలో శిఖాచౌదరి ఘటనాస్థలికి వెళ్లకుండా తమ ఇంట్లోకి ఎందుకు వచ్చిందో స్పష్టం కావాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. "నేను ఇంటికి వచ్చి చూసేసరికి ఇల్లంతా చిందరవందరగా ఉంది. వాచ్‌మన్‌ను అడిగితే శిఖాచౌదరి వచ్చి పత్రాల కోసం వెతికిందని చెప్పాడు"అని ఆమె తెలిపారు. ఆస్తిపై కన్నేసి ఇలా చేసిందా? అనేది తేలాల్సి ఉందన్నారు. ఆంధ్ర పోలీసుల దర్యాప్తుపై నమ్మకం లేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. "జయరాంతో నాకు 30 ఏళ్ల క్రితం పెళ్లి జరిగింది. మా బంధం దృఢంగా సాగింది. ఆయన్ని నా నుంచి కిరాతకంగా తీసుకెళ్లిపోయారు. ఆయన మృతి మాకు దిగ్భ్రాంతి కలిగించింది. ఆయనకు గొప్ప విజన్ ఉంది. నా భర్తను ఎందుకు చంపారు? ఒక జీవితం విలువ రూ.80లక్షలా? క్రిమినల్స్‌ను ఉద్దేశించి అడుగుతున్నా. ఈ హత్యకు జవాబుదారీ ఎవరు? నా జీవితాన్ని నాశనం చేశారు. నేను అమెరికాలో ఉన్నప్పుడు ఆయనకు రోడ్డు ప్రమాదం జరిగిందన్నారు. ఇక్కడికి వచ్చాక హత్య అని తెలిసింది. ఈ నాలుగు రోజులు కేసు దర్యాప్తు టీవీ సీరియల్‌ను తలపించింది. జయరాం హత్యపై అనుమానాల్ని నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసులదే. హత్య హైదరాబాద్‌లో జరిగితే మృతదేహం ఆంధ్రకు ఎందుకు తీసుకెళ్లారు? హత్యలో శిఖా పాత్ర ఉందా? లేదా? పోలీసులు తేల్చాలి. శిఖా నా కుటుంబంలోకి, జీవితంలోకి నా ప్రమేయం లేకుండానే వచ్చింది. కుటుంబ సభ్యురాలిగా ఉంటూ ఆర్థిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంది. ఆంధ్ర పోలీసుల్ని ఆమె ప్రభావితం చేసిందనే అనుమానాలున్నాయి. దోషులకు శిక్ష వేసి నా కుటుంబానికి న్యాయం చేయాలి" అని పద్మశ్రీ అన్నారు.

శిఖా చౌదరిపై ఫిర్యాదు

జూబ్లీహిల్స్‌లోని ఇంట్లో విలువైన వస్తువులు పోయాయని పద్మశ్రీ ఫిర్యాదు చేశారని జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. జయరాం చేతి గడియారంతో పాటు కీలకమైన దస్త్రాలు కనిపించడం లేదని, శిఖాచౌదరిపై అనుమానం ఉందని పేర్కొన్నట్లు వెల్లడించారు.



జయరాం హత్యోదంతంపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్నఆయన భార్య పద్మశ్రీ

ఎఫ్ఆర్‌బీఎం పరిధికి మించి అప్పులు చేసేందుకు వీల్లేదు

ఏపీపై రాజ్యసభలో కేంద్రం వెల్లడి

ఈనాడు, దిల్లీ: ఆర్థిక క్రమశిక్షణ, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) పరిధికి మించి 2018-19లో ఆంధ్రప్రదేశ్ అదనంగా అప్పులు చేయడానికి వీల్లేదని కేంద్రం పేర్కొంది. వైకాపా సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పొన్ రాధాకృష్ణన్ సమాధానమిచ్చారు. లోటు బడ్జెట్ దృష్ట్యా ఎఫ్ఆర్‌బీఎం పరిధి ఒక శాతం అదనంగా పెంచాలని ఏపీ ప్రభుత్వం 2016లో విజ్ఞప్తి చేసిందని ఆయన తెలిపారు. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ)పై ద్రవ్యలోటుకు అదనంగా 0.5శాతం రుణాలకు అనుమతి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు కోరాయన్నారు. 14వ ఆర్థిక సంఘం నివేదిక ప్రకారం 2015 నుంచి 2020 వరకు దేశవ్యాప్తంగా అని రాష్ట్రాలు జీఎస్‌డీపీపై మూడు శాతం మించి రుణాలు తీసుకోవడానికి వీల్లేదని తెలిపారు. జీఎస్‌డీపీపై ద్రవ్యలోటు లక్ష్యం 3% మించకుండా రూ.27,569 కోట్లు మాత్రమే రుణాలుగా తీసుకొనే అవకాశం ఉందని రాధాకృష్ణన్ తెలిపారు.

అమరావతిపై 39,937 కోట్ల ప్రతిపాదనలు

ఈనాడు, దిల్లీ: అమరావతిలో ప్రభుత్వ కార్యాలయ సముదాయాలు, ఇతర ముఖ్యమైన మౌలిక వసతుల కల్పన కోసం రూ.39,937 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలను నీతి ఆయోగ్ తమ అభిప్రాయం కోసం పంపించినట్లు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ తెలిపారు. మంగళవారం లోక్‌సభలో తెదేపా సభ్యుడు గల్లా జయదేవ్ అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన ఈమేరకు సమాధానమిచ్చారు. ప్రతిపాదనలపై తమ అభిప్రాయాలను రాసి తిరిగి నీతి ఆయోగ్‌కు పంపినట్లు వెల్లడించారు.

ఏపీలో రెండు పంటలకు జీఐ గుర్తింపు

దేశంలో 93 పంటలకు భౌగోళిక గుర్తింపు (జీఐ) లభించిందని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అందులో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన గుంటూరు మిర్చి (సన్నం), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బంగినపల్లి మామిడి ఉన్నట్లు తెలిపారు. దేశంలో అత్యధికంగా మహారాష్ట్రకు చెందిన 25, కర్ణాటకకు చెందిన 17 పంటలకు జీఐ గుర్తింపు ఉన్నట్లు చెప్పారు.

ఏపీలో 6, తెలంగాణలో 8 వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాలు

దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాల్లో వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాలు 90 ఉన్నట్లు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ జి.అహిర్ తెలిపారు. ఇందులో ఏపీ నుంచి 6 (తూర్పుగోదావరి, గుంటూరు, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, పశ్చిమ గోదావరి), తెలంగాణ నుంచి 8 (ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కొమరంభీం, మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్ రూరల్) ఉన్నట్లు వెల్లడించారు. మౌలిక వసతుల కల్పన కోసం 90 జిల్లాలకు కలిపి రూ.775 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. తీవ్రవాద నిరోధానికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల కారణంగా క్రమంగా హింసాత్మక కార్యకలాపాలు తగ్గుతున్నట్లు తెలిపారు.

విధానపర లోపంతోనే రూ.350 కోట్లు ఉపసంహరణ

ఏపీ వెనుకబడిన జిల్లాలపై లోక్‌సభలో కేంద్రం వెల్లడి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన జిల్లాలకు ఇచ్చిన రూ.350 కోట్లను విధానపరమైన లోపాలతోనే ఉపసంహరించుకున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్ తెలిపారు. పునర్విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన జిల్లాలకు నిధుల కేటాయింపుపై గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. ఏపీలో వెనుకబడిన జిల్లాలకు నిధులివ్వాలనే నిబంధన విభజన చట్టంలో ఉందని తెలిపారు. రాయలసీమ, ఉత్తర కోస్తా జిల్లాలకు ప్రత్యేకాభివృద్ధి ప్యాకేజీని బిల్లులో పొందుపర్చినట్లు నాటి ప్రధానమంత్రి రాజ్యసభలో ప్రకటించారని పేర్కొన్నారు. నీతి ఆయోగ్ సూచనల మేరకు 2014-15, 15-16 ఆర్థిక సంవత్సరాల్లో రూ.700 కోట్ల గ్రాంటు సహా ఆ ఏడు జిల్లాలకు మొత్తంగా రూ.2100 కోట్లు కేటాయించామని తెలిపారు.

మార్చి 1 నుంచి చౌక ధర దుకాణాల మూత

ఈనాడు దిల్లీ: దేశవ్యాప్తంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని చౌక ధరల దుకాణ డీలర్ల సంఘం ప్రతినిధులు కోరారు. సంఘం జాతీయ అధ్యక్షుడు కాకా దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో దిల్లీలో మంగళవారం వివిధ రాష్ట్రాలకు చెందిన డీలర్లు సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు నాయికోటి రాజు మాట్లాడుతూ.. డీలర్లకు నెలకు రూ.50 వేల వేతనం లేదా క్వింటాల్ బియ్యం/గోధుమలకు కమీషన్‌గా రూ.300 ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మార్చి ఒకటి నుంచి దేశవ్యాప్తంగా దుకాణాలు మూసివేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కాచం కృష్ణమూర్తి, మురళి తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన జిల్లాలకు రాష్ట్రమే నిధుల కేటాయింపు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఏడు వెనుకబడిన జిల్లాల్లో అయిదో ఏడాది పనులు చేపట్టేందుకు రూ.350 కోట్లకు రాష్ట్ర సర్కారు పరిపాలన పరమైన ఆమోదం ఇచ్చింది. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతోపాటు రాయలసీమలోని చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఒక్కోదానికి రూ.50 కోట్లు చొప్పున పనులు చేపట్టేందుకు కలెక్టర్లు ఇచ్చిన కార్యాచరణ ప్రణాళికకు అనుగుణంగా నిధులు మంజూరు చేసింది. ఈ జిల్లాలకు కేంద్రం అయిదేళ్లపాటు ఏడాదికి రూ.350 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. మూడేళ్లపాటు నిధులిచ్చిన కేంద్రం నాలుగో ఏడాది (2017-18లో) మాత్రం ఇచ్చినట్టే ఇచ్చి వెనక్కు తీసుకుంది. అయినా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కలెక్టర్లు పంపిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఆమోదం తెలియజేసింది. రాష్ట్ర నిధుల నుంచే ఈ మొత్తాన్ని ఖర్చు చేయనున్నారు.

12న దిల్లీలో వాల్మీకి, బోయల ధర్నా

ఈనాడు డిజిటల్, అమరావతి : రాష్ట్రంలోని వాల్మీకి, బోయలను తక్షణం కేంద్రం ఎస్టీ జాబితాలో చేర్చాలన్న డిమాండ్‌తో ఈ నెల 12న దిల్లీలో ధర్నా నిర్వహించనున్నట్లు మంత్రి కాలవ శ్రీనివాసులు తెలిపారు. వాల్మీకి, బోయలు ప్రాచీన గిరిజన తెగగా ఎప్పటి నుంచో ఆధారాలున్నా నేటికి గిరిజనులుగా గుర్తింపు పొందకపోవడం విచారకరమన్నారు.



బడ్జెట్ 2019

5 ఏళ్ల క్రితం...

తీవ్ర ఆర్థిక లోటులో కూడా, పెద్ద ఎత్తున రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేస్తామని, స్వయం సహాయక మహిళా సంఘాలకు 'పసుపు-కుంకుమ' అందిస్తామని, పింఛన్ల మొత్తాన్ని 10 రెట్లు పెంచుతామని, సంక్షేమంలో ఇతర రాష్ట్రాలకే ఆంధ్రప్రదేశ్ మార్గదర్శకం అవుతుందని భావించామా?

దీన్నిప్పుడు సాకారం చేసుకున్నాం!

– బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి యనమల

సంక్షేమ పథం



✦ ఏటా కేటాయింపులు పెంచుతున్న ప్రభుత్వం
✦ గతేడాదితో పోలిస్తే 33 శాతం అధికం
✦ బీసీ కార్పొరేషన్లకు రూ.3 వేల కోట్లు

ఓట్ ఆన్ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికే పెద్దపీట వేసింది. నవ్యాంధ్రలో ప్రభుత్వం ఏర్పాటైన తొలి ఏడాది నుంచి సంక్షేమ కేటాయింపులకు అధిక ప్రాధాన్యమిస్తోంది. 2018–19తో పోలిస్తే, 2019–20 బడ్జెట్‌లో సంక్షేమానికి 33 శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉప ప్రణాళికలకు సగటున 30 శాతం మేర పెంచింది. బీసీ ఉప ప్రణాళికకు ఈ బడ్జెట్‌లో రూ. 16,226 కోట్లు కేటాయించింది. 2018–19లో కేటాయించిన రూ.12,220 కోట్లతో పోలిస్తే ఇది 33 శాతం అధికం. కాపు కార్పొరేషన్‌కు రూ.1,000 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ. 1,308 కోట్లు కేటాయించింది. చంద్రన్న బీమా, చంద్రన్న పెళ్లి కానుక, విదేశీ విద్య, డప్పు కళాకారుల సంక్షేమం వంటి పథకాలకు కేటాయింపుల్లో ప్రాధాన్యతనిచ్చింది. కొత్తగా డ్రైవర్ల కోసం సాధికార సంస్థ ఏర్పాటు చేసి రూ.150 కోట్లను ప్రతిపాదించింది.

ఎక్కువ మందికి వ్యక్తిగత సాయం

11 బీసీ సమాఖ్యలను రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్లుగా మార్చడంతోపాటు కొత్తగా మరో 9 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. వీటన్నింటికీ కలిపి ఈ బడ్జెట్‌లో రూ. 3 వేల కోట్లు కేటాయించింది. దీని వల్ల ఎక్కువ మంది బీసీలకు వ్యక్తిగత సాయం అందే అవకాశం ఉంది.

ప్రస్తుత బడ్జెట్‌లో వివిధ పథకాలు, కార్పొరేషన్లకు కేటాయింపుల్లో కొన్ని

- ఈబీసీ కార్పొరేషన్‌కు రూ. 720 కోట్లకు పెంచింది.
- ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు రూ. 50 కోట్లు
- క్షత్రియ సంక్షేమానికి ప్రభుత్వం కొత్తగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 50 కోట్లు కేటాయించింది.
- డ్రైవర్ల కోసం సాధికార సంస్థ ఏర్పాటు చేసి రూ. 150 కోట్లు కేటాయించింది.
- చంద్రన్న బీమా పథకానికి రూ. 354.02 కోట్లు కేటాయించింది. గతేడాది వ్యయం రూ. 140 కోట్లతో పోలిస్తే రెట్టింపు చేయడం గమనార్హం
- ఎన్టీఆర్ విదేశీ విద్య పథకానికి రూ. 100 కోట్లు కేటాయించింది.

కేటాయింపులకు తగ్గట్టుగా ఖర్చులు

రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తున్న బడ్జెట్‌ను ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు కార్పొరేషన్లు దాదాపుగా ఖర్చు చేస్తున్నాయి. స్వయం ఉపాధి కోసం రాయతీ రుణాలు ఇవ్వడంతో పాటు యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాల కోసం ఈ నిధులను వెచ్చిస్తున్నాయి.


- ఈనాడు డిజిటల్, అమరావతి

సంక్షేమం రెట్టింపు

విభజన తెచ్చిపెట్టిన ఆర్థిక లోటు, వనరుల కొరత వెంటాడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనారిటీ వర్గాల సంక్షేమానికి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోంది. సంక్షేమం కోసం సరికొత్త పథకాలనూ తెచ్చింది.




కార్మికులు మరణిస్తే



అసంఘటిత రంగ కార్మికులు ప్రమాదవశాత్తూ మరణిస్తే వారి కుటుంబాలకు చంద్రన్న బీమా ద్వారా రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. 18-50 ఏళ్లలోపు వారు సహజంగా మరణించినా రూ. 2 లక్షల పరిహారం ఇస్తోంది. దళారుల ప్రమేయం లేకుండా ఆన్‌లైన్లో 10 రోజుల్లోనే ఈ మొత్తం అందిస్తున్నారు. దీని కింద ఇప్పటి వరకూ 2.67 లక్షల కుటుంబాలకు రూ. 2500 కోట్లకుపైగా పరిహారం అందించారు.

పేదల చదువుకు



పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, బోధనా రుసుములతో పాటు ఎంపిక చేసిన ప్రముఖ సంస్థల్లో ఉచితంగా సివిల్స్ శిక్షణ పొందేలా (రూ. 2 లక్షలతో) సాయం అందిస్తోంది. ఈ పథకం ద్వారా దాదాపు 9 వేల మంది అభ్యర్థులకు రూ. 142 కోట్ల సాయం అందించింది. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, బ్రాహ్మణ, మైనార్టీ వర్గాల విద్యార్థులకు విదేశీ విద్య కోసం రూ. 15 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. ఇలా ఇప్పటి వరకూ 4,528 మంది విద్యార్థులకు రూ. 377.7 కోట్ల సాయం అందింది.

కొత్త కార్పొరేషన్లు

కాపు సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఏటా రూ. వెయ్యి కోట్లు కేటాయిస్తోంది. ఈబీసీ, ఎంబీసీ వర్గాల కోసమూ కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది. బీసీ సమాఖ్యలను కార్పొరేషన్లుగా మార్చడంతో పాటు, కొత్తగా మరో 9 కార్పొరేషన్లు ఏర్పాటు చేయనున్నారు.

చేతి వృత్తులకు




బీసీల్లో చేతువృత్తులు చేసుకునే వర్గాల వారికి రూ. 30 వేల విలువైన ఆధునిక యంత్రాలు, పనిముట్లు 90% రాయితీతో ఇచ్చేందుకు ఆదరణ-2 పథకం తెచ్చారు. దీని కింద 4.02 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

ఏజెన్సీలో పోషకాహారం



గిరిజనుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు 'ఆహార బుట్ట' పథకం తెచ్చింది. దీనికింద ఒక్కో కుటుంబానికీ ప్రతి నెలా రూ. 500 విలువైన సరుకుల్ని ఉచితంగా ఇస్తున్నారు. దీనికి రూ. 120.40 కోట్ల కేటాయించారు.

ఆన్‌లైన్ గిరిసేవ



ఇంటర్నెట్ ద్వారా మారుమూల గిరిజన ప్రాంతాల్లో పౌర సేవలు విస్తృతం చేసేందుకు 'మీ సేవ' తరహాలో 'గిరిసేవ' కేంద్రాల్ని ఏర్పాటు చేయనున్నారు. 7 ఐటీడీఏల్లో 300 గిరిసేవల ఏర్పాటుకు రూ. 120 కోట్లు కేటాయించారు.



ఇమామ్‌లకు

ఆదాయంలేని మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్‌లు, మౌజమ్‌లకు ప్రతి నెలా వేతనాలు ఇస్తోంది.

ఆనందం అధికం


వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, హెచ్‌ఐవీ బాధితులు.. ఇలా సమాజంలో నిరాదరణకు గురవుతున్న బడుగుల జీవితాల్లో ఆనందాన్ని నింపటమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతి నెలా **13 రకాల పింఛను** పథకాలను అమలు చేస్తోంది. వృద్ధులకు గత ప్రభుత్వం ఇచ్చిన రూ.200 పింఛన్‌ను 5 రెట్లు పెంచి రూ.1,000 చేసింది, తాజాగా దీన్ని మళ్లీ రెట్టింపు చేసి ప్రస్తుతం నెలనెలా రూ.2000 ఇస్తోంది.

గత ప్రభుత్వ హయాంలో పింఛన్లు ఇచ్చింది: **43,15,251 మందికి**

ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్నది: **54,16,201 మందికి**

ప్రస్తుతం పింఛన్లు


వృద్ధులు	2,000
దివ్యాంగులు	3,000
హిజ్రాలు	3,000
వితంతువులు	2,000
ఒంటరి మహిళలు	2,000
హెచ్‌ఐవీ బాధితులు	2,000
డయాలసిస్ రోగులు	3,500
కల్లుగీత కార్మికులు	2,000
డప్పు కళాకారులు	3,000
చర్మకారులు	2,000
మత్స్యకారులు	2,000
చేనేత కార్మికులు	2,000
కళాకారులు	2,000



నాలుగేళ్ల కాలంలో పింఛన్లకు కేటాయించింది **రూ.27,215.30 కోట్లు**

ఖర్చు చేసింది **రూ.25,130.87 కోట్లు**

బడ్జెట్ కేటాయింపుల తీరు...



- ఈ ప్రభుత్వం కొత్తగా హిజ్రాలు, ఒంటరి స్త్రీలు, మత్స్యకారులు, చేనేత కార్మికులు, డయాలసిస్ రోగులు, డప్పుకళాకారులు, చర్మకారులకు పింఛన్లు మంజూరు చేసింది.
- మత్స్యకారులు, చేనేత కార్మికులు, డప్పుకళాకారులు, చర్మకారులకు 50 ఏళ్ల నుంచే ఇస్తోంది.

పెద్ద కానుక

చంద్రన్న పెళ్లికానుక కింద వివిధ వర్గాల వారికి కేటాయించే నిధులను ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో పెంచింది. బీసీ సంక్షేమశాఖకు గతంలో(రూ. 100 కోట్లు) పోలిస్తే 75 శాతం మేర పెంచి రూ. 175 కోట్లు కేటాయించింది. ఎస్సీలకు 28 శాతం మేర పెంచి రూ. 128.21 కోట్లు, మైనార్టీ సంక్షేమ శాఖకు(దుల్హన్ పథకం) రూ. 100 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖకు(గిరిపుత్రిక పథకం) రూ. 15 కోట్లు కేటాయించింది. దివ్యాంగులను పెళ్లి చేసుకున్న వారికి సాయం అందించేందుకు రూ. 10.26 కోట్లు కేటాయించింది.

అగ్రవర్ణ పేదలకూ పెళ్లి కానుక

ప్రభుత్వం అగ్రవర్ణాల్లోని పేద ఆడపిల్లల పెళ్లిళ్లకు కొత్తగా కానుక ప్రకటించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి చంద్రన్న పెళ్లికానుక పథకాన్ని వీరికి వర్తింపచేయనుంది. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అసంఘటిత కార్మికులు, దివ్యాంగులకు పెళ్లికానుక కింద ఆర్థిక చేయూత అందిస్తోంది. తాజా నిర్ణయంతో సమాజంలోని ప్రతి పేదకూ ఈ పథకం చేరువచేసినట్లైంది.



రాష్ట్ర బడ్జెట్ సందర్భంగా మంగళవారం మంత్రులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

రైతులు, మహిళలకు పెద్దపీట

'తాత్కాలిక బడ్జెట్‌లో ప్రభుత్వం రైతులు, మహిళలకు పెద్దపీట వేసింది. పసుపు-కుంకుమ చెల్లింపునకు సరిపడ నిధులు బడ్జెట్‌లో కేటాయించింది. రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు రూ. 5 వేల కోట్లతో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకురావడం అద్భుతమైన ఆలోచన. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు అన్ని వర్గాల వారిని సంతృప్తిపరిచేదిగా ఉంది'.

– గంటా శ్రీనివాసరావు, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి

ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకం ఆహ్వానించదగ్గది

'వ్యవసాయ రంగానికి పెద్దమొత్తంలో కేటాయించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోలు శక్తి పెరుగుతుంది, దీని వల్ల వినియోగం పెరిగి, రాష్ట్ర ఆర్థికవృద్ధికి దోహదపడుతుంది. ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకంగా రూ. 400కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదించడం ఆహ్వానించదగ్గ పరిణామం. నిరుద్యోగులకు ఉద్యోగ ఆధారిత నైపుణ్యాభివృద్ధిలో పారిశ్రామికరంగ భాగస్వామ్యాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించారు. దీనికి సీఐఐ మద్దతునిస్తుంది'.

– ఆర్‌వీఎస్ రుద్రరాజు, సీఐఐ ఏపీ విభాగం ఛైర్మన్

అండగా చంద్రన్న పెళ్లికానుక

పేదవారికి ఆడపిల్లల పెళ్లి భారం కాకుండా ఆర్థిక చేయూత అందించేందుకు పుట్టింటి కానుకగా 'చంద్రన్న పెళ్లికానుక' పథకాన్ని ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్ 20న అమల్లోకి తెచ్చింది. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు, దివ్యాంగులు, అసంఘటితరంగ కార్మికులు అప్పుల పాలు కాకుండా భరోసా ఇచ్చింది. సర్కారు సాయం మొత్తంలో పెళ్లినాటికి 20 శాతం, పెళ్లైయిన నెల రోజుల్లో మిగతా మొత్తం అందిస్తోంది. పథకం ప్రారంభమైనప్పటి నుంచి సెప్టెంబర్ 31 మధ్య వివాహం చేసుకుని, చంద్రన్న పెళ్లి కానుకకు దరఖాస్తు చేసుకోకుండా లబ్ధికి దూరమైన వారికి నవంబర్ 1 నుంచి 31 మధ్య దరఖాస్తు చేసుకునేందుకు ప్రత్యేక అనుమతి ఇచ్చింది. ఈ వ్యవధిలో దరఖాస్తు చేసుకున్న 29,846 మందికి ఫిబ్రవరి, 2, 3, 4 తేదీల్లో పంపిణీ చేసింది. ఇప్పటి వరకు 76,349 మందికి రూ. 358.35 కోట్ల మేర సాయాన్ని చేరువచేసింది.

సాయం పంపిణీ తీరు...


- ఏప్రిల్ 1– జనవరి 31 మధ్య రిజిస్ట్రేషన్లు: 46,503 మంది
- 100 శాతం సాయం అందించింది: 31,867 మందికి
- 80 శాతం ఇచ్చింది: 1,190 మందికి
- 20 శాతం అందించింది: 1,407 మందికి
- వీరికి అందిన సాయం: రూ. 245.23 కోట్లు



పింఛన్లకు భారీగా నిధులు


గతేడాదితో పోలిస్తే పింఛన్ల పంపిణీకి నిధుల కేటాయింపును బడ్జెట్‌లో ప్రభుత్వం భారీగా పెంచింది. ఇటీవల సర్కారు పింఛన్ల సాయాన్ని రెట్టింపు చేయడంతో గతేడాదితో(రూ. 5,012 కోట్లు) పోలిస్తే కేటాయింపు 155 శాతం మేర పెరిగింది. వృద్ధులకు రూ. 10,401 కోట్లు (147.64 శాతం), దివ్యాంగులకు రూ. 2,133 కోట్లు (188.33 శాతం) నిధులు కేటాయించింది. కొత్తగా చేరిన డప్పుకళాకారులకు 800 శాతం పెంచి రూ. 108 కోట్లు, హెచ్‌ఐవీ బాధితులకు 163 శాతం పెంచి రూ. 100.20 కోట్లు, గీత కార్మికులకు రూ. 76.31 కోట్లు కేటాయించింది.

వసూళ్లు (రూ.కోట్లల్లో)




రెవెన్యూ వసూళ్లు	1,78,269.9
రుణాలు	45,078.7
రుణ వసూళ్లు	600
ప్రజా పద్దు	1,756.6

వ్యయాలు (రూ.కోట్లల్లో)




రెవెన్యూ వ్యయం	1,80,369.3
మూలధన వ్యయం	29,596.5
ప్రభుత్వ రుణాల చెల్లింపు	14,917
అప్పులు, అడ్వాన్సులు	1,294.7

రెవెన్యూ వసూళ్లు (రూ.కోట్లల్లో)



కేంద్ర పన్నుల్లో వాటా	36,360.3
రాష్ట్ర పన్నులు, సుంకాలు	75,438
వడ్డీ వసూళ్లు	283.2
ఇతర పన్నేతర రాబడి	66,188.4

రెవెన్యూ వ్యయం (రూ.కోట్లల్లో)



రుణ సేవలు	18,529.7
పన్ను వసూలు	1,343.1
పాలనా సేవలు	8,975.4
ఇతర వ్యయం	19,613.9



5 ఏళ్ల క్రితం...

70 ఏళ్ల ఆంధ్రుల కల, మన రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు శరవేగంగా నడుస్తుందని, దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టులలో ఒకటిగా రూపం తీసుకుంటుందని మనం ఊహించామా? నదుల అనుసంధాన ప్రక్రియలో దేశానికే ఆంధ్రప్రదేశ్ మార్గదర్శకం అవుతుందని తలచామా?

దాన్నిప్పుడు నిజం చేస్తున్నాం!

– బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి యనమల

బడ్జెట్ 2019

అన్నదాతా సుఖీభవ

రూ.5,000 కోట్లతో కొత్త పథకం

రైతుకు పెట్టుబడి సాయానికి ప్రభుత్వం 'అన్నదాతా సుఖీభవ' పథకాన్ని ప్రకటించింది. దీనికి తాజా బడ్జెట్లో రూ.5,000 కోట్లు కేటాయించింది. అప్పుల ఊబిలో ఉన్న కర్షకులకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు 2014లో సర్కారు రూ.24 వేల కోట్లతో రుణ ఉపశమన పథకాన్ని ప్రకటించిన విషయం విదితమే. ఇప్పటికి మూడు విడతల్లో రూ.15,147 కోట్లు ఇచ్చింది. త్వరలోనే నాలుగు, అయిదో విడత కింద రూ.8,100 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. వారికి మరింత సాయం అందించే క్రమంలో తాజాగా 'అన్నదాతా సుఖీభవ' పేరుతో కొత్త పథకాన్ని వెల్లడించింది. పెట్టుబడి సాయంగా ఎకరాకు కొంత మొత్తాన్ని చెల్లించనుంది.

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో వ్యవసాయ, ఉద్యానశాఖల పరిధిలో మొత్తం 2 కోట్ల ఎకరాల సాగు భూములు ఉన్నాయి. భూయజమానులు, కౌలు రైతులు కలిపి సుమారు 96లక్షల మంది ఉన్నారు. వీరికి ఏడాదికి ఎకరాకు రూ.10వేల చొప్పున సాయం అందిస్తే రూ.20వేల కోట్లు అవసరమవుతాయి. దాంతో ఎన్నికలకు వెళ్లే లోగా ఎకరాకు రూ.2,500 చొప్పున రైతుల ఖాతాలకు జమ చేయాలనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. ప్రస్తుత బడ్జెట్లో తొలి దఫా మొత్తాన్ని ఇచ్చేందుకు అవసరమైన రూ.5000 కోట్లనే కేటాయించింది. ఈ సాయం రైతులకు మార్చి లోగా అందుతుందా? ఏప్రిల్‌లో జమవుతుందా? అనే విషయమై స్పష్టత రావాల్సి ఉంది. మరో పక్క కౌలు రైతుల సంఖ్య అధికంగా ఉంది. గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, ప్రకాశం జిల్లాల్లో 60 శాతానికి పైగా భూములు కౌలుకు తీసుకుని సాగు చేసే వారే ఉన్నారు. వారిని కూడా ఈ పథకం పరిధిలోకి తెచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. భూమి సొంతదారులకు సగం, కౌలుదారులకు సగం చొప్పున ఇస్తే ఎలా ఉంటుందనే అంశాన్ని పరిశీలిస్తోంది.

వెసులుబాటు కలుగుతుందనే..

సాగుకు అవసరమైన పెట్టుబడి వెదుక్కోవడంలోనే రైతులకు అసలైన ఇబ్బంది ఎదురవుతోంది. మిర్చి, పసుపు, ఇతర ఉద్యానపంటలకు ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి అవుతుండగా.. పత్తి, వరి తదితర పంటలకు రూ.30వేల వరకు ఖర్చుపెడుతున్నారు. పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగుకు ఎకరాకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వ్యయమవుతోంది. రైతులు విత్తనం నుంచి ఎరువులు, పురుగుమందుల కొనుగోలుకు అదనులో సొమ్ము దొరక్క అధిక వడ్డీకి వ్యాపారుల నుంచి తెచ్చుకుంటున్నారు. దుకాణాదారులు అప్పుపై అంటగట్టే నకిలీ ఎరువులు, పురుగుమందులను వినియోగించాల్సి వస్తోంది. దీనివల్ల పెట్టుబడి వ్యయం పెరుగుతుండగా... దిగుబడులు కూడా సరిగా రావడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే పెట్టుబడిగా కొంత మొత్తాన్ని అందిస్తే రైతుకు కొంత వెసులుబాటు కలుగుతుందని ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు.

రైతే ముందు

ఈనాడు, అమరావతి: రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగాలకు నిధులను పెంచింది. వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమలకు గత ఏడాదితో పోలిస్తే 26 శాతం అధికంగా రూ.12,732 కోట్లు కేటాయించింది. పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల బడ్జెట్‌ను 16.51 శాతం పెంచి రూ.2,030.87 కోట్లు చేసింది.

- వ్యవసాయ యాంత్రికీకరణకు 17-18లో రూ.146 కోట్లు, 18-19లో రూ.258 కోట్లు ఇవ్వగా తాజా బడ్జెట్లో దీనిని రూ.300 కోట్లకు పెంచింది.
- పశు సంవర్ధకశాఖలో బీమా అమలుకు గతేడాది రూ.50 కోట్లు కేటాయించింది. దీన్ని ఏకంగా రూ.200 కోట్లు చేసింది. పాడి పశువులతోపాటు మేకలు, గొర్రెలకు బీమా కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.
- వర్షాభావం, కరవు నేపథ్యంలో మేత దొరక్క పశువులను అమ్ముకుంటున్న రైతాంగానికి దాణా, గడ్డి సరఫరా కోసం రూ.200 కోట్లు కేటాయించింది.
- ఊరూరా పశుగ్రాస క్షేత్రాలు, మినీ గోకులాలు, పాతరగడ్డికి రైతుల నుంచి డిమాండు పెరుగుతుండటంతో పాటు వివిధ సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా 50 వేల పశువులు పంపిణీ చేస్తున్న క్రమంలో బడ్జెట్ పెంచింది. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యాన సాగును కోటి ఎకరాలకు పెంచాలనే లక్ష్యంలో భాగంగా గతేడాది కంటే రూ.22 కోట్లు అధికంగా ఇచ్చింది.

మార్కెట్ జోక్యానికి మరింత మద్దతు

పంటలకు కేంద్రం మద్దతు ధరలు పెంచి ప్రకటిస్తున్నా సేకరణ శాతం తగ్గిపోతోంది. గతంలో మొత్తం ఉత్పత్తిలో 40 శాతం మేర కొనుగోళ్లు చేస్తుండగా ఇప్పుడది 20 శాతానికి తగ్గింది. ఈ భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడుతోంది. గత అయిదేళ్లలో రూ.3,556 కోట్ల విలువైన 9.27 లక్షల టన్నుల పంట ఉత్పత్తులను సేకరించింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ మార్కెట్ జోక్య నిధిని గత ఏడాది రూ.500 కోట్లతో ప్రతిపాదించారు.

చరిత్రాత్మకం..



ఈ బడ్జెట్ చరిత్రాత్మకమైనది. రైతులు, మహిళల సంక్షేమానికి అద్దంపడుతూ దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. రైతాంగానికి వెన్నుదన్నుగా నిలిచేందుకు రూ.5వేల కోట్లతో 'అన్నదాత సుఖీభవ పథకం' అమలవనుంది. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణలో సంక్షేమానికి ఎంత కేటాయించారో? ఇక్కడ ఎంత కేటాయించారో ఈ బడ్జెట్‌ను చూస్తే అవగతమవుతుంది. **-మంత్రి సోమిరెడ్డి**

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా..



ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంది. సంక్షేమం ఇదే స్థాయిలో అమలు కావాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు కొనసాగాలి. రాష్ట్ర విభజనతో సున్నా నుంచి మొదలైన ప్రయాణం నేడు దేశంలోనే ఆదర్శంగా నిలిచేలా సాగుతోంది. పేదల ఇళ్ల స్థలాలకు రూ.500 కోట్లు కేటాయించారు. **- మంత్రి కాలవ శ్రీనివాసులు**

అప్పుల ఊబిలోకి దించారు



తెదేపా పాలనలో అభివృద్ధి జరగకపోయినా. . రాష్ట్రానికి రూ.1.53 లక్షల కోట్ల అప్పును మాత్రం మిగిల్చింది. 4 ఏళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పులోకి ఊబిలోకి దించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది పూర్తిగా ఓట్ల బడ్జెట్. విభజన సందర్భంగా రాష్ట్రానికిచ్చిన హామీల్ని సాధించుకోలేని అసమర్థులుగా సీఎం మిగిలిపోయారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయంటూ చెబుతూ తాత్కాలిక భవనాల కోసం రూ.కోట్లు ఖర్చు చేయడం ఎందుకో చెప్పాలి. **- పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి**

గాలి లెక్కల బడ్జెట్

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌కు.. వాస్తవాలకు ఎక్కడా పొంతన లేదు. మోదీ నేతృత్వంలోని కేంద్రం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను పోస్ట్ డేటెడ్ చెక్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్ చేశారు.. ఆ బడ్జెట్ పోస్ట్‌డేటెడ్ చెక్ అయితే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది పూర్తి గాలి లెక్కల బడ్జెట్ అవుతుంది. వ్యవసాయ రుణమాఫీకి రూ.8,500 కోట్లు ఇవ్వాల్సి ఉన్నా దాని ప్రస్తావనే లేదు. **- వైకాపా రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు దువ్వూరి కృష్ణ**

వ్యవసాయ రంగం ప్రాధాన్యాలు

1 యాంత్రీకరణ

యాంత్రీకరణ కోసం నాలుగున్నర ఏళ్లలో రూ.1,277 కోట్లు ఖర్చు చేశారు. 4,76,754 పరికరాలు పంపిణీ చేశారు. రైతులకు రాయితీ మీద ట్రాక్టర్లను ఇచ్చే రైతురథం పథకానికి గత రెండేళ్లలో రూ.383 కోట్లు కేటాయించారు. ఒక్కో ట్రాక్టర్ మీదా గతేడాది గరిష్ఠంగా రూ.2.5 లక్షలు రాయితీ ఇవ్వగా, ఈ ఏడాది రూ.2 లక్షలు ఇస్తున్నారు.

ట్రాక్టర్ల పంపిణీ (రూ.కోట్లలో)

సంవత్సరం	లక్ష్యం	పంపిణీ	రాయితీ
2017–18	12,217	12,217	207
2018–19	11,364	7,854	119 (ఇప్పటిదాకా)

2 ఉచిత సూక్ష్మపోషకం

ప్రభుత్వం 2017–18 నుంచి సూక్ష్మపోషకాలను పూర్తి ఉచితంగా అందిస్తోంది. దీంతో హెక్టారుకు రూ.2 వేల వరకూ ఖర్చు తగ్గుతుంది, పంట దిగుబడీ పెరుగుతోంది.

నాలుగేళ్లలో పంపిణీ చేసిన పోషకాలు టన్నుల్లో...

జింక్	బోరాక్స్	జిప్సం	మొత్తం
37,440	1,193	2,57,521	2,96,154

ఈ పోషకాలు వేసిన విస్తీర్ణం: 36.62 లక్షల హెక్టార్లు

రాయితీగా ఇచ్చిన మొత్తం: రూ. 247.13 కోట్లు (నూరు శాతం రాయితీగా ఇచ్చింది రూ.156 కోట్లు)

3 ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహం

పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయ విధానాన్ని (జడ్బీఎన్ఎఫ్) రాష్ట్రం భారీగా ప్రోత్సాహిస్తోంది. రసాయన మందుల వాడకం తగ్గించటం, పంటల నాణ్యత పెంచటం ధ్యేయం. పారిస్‌లో జరిగిన పీస్‌ఫోరంలో ఈ పథకానికి గ్లోబల్ అవార్డు లభించింది. అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ రూ.100 కోట్లు సాయానికి ముందుకొచ్చింది.

అమలవుతున్న గ్రామాలు 3,105

సేద్యం చేస్తున్న రైతులు 5.23 లక్షలు

4 సూక్ష్మసేద్యంలో ముందంజ

సాగునీటి సద్వినియోగంలో భాగంగా సూక్ష్మసేద్యాన్ని ప్రోత్సహించటంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందంజలో ఉంది. కేంద్ర నిధులకు తనవంతు వాటా జమ చెయ్యటమే కాదు, అదనంగా మరో రూ.616 కోట్లు కేటాయించింది.

- రాష్ట్రంలో మొత్తం 11.76 లక్షల హెక్టార్లలో సూక్ష్మసేద్యం పథకం అమలవుతుండగా దీనిలో 5,91,793 హెక్టార్లు గత ఐదు సంవత్సరాల్లో అమల్లోకి వచ్చిందే!
- రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఈ పరికరాలపై 90% రాయితీ ఇస్తున్నారు.
- 2018-19 కేటాయింపు రూ.1,382.80 కోట్లు ఇప్పటి వరకూ ఖర్చు రూ.842 కోట్లు

5 సొంతంగా పంటల కొనుగోలు

పంటల ధరలు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువగా ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా సేకరణ చర్యలు చేపట్టింది. మిర్చి క్వింటాలుకు రూ.1,500 చొప్పున అదనంగా రైతు ఖాతాలకు జమ చేసింది. పసుపు, ఉల్లి, పొగాకు, మొక్కజొన్న రైతులకూ ప్రోత్సాహకం చెల్లించింది.

నాలుగేళ్లలో సేకరించిన పంట ఉత్పత్తులు 9,27,189

చెల్లించిన సొమ్ము రూ.3,556 కోట్లు

ఉద్యానంలో ఉత్సాహం: దేశంలోనే అత్యధికంగా పండ్లను ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరిస్తోంది. ప్రస్తుతం 16.43 లక్షల హెక్టార్లతో 251.35 లక్షల టన్నుల పండ్లను ఉత్పత్తి చేస్తోంది. ఏటా విస్తీర్ణంలో 11.43%, ఉత్పత్తిలో 15.41% పెరుగుదల నమోదు చేస్తోంది.

రుణ ఉపశమనం..

4, 5 విడతలే కీలకం


రుణ ఉపశమన పథకం చివరి రెండు దశల సర్దుబాటే ఇప్పుడు కీలకంగా మారింది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలుగుదేశం అధికారంలోకి రాగానే రూ.24 వేల కోట్ల రుణమాఫీ ప్రకటించింది.

- ఒక్కో రైతుకు గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకూ రుణం రద్దు చేశారు.
- రూ.50 వేల వరకూ ఉన్న రుణాలను తొలి విడతలోనే, ఒకే దఫాగా చెల్లించేశారు.
- రూ.1.50 లక్షల వరకూ ఉన్న రుణాలను 5 సమాన వాయిదాల్లో 10% వడ్డీతో కలిపి చెల్లిస్తున్నారు.
- ఇప్పటి వరకూ 3 విడతల్లో రూ.15,147 కోట్లు చెల్లింపులు జరిగాయి. ఇక 4, 5 విడతల మొత్తాన్ని ఇవ్వాల్సి ఉంది. దీన్ని ఒకేసారి రైతులకు ఇస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీని కోసం రూ. 8,100 కోట్లు విడుదల కావాల్సి ఉంది.



కౌలు రైతులకు

రుణాల్లో అగ్రస్థానం



కౌలు రైతులకు రుణాలివ్వటంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. వివిధ పత్రాలు ఆధారంగా 2014-15 నుంచి ఇప్పటిదాకా 26 లక్షలు మందికి రూ.9,400 కోట్లు ఇచ్చారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీలు కలిపి బ్యాంకుల నుంచి రూ.రూ.5,028.14 కోట్ల పంట రుణాలు మంజూరు చేయించింది.

అత్యధికం పశ్చిమగోదావరి జిల్లా 3.14 లక్షల మందికి రూ.1,727.50 కోట్లు (2018-19 ఖరీఫ్, రబీల్లో)

ఈ ఖరీఫ్, రబీలలో జనవరి నెలాఖరు వరకు ఇచ్చిన పంట రుణాలు

రుణానికి ఆధారం	రుణం పొందిన రైతులు	తీసుకున్న పంట రుణం(రూ.కోట్లలో)
రుణ అర్హత పత్రాలు	2,63,074	1,519.13
సాగుదారు పత్రాలు	2,59,500	1,227.86
రైతుమిత్ర సంఘాలు	3,43,097	1,312.69
జేఎల్‌జీ (జాయింట్ లయబిలిటీ)	2,49,100	968.26
మొత్తం	11,14,771	5,028.14

మరో ఆరేశారు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆరు కొత్త పథకాలను ప్రవేశపెట్టి వాటి కోసం రూ.6,200 కోట్లు కేటాయించింది. అందులో రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందించటానికి ఉద్దేశించిన 'అన్నదాత సుఖీభవ'కు అత్యధిక ప్రాధాన్యమిచ్చి రూ.5,000 కోట్ల(80.64 శాతం)ను, మిగతా అయిదు పథకాలకు కలిపి రూ.1,200 కోట్ల(19.36 శాతం)ను ఇవ్వనుంది. ఈ ఆరింటిలో నాలుగు సంక్షేమ పథకాలు... రెండు అభివృద్ధికి సంబంధించినవి. కొన్నింటిపై ఇప్పటికే వివిధ సందర్భాల్లో ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలివ్వడం, హామీలు ఇచ్చిన నేపథ్యంలో వాటిని బడ్జెట్‌లో చూపించారు. పట్టణ ప్రాంతాల్లో భూముల విలువ పెరిగిపోవటం, ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవటంతో పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు స్థలాలు లభ్యం కావడం లేదు. దాంతో ప్రభుత్వమే ఇళ్ల స్థలాలను కొనుగోలు చేయడానికి రూ.500 కోట్లు ఖర్చు చేయనుంది. క్షత్రియుల్లోని పేదలను ఆదుకునేందుకు, సాధికార సంస్థను ఏర్పాటు చేసి ఆటో, ఇతర వాహనాల డ్రైవర్ల సంక్షేమానికి ఆర్థిక సాయాన్ని అందించనుంది. ప్రతి నియోజకవర్గంలో ఏర్పడే సూక్ష్మ, మధ్య, చిన్నతరహా పారిశ్రామికవాడలకు ప్రోత్సాహకాలు ఇవ్వనుంది. పట్టణాల్లో మౌలిక సదుపాయాలను కల్పించనుంది. గతేడాది బడ్జెట్‌లో 37 కొత్త పథకాలను ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం వాటన్నింటికీ రూ.5,147.73 కోట్లు ఇవ్వగా.. ఈ సారి కేవలం ఈ ఆరింటికే అంతకన్నా ఎక్కువగా నిధులను కేటాయించింది.

- ఉద్యాన రైతులకు కూడా ఎకరాకు రూ.10 వేల చొప్పున గరిష్ఠంగా రూ.50 వేల వరకూ మాఫీ వర్తింపజేస్తూ 2.23 లక్షల రైతు ఖాతాలకు రూ.384.47 కోట్లు జమ చేశారు.



శాసనసభలో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు బడ్జెట్ ప్రసంగం చేస్తున్న సమయంలో సంబంధిత ప్రతులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు

ఆదాయ, వ్యయాలు (రూ. కోట్లలో)

ఆదాయం	రూ. కోట్లలో
కేంద్ర పన్నుల వాటా	36,360
గ్రాంట్ ఇన్ ఎయిడ్	60,721
రాష్ట్ర పన్నుల ద్వారా ఆదాయం	75,438
అమ్మకపు పన్ను	66,004
ఎక్సైజ్	8,518
రవాణా(ఎంవీ)	4,000
స్టాంప్స్, రిజిస్ట్రేషన్లు	6,600
పన్నేతర ఆదాయం	5,750
గనులు, ఖనిజాలు	2,750
అటవీ	700
రెవెన్యూ లోటు అంచనా	2,099
ద్రవ్య లోటు అంచనా	32,391
స్థూల రాష్ట్రోత్పత్తి(జీఎస్‌డీపీ)	10,67,990
జీఎస్‌డీపీలో రెవెన్యూలోటు శాతం	0.20%
ద్రవ్య లోటు శాతం	3.03%

రెవెన్యూ వ్యయం	రూ. కోట్లలో
జీతాలు	44,087
పింఛను	16,695
వడ్డీ చెల్లింపులు	17,805
జీతాలేతర ఖర్చు	10,032
రాయితీలు, గ్రాంట్ ఇన్ ఎయిడ్	87,954
విద్యుత్తు రాయితీ	3,500
బియ్యం రాయితీ	3,000



5 ఏళ్ల క్రితం...

'మన గడ్డ నుంచే మన పరిపాలన'తో పాటు మన న్యాయవ్యవస్థ అమరావతి నుంచే కొనసాగాలన్న కల ఇంత స్వల్ప సమయంలో నెరవేరుతుందని అనుకొన్నామా? రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో 3 అంతర్జాతీయ విమానాశ్రయాలు అభివృద్ధి చేయగలమని అప్పట్లో ఊహించామా?

కానీ దాన్ని రోజున నిజంగానే సాధించాం!

– బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి యనమల

బడ్జెట్ 2019

రూ.76,816.85 కోట్లు

ఓట్ ఆన్ అకౌంట్ పరిమాణం

● ప్రభుత్వశాఖలు తొలి 4నెలల్లో ఖర్చు చేసేది రూ.65,869.23కోట్లు

ఆర్థిక సంవత్సరం(2019-20) మొత్తానికి రూ. 2,26,177.53 కోట్లకు పూర్తి బడ్జెట్ లెక్కలు సిద్ధం చేసినా ఇందులో నాలుగు నెలల కాలానికి రూ. 76,816.85 కోట్లకు ఓట్ ఆన్ అకౌంట్‌గా తేల్చారు. ఇందులో రూ. 65,869.23 కోట్లను ప్రభుత్వశాఖలు తొలి నాలుగు నెలల కాలానికి ఖర్చు చేసే మొత్తంగా తేల్చారు. ఈ మొత్తాన్నే సభ ఆమోదించాల్సి ఉంది. అదికాకుండా ఛార్జి మొత్తం కింద రూ. 10,947.62 కోట్లను చూపించారు. రాజ్యాంగ బద్ధ సంస్థల్లో పని చేసే గవర్నర్, న్యాయమూర్తుల వేతనాలు, ఆయా వ్యవస్థలోని ఉద్యోగుల జీతాలు, ఎన్నికల ఖర్చులు వంటివి ఇందులో చేరతాయని ఆర్థికశాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ మొత్తానికి సభ ఆమోదం లేకపోయినా ఖర్చు చేసుకునే వీలుంటుంది.

11వ బడ్జెట్ ప్రవేశపెట్టిన యనమల

రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు తన 11వ బడ్జెట్‌ను మంగళవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. అమరావతిలో తాను మూడో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నానని యనమల సభలో పేర్కొన్నారు. ఉదయం 11.45 గంటలకు బడ్జెట్ ప్రసంగం ప్రారంభించిన మంత్రి మధ్యాహ్నం 1.22 నిమిషాల వరకు సభలో చదివి వినిపించారు. మొత్తం 30 పేజీల్లో ఆయన ప్రసంగపాఠం ఉంది. అన్నదాతా సుఖీభవ పథకానికి నిధులు కేటాయిస్తున్నట్లుగా ప్రకటించిన సందర్భంలో ఎమ్మెల్యేలు, మంత్రులు బల్లలు చరుస్తూ హర్షధ్వానాలు ప్రకటించారు. ఇతర వరాల సమయంలోను సభ్యులు స్పందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యనమల ప్రసంగాన్ని ఆసక్తిగా వినడమే కాకుండా కీలక సందర్భాల్లో బల్లపై చరుస్తూ ఆనందం వ్యక్తం చేశారు. యనమల ప్రసంగం పూర్తయిన తర్వాత దీనిపై మాట్లాడేందుకు భాజపా శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్ రాజు ప్రయత్నించగా బడ్జెట్‌పై చర్చలో అవకాశం ఇస్తామని స్పీకర్ కోడెల శివప్రసాదరావు చెప్పారు.

– ఈనాడు, అమరావతి

పథకాల వారీగా కేటాయింపుల్లో పెరుగుదల

పథకం	2018–19 (కేటాయింపులు రూ.కోట్లల్లో)	2019–20 (కేటాయింపులు రూ.కోట్లల్లో)	పెంపుదల శాతం
ఎస్సీల సంక్షేమం(కాంపోనెంట్)	11,228.10	14,367.34	27.96
ఎస్టీ ”	4,176.61	5,385.31	28.94
మైనార్టీ ”	1100.14	1,304.43	18.57
బీసీ ”	12,200	16,226	33
రైతన్నల కోసం..			
ధరల స్థిరీకరణ నిధి	500	1,000	100
యాంత్రీకరణ	258.17	300.17	16.27
పశువుల బీమా	50	200	300
పశువుల దాణా, పశుగ్రాసం	149	200	34.23
ఉద్యాన కార్యక్రమాల ప్రచారం	102	124	21.57
మత్స్య రంగ అభివృద్ధి	81.68	100	22.43
సంక్షేమ పథకాలు			
డ్వాక్రా పసుపు-కుంకుమ	1700	4,000	135.29
బీసీ కార్పొరేషన్లు	1,337.81	3,000	124.25
ముఖ్యమంత్రి యువనేస్తం	1000	1,200	20
డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు	1000	1,100	10
సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక అభివృద్ధి నిధి	500.70	800	59.78
చంద్రన్న బీమా	140	354.02	152.87
అన్న క్యాంటీన్లు	200	300	50
నేతన్నల ఉపాధి మెరుగుకు సహాయం	200	225	12.50
9,10 తరగతులకు మధ్యాహ్న భోజన పథకం	94.93	156.72	65.09
పెళ్లి కానుకలు..			
బీసీలకు చంద్రన్న పెళ్లి కానుక	100	175	75
ఎస్సీలకు చంద్రన్న పెళ్లి కానుక	100	128.21	28.21
ఎస్టీలకు గిరిపుత్రిక	8.25	15	82.26
మైనార్టీలకు దుల్హన్	80	100	25
విభిన్నప్రతిభావంతులకు చంద్రన్న పెళ్లి కానుక	08	10.26	28.25
ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ	68.08	100	46.88
క్రిస్టియన్ మైనార్టీ ఆర్థిక సంస్థ	75	100	33.33
ఇమామ్స్, మౌజాన్స్	75	100	33.33
బ్రహ్మణ సంక్షేమ కార్పొరేషన్	75	100	33.33
విభిన్న ప్రతిభావంతుల పునరావాసం, పరికరాల పంపిణీ	35	70	100
ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం	23	58	152.17
వైశ్య కార్పొరేషన్	30	50	66.67
సంక్షేమ పింఛన్లు..			
ఎన్టీఆర్ వృద్ధాప్య, వితంతు పింఛన్లు	4,200	10,401.05	147.64
విభిన్న ప్రతిభావంతులకు పింఛన్లు	740	2,133.62	188.33
డప్పు కళాకారులకు పింఛన్లు	12	108	800
ఎయిడ్స్ రోగులకు పింఛన్లు	38	100.20	163.67
గీత కార్మికుల పింఛన్లు	22	76.31	246.85
ఇతర రాష్ట్రాభివృద్ధి కార్యక్రమాలు..			
మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం	750	1,000	33.33
ఉపాధి హామీ పనుల ఉన్నతీకరణ	100	124	24.05
సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మౌలికవసతులు	150	500	233.33
సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పునరుద్ధరణ	50	100	100
ప్రధాన రహదారులు	230	3,31.24	44.02
నూతన రాష్ట్ర రాజధాని భూసమీకరణ	166.53	226.27	35.87
కొత్త రైల్వే మార్గాల నిర్మాణం వాటా(50%)	100	180	80
పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం రోడ్డు ఆస్తుల నిర్వహణ	25	50	100
పంచాయతీరాజ్ రోడ్ల పునఃనిర్మాణం	25	50	100

నిరుద్యోగులకు భృతి భరోసా

ముఖ్యమంత్రి యువనేస్తం పథకం కింద నిరుద్యోగులకు ప్రతినెలా ఇస్తున్న నిరుద్యోగ భృతిని రూ.1,000 నుంచి రూ. 2,000లకు పెంచుతున్నట్లు ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించింది.

నిరుద్యోగ భృతి కోసం

2017–18 బడ్జెట్‌లో రూ.500 కోట్లు
2018–19లో రూ.1,000 కోట్లు
కేటాయింపు

ప్రస్తుత బడ్జెట్‌లో రూ.1200 కోట్లు కేటాయించింది. నిరుద్యోగులకు భృతిని ఇవ్వడంతో పాటు సామర్థ్యం పెంపు శిక్షణను కూడా ప్రభుత్వం ప్రారంభించింది.

- 2018 అక్టోబరు నుంచి నిరుద్యోగభృతి పంపిణీ ప్రారంభం
- మొదటి నెల 1.70 లక్షల మందికి
- తాజాగా జనవరి నెలలో 3.61 లక్షల మందికి రూ. 1,000 చొప్పున చెల్లింపు
- ఫిబ్రవరిలో 4.46 లక్షల మందికి మంజూరు
- ముఖ్యమంత్రి యువనేస్తం కింద ఇప్పటివరకూ దరఖాస్తు చేసుకున్న వారు 11.94 లక్షల మంది



పారిశ్రామికంలో నవశకం

రాష్ట్రంలో అందుబాటులో విద్యుత్తు, నీరు, ఇతర మౌలిక సదుపాయాలు, ఆకర్షణీయమైన విధానాలు, ఆర్థిక ప్రోత్సాహకాలతో పారిశ్రామిక రంగంలో గణనీయమైన వృద్ధి నమోదవుతోంది. ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, జౌళి, పర్యాటక రంగాల్లోకి అనేక పెట్టుబడులొస్తున్నాయి. ఇప్పటివరకు రూ.15.48 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయి. రూ.1.77 లక్షల కోట్లతో 810 పరిశ్రమలు ప్రారంభమయ్యాయి. 2.51 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి లభించింది. సులభతర వాణిజ్యంలో వరుసగా రెండేళ్లపాటు రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే మొదటిస్థానంలో నిలిచింది.

పారిశ్రామిక రంగంలో గత మూడేళ్లలో వృద్ధిరేటు (శాతం)

సంవత్సరం	దేశం	ఆంధ్రప్రదేశ్
2015-16	8.80	9.61
2016-17	5.60	7.40
2017-18	4.40	8.49

ఇదీ పురోగతి..

- పారిశ్రామికంతో పాటు సేవా రంగం అభివృద్ధి చెందేలా 2014 డిసెంబరు నుంచి 2018 మధ్య ఆర్థిక ప్రోత్సాహకాలకు రూ.3,675 కోట్లు విడుదల చేశారు.
- డిసెంబరు 21 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్(ఎస్‌డీపీ) విధానంలో 33,565 సంస్థలకు అనుమతులిచ్చారు.
- 2016 నుంచి 2018 వరకు మూడేళ్ల పాటు విశాఖపట్నంలో నిర్వహించిన ప్రభుత్వ భాగస్వామ్య సదస్సులో రూ.13.35 లక్షల పెట్టుబడుల కోసం 1,437 అవగాహన ఒప్పందాలు జరిగాయి. వీటితో 24.6 లక్షల ఉద్యోగాలు లభించనున్నాయి.
- 2014 నుంచి ఇప్పటివరకు 1,945 పరిశ్రమల ఏర్పాటుకు భూములు కేటాయించారు.
- ఇసుజు మోటార్, పెప్సీ, కాడ్బరీస్(మోండలెజ్), కెలాగ్స్, గ్రీన్ప్లై, గమేసా, సుజ్లాన్, ఎనర్జీ, కాల్గేట్ పామోలివ్, టాటా కెమికల్స్, బర్గర్ పెయింట్స్, అరబిందో ఫార్మా, లారస్ లాబ్స్, హాస్పైరా హెల్త్ కేర్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ట్యూపిన్, రెగ్జామ్ సంస్థలు రాష్ట్రం నుంచి ఇప్పటికే వాణిజ్య ఉత్పత్తులు ప్రారంభించాయి.

2014-19 మధ్య కాలంలో పరిశ్రమల శాఖకు సగటున వార్షిక బడ్జెట్‌లో అత్యధికంగా రూ. 1,593 కోట్లు కేటాయించారు.

రూ.24,615 కోట్ల పెట్టుబడులతో కియా మోటార్స్, ఇసుజు మోటార్, అపోలో టైర్లు, అశోక్ లేలాండ్, భారత్ ఫోర్జ్, హీరో గ్రూపు సంస్థలు యూనిట్లు ప్రారంభించాయి.

- 2018–19 బడ్జెట్‌లో రూ. 6,290.29 కోట్లకు సవరించారు.
- 2019–20 బడ్జెట్‌లో రూ. 4,114.92 కోట్లు కేటాయించారు.

పారిశ్రామిక రంగానికి గత నాలుగేళ్ల బడ్జెట్ (రూ.కోట్లలో)

సంవత్సరం	కేటాయింపు	ఖర్చు
2015-16	681.68	398.95
2016-17	975.77	711.35
2017-18	2,085.96	1,519.45
2018-19	3,074.87	4,727.34

(డిసెంబరు వరకు)



అన్నదాతలను మభ్యపెట్టేందుకే

ఊహాజనిత గణాంకాలతో భారీ కేటాయింపులతో వండివార్చిన ఈ బడ్జెట్‌లో ఆదాయ వనరుల వాస్తవ పరిస్థితిని విస్మరించారు. రైతుల రుణ మాఫీ పూర్తిగా అమలు చేయని చంద్రబాబు ఎన్నికల ముందు రైతులను మభ్యపెట్టేందుకు అన్నదాత సుఖీభవ అంటూ మరో కొత్త పథకాన్ని తెరపైకి తెచ్చారు.

– సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ఓట్ల కోసం అంకెల గారడీ

ఓట్ల కోసం అంకెల గారడీలకే పరిమితమైంది. వాస్తవ విరుద్ధంగా కేటాయింపులు చేసి, ప్రజలను మోసగించే విధంగా రూపొందించారు. నిరుద్యోగ భృతిని రెండింతలు చేసినా కేటాయించింది రూ.1,200కోట్లు మాత్రమే. కేవలం 20% పెంచి... 100%భృతి ఎలా పెంచుతారో వారికే అర్థం కావాలి.

– సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు

ఐటీ అభివృద్ధిలో కొత్త పుంతలు

విశాఖ వేదికగా ఫైనాన్షియల్ టెక్నాలజీ(ఫిన్‌టెక్) ఏర్పాటు. దీని యాక్సలేటర్లుగా ముందుకొచ్చినవి ఐసీఐసీఐ, మహీంద్ర ఫైనాన్స్.

ఇప్పటికే కార్యకలాపాలు మొదలెట్టినవి – ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, కాన్డ్యుయెంట్, పేటీఎం, బెల్‌ఫ్రిక్స్, అంజూర్, ఫైకేర్, ఇన్వికాస్. అమరావతిలో హెచ్‌సీఎల్ పనులుమొదలయ్యాయి.

సన్నీ ఓపోటెక్ రూ.500 కోట్లు, హూలీటెక్ రూ.1,400 కోట్ల పెట్టుబడులతో తిరుపతిలో కంపెనీ ఏర్పాటుకు ఒప్పందం చేసుకున్నాయి.

తిరుపతిలో కార్యకలాపాలు ప్రారంభించిన జోహూ. అనంతపురం జిల్లాలో 'బెంగుళూరు ప్లస్' పేరుతో 4 ఐటీ క్లస్టర్ల ఏర్పాటు. వీటిలో బిగ్ డేటా, సైబర్ సెక్యూరిటీ, బ్లాకు చైన్, ఫింటెక్ సెంటర్లను తేనున్నారు.

రిలయన్స్ జియో తిరుపతిలో 150 ఎకరాల్లో రూ.15 వేల కోట్లతో 20 వేల మందికి ఉపాధి చూపే ఎలక్ట్రానిక్ పార్కు ఏర్పాటు చేస్తోంది. ఇది మొబైల్ తదితర ఉపకరణాల తయారీకి వేదిక కానుంది.

అదానీ గ్రూపు 500 ఎకరాల్లో రూ.70 వేల కోట్ల పెట్టుబడితో నెలకొల్పే 'గిగా వాట్ డేటా పార్క్, సోలార్ పార్క్'తో మరింత మహర్దశ పట్టనుంది. ఐటీ రంగంలో రాష్ట్రం ఇప్పుడిప్పుడే అభివృద్ధి పథం పట్టింది.

రేణిగుంట సమీపంలో రెండు ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ క్లస్టర్లలో ఇప్పటికే పలు కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించాయి. వీటిలో డిక్సన్ కంపెనీ ప్రధానమైనది.

రూ.2,200 కోట్ల పెట్టుబడితో 8 వేల మందికి ఉపాధి కల్పించే టీసీఎల్‌కి భూమి పూజ జరిగింది. శ్రీసిటీలోని ఫ్యాక్స్‌కాన్ కంపెనీలో 15,000 మంది మహిళలు పని చేస్తున్నారు.

ఐటీ రంగంలోకి వచ్చిన పెట్టుబడులు రూ.2,697 కోట్లు
కల్పించిన ఉద్యోగాలు 40,109
దేశంలో తయారవుతున్న ఫోన్లలో 30% రాష్ట్రంలోనే రూపుదిద్దుకుంటున్నాయి.
ఎలక్ట్రానిక్ రంగంలో వచ్చిన పెట్టుబడులు రూ.6,832 కోట్లు
కల్పించిన ఉద్యోగాలు 20,000

2018-19 బడ్జెట్ కేటాయింపులను రూ. 954.55 కోట్లకు సవరించారు. 2019-20లో రూ. 1,006.81 కోట్లు కేటాయించారు.

విశాఖపట్నం, విజయవాడ, గుంటూరులో టెక్ పార్క్ భవనాల్లోకి వచ్చిన ఐటీ కంపెనీలు 87

చిన్న పరిశ్రమలకు పెద్ద ప్రోత్సాహం

ఈనాడు, అమరావతి: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఇదివరకే ప్రత్యేక సంస్థ (కార్పొరేషన్)ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఈ మేరకు బడ్జెట్‌లో రూ. 1,000 కోట్లు కేటాయించింది. మెగా, భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసే సంస్థలకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తూ అనేక విధానాలు (పాలసీలు) అమలు చేస్తున్న సర్కారు ఎంఎస్ఎంఈలపైనా దృష్టి సారించింది. ఈ క్రమంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తోంది. వీటి అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.500 కోట్లు సమకూర్చారు. మరో రూ.400 కోట్లు పెట్టుబడుదారులకు ప్రోత్సాహకాల కింద, మరో 100 కోట్లను ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఎంఎస్ఎంఈల పునరుద్ధరణకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.



బడులకు ఒరవడి

ఈనాడు, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకూ విస్తరించనున్నారు. ఇప్పటి వరకు పాఠశాల, ఇంటర్ విద్యార్థులకు మాత్రమే ఈ పథకం అందుబాటులో ఉండగా.. కొత్తగా ఈ సారి డిగ్రీ, పాలిటెక్నిక్‌ల్లోనూ అమలు చేయనున్నారు. మరో వైపు, రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన విశ్వవిద్యాలయాల్లో మౌలికవసతుల నిమిత్తం ఒక్కో వర్సిటీకి రూ.40 కోట్ల చొప్పున నిధులిచ్చారు. ఉన్నత, మాధ్యమిక విద్యకు కలిపి ఈ బడ్జెట్‌లో మొత్తం రూ.25,955 కోట్లు కేటాయించారు. గత ఏడాదితో పోల్చితే ఈ పెంపు ఉన్నత, మాధ్యమిక విద్యలో వరసగా 11.8%, 5.42% ఉంది.



- 7,491 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం అమలు. 66,627 మందికి ప్రవేశం
- పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు డిజిటల్ తరగతుల ఏర్పాటు. ఇప్పటి దాకా 3,450 బడుల్లో ప్రారంభం.
- పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 35,47,372 మందికి వారానికి ఐదు కోడిగుడ్లు పంపిణీ.
- 2014లో 8,926 పోస్టుల భర్తీ. ఈ విద్యా సంవత్సరంలో 7,902 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది.
- 8, 9 తరగతులు చదువుతున్న 3.81 లక్షల బాలికలకు సైకిళ్లు పంపిణీ
- 8, 9, 10 తరగతులు చదువుతున్న 6.04 లక్షల మంది బాలికలకు రూ.23 కోట్లతో శానిటరీ నేప్‌కిన్స్ పంపిణీ కొనసాగింపు

2018–19 బడ్జెట్‌లో రూ. 18524.10 కోట్లు కేటాయించగా 14,384.69 (డిసెంబరు వరకు) ఖర్చు చేశారు.

2019–20 బడ్జెట్‌లో రూ. 22,783.37 కోట్లు కేటాయించారు.

సంక్షేమ పథకాలు (రూ. కోట్లలో)

ఎస్సీ సంక్షేమం	ఎస్టీ సంక్షేమం	బీసీ సంక్షేమం	బీసీ సంక్షేమ కార్పొరేషన్లు	కాపు సంక్షేమం	మైనారిటీ సంక్షేమం	ఈబీసీ సంక్షేమం	డ్రైవర్ల సంక్షేమం	బ్రాహ్మణ సంక్షేమం	వైశ్య సంక్షేమం	క్షత్రియ సంక్షేమం
14,367	5,385	16,226	3,000	1000	1,309	720	150	100	50	50



కలగన్నామా?

వినూత్నంగా నిర్మితమయ్యే మన ప్రజా రాజధాని నగరం అమరావతికి 28,074 మంది భూయజమానులు భూసమీకరణ విధానం ద్వారా స్వచ్ఛందంగా తమ భూములను ఇవ్వటానికి ముందుకు వస్తారని.. 2,28,559 మంది ఉదారంగా విరాళాలు ఇస్తారని ఊహించామా? అత్యున్నత నమూనాలతో అంతర్జాతీయ వేదికలపై ప్రశంసలతో.. అందరి దృష్టినీ ఆకర్షించేలా ప్రజా రాజధానిని నిర్మించుకుంటామని అనుకున్నామా?

కానీ వాటినిప్పుడు నిజం చేస్తున్నాం.

– బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి యనమల

బడ్జెట్ 2019

గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం

- **సురక్షిత నీరు, రహదారుల అభివృద్ధికి పెద్దపీట**
- **బడ్జెట్‌లో గతేడాది కంటే 50.10 శాతం నిధులు అదనం**

ఈనాడు – అమరావతి

ప్రజలకు సురక్షిత నీరు, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ గ్రామీణాభివృద్ధికి ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. గతేడాది బడ్జెట్‌తో చూస్తే ఈసారి 50.10 శాతం నిధులు అదనంగా కేటాయించారు. మిగతా శాఖలకు కేటాయింపులు చూసినా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. ఉపాధి హామీ చట్టం(నరేగా)లో కూలీలు చేస్తున్న పనులపై అదనంగా కేంద్రం నుంచి సమకూరే 'మెటీరియల్ కాంపోనెంట్' నిధులను ఇతర ప్రభుత్వ శాఖలతో అనుసంధానించి గ్రామాల్లో ఇప్పటికే పెద్దఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించారు. మిగతా పనులు కూడా ఏడాదిలో పూర్తయ్యేలా భారీగా నిధులు కేటాయించారు.

- గ్రామాల్లో ప్రతి ఇంటికీ 2024 నాటికి తగినంత నీటిని సరఫరా చేసే లక్ష్యంతో ఇప్పటికే గ్రామీణ తాగునీటి సరఫరా సంస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఎనిమిది జిల్లాల్లో రూ.6,330 కోట్లతో మెరుగైన తాగునీటి సరఫరా పనులకు ఇప్పటికే సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను ప్రభుత్వం ఆమోదించింది. ఇందులో మొదటి విడత రూ.2,200 కోట్ల అంచనా వ్యయంతో పనులకు టెండరు ప్రక్రియను ఇటీవలే ప్రారంభించింది. తాగునీటి నాణ్యత లోపించే (ఫ్లోరిడ్ బాధిత గ్రామాల్లో) ప్రాంతాల్లో ఎన్టీఆర్ సుజల పథకంలో నీటిశుద్ధి ప్లాంట్లను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. 103 క్లస్టర్లలో 7,787 నివాస ప్రాంతాల్లో ఫ్లోరైడ్ సమస్యను గుర్తించారు.
- నరేగా అనుసంధానంతో గ్రామాల్లో ఇప్పటికే 25 వేల కిలోమీటర్ల అంతర్గత రహదారులను పూర్తి చేశారు. మరో ఎనిమిది వేల కిలోమీటర్ల రహదారుల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిని వచ్చే రెండేళ్లలో సిమెంటు రహదారులతో అనుసంధానించనున్నారు. ఇంకోవైపున 2,666 నివాస ప్రాంతాల్లో రూ.2,599 కోట్లతో బీటీ రోడ్లు నిర్మించారు. మరో 10,755 నివాస ప్రాంతాల్లో 2020 నాటికి బీటీ రోడ్లు నిర్మించేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు.
- చంద్రన్న కాంతి పథకంలో దేశంలోనే అత్యధిక సంఖ్యలో ఇప్పటివరకు 22 లక్షల ఎల్ఈడీ వీధిదీపాలు ఏర్పాటుచేశారు. వీటితో రూ.1,138 కోట్ల విలువచేసే 1,181 మి. యూనిట్ల విద్యుత్తు ఆదా అయ్యింది. ఈనెలాఖరులోగా మరో 5.50 లక్షల ఎల్ఈడీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.
- బహిరంగ మల, మూత్ర రహితం(ఓడీఎఫ్)గా రాష్ట్రం 2018 జులైలో హోదా సాధించింది. ప్రజల భాగస్వామ్యంతో గ్రామీణ ప్రాంతాల్లో 38.64 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్లను నాలుగేళ్లలో నిర్మించారు. ఓడీఎఫ్-ప్లస్ కోసం అనేక కార్యక్రమాలతో ముందుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.



బడ్జెట్ స్వరూపం... (రూ.కోట్లలో)

ఆర్థిక సంవత్సరం	ప్రతిపాదిత బడ్జెట్	రెవెన్యూ ఆదాయం	రెవెన్యూ ఖర్చు
2014–15	1,11,824.00	90,671.42	1,14,986.24
2015–16	1,13,048.98	88,647.80	95,949.68
2016–17	1,35,688.99	98,984.49	1,16,178.22
2017–18	1,56,999.39	1,05,062.09	1,21,213.77
2018–19	1,91,063.60	1,56,364.40	1,58,858.52
2019–20	2,26,177.53	1,78,269.85	1,80,369.32

★ 2018-19 బడ్జెట్‌ను ప్రస్తుతం 1,96,948.49 కోట్లకు సవరించారు.


పాలనా 'మోదమే'!

కేటాయింపులు చాలవే

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో ఒక వైపు కొత్త ప్రాజెక్టులకు రూ. వేల కోట్ల మేర పాలనామోదం ఇచ్చుకుంటూ వెళ్తున్న ప్రభుత్వం మరోవైపు బడ్జెట్‌లో ఆశించిన స్థాయిలో కేటాయింపులు చేయకపోవడం విశేషం. తొలి మూడు సంవత్సరాల్లో అంచనాలకు మించి ప్రాజెక్టులపై ఖర్చు చేశారు. ప్రాధాన్య ప్రాజెక్టులను ఎంచుకుని వాటిని పూర్తి చేయడమే తమ ప్రభుత్వ కర్తవ్యం అని చెప్పినా తాజా కేటాయింపులు తగ్గడమే కీలకం. ఇప్పటికే పాలనామోదం ఇచ్చినవి, ఇవ్వబోతున్న ప్రాజెక్టుల విలువే రూ.16 వేల కోట్లు దాటనుంది. అదీకాక పాత ప్రాజెక్టులకు సంబంధించి నిర్మాణాలు పూర్తి చేయాల్సినవి సవరించే అంచనాలతో కలిపి రూ.వేల కోట్లు ఉన్నాయి. మరోవైపు పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం సకాలంలో నిధులు ఇవ్వకపోవడంతో ఆ భారమూ రాష్ట్రంపైనే పడుతోంది. వెరసి తాజా కేటాయింపులు జలవనరులశాఖ ప్రాజెక్టులకు ఏమాత్రం చాలినంతగా లేవు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా కేటాయింపులు కన్నా సవరించిన అంచనాలు తగ్గిపోవడమూ గమనార్హం...

ఇదీ ప్రాజెక్టుల స్వరూపం..



సాగునీటి రంగానికి బడ్జెట్ కేటాయింపులు.. ఖర్చు తీరు..

(రూ.కోట్లలో)

సంవత్సరం	కేటాయింపులు	ఖర్చు
2014–15	8463.50	9223.75
2015–16	5258.06	9545.87
2016–17	7978.80	10,561.68
2017–18	12,770.26	12,100.28
2018–19	16,978.23	11,387.79
2019–20	16,852.27	----

ఇదీ పంథా...

- కొన్ని ప్యాకేజీల మేరకు పనులు పూర్తిచేసి ఆ మేరకు తాగునీరు కల్పించడం లేదా సాగు నీరివ్వడం.
- అంతర్రాష్ట్ర నదుల అనుసంధానానికి ప్రాధాన్యం. ఆ రకంగా నీరున్న చోట నుంచి లేని ప్రాంతాలకు వరద జలాల మళ్లింపునకు ప్రాధాన్యమివ్వడం.

ప్రాజెక్టుల నిర్మాణంలో ఇవీ సవాళ్లు

1. భూసేకరణ, పునరావాసం ఆలస్యం కావడం
2. అటవీ అనుమతులు సకాలంలో లభించకపోవడం
3. ఉపగుత్తేదారులు సరిగా పనిచేయకపోవడం
4. అదనపు ధరలు పొంది, పనులు వదిలేయడం
5. ఆకృతుల ఆమోదంలో ఆలస్యం

భేషుగ్గా 'ఉపాధి హామీ'

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని(నరేగా) ఉపయోగించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందు వరుసలో నిలుస్తోంది. కూలీలకు ఉపాధితో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాలను పెద్దఎత్తున కల్పిస్తున్నారు. ప్రతిపాదిత పని విలువలో మెటీరియల్ కాంపోనెంట్‌లో 60 శాతం నిధులు, మిగతా 40 శాతం నిధులు ప్రభుత్వ శాఖల బడ్జెట్ నుంచి ఖర్చుచేస్తున్నారు. దీంతో గ్రామాల్లో సిమెంట్ రహదారులు, కాలువలు, పంచాయతీ, అంగన్‌వాడీ, పాఠశాలల భవనాలు అందుబాటులోకి వస్తున్నాయి. వ్యవసాయం, గృహ నిర్మాణం, జలవనరుల శాఖల్లోనూ నరేగా భాగస్వామ్యంతో అనేక అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు.

2019–20 బడ్జెట్‌లో మెటీరియల్ కాంపోనెంట్‌తో చేపట్టే పనులకు రూ.1000 కోట్లు కేటాయించారు. గత ఏడాది ఈ పద్దు కింద రూ.800 కోట్లు సమకూర్చారు.

నరేగాలో గత నాలుగేళ్లలో రాష్ట్రంలో ఖర్చుచేసిన నిధులు.. (రూ. కోట్లలో)

ఏడాది	వేతనాలు	మెటీరియల్	మొత్తం
2015-16	2,432.75	1,703.68	4,400.31
2016-17	2,908.34	2,462.28	5,705.78
2017-18	3,159.84	2,645.00	6,148.65
2018-19 (ఫిబ్రవరి 4 వరకు)	4,120.00	3,319.00	7,774.00

మౌలికానికి తగ్గిన ప్రాధాన్యం

ఇది ఎన్నికల కోసం ప్రవేశపెట్టినది. మౌలికరంగానికి ప్రాధాన్యత తగ్గింది. ప్రధానమైన విద్య, ఆరోగ్య, సాంఘిక, మహిళా సంక్షేమానికి కోత పడింది. మధ్యంతర భృతి, పీఆర్సీ ప్రస్తావన లేదు. సీపీఎస్ రద్దుపై చేపడుతున్న చర్యలపై మాటమాత్రమైనా లేదు. దీనిపై ఆందోళన చేపడతాం.

- పీడీఎఫ్ ఎమ్మెల్సీలు నాగేశ్వరరావు, రాము సూర్యారావు, శ్రీనివాసులరెడ్డి.

పాతవిషయాలే

పాతవిషయాలనే వల్లె వేశారు. కొత్త వాటికి సంబంధించి అంకెలు చెప్పారే తప్ప ఎలా అమలు చేస్తామన్నది పేర్కొనలేదు. రైతులకు ఎవరు సాయం చేసినా సంతోషమే. కేంద్ర సాయం లేకుండా రాష్ట్రానికి ఇన్ని అవార్డులు ఎలా వచ్చాయో చెప్పాలి.

– భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్సీ సోమువీర్రాజు

విద్యకు ఏదీ ప్రాధాన్యం?

కీలకమైన విద్యా రంగానికి కేటాయింపులు తగ్గడం బాధాకరం. గతేడాదితో పోల్చితే విద్యకు బడ్జెట్ పెరిగినా వాస్తవానికి 13% నుంచి 11.5% తగ్గిపోయింది. ఉన్నత విద్యకు కేవలం రూ.3,171 కోట్లు కేటాయించారంటే దీన్ని ప్రైవేటు రంగానికి అప్పచెప్పడమే.

– పీడీఎఫ్ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణం

వ్యవసాయానికి 9 గంటల విద్యుత్తు


రాష్ట్రంలో విద్యుత్‌రంగం గణనీయ పురోగతి సాధించింది. నాలుగేళ్ల కిందట రాష్ట్రంలో విద్యుత్తు సరఫరా 43,810 మిలియన్ యూనిట్లే. ఇప్పుడది 62 వేల మిలియన్ యూనిట్లు. మిగులు విద్యుత్తు దిశగా రాష్ట్రం ప్రగతి సాధించింది. వ్యవసాయానికి రాత్రిపూట రెండుమూడు విడతలుగా కరెంటును అందించే కష్టాల నుంచి గట్టెక్కింది. విద్యుత్తు ఉత్పాదన సామర్థ్యాన్ని 9,529 మెగావాట్ల నుంచి 19,080 మెగావాట్లకు పెంచుకుంది. విద్యుత్తు నష్టాలు 3.59 శాతం నుంచి 3.12 శాతానికి తగ్గాయి.



వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా

- వ్యవసాయానికి, వివిధ వర్గాలకు ఉచిత విద్యుత్తు రూపంలో ప్రభుత్వం ఏడాదికి ఇస్తున్న రాయితీ – రూ.6,030 కోట్లు
- సౌర విద్యుత్తుకు ప్రోత్సాహం.. నవంబరు నాటికి 31,725 పంపుసెట్ల ఏర్పాటు
- జగ్‌జీవన్‌జ్యోతి పథకం కింద ఎస్సీ, ఎస్టీల కుటుంబాలకు నెలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు
- దోభీఘాట్లకు, గ్రామీణ ప్రాంత నర్సరీలకు ఉచిత విద్యుత్తు

నాలుగేళ్లుగా విద్యుత్తు బడ్జెట్టు కేటాయింపు, ఖర్చులు (రూ.కోట్లలో)





పేదలకు అన్నం క్యాంటీన్లు




పేదల క్షుద్బాధను తీర్చే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది శ్రీకారం చుట్టింది. పూటకు రూ.5 ధరకే నాణ్యమైన ఆహారాన్ని అందించే అన్న క్యాంటీన్లు జులైలో ప్రారంభమయ్యాయి. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం కలిపి మొత్తం రూ.15కే అందిస్తున్నారు. పట్టణాల్లో మంచి స్పందన రావడంతో గ్రామాలకూ విస్తరిస్తున్నారు.

పట్టణాల్లో ఇప్పుడు ఉన్న క్యాంటీన్లు.. 171

కొత్తగా రానున్నవి.. 31

గ్రామాల్లో త్వరలో ప్రారంభించనున్నవి.. 152

క్యాంటీన్లలో ఒక రోజులో సరాసరి భోజనం చేస్తున్న ప్రజలు



వసూలు చేస్తున్నది రూ.15

ప్రభుత్వం వెచ్చిస్తున్న రాయితీ రూ.58

మూడు పూటలా ఒకరి ఆహారానికి చేస్తున్న ఖర్చు రూ.73

2019-20 బడ్జెట్‌లో రూ. 300 కోట్లు కేటాయించారు. గత ఏడాది రూ. 200 కోట్లు సమకూర్చారు.

రాయితీ కింద ప్రభుత్వం ఇప్పటిదాకా చేసిన ఖర్చు రూ.40,28,99,089

కేటాయింపులు (రూ. కోట్లలో)

ఆర్థిక శాఖ	సాధారణ పరిపాలన	వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం	హోంశాఖ	గృహనిర్మాణం	జలవనరులు	పరిశ్రమలు, వాణిజ్యం	ఐటీ, కమ్యూనికేషన్
51,841.69	1,177.56	10,032.15	6,397.94	4,079.10	16,852.27	4,114.92	1,006.81



5 ఏళ్ల క్రితం...

దేశంలోనే శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో మన రాష్ట్రం ఒకటిగా నిలబడి, వరుసగా మూడేళ్లు రెండంకెల వృద్ధిని సాధించగలదని ఊహించామా?


కానీ దాన్నీ రోజున నిజంగానే సాధించాం!

– బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి యనమల

బడ్జెట్ 2019

సవాళ్లు రెట్టింపు

కొండలా పెరుగుతున్న రుణభారం



విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు ఆశించిన కేంద్ర సాయం అందక పోవడంతో అప్పుల మీదే ఆధారపడాల్సి వస్తోంది. కేంద్రం నుంచి పన్నుల్లో వాటా మినహా ప్రత్యేకంగా ఆశించిన సాయం లేదు. కొత్త రాష్ట్రంలో పెట్టుబడుల అవసరమూ పెరిగింది. రాబడుల కన్నా ఖర్చులు పెరిగిపోతున్నాయి. రైతు, పేద, మహిళలకు వివిధ రకాలుగా చేయూత అందించేందుకు సంక్షేమానికి పెద్ద మొత్తాల్లో ఖర్చులు చేయాల్సి వస్తుండడం ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోంది. రాష్ట్ర స్థూలోత్పత్తిలో రుణ భారం 2014–15లో 28.25 శాతానికి పరిమితం కాగా.. ప్రస్తుతం 28.66 శాతానికి చేరుతుందని అంచనా. ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వ గ్యారంటీలతో కార్పొరేషన్ల ద్వారా అప్పులు తీసుకుంటున్నారు. ఈ భారమూ ఆర్థిక వ్యవస్థపై పడుతోంది.

నికర రుణాలు రూ.24 వేల కోట్లు

2018-19 బడ్జెట్ అంచనాల్లో నికర రుణాలు రూ. 24 వేల కోట్లగా ఉండొచ్చని అంచనా వేశారు. ప్రస్తుత సంవత్సరంలో అప్పులు అంతకు మించే ఉన్నాయి. గత నవంబరు నెలాఖరు నాటికే అప్పు రూ. 23,531 కోట్లకు చేరింది. ప్రస్తుతం ప్రభుత్వ సెక్యూరిటీలను తాకట్టు పెట్టి మరో రూ. 5,000 కోట్ల రుణాలు సమీకరించాలని ప్రయత్నిస్తున్నా కేంద్రం నుంచి అనుమతులు రావడం లేదు.

ఇదీ రుణభారం... (రూ.కోట్లలో)

సంవత్సరం	బహిరంగ మార్కెట్	కేంద్రం నుంచి	ఇతర సంస్థల నుంచి	చిన్న మొత్తాల పొదుపు	పీఎఫ్, డిపాజిట్లు	మొత్తం
2014–15	78,440.00	9,500.31	6,318.87	15,166.75	39,318.65	1,48,743.45
2015–16	94,925.71	8,957.00	4,854.56	15,923.94	49,191.49	1,73,853.60
2016–17	1,12,630.20	9,025.33	13,360.58	14,792.12	51,505.81	2,01,314.04
2017–28	1,34,550.09	9,283.21	14,369.48	13,579.68	53,450.77	2,25,234.04
2018–19 (అంచనా)	1,57,779.19	9,218.10	15,028.63	12,367.24	55,042.21	2,49,435.37

కార్పొరేషన్ల ద్వారా రూ.వేల కోట్ల సేకరణ

ఆర్థిక నిర్వహణ ప్రక్రియ బడ్జెట్ వనరులను మించి ఉండటంతో వివిధ జాతీయ బ్యాంకుల నుంచి పలు కార్పొరేషన్ల ద్వారా రుణాలు సేకరిస్తున్నారు. మొత్తం 13 కార్పొరేషన్ల ద్వారా రూ. 35,768 కోట్లు కిందటి సంవత్సరమే తీసుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరికొన్ని రుణాలు తీసుకుంటున్నారు. వీటికి వడ్డీలు చెల్లించాల్సి ఉంటుంది.

ఏపీ పునర్వ్యవస్థీకరణ తర్వాత రాష్ట్ర ఆర్థిక స్వరూపం స్వల్పకాలంలోనే ఎంతో మార్పు పొందింది. తొలి ఆర్థిక సంవత్సరంలో రూ. 1.11 లక్షల కోట్ల అంచనా వ్యయంతో రూపుదిద్దుకున్న బడ్జెట్ ఐదేళ్లలో రూ. 2.26 లక్షల కోట్లకు చేరింది. కేవలం కేటాయింపులేనా? ఖర్చు అదే స్థాయిలో ఉందా? అని ప్రశ్నిస్తే.. వందశాతానికి మించే తొలి నాలుగేళ్లు ఖర్చు చేశారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలోనూ ప్రతిపాదనలకు మించి సవరించిన అంచనాలు తాజా బడ్జెట్ గణాంకాల్లో ప్రస్తావించారు. కొత్త రాష్ట్రాన్ని కొత్త ఉత్సాహంతో పుంతలు తొక్కిస్తున్నామని, ఈ స్థాయిలో అభివృద్ధి సాధ్యమవుతుందని తొలినాళ్లలో తాము ఊహించలేదని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనడం విశేషం. 2019-20 బడ్జెట్‌ను విశ్లేషిస్తే... రెవెన్యూ ఖర్చులు, రుణాల తిరిగి చెల్లింపులకే అధిక మొత్తాలు కేటాయించాల్సి వస్తోంది. పెట్టుబడి వ్యయం రూ. 29,596 కోట్లుగా చూపిస్తున్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిని ఎంత స్థాయిలో పెంచుకున్నా, 2014 నుంచి తలసరి ఆదాయం పెరిగినా సమీప దక్షిణాది రాష్ట్రాలతో సమంగా చేరువ కావడం ఎప్పటికి సాధ్యమనేది ప్రశ్నార్థకమే. హైదరాబాద్‌వంటి రాజధాని నగరాన్ని కోల్పోయిన నేపథ్యంలో ఈ సవాలు ఏర్పడింది. సేవారంగాన్ని విస్తరించుకోవాలంటే కేంద్రం నుంచి వివిధ మార్గాల్లో సాయం అందాల్సిందేనని చెబుతున్నారు.

ఆదాయమూ, అప్పు, ఖర్చు అన్నీ పెరుగుతున్నవే!

రాష్ట్రంలో ఐదేళ్లుగా రెవెన్యూ ఖర్చు, రెవెన్యూ ఆదాయమూ పెరుగుతూ వస్తోంది. అప్పులూ అదే విధంగా ఉన్నాయి. పైగా జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు, ఇతర నిర్వహణ వ్యయాలు బాగా పెరుగుతున్నాయి. అభివృద్ధి పనులు చేపట్టాలంటే అప్పులపై ఆధారపడక తప్పడం లేదు. కేంద్రం రూపొందించిన ఎఫ్ఆర్‌బీఎం చట్టం పరిధిలోనే కాకుండా ఇతరత్రా కూడా రాష్ట్ర ప్రభుత్వం రుణాలు సేకరించి మూలధన వ్యయంగా వెచ్చించాల్సి వస్తోంది. ఈ రకంగా పొందే అప్పు పెట్టుబడి రూపంలోనే ఖర్చు చేస్తున్నందున అది ఆదాయం సృష్టించుకునేందుకేనని ఆర్థిక శాఖ విశ్లేషిస్తోంది. జాతీయ బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి అప్పులు తెచ్చుకుని వేరే చోట చెల్లింపులు చేయడం వల్ల అదనపు ప్రయోజనాలు దక్కుతున్నాయని చెబుతున్నారు.

ఏది? ఏమిటి? ఎలా?...

- 2014-15లో రూ. 7069. 75 కోట్లతో పెట్టుబడి వ్యయంగా చూపితే ప్రస్తుతం అది రూ. 29,596 కోట్లకు పెరిగింది. 2018-19లో రూ. 28,678 కోట్లుగా పేర్కొన్నా సవరించిన అంచనాల్లో రూ. 25,021 కోట్లకు పరిమితం చేశారు.
- ప్రస్తుతం జీతాలు, పెన్షన్లకే రూ. 60 వేల కోట్లకుపైగా చెల్లించాల్సి వస్తోంది.
- ఎప్పటికప్పుడు అప్పులు పెరగడంతో వడ్డీ చెల్లింపుల భారం పెరుగుతోంది.
- రెవెన్యూ లోటు లేకుండా చేసే ప్రయత్నం కిందటి ఆర్థిక సంవత్సరంలో చేసినా చివరకు అది సాకారం కాలేదు. సవరించిన అంచనాల్లో మిగులుపోయి లోటు రూ. 2494 కోట్లకు చేరింది. వాస్తవ లెక్కలు తేలేసరికి ఇది మరింత పెరిగే అవకాశమూ ఉంది.

– ఈనాడు, అమరావతి

తలసరి ఆదాయం


దక్షిణాదిలో అట్టడుగున!

విభజన ప్రభావం రాష్ట్ర 'తలసరి ఆదాయం'పై పడింది. విభజన కారణంగా అధిక ఆదాయాన్నిచ్చే సేవారంగాన్ని కోల్పోవాల్సి వచ్చింది, మరోవైపు వ్యవసాయాధారిత ప్రాంతంలో అధికభాగం రాష్ట్రానికి దక్కింది. దీంతో ఉమ్మడి రాష్ట్ర తలసరి ఆదాయానికీ, విభజన తర్వాత రాష్ట్ర తలసరి ఆదాయానికీ మధ్య ఎంతో వ్యత్యాసం వచ్చేసింది. మొత్తం దక్షిణాది రాష్ట్రాలన్నింటిలోకీ తలసరి ఆదాయం విషయంలో ఇప్పటికీ ఆంధ్రప్రదేశే అట్టడుగున ఉంది.

ఏటేటా పెరుగుతున్న తలసరి (రూపాయలలో)


రాష్ట్రం	2014–15	2015–16	2016–17
తెలంగాణ	1,24,104	1,40,840	1,59,856
తమిళనాడు	1,28,372	1,40,441	1,50,036
కర్నాటక	1,30,024	1,48,110	1,61,936
కేరళ	1,35,537	1,47,568	1,62,750
ఆంధ్రప్రదేశ్	93,903	1,07,276	1,23,664
జాతీయ సగటు	86,647	94,731	1,03,870

ఇప్పుడు ఇక్కడున్నాం! 2017–18 (రూపాయలలో)



- గత నాలుగు సంవత్సరాల్లో దేశంలో తలసరి ఆదాయంలో వృద్ధి 14.4% కాగా.. రాష్ట్రంలో మాత్రం ఈ పెరుగుదల 71% ఉందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది.
- జాతీయ సగటుతో పోలిస్తే రాష్ట్ర తలసరి కాస్త ఎక్కువ ఉండటం ఊరటనిచ్చేదే అయినా.. పొరుగు రాష్ట్రాలతో సమానమయ్యే వరకైనా ఆదుకోవాలని రాష్ట్రం కేంద్రాన్ని కోరుతోంది.

ఆదాయ మార్గాల వేట



ఆంధ్రప్రదేశ్ శాసనసభకు రూ. 2.26 లక్షల కోట్లతో సమర్పించిన బడ్జెట్‌లో ఆ స్థాయి ఆకాంక్షలు నెరవేరాలంటే ఆదాయం రాబట్టుకోవడమే ప్రధానాంశం. ఈ బడ్జెట్‌లో రూ. 1,78,270 కోట్లు రెవెన్యూ ఆదాయంగా ఆర్థిక శాఖ లెక్కించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ స్థాయిలో ఆదాయ సముపార్జన ఎంతవరకు సాధ్యమనే కోణంలో చర్చ సాగుతోంది. ఇందులో రాష్ట్ర సొంత ఆదాయం రూ. 75,438 కోట్లుగా లెక్కించారు. కేంద్రం నుంచి పన్నుల రూపంలో రూ. 36,360 కోట్లు వస్తాయని పేర్కొన్నారు. అన్నింటికన్నా కీలకమైంది కేంద్రం నుంచి వివిధ పథకాల కింద ఇతరత్రా రూపంలో రూ. 60,721 కోట్లు సాయంగా దక్కుతుందని చూపించారు.

కొంత ఆశ... మరికొంత నిరాశ

కొన్నేళ్లుగా రెవెన్యూ ఆదాయం ఆశించినంత మేర లేదు. ఇందులో రాష్ట్ర సొంత ఆదాయం, కేంద్ర పన్నుల్లో వాటాలో కొంత మెరుగ్గానే ఉన్నా కేంద్ర సాయం విషయంలోనే ఆశలు నెరవేరడం లేదని విశ్లేషిస్తున్నారు. 2016-17లో రూ1.09 లక్షల కోట్ల రెవెన్యూ ఆదాయాన్ని ఆశించారు. వాస్తవ లెక్కలు తేలేసరికి అది రూ. 98,984 కోట్లకే పరిమితమైంది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో మొత్తమ్మీద రూ. 1.25 లక్షల కోట్ల రెవెన్యూ ఆదాయాన్ని ఆశించారు. ప్రస్తుతం వాస్తవ లెక్కలను ఈ బడ్జెట్ సందర్భంగా తేల్చారు. ఇందులో రూ. 1.05 లక్షల కోట్ల మేర మాత్రమే రెవెన్యూ ఆదాయం రాబట్టినట్లు పేర్కొన్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ. 1.55 లక్షల కోట్ల రెవెన్యూ ఆదాయం ఆశించగా ప్రస్తుతం సవరించిన అంచనాల్లో రూ. 1.56 లక్షల కోట్లకు పెంచి చూపించారు. వాస్తవ లెక్కలు తేలేసరికి ఇది బాగా తగ్గే పరిస్థితి కనిపిస్తోంది.

రాష్ట్ర సొంత ఆదాయంలో పెరుగుదలే

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తర్వాత రాష్ట్ర సొంత ఆదాయాన్ని పెంచుకునేందుకు ఆయా శాఖలకు లక్ష్యాలు నిర్దేశించారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ. 66,004 కోట్ల అమ్మకపు పన్ను దక్కుతుందని లెక్కించారు. 2018-19లో వాణిజ్య పన్నుల ఆదాయం రూ. 48,600 కోట్లు వస్తుందని అంచనా వేశారు. కిందటేడాది డిసెంబరు నెలాఖరువరకు రూ. 32,000 కోట్ల ఆదాయం దక్కింది. ఆశించిన ఆదాయంలో ఇది 88శాతమని అధికారులు లెక్కించారు. అంతకుముందు సంవత్సరం వాణిజ్య పన్నుల ఆదాయం రూ. 37,500 కోట్లు రాగా, కిందటేడాది మరో 30శాతం అదనంగా పెంచి అంచనాలు వేశారు. దాదాపు ఆ మొత్తం రాబట్టే అవకాశం ఉందని రెవెన్యూ సముపార్జన శాఖలు పేర్కొంటున్నాయి. 2016-17తో పోలిస్తే ఆ మరుసటి ఏడాది 15శాతం అధికంగా లక్ష్యాలు సాధించారు. ఆ తర్వాత 30శాతానికి పెంచారు. జీఎస్టీ కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 15,600 కోట్లు డిసెంబరు వరకు సాధించారు. ఎక్సైజ్ శాఖ నుంచి రూ. 8,518 కోట్ల ఆదాయం అంచనావేశారు. వచ్చే కాలమంతా వరుసగా ఎన్నికలే. ఈ ప్రభావం వల్ల ఎక్సయిజ్ ఆదాయం ఆశించినమేర వస్తుందనే విశ్వాసం అధికార వర్గాల్లో కనిపిస్తోంది.

– ఈనాడు, అమరావతి

కేంద్ర పన్నులు ఇలా...

2015–16లో కేంద్ర పన్నుల్లో వాటా రూ. 22,637 కోట్లు అంచనాగా లెక్కిస్తే చివరికి రూ. 21,878 కోట్లు మాత్రమే వచ్చింది. 2016-17 బడ్జెట్ అంచనాల్లో కేంద్రం నుంచి పన్నుల వాటాగా రూ. 24,637 కోట్లు వస్తుందని లెక్కించారు. వాస్తవ లెక్కలకు ఇది అంచనాలకు మించి వచ్చింది. రూ. 26,263 కోట్లు దక్కింది. 2017-18లో 29,138 కోట్లు వాటాగా వస్తుందని భావించగా, రూ. 28,674. 89 కోట్లే వాస్తవంలో అందింది. ఆశించిన మొత్తంలో కొంత తగ్గింది. 2018-19లో రూ. 33,929 కోట్లు ఆశించారు. సవరించిన అంచనాల్లోనే ఇది రూ. 32,787 కోట్లకు తగ్గింది.



మంగళవారం తన నివాసం నుంచి అసెంబ్లీకి బడ్జెట్ ప్రతులతో బయలుదేరిన ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు

కుంగదీస్తున్న రెవెన్యూ లోటు

నాలుగేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి బడ్జెట్ లోనూ రెవెన్యూ లోటు కనిపిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ మిగులు చూపించినా వాస్తవ లెక్కలు తేల్చేసరికి లోటు తప్పేలా లేదు. అంచనాలకు తగ్గట్టుగా కేంద్ర సాయం దక్కకపోవడం, రెవెన్యూ లోటు పూడ్చకపోవడమూ కారణమే.

రెవెన్యూ మిగులు/ లోటు అంటే...


రెవెన్యూ ఖర్చుకు, రెవెన్యూ ఆదాయానికి మధ్య ఉన్న వ్యత్యాసం. రెవెన్యూ ఖర్చు కంటే ఆదాయం ఎక్కువగా ఉంటే అది మిగులు. రెవెన్యూ ఖర్చు కన్నా ఆదాయం తక్కువ ఉంటే అది లోటు.



కేంద్ర సాయం ఏదీ?


కేంద్రం నుంచి పన్నులు, ఇతర ఆదాయాలు కాకుండా, ప్రత్యేక సాయం కింద నిధులు దక్కుతాయని రాష్ట్ర అధికారులు భావించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో పేర్కొన్నా.. ఆ మేరకు నిధులు వచ్చింది లేదు. దాదాపు రూ. 32 వేల కోట్లు ఇలాంటి మొత్తం రాలేదు. ఇందులో రెవెన్యూ లోటుతో పాటు, పోలవరం ప్రాజెక్టు కోసం ఆశించిన రూ. 9000 కోట్లు రాలేదు. వెనుకబడిన జిల్లాల గ్రాంటు, అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు కూడా దక్కలేదు. ఇవన్నీ రాష్ట్ర బడ్జెట్‌ను భారంగా మార్చేశాయి.

రెవెన్యూ లోటు భర్తీ ఏదీ?



రాష్ట్ర విభజన తర్వాత తొలి సంవత్సరంలో 14వ ఆర్థిక సంఘం పేర్కొన్న ప్రకారం లోటును భర్తీ చేస్తామని ప్రధానమంత్రి హామీ ఇచ్చారు. ఆ ప్రకారం 2014-15లో రూ. 16,078.76 కోట్లు రెవెన్యూ లోటుగా లెక్కించారు. ఇందులో కేంద్రం రూ. 3979.50 కోట్లు మాత్రమే ఇచ్చింది. మిగతా రూ. 12099.26 కోట్లు ఇప్పటికీ రాలేదు.

గత నాలుగేళ్లుగా రెవెన్యూ లోటు తీరిదీ.. (రూ.కోట్లలో)



కేంద్రం సాయం మాటేమిటి?

(అంకెలన్నీ రూ.కోట్లలో)

సంవత్సరం	అంచనాలు	వాస్తవంగా వచ్చింది
2015-16	17,722. 26	21,927. 46
2016-17	26,849. 49	23,346. 38
2017-18	37,548. 00	22,760. 70
2018-19	50,695. 00	లెక్కలు తేలాలి

- కేంద్రం నుంచి దాదాపు రూ. 32 వేల కోట్లు వచ్చే అవకాశం అంతంతమాత్రమేనని ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు. రూ. 12,099 కోట్ల రెవెన్యూ లోటు, రూ. 9000 కోట్ల పోలవరం నిధులు, అమరావతి నిధులు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధులవంటివి ఇందులో ఉన్నాయి. ప్రస్తుతం రూ. 13 వేల కోట్ల వరకు వివిధ కేంద్ర పథకాలకు సాయం, ఇతరత్రా సాయం రూపంలో అందినట్లు వివరిస్తున్నారు. మార్చి నెలాఖరుకు మరిన్ని నిధులు రావచ్చు. ప్రత్యేక సాయం విషయంలోనే ఆశించినంత నిధులు రావడం లేదు.

కేటాయింపులు (రూ. కోట్లలో)

రెవెన్యూ	రియల్‌టైం గవర్నెన్స్	నైపుణ్యాభివృద్ధి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్	సాంఘిక సంక్షేమం	రోడ్లు, భవనాలు	మహిళా శిశుసంక్షేమం	యువజన, క్రీడలు
5,546.94	172.12	458.66	6,861.60	5,382.83	3,408.66	1,982.74



5 ఏళ్ల క్రితం... ఊహించామా..?

'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో అగ్రగామి రాష్ట్రంగా ఉంటూ, విదేశీ పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడంలో ముందంజలో ఉంటామని అప్పట్లో అంచనా వేశామా?

కానీ దాన్నీ రోజున నిజంగానే సాధించాం!

– బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి యనమల

బడ్జెట్ 2019

5 ఎకరాల రైతుకు రూ.6 వేలా?

అయిదెకరాలలోపు ఉండే రైతు కుటుంబానికి కేంద్రం ఏడాదికి రూ.ఆరు వేలు ఇస్తుందట. అంటే రోజుకు రూ.16 నుంచి రూ.17 వస్తుంది. రాయలసీమలో పదెకరాలున్నా మా ప్రభుత్వం వృద్ధాప్య పింఛనుగా ఏటా రూ.24వేలు ఇస్తోంది. కేంద్రం రైతులకిచ్చేది ఏడాదికి రూ.6వేలే. అదీ మూడు విడతలుగా. రైతుకు భిక్షమేస్తున్నారు. ఇది చాలా బాధాకరం.

అమిత్‌షా కొడుకు సంస్థ ఆస్తుల విలువ 16వేల రెట్లు పెరిగినా విచారణ లేదా? ఆయన దేశమంతా తిరిగి నీతి మంతుడిగా మాట్లాడుతుంటే మేం వినాలా? అలాంటి వ్యక్తి మా అబ్బాయి కోసం నేను పదవిలో ఉన్నానంటున్నారు. మా ఆస్తులు అన్ని వేల రెట్లు పెరగలేదు. ఏటా ప్రకటిస్తున్నా. ఆయనకు మా వాళ్ల గురించి మాట్లాడే నైతిక హక్కు ఎక్కడిది? అమిత్‌షా పలాస వెళితే కుర్చీలు వెలవెలబోయాయి. కేంద్రంపై ప్రజలకు ఎంత కోపం ఉందో దీన్నిబట్టే అర్థమవుతోంది. ఎవరూ మీ సమావేశాలకు వచ్చే పరిస్థితి ఉండదు. ఎవరైనా వెళ్లినా వారు రాష్ట్రద్రోహులుగా మిగిలిపోతారు.

వారికి భిక్షమేస్తున్నారు..

- అహంభావంతో వ్యవహరిస్తే పతనం తప్పదు.
- కేంద్రం, భాజపా తీరుపై శాసనసభలో ముఖ్యమంత్రి ధ్వజం

'అన్నదాత సుఖీభవ పథకం తెస్తున్నాం. వ్యవసాయాన్ని లాభసాటిగా తయారుచేసి రైతుకు అండగా నిలుస్తాం. ఎన్డీయే ప్రభుత్వం మాదిరి మేం మోసం చేయబోం..' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'రైతులకు రుణమాఫీ చేద్దామని ప్రధాని మోదీని అడిగితే ఇవ్వలేమన్నారు. మీరు కూడా చేయొద్దన్నారు. అయినా అన్నదాతల్లో ఆత్మవిశ్వాసం నింపాలనే ఉద్దేశంతోనే రూ.24వేల కోట్ల రుణమాఫీ చేశా. ఇప్పటికే మూడు విడతలు చెల్లింపులు చేశాం. మిగిలిన రెండు విడతలు ఇస్తాం. చెప్పిన మాట నిలబెట్టుకునే ఎన్నికలకు వెళ్తా'నని హామీనిచ్చారు. దేశంలోనే వ్యవసాయానికి అధిక మొత్తంలో బడ్జెట్ కేటాయించే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని పేర్కొన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో అభివృద్ధిపై మంగళవారం అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అందరూ వ్యవసాయాభివృద్ధి గురించి మాట్లాడుతుంటే మేం 11 శాతం వృద్ధి సాధించి చూపించామని స్పష్టం చేశారు. 'అమిత్‌షా, మోదీ నాలుగేళ్లముందు ఎక్కడున్నారు? దిల్లీకి రావడంతోనే కళ్లు నెత్తికెక్కు




తాయా? ప్రచారానికి వచ్చినప్పుడు వారి గొప్పలు చెప్పుకోవచ్చు. నన్ను విమర్శించాల్సిన అవసరం లేదు. మోదీ మళ్లీ కచ్చితంగా ప్రధాని అవుతారంటున్నారు. అవుతారో లేదో కాలమే చెబుతుంది. అహంభావంతో వ్యవహరించే వారికి పతనం తప్పదు. కుటుంబాన్నే చూసుకోని వారు దేశాన్ని ఏం చూసుకుంటారని కేంద్ర మంత్రి గడ్కరీ అన్నారు. కుటుంబాన్ని చూసుకోలేని ప్రధాని దేశాన్ని ఉద్ధరిస్తానంటే ఎవరు నమ్ముతారు? మీకు నోరు, అధికారం, ఈడీ, సీబీఐ ఉండొచ్చు. బెదిరించొచ్చు. భయపెట్టవచ్చు. నిజం నిప్పులాంటిది. ఇది విలువలుండే పాత భాజపా కాదు.. మోదీ-షా భాజపా' అని కేంద్రం, భాజపా తీరుపై చంద్రబాబు మండిపడ్డారు. జగన్ పార్టీపై తిరుపతిలో ఏమన్నారు? 'వైకాపా పుట్టిందే అవినీతిలో. ఆ పార్టీతో మేం కలవబోమని తిరుపతిలో భాజపా చెప్పలేదా?' అని చంద్రబాబు ప్రశ్నించారు. '2014లో మోదీ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు ఎన్డీయేలోకి రమ్మని ఆహ్వానించారు. తెలుగుజాతి కోసమే మీతో కలిశా. నమ్మకద్రోహం చేశారనే తిరుగుబాటు చేశా.' అని స్పష్టం చేశారు. 'నాకు తలుపులు మూసేశారట. నేను మళ్లీ ఎన్డీయేకు వెళ్తానంటూ చౌకబారు ఉపన్యాసాలు ఇస్తున్నారు.. వీటిని ఎవరూ నమ్మరు' అని మండిపడ్డారు. 'మిమ్మల్ని ఎంపీ, ఎమ్మెల్యేగా గెలిపిస్తే జోన్ సాధించలేకపోయారు.. అందుకోసం రాజీనామా చేసి ఉంటే సంతోషపడేవాళ్లం' అని భాజపా ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'ఫసల్‌బీమా వృథా. రైతు కట్టే డబ్బులకు, వచ్చేవాటికి తేడా ఉంది. అన్నింటికీ నిబంధనలు పెట్టారు. అసలు బీమా వచ్చే పరిస్థితి లేదు. పెద్దఎత్తున డబ్బా వాయించుకోవడం తప్పితే జరిగిందేం లేదు' అని ధ్వజమెత్తారు.

– ఈనాడు, అమరావతి

రాష్ట్రంలో మహిళలు నా మీద కోపంగా ఉన్నారట. వారికేం తెలుసు..! మాది అన్నాచెల్లెళ్ల అనుబంధం. అందుకే పసుపు కుంకుమ కింద అన్నగా నా చెల్లెళ్లకు మొదటిదఫా రూ.10 వేలు ఇచ్చా. ఇప్పుడు రూ.10వేలు ఇస్తున్నా. ఇంకా ఇస్తూనే ఉంటా. మా అన్నమీద ఈగ వాలితే మీ తోలుతీస్తాం అని మా చెల్లెళ్లే చెప్పే పరిస్థితి వస్తుంది.

అతివలకు ఆర్థిక చేయూత



పేదరిక నిర్మూలనలో భాగంగా అతివలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం పసుపు-కుంకుమ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. గ్రామీణ, పట్టణ పరిధిలోని ఒక్కో స్వయం సహాయక సంఘ మహిళకు రూ.10 వేల చొప్పున అందించాలని నిర్ణయించి నాలుగు విడతల్లో ఈ మొత్తాన్ని చేరువ చేసింది. తాజాగా పసుపు-కుంకుమ-2 పథకం పేరుతో ఈ ఏడాది జనవరి 18 నాటికి సంఘంలో ఉన్న సభ్యులకు మరో మారు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున అందించేందుకు కార్యాచరణ పూర్తిచేసింది. ఫిబ్రవరి 1న రూ.2,500 మొత్తాన్ని బ్యాంకుల్లో జమచేసింది.

మార్చి 8న రూ.3,500, ఏప్రిల్ 5న రూ.4 వేలను ఇవ్వనుంది. మూడు విడతలకు సంబంధించిన చెక్కుల పంపిణీని ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో గ్రామ గ్రామాన పండుగ వాతావరణంలో నిర్వహించింది.

పసుపు-కుంకుమ-1 సాయం తీరు...

సంఘాలు	సభ్యులు	సాయం
8.7 లక్షలు	86 లక్షలు	రూ.8,604 కోట్లు

పసుపు-కుంకుమ-2 సాయం తీరు...

సంఘాలు	సభ్యులు	సాయం
9.55 లక్షలు	94 లక్షలు	రూ.9,381 కోట్లు



పేదలకు తోడూ 'నీడా'

ఇళ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం

గత నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ, పట్టణ పేదల గృహ నిర్మాణంపై పెద్దఎత్తున నిధులు వెచ్చించింది. పట్టణ పేదల కోసం షీర్‌వాల్ సాంకేతికతతో ఒకే ప్రాంతంలో వెయ్యి మొదలు 10 వేల వరకు గృహాలుండేలా ఆధునిక వసతులతో నిర్మించి ఇస్తోంది. ఎన్టీఆర్ పథకం అమలుకన్నా ముందున్న, అసంపూర్తిగా మిగిలిన ఇళ్ల పూర్తికి ప్రాధాన్యం ఇచ్చింది.



- గృహ నిర్మాణానికి 2017-18 బడ్జెట్ కేటాయింపులు **1,465.55 కోట్లు** (అదనంగా చేసిన ఖర్చు 204.70%)
- 2018-19 బడ్జెట్ కేటాయింపులు **3,679.53 కోట్లు** (జనవరి ఆఖరు నాటికి అదనంగా చేసిన ఖర్చు 125.02%)
- 2019-20 బడ్జెట్ కేటాయింపులు **4,079.10 కోట్లు** ఈ బడ్జెట్‌లో 10.86 శాతం మేర నిధులు పెంచారు




	గ్రామాల్లో	పట్టణాల్లో	మొత్తం
మంజూరైన ఇళ్లు	20,18,390	5,67,898	25,86,288
పూర్తి చేసినవి	7,70,175	92,240	8,62,415
చేసిన ఖర్చు	10,437.17	6,982.32	17,419.49

(రూ. కోట్లలో)

పండుగలా గృహ ప్రవేశాలు...

ఇళ్ల పూర్తి తర్వాత ప్రభుత్వం పండుగ వాతావరణంలో గృహప్రవేశాలు నిర్వహించి లబ్ధిదారులకు అప్పగిస్తోంది. ఇప్పటికే రెండు విడతల్లో 3 లక్షల గృహప్రవేశాలు జరిగాయి. ఈ నెల 9న గ్రామీణ ప్రాంతంలో 3 లక్షలు, పట్టణ పరిధిలో లక్ష ఇళ్లకు గృహప్రవేశాలు నిర్వహించనుంది.



ఇళ్లకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీ...

గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు | పట్టణ ప్రాంతంలో రూ.4 లక్షలు (కేంద్రం, రాష్ట్రం కలిసి ఇచ్చేది).

స్థలాల సేకరణకు రూ.500 కోట్లు

పట్టణ, నగర, గ్రామీణ ప్రాంతాల్లోని పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు స్థలాల కొరత ప్రతిబంధకంగా ఉంది. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి తదితర నగరాల్లోని వేల మంది అర్హులకు గృహ వసతి కల్పించలేని పరిస్థితి. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు జీ+2 నిర్మాణాలు చేపట్టి ఇచ్చేందుకూ స్థలం అందుబాటులో లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు తాజా బడ్జెట్‌లో స్థలాల సేకరణకు ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించింది.

వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాలకు రూ.329 కోట్లు

ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టుకు రూ.1200 కోట్లు
ఔషధాల కోసం రూ.400 కోట్లు కేటాయింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం 2019-20 బడ్జెట్లో రూ.329 కోట్లను ప్రత్యేకంగా కేటాయించారు. జాతీయ వైద్య మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా సంబంధిత నిధులతో వైద్య కళాశాలల్లో సౌకర్యాలు కల్పించబోతుండడం ద్వారా వైద్య సీట్లు క్రమేణా పెరిగే అవకాశం ఉంది. రోగులకు ఉచిత మందులకుగాను కిందటి బడ్జెట్లో రూ.300 కోట్లను సర్కారు కేటాయించింది. దీనికి అదనంగా మరో వంద కోట్లను ప్రస్తుత బడ్జెట్‌లో సమకూర్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాకుండా.. ముఖ్యమంత్రి పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా పట్టణ, నగరవాసులకు, 104 చంద్రన్న సంచార చికిత్స పథకంలోభాగంగా గ్రామీణులకు వైద్యసేవలను విస్తృతంగా అందుబాటులోకి తెచ్చారు. అదేవిధంగా సర్కారు ఆసుపత్రుల్లో నిర్వహిస్తున్న రకరకాల ఉచిత వైద్య పరీక్షలతోనూ రోగుల సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో మందుల అవసరాలు కూడా పెరగడంతో మొత్తం రూ.400 కోట్లను కేటాయించారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా రోగులకు అందుతున్న ఉచిత వైద్య సేవలకు రూ.1000 కోట్లు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో అదనంగా రూ.200 కోట్లు (మొత్తం రూ.1200 కోట్లు) ఇచ్చారు.

ఎన్టీఆర్ వైద్యసేవ



ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు కింద..

- మొదట్లో 938 రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేవి. ఈ సంఖ్యను 1047 సేవలకు పెంచారు.
- మొదట్లో ఏడాదికి రూ.2 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందిచేవారు. దీన్ని రూ.2.5 లక్షలకు పెంచారు. వచ్చే ఏప్రిల్ నుంచి రూ.5 లక్షలు చెయ్యనున్నారు.
- విభజన నాటికి ఈ ట్రస్టు కింద 356 ప్రైవేట్ ఆస్పత్రులుండేవి. ఇప్పుడీ సంఖ్య 913కు చేరుకుంది.
- విభజన జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.4755 కోట్ల సేవలందించారు, రూ.4,507 కోట్ల చెల్లింపులు జరిగాయి.

సంవత్సరం	లబ్ధిపొందిన రోగులు
2015-16	2,33,337
2016-17	2,69,520
2017-18	3,00,041
2018-19	2,68,271

(జనవరి 15,2019)

వైద్యం కొత్త పుంతలు

వైద్య ఆరోగ్య రంగాన్ని సంస్కరిస్తూ ప్రభుత్వం సరికొత్త పథకాలను ప్రవేశపెట్టింది.



- బాలింతలు, శిశువులను అంబులెన్సుల ద్వారా ఉచితంగా ఇళ్లకు చేర్చే 'తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్' పథకం
- బిడ్డ పుట్టగానే శిశు సంరక్షణ వస్తువులతో ఉచిత 'బేబీ కిట్'
- నగరాలు, పట్టణాల్లో టెలీ మెడిసిన్ సేవలు
- వాహనాలు పోలేని గిరిజన ప్రాంతాలకు ఫీడర్ అంబులెన్సులు
- గ్రామీణులకు ఉచిత రక్తపరీక్షలు, '104 చంద్రన్న సంచార' చికిత్స
- అవసరమైన వారికి స్కానింగ్, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచటం వంటి చర్యలతో ప్రభుత్వాసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరిగింది.
- ఆసుపత్రిలో మృతిచెందిన వారి భౌతికకాయాలను అంబులెన్సుల్లో ఉచితంగా స్వస్థలానికి తరలింపు
- మూత్రపిండాల రోగులకు ఉచిత డయాలసిస్

ఆరోగ్య రంగంపై వెచ్చించింది

సంవత్సరం	కేటాయింపులు	ఖర్చు (రూ.కోట్లలో)
2015-16	5,728.06	9,596.41
2016-17	6,103.71	6,331.63
2017-18	7,020.63	6,140.67
2018-19	8,910.18	5,920.62 (2018 డిసెంబరు వరకు)
2019-20	10,032.15	-----

పర్యవేక్షణ లోపం! ప్రభుత్వాసుపత్రుల్లో ఉచిత మందుల కోసం ఇప్పుడు రూ.300 కోట్లు కేటాయిస్తున్నారు. దీన్ని రెట్టింపు చెయ్యాలన్న డిమాండ్ ఉంది. మరోవంక...రోగులు పెరుగుతున్నా.. పర్యవేక్షణ వ్యవస్థ లోపభూయిష్టంగా ఉందన్న విమర్శలున్నాయి.

కేటాయింపులు (రూ. కోట్లలో)

విభాగం	కేటాయింపు
వ్యవసాయం	12,732.97
మత్స్య, పశుసంవర్ధక, పాడి	2,030.87
అటవీ, పర్యావరణం	491.93
ఉన్నత విద్య	3,171.63
ఇంధన, మౌలికవసతులు	5,473.83
మాధ్యమిక విద్య	22,783.37
ఆహార, పౌరసరఫరాలు	3,763.42

కేటాయింపులు (రూ. కోట్లలో)

విభాగం	కేటాయింపు
కార్మిక, ఉపాధి	1,225.75
న్యాయశాఖ	918.81
అసెంబ్లీ	149.90
పురపాలక, పట్టణాభివృద్ధి	7,979.34
ప్రభుత్వ సంస్థలు	2.56
ప్రణాళిక	1,403.17
పంచాయతీరాజ్, గ్రామీణం	35,182.61

పుణెలో కుప్పకూలిన విమానం



పైలట్ల శిక్షణకు ఉపయోగించే ఓ విమానం మహారాష్ట్రలో కుప్పకూలింది. పుణె జిల్లాలోని రుయీ గ్రామ పరిసరాల్లో మంగళవారం ఈ ప్రమాదం సంభవించింది. ఘటనలో పైలట్ సిద్ధార్థ్ టాయిటస్ గాయపడ్డారు. సాంకేతిక లోపమే ప్రమాదానికి కారణమని, ఈ విమానం కార్వర్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందినదని పోలీసులు తెలిపారు.

పారిస్‌లో 10 మంది సజీవ దహనం

- ఇరుగు పొరుగు తగాదాతో అపార్ట్‌మెంట్‌కు మహిళ నిప్పు

ప్యారిస్: ఫ్రాన్స్ రాజధాని నగరంలో ఘోరం.. ఓ అపార్ట్‌మెంట్‌లో ఇరుగు పొరుగు వారి మధ్య తలెత్తిన తగాదా అగ్గి రాజేసింది. ఫలితంగా ఓ మహిళ నిప్పు పెట్టడంతో రాత్రి వేళ భవనంలో మంటలు చెలరేగి ఓ పసిబిడ్డ సహా 10 మంది సజీవ దహనమైపోయారు. ఈ ఘటనలో ఆరుగురు అగ్నిమాపక సిబ్బంది సహా మరో 30 మందికి పైగా గాయపడ్డారు. దేశ రాజధాని పారిస్‌లోని ప్రిన్సెస్ సాకర్ స్టేడియంకు సమీపంలో సంపన్నులు నివసించే రూ ఎర్లాంజర్ స్ట్రీట్‌లోని 8 అంతస్తుల భవనం పై బ్లాక్‌లలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. ఒక్కసారిగా మంటలు, దట్టమైన పొగలతో భీతావహ వాతావరణం నెలకొనడంతో భవనంలోని వారంతా ప్రాణభయంతో పరుగులు తీశారు. కొందరు బాల్కనీల నుంచి బయటపడే ప్రయత్నం చేశారు. దాదాపు 250 మంది అగ్నిమాపక సిబ్బంది 5 గంటలపాటు తీవ్రంగా శ్రమించారు. మంగళవారం ఉదయానికి మంటలను అదుపులోకి తెచ్చారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. గృహదహనం కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అదే అపార్టుమెంట్‌కు చెందిన ఓ మహిళ(40)ను అరెస్టు చేశారు. ఆమెకు గతంలో మానసిక సమస్యలుండేవని అధికారులు తెలిపారు.



పారిస్‌లో ఎనిమిది అంతస్తుల భవనం నుంచి ఎగసిపడుతున్న మంటలు

శివసేనకు ప్రశాంత్ కిశోర్ సేవలు!

ముంబయి, ఈనాడు, దిల్లీ: రాజకీయ వ్యూహాల్లో దిట్టగా పేరొందిన ప్రశాంత్ కిశోర్ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో, ఈ ఏడాది చివర్లో జరగనున్న మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో శివసేనకు సేవలు అందించడం దాదాపు ఖరారుగా కనిపిస్తోంది. మంగళవారం శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే నివాసంలో జరిగిన ఆ పార్టీ ఎంపీల సమావేశానికి ప్రశాంత్ కిశోర్ హాజరవడం ఇందుకు మరింత బలాన్ని ఇస్తోంది. "సమావేశానికి విచ్చేసిన ప్రశాంత్ కిశోర్‌ని ఉద్ధవ్ ఎంపీలకు పరిచయం చేశారు. మహారాష్ట్రలోని స్థానిక అంశాలను మనం గుర్తిద్దాం. శివసేన ప్రచారం, మీడియా నిర్వహణ తదితర అంశాల్లో వ్యూహాలు రూపొందించడంలో ఆయన సహాయం అందిస్తారు" అని ఒక ఎంపీ వివరించారు. భాజపాకు వ్యతిరేకంగా శివసేన-జేడీయూ కూటమి జట్టు కట్టే అంశాన్ని ఉద్ధవ్ కొట్టిపారేశారని చెప్పారు. మరోవైపు, శివసేన ఎంపీ సంజయ్ రౌత్ విలేకరులతో మాట్లాడుతూ.. "ప్రశాంత్ కిశోర్ ఓ రాజకీయనాయకుడిగా ఉద్ధవ్ ఠాక్రేను కలవలేదు. ఆయన కేవలం మర్యాదపూర్వకంగా కలిశారు" అని పేర్కొన్నారు.

విచారణకు హాజరవ్వాల్సిందే

- సీబీఐకి సహకరించండి
- కోల్‌కతా పోలీసు కమిషనర్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలు
- ఆయన్ను అరెస్టు చేయొద్దని సీబీఐకి సూచన
- తదుపరి విచారణ 20కి వాయిదా

దిల్లీ - కోల్‌కతా

శారదా కుంభకోణానికి సంబంధించిన కేసుల్లో సీబీఐకి సహకరించాలని కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. మేఘాలయలోని షిల్లాంగ్‌లో సంస్థ ఎదుట విచారణకు హాజరు కావాలని సూచించింది. అదే సమయంలో సీబీఐకీ కొన్ని సూచనలు చేసింది. దర్యాప్తు క్రమంలో రాజీవ్‌ను అరెస్టు చేయొద్దని, ఆయనపై బలవంతపు చర్యలేవీ తీసుకోవద్దని ఆదేశించింది. ఎలక్ట్రానిక్ సాక్ష్యాధారాలను నాశనం చేశారంటూ సీబీఐ చేసిన ఆరోపణలపై రాజీవ్‌కు సర్వోన్నత న్యాయస్థానం తాఖీదు జారీ చేసింది. ఈ నెల 20లోగా స్పందన దాఖలు చేయాలని సూచించింది. అదే తేదీకి తదుపరి విచారణను వాయిదా వేసింది.

కోల్‌కతా పోలీసులతో ఘర్షణ నేపథ్యంలో సీబీఐ దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ రంజన్ గొగొయి, జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన ధర్మాసనం విచారణ నిర్వహించింది. తొలుత అటార్నీ జనరల్(ఏజీ) కె.కె.వేణుగోపాల్, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సీబీఐ తరఫున వాదనలు వినిపించారు. 2014 నుంచి శారదా కుంభకోణం కేసు పరిణామాల క్రమాన్ని వివరించారు. ఈ కుంభకోణానికి సంబంధించిన కేసుల దర్యాప్తు బాధ్యతను సుప్రీంకోర్టు సీబీఐకి అప్పగించిందని తెలిపారు. దర్యాప్తులో రాజీవ్ సహకరించడం లేదని ఆరోపించారు. శారదా కుంభకోణంపై రాజీవ్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) గతంలో దర్యాప్తు జరిపిన సంగతిని గుర్తుచేశారు. సీబీఐకి సిట్ అన్ని దస్త్రాలను అప్పగించలేదని పేర్కొన్నారు. దర్యాప్తును తప్పుదోవ పట్టించేలా తారుమారు చేసిన కొన్ని దస్త్రాలను సమర్పించారని ఆరోపించారు. శారదా, రోజ్‌వ్యాలీ గొలుసుకట్టు పథకం ఛైర్మన్ సుదీప్త సేన్ నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపించలేదని వెల్లడించారు. సెల్‌ఫోన్ల నుంచి ఉద్దేశపూర్వకంగా కాల్ డేటాను తొలగించారని తెలిపారు. ఈ దశలో ధర్మాసనం కలుగజేసుకొని.. దర్యాప్తునకు స్వయంగా హాజరు కావాలని రాజీవ్‌ను ఆదేశిస్తూ తాము ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రతిపాదించింది. రాజీవ్ దర్యాప్తునకు అందుబాటులోకి రాకుండా ఉండేందుకు కారణాలేవీ కనిపించట్లేదని పేర్కొంది.



రాజీవ్‌ను వేధించేందుకే: సింఘ్వీ

పశ్చిమ బెంగాల్ పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. సీబీఐ ఆరోపణలను తోసిపుచ్చారు. రాజీవ్‌ను వేధించేందుకు, అవమానించేందుకు సీబీఐ ప్రయత్నించిందని ఆరోపించారు. శారదా కుంభకోణానికి సంబంధించిన కేసుల్లో సిట్ పాత్రను ప్రశంసిస్తూ సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల గురించి ప్రస్తావించేందుకు సింఘ్వీ ప్రయత్నించారు. రాజీవ్‌పై ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ ఏదీ నమోదు కాలేదని, శారదా కుంభకోణానికి సంబంధించిన ఏ కేసులోనూ ఆయన నిందితుడిగా లేరని గుర్తుచేశారు. మూడేళ్ల వ్యవధి తర్వాత ఆయనను ప్రశ్నించేందుకు సీబీఐ అధికారులు వచ్చారని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ ర్యాలీ చోటుచేసుకున్న రెండు రోజుల తర్వాత ఈ ఘటన చోటుచేసుకోవడాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. సాక్ష్యాధారాలు నాశనం చేశారని గత ఐదేళ్లలో సీబీఐ ఎప్పుడూ చెప్పలేదన్నారు.

'కోర్టు ధిక్కరణ'పై స్పందన కోరిన సుప్రీం

కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారంటూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్లపై ఈ నెల 18లోగా స్పందించాలంటూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, కోల్‌కతా పోలీసు కమిషనర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. స్పందనలను పరిశీలించిన అనంతరం. . ఈ నెల 20న ఈ ముగ్గురు అధికారుల వ్యక్తిగత హాజరుకు తాము ఆదేశించే అవకాశముందని తెలిపింది. వ్యక్తిగతంగా వారు హాజరు కావాలా వద్దా అనే సంగతిని 19న సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ తెలియజేస్తారని పేర్కొంది.

షిల్లాంగ్ వెళ్లండి.. చల్లబడతారు!

దిల్లీ: "షిల్లాంగ్ వెళ్లండి. అది చల్లనిప్రదేశం. అక్కడికెళ్తే ఉభయులూ శాంతంగా ఉంటారు" అంటూ సీబీఐకి కోల్‌కతా పోలీసులకు సుప్రీంకోర్టు ఓ చల్లని సలహా ఇచ్చింది. తీవ్ర సంచలనం సృష్టిస్తున్న శారదా కుంభకోణం కేసులో సుప్రీంకోర్టు ఛలోక్తిగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఏదైనా సరే తటస్థమైన స్థలంలో తాము జరిపే విచారణకు హాజరుకావలసిందిగా కోల్‌కతా పోలీసు కమిషనరు రాజీవ్‌కుమార్‌ను ఆదేశించాలంటూ సుప్రీంకోర్టును సీబీఐ అభ్యర్థించింది. దీనిపై చీఫ్‌జస్టిస్ రంజన్‌గొగొయి స్పందిస్తూ ఛలోక్తిగా ఈ వ్యాఖ్యలు చేశారు.

సుప్రీం ఆదేశాలు మమతకు గట్టి చెంపదెబ్బ

- ఆమె రాజకీయ డ్రామాకు సరైన ముగింపు
- కేంద్రమంత్రి స్మృతిఇరానీ వ్యాఖ్యలు

దిల్లీ: శారదాకుంభకోణం కేసులో సీబీఐ దర్యాప్తునకు కోల్‌కతా పోలీసు కమిషనరు రాజీవ్‌కుమార్ హాజరు కావాలని ఆదేశించిన సుప్రీంకోర్టు ఆదేశాలపై భాజపా హర్షం వ్యక్తం చేసింది. మమతాబెనర్జీ ప్రభుత్వానికి ఈ ఆదేశాలు గట్టి చెంప దెబ్బవంటివని, ఆమె రాజకీయ డ్రామాకు సరైన ముగింపు పలికినట్లైందని వ్యాఖ్యానించింది. కుంభకోణంతో ప్రమేయం ఉన్నవారిని కాపాడటానికి తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న భాజపా వాదన సుప్రీంకోర్టు ఆదేశాలతో నిజమని తేలిందని కేంద్రమంత్రి స్మృతిఇరానీ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు తమకే అనుకూలంగా వచ్చిందంటూ మమత చేసిన వ్యాఖ్యలపైనా ఇరానీ స్పందించారు. సుప్రీంకోర్టు అక్షింతలు వేసినా తమదే నైతిక విజయమని వ్యాఖ్యానించడం మమతకే చెల్లిందని ఎద్దేవా చేశారు.

బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తే భాజపాకే నష్టం!

పార్టీ నాయకుల అభిప్రాయం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తే భాజపాకు నష్టం కలిగే అవకాశాలున్నాయని ఆ పార్టీ స్థానిక నాయకులు అభిప్రాయపడుతున్నారు. దీన్ని అణిచివేతగా చిత్రించి, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సానుభూతి ఓట్లను పొందేందుకు అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రయత్నిస్తుందని వారు అంటున్నారు. ఇదే విషయాన్ని తమ పార్టీ అగ్రనాయకత్వానికి వివరించామని భాజపాకు చెందిన ఓ సీనియర్ నాయకుడు తెలిపారు. "రాష్ట్రంపై టీఎంసీ పట్టు కోల్పోతోంది. ఈ దశలో రాష్ట్రపతి పాలన విధిస్తే రాజకీయ ప్రతీకార చర్యలకు కేంద్రం పాల్పడుతోందంటూ ఆ పార్టీ ప్రచారం చేసుకుంటుంది. అందుకు అవకాశం ఇవ్వకూడదు. సహజంగానే బెంగాల్ ఓటర్లు కేంద్రానికి వ్యతిరేకంగా ఉన్న పార్టీలను సమర్థిస్తుంటారు" అని అన్నారు.

దీక్ష విరమించిన హజారే

రాలేగణ్ సిద్ధి (మహారాష్ట్ర): ప్రముఖ సామాజికవేత్త అన్నా హజారే నిరాహార దీక్ష విరమించారు. లోక్‌పాల్ నియామకం చేపట్టాలంటూ... గతనెల 30న అహ్మద్‌నగర్ జిల్లాలోని తన స్వగ్రామం రాలేగణ్ సిద్ధిలో ఆయన నిరాహార దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. మంగళవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవిస్‌తో పాటు కేంద్ర మంత్రులు రాధా మోహన్‌సింగ్, సుభాష్ భామ్రే తదితరులు ఇక్కడకు చేరుకుని, హజారేతో ఐదు గంటలపాటు మంతనాలు సాగించారు. చర్చలు ఫలప్రదం కావడంతో తాను దీక్ష విరమిస్తున్నట్లు హజారే ప్రకటించారు.

కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రాల్లో లోకాయుక్త నియామకాలు చేపట్టడంతో పాటు... రైతుల సమస్యల పరిష్కారానికి స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని, ఎన్నికల సంస్కరణలు తీసుకురావాలని కొంతకాలంగా హజారే డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

యోగి ఆదిత్యనాథ్ రోడ్డు ప్రయాణం

పురులియా: రాష్ట్రంలోని పురులియాలో ప్రసంగించేందుకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మంగళవారం రోడ్డు మార్గాన ప్రయాణించి వచ్చారు. పశ్చిమబెంగాల్‌లో తన హెలికాప్టర్ దిగడానికి అనుమతి నిరాకరించిన నేపథ్యంలో యోగి రోడ్డు ప్రయాణాన్ని ఎంచుకున్నారు. ఝార్ఖండ్‌లోని బొకారోకు మంగళవారం హెలికాప్టర్‌లో చేరుకున్నారు. అక్కడి నుంచి పురులియాకు రోడ్డుమార్గాన ప్రయాణించి వచ్చి సభలో ప్రసంగించారు. ఈ సభలో ఆయన మమతపై విమర్శలు కురిపించారు. ఆమె సర్కారు అవినీతి మయమని ఆరోపించారు.

ఆ విద్యార్థులు అమాయకులు కాదు: అమెరికా

వాషింగ్టన్: అగ్రరాజ్యంలో నకిలీ వర్సిటీలో చేరినందుకు నిర్బంధానికి గురైన భారతీయ విద్యార్థులు అమాయకులన్న వాదనను అమెరికా విదేశాంగశాఖ తోసిపుచ్చింది. అక్రమమని తెలిసే వారు ఆ వర్సిటీలో చేరారని స్పష్టం చేసింది. విద్యార్థుల క్షేమం గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ దిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయానికి భారత్ ఇటీవల 'డెమార్షే' (అభ్యంతర పత్రం) జారీ చేసిన సంగతి తెలిసిందే. ఫార్మింగ్టన్ వర్సిటీ నకిలీదని తెలియకే బాధిత విద్యార్థులు అందులో చేరారని చాలా మంది వాదించారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారం గురించి అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి స్పందించారు. "ఆ వర్సిటీలో తరగతులు లేవు. బోధకులు లేరు. అమెరికాలో ఉండిపోయేందుకు నేరానికి పాల్పడుతున్నామని తెలిసే సదరు విద్యార్థులు అందులో చేరారు" అని తెలిపారు. విద్యార్థి వీసాలను దుర్వినియోగం చేస్తున్నవారిని పట్టుకునేందుకు అమెరికా ఇమిగ్రేషన్ అధికారులు ఇటీవల ఫార్మింగ్టన్ అనే నకిలీ వర్సిటీ ఏర్పాటు చేశారు. తమ ఉచ్చులో పడ్డ 8 మంది దళారులు, 130 మంది విద్యార్థులను వారం క్రితం అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు దళారులుగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భరత్ కాకిరెడ్డి, సురేశ్ కండాల, ప్రేమ్ రాంపీస, సంతోష్ సామ, అవినాష్ తక్కళ్లపల్లి, అశ్వంత్ నూనె, నవీన్ ప్రత్తిపాటి, ఫణిదీప్ కర్నాటి తాజాగా మిషిగన్‌లోని ఫెడరల్ కోర్టుకు తాము నిర్దోషులమని విన్నవించుకున్నారు. ఫణిదీప్ సోమవారం బెయిల్‌పై విడుదలయ్యారు.

'కనకదుర్గను ఇంట్లోకి అనుమతించండి'

మలప్పురం: శబరిమలలో జనవరి 2న అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించిన ఇద్దరు మహిళల్లో ఒకరైన కనకదుర్గ(44)కు మంగళవారం గ్రామ న్యాయస్థానం ఊరట లభించింది. ఆమెను భర్త ఇంట్లో ఉండటానికి అనుమతించాలని 'గ్రామ న్యాయాలయ' న్యాయాధికారి నిమ్మి కె.కె. ఆదేశించారు. భర్త ఇంట్లో జీవించడానికి కనకదుర్గకు హక్కు ఉందని పేర్కొన్నారు. అయ్యప్ప దర్శనానంతరం తనపై అత్తింటివారు గృహహింసకు పాల్పడుతున్నారని కనకదుర్గ గ్రామకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో బిందు(42)అనే మరో మహిళతో కలిసి అయ్యప్పను దర్శించుకున్నారు. ఆమె తిరిగి వచ్చేసరికి అత్తింటివారు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. వారిని వెదుక్కుంటూ, వారుంటున్న మరోఇంటికి వెళ్లిన కనకదుర్గను అత్త తీవ్రంగా కొట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆమె ప్రస్తుతం శరణార్థి శిబిరంలో తలదాచుకుంటున్నారు.

మాదే నైతిక విజయం

- మమతా బెనర్జీ వెల్లడి
- ధర్నా విరమించిన దీదీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా వేదికగా చెలరేగిన రాజకీయ రగడకు విరామం! కేంద్రప్రభుత్వం, సీబీఐ తీరుకు నిరసనగా నాటకీయ రీతిలో ఆదివారం రాత్రి ధర్నా ప్రారంభించి ప్రకంపనలు సృష్టించిన సీఎం మమతా బెనర్జీ ఎట్టకేలకు నిరసనను ఉపసంహరించుకున్నారు. కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌పై సీబీఐ బలవంతపు చర్యలేవీ చేపట్టకుండా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో తన నిరసనను ఉపసంహరించుకుంటున్నట్లు దీదీ ప్రకటించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు తమకు అనుకూలంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వాన్ని గద్దె దించేంత వరకు తన పోరాటాన్ని కొనసాగిస్తానని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఆమె స్వాగతించారు. రాజీవ్‌ను అరెస్టు చేయొద్దని, బలవంతపు చర్యలు చేపట్టొద్దని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించడాన్ని ప్రజాస్వామ్య విజయంగా అభివర్ణించారు. తమకు నైతిక విజయం దక్కిందన్నారు. తన ధర్నాలో రాజీవ్‌కుమార్ పాల్గొనలేదని స్పష్టం చేశారు. ధర్నా వేదిక వద్ద గుమిగూడిన మద్దతుదారులనుద్దేశించి మమత ప్రసంగిస్తూ "నేను వదిలి పెట్టను. మోదీని సాగనంపండి - దేశాన్ని రక్షించండి. నా ధర్నా ప్రజల విజయం. ప్రజాస్వామ్య విజయం. ఇక దిల్లీలో పోరాటం కొనసాగిస్తా" అని పేర్కొన్నారు.

మమతతో మాట్లాడలేదు: ఒడిశా సీఎం

భువనేశ్వర్: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, తృణమూల్ కాంగ్రెస్ నేతలతో ఇటీవల కాలంలో తాను మాట్లాడలేదని ఒడిశా ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్(బీజేడీ) అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ స్పష్టం చేశారు. సీబీఐ-కోల్‌కతా పోలీసుల మధ్య ఘర్షణాత్మక వైఖరి నేపథ్యంలో నవీన్‌పట్నాయక్‌ను తాను సంప్రదిస్తానని మమత చెప్పిన నేపథ్యంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. తృణమూల్ కాంగ్రెస్ నాయకులు తనతో మాట్లాడి దాదాపు ఏడాది కావస్తోందన్నారు. సీబీఐ వృత్తిపరంగా వ్యవహరించాలని, రాజకీయేతర పనికి పరిమితం కావాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

కేంద్ర సంస్థలతో భాజపా బెదిరింపులు

సీబీఐ వంటి కేంద్ర సంస్థలను ఉపయోగించుకొని భాజపా బెదిరింపులకు పాల్పడుతోందని దీదీ ఆరోపించారు. 'తుపాకులు, గో రక్షకులతో దేశం నడవదు. రాజ్యాంగం సహాయంతోనే దేశ పరిపాలన సాగాలి' అని అన్నారు.



కోల్‌కతాలో మంగళవారం నిరసన ప్రాంగణంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

సీబీఐపై అపార గౌరవం

సీబీఐపై తనకు అపార గౌరవముందని మమత చెప్పారు. తాము నిరసన చేపట్టింది దర్యాప్తు సంస్థల అధికారులకు వ్యతిరేకంగా కాదని స్పష్టం చేశారు. 'వాళ్లూ మా సోదరులు, సోదరీమణులే' అని వ్యాఖ్యానించారు.

ఇది ప్రజాస్వామ్యానికి గెలుపు

- కేంద్రంపై పోరాటం కొనసాగుతుంది
- దేశ ప్రయోజనాల కోసమే పోరు
- ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
- దీదీ ధర్నాకు సంఘీభావం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ పరిణామాలపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ, ప్రజాస్వామ్య, రాజ్యాంగ సంస్థల విజయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివర్ణించారు. కోల్‌కతాలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత, పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ చేపట్టిన ధర్నాకు మంగళవారం చంద్రబాబు స్వయంగా హాజరై సంఘీభావం ప్రకటించారు. కోల్‌కతా పోలీసు కమిషనర్‌ను అరెస్టు చేయకూడదంటూ సుప్రీంకోర్టు ఆదేశించడాన్ని స్వాగతించారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. కేంద్రంపై అన్ని రాజకీయ పార్టీలు తమ పోరాటం కొనసాగిస్తాయన్నారు. తదుపరి కార్యాచరణ కోసం దిల్లీలో ఫిబ్రవరి 13 లేదా 14 తేదీల్లో సమావేశమవుతామని వెల్లడించారు. ధర్నాగానీ, ఆందోళనగానీ, బహిరంగ సభగానీ నిర్వహిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీలు, ఐఏఎస్, ఐపీఎస్‌లు, వివిధ సంస్థలు ప్రమాదంలో పడిన నేపథ్యంలో రాజ్యాంగాన్ని, సమాఖ్య వ్యవస్థను కాపాడేందుకు మమత పోరాటం సాగించారన్నారు. ముఖ్యమంత్రులు, రాజకీయ పార్టీలన్నీ అవినీతిమయమని, మోదీ, అమిత్‌షాలే నిష్కళంకులని వారు చెబుతున్నారని, కానీ అమిత్‌షా కుమారుడు ఆకస్మికంగా తన ఆస్తులకు 16 వేల రెట్ల అధిక విలువైన కంపెనీని సొంతం చేసుకున్నారని ఆరోపించారు. రఫేల్ ఒప్పందంపై వివరాలు వెల్లడించడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో బ్యాంకులన్నీ నష్టపోయాయని, ఎగవేతదారులు దేశం నుంచి పారిపోయారని, ప్రభుత్వం వారికి పాస్‌పోర్టులు సమకూర్చిందని ఆరోపించారు. శాంతిభద్రతలు, వ్యవసాయం వంటివి రాష్ట్ర పరిధిలోని అంశాలని స్పష్టం చేశారు. పోలీసు కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలనుకోవడం, అధికారులను నియంత్రించాలనుకోవడం మంచిది కాదన్నారు. న్యాయస్థానం మంచి తీర్పు ఇచ్చిందని వ్యాఖ్యానించారు. దర్యాప్తు జరగొద్దని మమత ఎప్పుడూ చెప్పలేదని, లక్ష్యంగా చేసుకోవడాన్నే వ్యతిరేకించారని, అందుకే ధర్నాకు దిగారని వివరించారు. 'నేనూ సీనియర్ నేతనే, నరేంద్రమోదీ వంటి ప్రధానమంత్రిని ఎప్పుడూ చూడలేదు. భవిష్యత్తులో కూడా చూసే అవకాశం లేదు' అని చంద్రబాబు అన్నారు. దేశ ప్రయోజనాల కోసమే తాము పోరాడుతున్నామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ఎవరైనా గొంతెత్తితే అణచివేస్తున్నారన్నారు. ప్రస్తుతం అత్యయిక స్థితికన్నా అధ్వానంగా ఉందన్నారు. వ్యవస్థలను అడ్డం పెట్టుకొని ప్రతిపక్షాలను వేధించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా సివిల్ సర్వీసెస్‌తో పాటు ఇతర శాఖల ఉన్నతాధికారులను కేంద్రం లక్ష్యంగా చేసుకుంటోందని దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా భాజపాయేతర పార్టీలన్నీ మమతకు అండగా ఉన్నాయని తెలిపారు. సాంకేతికత పెరిగిన ప్రస్తుత తరుణంలో దేశంలో జరుగుతున్న పరిణామాలను అందరూ గమనించాలని కోరారు. ముఖ్యంగా యువత ఇలాంటి విషయాలపై దృష్టిసారించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో కేంద్రంలోని భాజపా ప్రభుత్వ దురాగతాలను విస్తృతంగా వ్యాప్తి చేయాలని సూచించారు. భాజపా మరోసారి అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం మరింత అపహాస్యమవుతుందని హెచ్చరించారు. ఓటింగ్ యంత్రాలను ఏమార్చడం చాలా తేలికని, దేశ భవిష్యత్తును, ప్రజాస్వామ్యాన్ని ఒక కంప్యూటర్ ఆపరేటర్ చేతిలో పెట్టలేమని తేల్చిచెప్పారు. ఈవీఎంలను హ్యాకింగ్ చేసినట్లు ఒక హ్యాకర్ చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎవరికి ఓటు వేశామో తెలుసుకునే హక్కు ఓటరుకు ఉందని, దానిని అందరూ గౌరవించాలన్నారు.

మమత.. విపక్ష కూటమి నిర్మాత

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ విపక్ష కూటమికి నిర్మాత అని చంద్రబాబు అభివర్ణించారు. విపక్షాలకు మూలస్తంభం మమతేనని స్పష్టం చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ పశ్చిమ బెంగాల్‌లోని 42 లోక్‌సభ సీట్లను గెలుచుకుంటుందని స్పష్టం చేశారు. ఆమె జాతీయ స్థాయిలో నిర్ణయాత్మక శక్తిగా మారతారని పేర్కొన్నారు. కోల్‌కతాలో జనవరి 19న నిర్వహించిన విపక్ష సభలో పాల్గొన్న 23 రాజకీయ పార్టీల తరఫున తాను హాజరైనట్లు చెప్పారు.

రాజీవ్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోండి

బెంగాల్ ప్రభుత్వాన్ని కోరిన కేంద్రం

దిల్లీ: కేంద్రం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మధ్య ఘర్షణ మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అఖిల భారత సర్వీసుల నిబంధనలను ఉల్లంఘించినందుకుగాను కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని కేంద్రం కోరింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈ మేరకు మంగళవారం కేంద్ర హోంశాఖ నుంచి లేఖ అందింది. సీఎం మమతా బెనర్జీ, మరికొంతమంది పోలీసు అధికారులతో కలిసి రాజీవ్ కోల్‌కతాలో ధర్నా చేసినట్లు తమకు సమాచారం అందిందని లేఖలో కేంద్ర హోంశాఖ తెలిపింది. ఆయన ధర్నా చేయడం అఖిల భారత సర్వీసుల(ప్రవర్తన) నిబంధనలు-1968, అఖిల భారత సర్వీసుల(క్రమశిక్షణ, అప్పీలు) నియమాలను ఉల్లంఘించడమేనని పేర్కొంది. కాబట్టి రాజీవ్‌పై చర్యలు తీసుకొని.. ఏం చర్యలు తీసుకున్నారో తమకు తెలియజేయాలని కోరింది.

పార్లమెంట్‌లో రెండో రోజూ రగడ

సీబీఐ వ్యవహారంపై నిలదీసిన ప్రతిపక్షాలు

దిల్లీ: సీబీఐ, కోల్‌కతా పోలీసుల మధ్య వివాదంపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సభ్యుల నిరసనలతో పార్లమెంటు ఉభయ సభలకు వరసగా రెండోరోజైన మంగళవారం కూడా అంతరాయాలు ఏర్పడ్డాయి. లోక్‌సభలో శూన్యగంట ప్రారంభం కాగానే టీఎంసీ సభ్యులు సభ మధ్యలోకి దూసుకొచ్చి కేంద్ర ప్రభుత్వం, సీబీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అడ్డుతగిలారు. వారికి తెదేపా, ఎస్పీ, కాంగ్రెస్ సభ్యులు కూడా జత కలిశారు. స్పీకర్ సుమిత్ర మహాజన్ పలుమార్లు సూచించినప్పటికీ టీఎంసీ సభ్యులు సీబీఐ అంశంపై నిరసన కొనసాగించారు. దీంతో సభ 3 సార్లు వాయిదా పడింది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే అంశంపై భాజపా ఎంపీ హుకుమ్‌దేవ్ నారాయణ్ యాదవ్ చర్చను ప్రారంభించగా పలువురు టీఎంసీ సభ్యులు అడ్డు తగిలారు. సభ మధ్యాహ్నం 2.30 గంటలకు తిరిగి ప్రారంభమైన అనంతరం ప్రభుత్వం చేపట్టిన వివిధ చర్యలను యాదవ్ ప్రస్తుతించారు. కాంగ్రెస్ సభాపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేను మాట్లాడాల్సిందిగా స్పీకర్ అనుమతించగా సభ సజావుగా లేనందున చర్చను బుధవారానికి వాయిదా వేయాలని కోరారు. టీఎంసీ నేత సుదీప్ బంద్యోపాధ్యాయ్ కూడా ఇదే డిమాండ్ చేశారు. అనంతరం ప్రతిపక్ష సభ్యుల నినాదాలతో స్పీకర్ సభను సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన తర్వాత సీబీఐ వ్యవహారంపై ప్రధాని మాట్లాడాలని సుదీప్ బంద్యోపాధ్యాయ్ డిమాండ్ చేశారు.

రాజ్యసభలోనూ..

ప్రతిపక్షాల నిరసనల మధ్య రాజ్యసభ కార్యకలాపాలు కూడా సాగలేదు. తొలుత వాయిదా పడిన సభ మధ్యాహ్నం తిరిగి ప్రారంభం కాగానే 'రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడాలి' అని నినాదాలు చేస్తూ టీఎంసీ, ఎస్పీ, కాంగ్రెస్ సభ్యులు సభ మధ్యలోకి దూసుకొచ్చారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చకు సహకరించాలని డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ సభ్యులకు సూచించినా.. ప్రతిపక్షాలు పట్టువీడక పోవడంతో సభను ఒక రోజు వాయిదా వేశారు.



బాలీవుడ్ నటుడు అర్జున్ కపూర్, మల్లికా దువా చేతుల మీదుగా స్టూడెంట్ అఛీవర్ విభాగంలో పురస్కారం అందుకుంటున్న మొహమ్మద్ అలీ హసన్



'యోనో ఎస్‌బీఐ 20 అండర్ 20' పురస్కారం అందుకుంటున్న పోతునూరి లయ

తెలుగు యువ ప్రతిభావంతులకు యోనో ఎస్‌బీఐ అవార్డులు

ఈనాడు, హైదరాబాద్: బీటెక్ విద్యార్థులకు సాంకేతిక, కమ్యూనికేషన్ నైపుణ్యాలను నేర్పించే హైదరాబాద్‌కు చెందిన 11 ఏళ్ల బాలుడు మొహమ్మద్ అలీ హసన్.. అతి తక్కువ ఖర్చుతో వాహన ఉద్గారాల ఫిల్టర్‌ను తయారు చేసింది గుణదలకు చెందిన 17 ఏళ్ల పోతునూరి లయ. ఈ ఇద్దరూ తమ విశేష ప్రతిభతో యోనో ఎస్‌బీఐ '20 అండర్ ట్వంటీ' అవార్డును గెలుచుకున్నారు. తమ నైపుణ్యంతో సమాజానికి మేలు చేసే యువ ప్రతిభావంతులను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన యోనో ఎస్‌బీఐ 20 అండర్ ట్వంటీ పోటీని నిర్వహించింది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. ఇందులో భాగంగా క్రీడలు, ఆవిష్కరణలు, నటన, దివ్యాంగుల్లో నైపుణ్యం ఉన్నవారు ఇలా 10 విభాగాలలో నుంచి కొంతమందిని ఎంపిక చేసింది. మొత్తం 60 నామినేషన్లు రాగా, అందులో నుంచి 1.7లక్షల మంది తమ ఓట్లతో 20 మంది యువ ప్రతిభావంతులను ఎంపిక చేశారు. హసన్ బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు అతి చిన్న వయసులోనే ఓ కోచింగ్ సెంటర్ ద్వారా శిక్షణ అందిస్తున్నాడు. 2020 నాటికి వెయ్యి మందికి శిక్షణ అందించాలని అతని లక్ష్యం. పోతునూరి లయ తన సృజనాత్మక ఆవిష్కరణతో ఆకట్టుకుంది. వాహన కాలుష్యాన్ని నివారించేందుకు వీలుగా తక్కువ ఖర్చుతో ఫిల్టర్‌ను తయారు చేసింది. ఇప్పటికే ఆమె జాతీయ స్థాయిలో రెండు అవార్డులను అందుకుంది. మంగళవారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో బాలీవుడ్ నటుడు అర్జున్ కపూర్ చేతుల మీదుగా వీరు ఈ అవార్డులను అందుకున్నారు.

ఈనాడు బిజినెస్

10 అంకుర సంస్థలకు సాయం

- ఎక్స్‌టూ10ఎక్స్ పేరుతో కొత్త సంస్థ
- బిన్నీ బన్సల్ భవిష్యత్ ప్రణాళిక



దిల్లీ: ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ సహవ్యవస్థాపకుడు బిన్నీ బన్సల్ ఎట్టకేలకు మౌనం వీడారు. వ్యక్తిగత దుష్ప్రవర్తన ఆరోపణలతో గత నవంబరులో ఫ్లిప్‌కార్ట్‌కు రాజీనామా చేసిన బిన్నీ.. తొలిసారిగా భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. పాత సహచరుడు సాయికిరణ్ కృష్ణమూర్తితో కలిసి ఏర్పాటు చేసిన అంకుర సంస్థ ఎక్స్‌టూ10ఎక్స్ టెక్నాలజీస్‌పై దృష్టి సారించనున్నట్లు వివరించారు. దేశీయంగా అంకుర సంస్థలు ఏర్పాటు చేయాలనుకునే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ సంస్థతో తోడ్పాటు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటికే దీని కోసం ఒక బృందాన్ని తయారు చేశారు. కొత్త కార్యాలయాన్ని సైతం ప్రారంభించారు. కొంతమంది ప్రముఖ అంకుర సంస్థ ఖాతాదారులను సైతం చేర్చుకున్నారు. 'జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించడానికి సిద్ధమయ్యాను. నేను వ్యక్తిగతంగా 10 అంకుర సంస్థలకు తోడ్పాటు ఇవ్వగలను. అయితే 10,000 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం కల్పించడమే మా లక్ష్యం' అని బిన్నీ బన్సల్ పేర్కొన్నారు.

కొత్త సంస్థపై: బిన్నీ ఏర్పాటు చేసిన కొత్త సంస్థ అంకుర సంస్థలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించనుంది. ఆన్ టాప్ కన్సల్టింగ్, న్యాయ, ఆర్థిక, సమాచార సేవలు, హెచ్‌ఆర్, మేనేజ్‌మెంట్ మెళకువలు ఇవ్వనుంది. ప్రస్తుతం పెద్ద సంస్థల కోసమే సాఫ్ట్‌వేర్‌లను రూపొందిస్తున్నారని, చిన్న అంకురసంస్థలకు ఇవి అందడం లేదని బిన్నీ అన్నారు. కొత్త సంస్థకు బిన్నీ ఛైర్మన్‌గా ఉన్నప్పటికీ.. ఎటువంటి నిర్వాహణ పదవి చేపట్టడం లేదు.

సిమెంటు బస్తా రూ.40-60 ప్రియం

హైదరాబాద్: సిమెంటు ధరలు భగ్గుమన్నాయి. 50 కేజీల బస్తాపై రూ.40-60 మేర సిమెంటు కంపెనీలు ధరలు పెంచాయి. దక్షిణాదిలో గిరాకీ పుంజుకోవడమే ఇందుకు కారణమని డీలర్లు చెబుతున్నారు. తెలంగాణ, తమిళనాడుల్లో గిరాకీ ఎక్కువగా ఉందని తెలిపారు. సిమెంటు ధరలు పెంచిన కంపెనీల్లో అల్ట్రాటెక్, ఇండియా సిమెంట్స్, ఓరియంట్ సిమెంట్స్, సాగర్ సిమెంట్స్, ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్, రామ్‌కో సిమెంట్స్, కేశోరామ్స్ ఇండస్ట్రీస్, పలు ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. ధరల పెంపు తర్వాత.. తెలంగాణలో 50 కేజీల సిమెంట్ బస్తా రూ.290- 320కు విక్రయిస్తున్నట్లు స్థానిక విక్రేత ఒకరు తెలిపారు. ఆంధ్రాలోను ఇదే విధమైన ధరలు ఉన్నాయని వెల్లడించారు.

లాభాల్లోకి పీఎన్‌బీ

దిల్లీ: నీరవ్ మోదీ చేసిన రూ.14,356 కోట్ల మోసం ప్రభావం నుంచి పంజాబ్ నేషనల్ బ్యాంక్ బయటపడింది. ఈ కుంభకోణానికి సంబంధించి బ్యాంకు పూర్తి కేటాయింపులు చేసేసింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.246.51 కోట్ల నికర లాభాన్ని నమోదు చేయగలిగింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో బ్యాంకు ఆర్జించిన నికర లాభం రూ.230.11 కోట్లతో పోలిస్తే ఇది 7.12 శాతం ఎక్కువ. బ్యాంకు మొత్తం ఆదాయం రూ.15,257.50 కోట్ల నుంచి 2.64 శాతం క్షీణతతో రూ.14,854.24 కోట్లకు తగ్గింది.

మెరిసిన టెక్ మహీంద్రా

టెక్ మహీంద్రా ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.1,203 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో సంస్థ ఆర్జించిన నికర లాభం రూ.943.10 కోట్లతో పోలిస్తే ఇది 27.5 శాతం అధికం. కార్యకలాపాల ఏకీకృత ఆదాయం రూ.7,776 కోట్ల నుంచి 15% వృద్ధి చెంది రూ.8,944 కోట్లకు చేరింది.

గెయిల్ డివిడెండు రూ.6.25

ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో గెయిల్ ఇండియా రూ.1,681.23 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో సంస్థ ఆర్జించిన రూ.1,262.22 కోట్లతో పోలిస్తే ఇది 33 శాతం అధికం. ఒక్కో షేరుపై ఆర్జన (ఈపీఎస్) రూ.7.46గా నమోదైంది. రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.6.25 చొప్పున మధ్యంతర డివిడెండును కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదించింది.

సైయెంట్ బైబ్యాక్: షేరుకు 700

ఈనాడు, హైదరాబాద్: సైయెంట్ లిమిటెడ్ ఈక్విటీ షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించింది. రూ.5 ముఖ విలువ కల ఒక్కో షేర్‌ను రూ.700 ధరకు మించకుండా బైబ్యాక్ చేయాలని నిర్ణయించింది. ఇందుకు రూ.200 కోట్లు కేటాయిస్తారు. దీని ప్రకారం 28.75 లక్షల షేర్లు (కంపెనీ జారీ మూలధనంలో 2.54 శాతం) వెనక్కి కొనుగోలు చేయవచ్చు. బైబ్యాక్‌లో కంపెనీ ప్రమోటర్లు పాల్గొనరు. సైయెంట్ షేర్ మంగళవారం బీఎస్ఈలో రూ.606.80 వద్ద ముగిసింది.

సువెన్ కాంట్రాక్టు పరిశోధన, తయారీ వ్యాపారం విభజన

ఈనాడు, హైదరాబాద్: సువెన్ లైఫ్ సైన్సెస్ కాంట్రాక్టు పరిశోధన, తయారీ సేవల వ్యాపారాన్ని విడదీయనుంది. ఈ వ్యాపారాన్ని విడదీసి తన అనుబంధ కంపెనీ అయిన సువెన్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ (ఎస్‌పీఎల్) లో కలపనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ మేరకు సోమవారం జరిగి కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఎన్‌సీఎల్‌టీలో ఈ మేరకు దరఖాస్తు చేయనున్నట్లు కంపెనీ పేర్కొంది. వేరు వేరు వ్యాపార కార్యకలాపాలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించేందుకు వీలుగా ఈ విభజన చేపట్టినట్లు వెల్లడించింది. ప్రస్తుత సువెన్ లైఫ్‌సైన్సెస్ వాటాదార్లకు 1:1 నిష్పత్తిలో కొత్త కంపెనీ అయిన సువెన్ ఫార్మా షేర్లు లభిస్తాయి.

త్రైమాసిక లాభం రూ.25.23 కోట్లు: సువెన్ లైఫ్‌సైన్సెస్ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.25.23 కోట్ల నికరలాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో నికరలాభం రూ.34.60 కోట్లు ఉంది. దీంతో పోల్చితే ప్రస్తుత మూడో త్రైమాసికంలో నికర లాభం తగ్గిపోయింది. అదేవిధంగా మొత్తం ఆదాయం రూ.166.95 కోట్ల నుంచి రూ.134.78 కోట్లకు తగ్గింది. వాటాదార్లకు ఒక్కో షేర్‌కు రూ.1.50 చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లించాలని ప్రతిపాదించారు. దీనికి ఈ నెల 15వ తేదీని రికార్డు తేదీగా నిర్ణయించారు. అర్హత గల వాటాదార్లకు ఈ నెల 25 తర్వాత డివిడెండ్ లభిస్తుంది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2018-19	2017-18	2018-19	2017-18
హెచ్‌పీసీఎల్	248	1950	76884	62832
అపోలో టైర్స్	198.00	245.00	4,655.00	4,016.00
డీఎల్ఎఫ్	335.15	4091.27	2405.89	1855.21
భెల్	191.95	153.19	------	------
మారికో	251.70	223.28	1882.54	1642.49
టీజీబీఎల్	121.32	186.11	1935.17	1750.94
సీఈఎస్‌సీ	173.00	153.00	1707.00	1713.00
ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్	77.25	34.94	1375.66	1180.66
డిష్ టీవీ	152.69	(168.29)	1529.57	1638.50
బిర్లా కార్పొరేషన్	27.40	(21.80)	1556.90	1387.80
టాటా కెమికల్స్	219.48	759.07	2927.94	2591.07
యునైటెడ్ బ్యాంక్	(1139.25)	(637.53)	2846.23	2483.01
ఆదిత్య బిర్లా క్యాపిటల్	193.65	152.85	3782.00	2927.00
హెచ్‌సీఎల్ ఇన్ఫోసిస్టమ్స్	(29.71)	(62.00)	1139.36	1218.79
ఉషా మార్టిన్	(35.46)	(111.07)	630.88	509.85

'వాహన సాంకేతికతలో అనేక దేశాలు మనకంటే ముందున్నాయి. అంతర్జాతీయ దిగ్గజ సంస్థలన్నీ తమ వాహనాలు భారత్‌లో విక్రయిస్తున్నాయి. ప్రయాణికులతో పాటు పాదచారుల రక్షణకూ ఆయా సంస్థల వద్ద మెరుగైన సాంకేతికత ఉంది. మళ్లీ కొత్తగా ఆవిష్కరించాల్సిన పని లేదు. భారత్‌లో తయారు చేసే అన్ని వాహనాల్లో, ముఖ్యంగా చిన్న కార్లలోనూ మెరుగైన సాంకేతికత, ఫీచర్లు ప్రవేశపెట్టాలి. వినియోగదారులు డిమాండ్ చేయడం/నిబంధనల మార్పిడితోనే ఇది సాధ్యమవుతుంది. అన్ని రకాల వాహనాలు సురక్షితంగా ఉండేలా, సాగేలా రూపొందించాలి. రోడ్డు క్రమశిక్షణ పాటిస్తే చాలావరకు సమస్యలు తగ్గుతాయి' అంటున్నారు రెనో ఇండియాకు కొత్త ఎండీగా నియమితులైన వెంకట్రామ్ మామిళ్లపల్లి. ఈయన నియామకాన్ని కంపెనీ మంగళవారం ప్రకటించింది. ప్రస్తుతం రష్యాలోని తోగ్లియాతీ ప్రాంతంలో ఉన్న వెంకట్రామ్.. అక్కడి నుంచి 'ఈనాడు' కిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ విశేషాలు..

ఈనాడుకు ప్రత్యేకం

మీకు కావల్సిన కారు తయారు చేయించుకోండి



- వినియోగదారులు డిమాండ్ చేయాలి
- అప్పుడే కంపెనీల దృక్పథమూ మారుతుంది
- విద్యుత్ వాహనాలు మంచిదే కానీ..
- పర్యావరణ అనుకూల విద్యుదుత్పత్తిపై దృష్టి పెట్టాలి
- పాదచారులు, ప్రయాణికుల భద్రతే కంపెనీల లక్ష్యం కావాలి
- మా సంస్థ ప్రాధాన్యం వీటికే

★ ఆర్థిక వ్యవస్థకు వాహన రంగమే వెన్నెముక

భారత్ వంటి వర్ధమాన దేశ ఆర్థిక వ్యవస్థలకు వాహన రంగం వెన్నెముక వంటిది. దేశ అభివృద్ధిలో యువతీ, యువకులంతా పాలు పంచుకోవాలి. వాహన తయారీ ఊపందుకుంటున్న దశలోనే 1990లో మేమంతా ఈ రంగాన్ని ఎంచుకున్నాం. తమిళనాడులోని మదురై కామరాజ్ విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజినీరింగ్‌ను 1989లో పూర్తి చేసినప్పటినుంచీ వాహన తయారీ రంగంలోనే బాధ్యతలు నిర్వహించా. ఈ రంగంలో సాంకేతికత తప్పనిసరిగా మెరుగు పడాలని యువతరం గుర్తించాలి.

★ చాలా దేశాల జనాభా కంటే మన నిపుణుల సంఖ్యే ఎక్కువ

విద్యాభ్యాసం పూర్తి చేసుకుని, కలల ఉపాధిని ఎంచుకుంటున్న యువత అమితంగా ఉన్న దేశం మనది. నేను భారత్‌తో పాటు దక్షిణ కొరియా, రష్యాలలో వాహన తయారీ సంస్థల్లో భిన్న బాధ్యతలు నిర్వర్తించాను. మళ్లీ భారత్‌కు వస్తుండటం ఎంతో సంతోషం కలిగిస్తోంది. చాలా దేశాల జనాభా కంటే, మన దేశంలోని నిపుణుల సంఖ్యే చాలా అధికం. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎంత ఎక్కువ పని చేశామనే కంటే, ఎంత నాణ్యంగా విధులు నిర్వర్తించామనే విషయమై దృష్టి సారించాలి. అప్పుడే బలమైన దేశం ఆవిర్భవిస్తుంది.

★ యువ ఇంజినీర్లకు 'విజయ నైపుణ్యాలు' నేర్పుతుంటా

చేసే పనిని ఎంతో ఇష్టంతో, నమ్మకంతో నిర్వహించడం తొలి నుంచీ అలవాటు. వృత్తిపరంగా ఎలా మెలగాలి, వృత్తి జీవితంలో ఎలా విజయం సాధించాలి అనే అంశాలను యువ ఇంజినీర్లకు అనుభవపూర్వకంగా నేర్పడం నాకు ఎంతో ఇష్టమైన వ్యాపకం. ఇలాంటివి విశ్వవిద్యాలయాల్లో నేర్పడం అరుదుగా జరుగుతుంది.

ఈయన తెలుగు వారే

రెనో ఇండియా ఎండీగా నియమితులైన మామిళ్లపల్లి వెంకట్రామ్ హైదరాబాద్ వాస్తవ్యులే. ఆయన విద్యాభ్యాసం కేంద్రీయ విద్యాలయలో సాగింది. 8వ తరగతి నుంచే వాహనాలపై మక్కువ ఏర్పడిందని, తన తండ్రి నడిపే స్కూటర్ భాగాలను విడదీసే వాడినే కానీ, మళ్లీ బిగించడం చేతనయ్యేది కాదని తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ వెంకట్రామ్ చెప్పారు. రోడ్డుపై వెళ్తున్న కార్లు, ట్రక్కులు కూడా ఎలా పనిచేస్తాయో తెలుసుకోవాలనే ఆసక్తి ఉండేదని, అదే తనను వాహన రంగంలో చేరేలా ప్రేరేపించిందని వివరించారు. వాహన సంస్థల్లో సమీకరణ, మెటీరియల్స్ నిర్వహణ, సరఫరా వ్యవస్థలు, విక్రయదార్లతో అనుబంధం- అభివృద్ధి, లాజిస్టిక్స్, సప్లయర్ మేన్యుఫ్యాక్చరింగ్ డిజైనింగ్‌లో ఆయనకు ప్రావీణ్యత ఉంది. టాటా మోటార్స్‌లో సోర్సింగ్ అధిపతిగా, దక్షిణకొరియాలో జనరల్ మోటర్స్ గ్లోబల్ పర్చేజింగ్, సప్లై చెయిన్ అధిపతిగా వ్యవహరించారు. లంబోర్గిని ఇండియా, ఐషర్ ట్రాక్టర్స్‌లోనూ విధులు నిర్వర్తించారు.

★ విద్యుదుత్పత్తి ఎలా చేస్తామన్నదీ ముఖ్యం

పర్యావరణ హితమైన విద్యుత్తు వాహనాలను ఆవిష్కరించడం మంచిదే. అయితే విద్యుదుత్పత్తి ఎలా చేస్తున్నామన్నదీ ముఖ్యమని గ్రహించాలి. బొగ్గు లేదా శిలాజ ఇంధనాల (పెట్రోల్/డీజిల్)తో విద్యుదుత్పత్తి చేసి, దాంతో విద్యుత్తు వాహనాలు నడుపుతామంటే ఎంతవరకు ప్రయోజనం ఉంటుందో ఆలోచించాలి. పెట్రోల్/డీజిల్ వాహనాలు తగ్గిస్తున్నాం అంటూ, విద్యుదుత్పత్తి కోసం బొగ్గును మండిస్తే.. కాలుష్య ఉద్గారాలు ఉత్పత్తి చేసే ప్రదేశం మారుతుంది కానీ కాలుష్యం తగ్గదు. ఇది దేశానికే కాదు భూ వాతావరణానికీ హాని కలిగించేదే. అందువల్ల ముందుగా పర్యావరణ హితంగా, కాలుష్య రహిత పద్ధతుల్లో విద్యుదుత్పత్తి పెంచాలి. అప్పుడు విద్యుత్తు వాహనాల దిశగా దేశాన్ని మళ్లిస్తే మేలు. నేను ఎండీ బాధ్యతలు చేపట్టాక, భారత్‌లో కంపెనీ వ్యూహాలపై మాట్లాడటం సబబు అవుతుంది.

★ అయిదేళ్లలో 25 శాతం వృద్ధి సాధ్యమే

దేశీయ కార్ల విపణి వృద్ధి పథంలో సాగడంపై అనుమానాలేం లేవు. సరికొత్త వాహనాల కోసం దేశీయులు ఎదురు చూస్తున్నారు. ప్రయాణ భద్రతకు ఏయే ఫీచర్లు అవసరమో అవగాహన ఉన్నవారు , వాటికోసం కంపెనీలను డిమాండ్ చేయాలి. అలాంటి కార్లే కొనుగోలు చేస్తే, కంపెనీలు మారి తీరతాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో, సురక్షిత, అధిక సామర్థ్యం కలిగిన వాహనాల రూపకల్పనపై దృష్టి సారించాల్సిన సమయమిది. దేశంలో మధ్యతరగతితో పాటు ఆర్థిక సామర్థ్యాలు పెరుగుతున్నందున, వాహన విపణి వేగంగా అభివృద్ధి చెందుతుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులు అభివృద్ధి చెందితే, రాబోయే అయిదేళ్లలో 25 శాతం వృద్ధి లభిస్తుందన్నది అంచనా.

★ ఆరోగ్యకరమైన పోటీ ఉండాల్సిందే

ఏ రంగంలో అయినా ఆరోగ్యకరమైన పోటీ ఉండాల్సిందే. ఇందువల్ల తయారీ సంస్థలతో పాటు వినియోగదార్లకూ మేలు జరుగుతుంది. తయారీ సంస్థల సామర్థ్యం మెరుగుపడుతుంది, వినియోగదార్లకు నగదుకు సరిపడా విలువ దక్కుతుంది.

- ఈనాడు వాణిజ్య విభాగం

రెనో ఇండియా కొత్త ఎండీగా వెంకట్రామ్ మామిళ్లపల్లి

దిల్లీ: ఫ్రెంచ్ వాహన దిగ్గజం రెనో భారత విభాగమైన రెనో ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా వెంకట్రామ్ మామిళ్లపల్లి నియమితులయ్యారు. ఆయన మార్చి 1న బాధ్యతలు స్వీకరిస్తారు. ప్రస్తుతం రష్యాలో రెనో-నిస్సాన్-ఆటోవాజ్ పర్చేజింగ్ ఆర్గనైజేషన్ అధిపతిగా వెంకట్రామ్ వ్యవహరిస్తున్నారు. వాహన రంగంలో ఆయనకు అపార అనుభవం ఉందని, దేశ-విదేశీ వాహన తయారీ సంస్థల్లో పనిచేశారని సంస్థ తెలిపింది. ప్రస్తుతం ఎండీగా ఉన్న సుమిత్ సాహ్నీ గ్రూప్‌లోనే మరో కొత్త బాధ్యత చేపడతారు. భారత్ కార్యకలాపాలను వెంకట్రామ్ మరింత ముందుకు తీసుకెళ్తారన్నది కంపెనీ ఆశాభావం.

ఒడుదొడుకులున్నా.. ముందుకే


- సూచీలకు స్వల్ప లాభం
- రాణించిన వాహన, బ్యాంకింగ్ షేర్లు

సెన్సెక్స్ ▲ 34 — 36617 | నిఫ్టీ ▲ 22 — 10934

ఆద్యంతం ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో.. సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. బ్యాంకింగ్, వాహన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం కలిసొచ్చింది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష సమావేశాలు ప్రారంభం కావడంతో మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. విదేశీ సంకేతాలు కొరవడటం ప్రభావం చూపింది. అంతర్జాతీయంగా చూస్తే జపాన్ మినహా ఆసియా మార్కెట్లు పనిచేయలేదు. ఐరోపా మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 36,573.04 పాయింట్ల వద్ద స్తబ్దుగా ప్రారంభమైంది. ఆద్యంతం హెచ్చుతగ్గులు ఎదుర్కొన్న సూచీ.. ఇంట్రాడేలో 36,727 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 36,495.83 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 34.07 పాయింట్ల లాభంతో 36,616.81 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 22.10 పాయింట్ల లాభంతో 10,934.35 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,886.70-10,956.70 పాయింట్ల మధ్య కదలాడింది.

కొనసాగిన ఆర్‌కామ్ పతనం: దివాలా పరిష్కార ప్రక్రియకు వెళ్లనున్న నేపథ్యంలో రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) షేర్ల పతనం కొనసాగింది. ఇంట్రాడేలో 32.84 శాతం కోల్పోయిన షేరు.. రూ.5.07 వద్ద రికార్డు కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 27.95 శాతం నష్టంతో రూ.5.44 వద్ద ముగిసింది. గత రెండు ట్రేడింగ్ సెషన్లలో ఆర్‌కామ్ మార్కెట్ విలువ రూ.1703.55 కోట్లు ఆవిరైంది. ఇతర గ్రూప్ షేర్లు రిలయన్స్ పవర్ 30.12 శాతం, రిలయన్స్ నేవల్ 13.39 శాతం మేర నష్టాలు చవిచూశాయి.



సెన్సెక్స్ 30 షేర్లలో 18 లాభాలతో ముగిశాయి. హీరో మోటోకార్ప్ 2.66%, బజాజ్ ఆటో 2.51%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2.38%, మారుతీ సుజుకీ 1.84%, ఎం అండ్ ఎం 1.40%, యాక్సిస్ బ్యాంక్ 1.20%, హిందుస్థాన్ యునిలీవర్ 1%, వేదాంతా 0.65% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. టాటా మోటార్స్ 2.63%, కోల్ ఇండియా 2.48%, ఓఎన్‌జీసీ 2.46%, టాటా స్టీల్ 2.32%, యెస్ బ్యాంక్ 2.28%, సన్‌ఫార్మా 1.22%, ఐటీసీ 0.90% మేర నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో వాహన, మన్నికైన వినిమయ వస్తువులు, బ్యాంకింగ్ షేర్లు రాణించాయి. యంత్ర పరికరాలు, లోహ, పీఎస్‌యూ, చమురు- గ్యాస్ స్క్రిప్‌లు డీలా పడ్డాయి. బీఎస్ఈలో 826 షేర్లు లాభాల్లోనూ, 1741 షేర్లు నష్టాలతోనూ ముగిశాయి. 142 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.

హైదరాబాద్‌లో మిరే అసెట్ బిజినెస్ పార్కు?

ఈనాడు, హైదరాబాద్: మ్యూచువల్ ఫండ్లు, స్థిరాస్తి రంగంలో ఉన్న మిరే అసెట్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్స్ దేశంలో బిజినెస్ పార్కుల తరహా నిర్మాణాలను చేపట్టేందుకు చూస్తోంది. ఇందులో భాగంగా చెన్నై, బెంగళూరు, పుణేలతోపాటు హైదరాబాద్‌ను కూడా పరిశీలిస్తున్నట్లు మిరే అసెట్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్స్ (ఇండియా) సీఈఓ స్వరూప్ మొహంతీ తెలిపారు. ఈ నగరాల్లో ఉన్న అవకాశాలను పూర్తి స్థాయిలో విశ్లేషించి త్వరలోనే ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇందుకోసం రూ.1,500-2,000 కోట్ల వరకూ పెట్టుబడి పెట్టే అవకాశం ఉందని వెల్లడించారు. డెవలపర్లకు రుణం ఇవ్వడమా లేదా సొంతంగా నిర్మాణాలు చేపట్టడమా అనే విషయంలో ఇప్పుడే స్పష్టత ఇవ్వలేమని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మార్కెట్ ప్రస్తుత పరిస్థితులను విశ్లేషిస్తూ.. రానున్న ఆరు నెలల కాలంలో ఎన్నికల నేపథ్యంలో కొంత ఒడుదొడుకులు కనిపించినా, మార్కెట్‌లో మదుపు చేసేందుకు ఇది మంచి సమయం అని తెలిపారు. మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ రూ.23,500 కోట్ల వరకూ ఉందని తెలిపారు. ప్రస్తుతం దేశంలో 16 నగరాల్లో విస్తరించామనీ, రానున్న ఏడాదిన్నర కాలంలో 30 నగరాల్లో సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి రూ.728 కోట్ల పెట్టుబడులు మిరే అసెట్ ఫండ్లలోకి వచ్చాయని తెలిపారు.

శ్రీయుత ప్రత్యేక కలెక్టరు (భూ.సే) తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారి కార్యవర్తనములు
ప్రస్తుతము : శ్రీమతి సదా భార్గవి, ఎం.ఎ.,

ఫారం నెం. VII

ఆర్.సి. డి1.374/2018 తేది: 15.12.2018

(2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్ (1) ననుసరించి)

రూఢి ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణములను ప్రజా ప్రయోజనముకై అనగా తెలుగు గంగ ప్రాజెక్టు క్రింద వాలపల్లి చెరువు కుడి ప్రధాన కాలువ కి.మీ. 12.500 నుండి కి.మీ. 19.300 వరకు నిర్మాణము కొరకు చేజర్ల మండలం వావిలేరు గ్రామం నందు విస్తీర్ణము ఎ. 24.72 సెంట్లు భూములు కావలెనని శ్రీ ప్రత్యేక కలెక్టర్, తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారు భావించినందున, 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 15వ విభాగం ననుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములను విచారణ జరిపిన పిమ్మట శ్రీ ప్రత్యేక కలెక్టరు, తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు వాటిలా భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తము భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2018-19నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢి ప్రకటన 2013వ సంవత్సరము 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి చేయుచున్నది.

రూఢి ప్రకటన

శ్రీయుత ప్రత్యేక కలెక్టర్, తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19 (1) విభాగంననుసరించి ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు వాటిలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణంను ప్రజా ప్రయోజనముకై అనగా తెలుగుగంగ ప్రాజెక్టు క్రింద వాలపల్లి చెరువు కుడి ప్రధాన కాలువ కి.మీ. 12.500 నుండి కి.మీ. 19.300 వరకు నిర్మాణము కొరకు చేజర్ల మండలం వావిలేరు గ్రామం నందు విస్తీర్ణము ఎ. 24.72 సెంట్లు అవసరమైనవని ఇందుమూలముగా ప్రకటన చేయుచున్నారు.

షెడ్యూలు

జిల్లా : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు మండలం : చేజర్ల గ్రామం : వావిలేరు

క్రమ సంఖ్య	సర్వే నెం./ సబ్ డి.నెం.	విస్తీర్ణం	తరగతి	పట్టాదారు పేరు	అనుభవదారు పేరు	సాగు/ బీడు
1.	610-2	0.50	పట్టా మెట్ట	పంచేటి చెంచమ్మ భర్త నరసయ్య	పంచేటి చెంచమ్మ భర్త నరసయ్య	సాగు, పచ్చిశనగ
		0.41	పట్టా మెట్ట	తాళ్ళ చంద్రమౌళి తండ్రి బుడగయ్య మరియు ఇతరులు	తాళ్ళ చంద్రమౌళి తండ్రి బుడగయ్య మరియు ఇతరులు	సాగు, పచ్చిశనగ, 12-తాటి
		0.48	పట్టా మెట్ట	కోసూరు వెంకటసుబ్బయ్య తండ్రి సుబ్బయ్య	కోసూరు వెంకటసుబ్బయ్య తండ్రి సుబ్బయ్య	సాగు, పచ్చిశనగ 4-తాటి, బాదం-1 1- వేప
		0.34	పట్టా మెట్ట	తాళ్ళ రమణయ్య తండ్రి యానాదయ్య	తాళ్ళ రమణయ్య తండ్రి యానాదయ్య	సాగు, పచ్చిశనగ
2.	618-2బి	0.52	పట్టా మెట్ట	కామంచి పెంచలయ్య అలియాస్ మూగయ్య తండ్రి యామయ్య	కామంచి పెంచలయ్య అలియాస్ మూగయ్య తండ్రి యామయ్య	సాగు, పచ్చిశనగ
		0.35	పట్టా మెట్ట	కామంచి పిచ్చయ్య తండ్రి యామయ్య	కామంచి పిచ్చయ్య తండ్రి యామయ్య	సాగు, పచ్చిశనగ
3.	619-2	0.27	పట్టా మెట్ట	నెట్టెం పెంచలయ్య తండ్రి మునెయ్య	నెట్టెం పెంచలయ్య తండ్రి మునెయ్య	సాగు, పచ్చిశనగ, 11-తాటి
4.	622-1ఎ2	0.31	పట్టా మెట్ట	నెట్టెం పెంచలయ్య తండ్రి మునెయ్య	నెట్టెం పెంచలయ్య తండ్రి మునెయ్య	సాగు, పచ్చిశనగ
		0.42	పట్టా మెట్ట	చిలంకూరు అనంతమ్మ భర్త పెంచలయ్య	చిలంకూరు అనంతమ్మ భర్త పెంచలయ్య	సాగు, పొగాకు
		0.14	పట్టా మెట్ట	నెట్టెం నరసమ్మ భర్త వెంకటయ్య	నెట్టెం నరసమ్మ భర్త వెంకటయ్య	సాగు, జటిల్‌వేర్ మొక్కలు
5.	622-1బి2	0.43	పట్టా మెట్ట	నెట్టెం నరసమ్మ భర్త వెంకటయ్య	నెట్టెం నరసమ్మ భర్త వెంకటయ్య	సాగు, జటిల్‌వేర్ మొక్కలు
6.	622-2ఎ	0.11	పట్టా మెట్ట	చిక్కసాని కృష్ణయ్య తండ్రి సుబ్బయ్య	చిక్కసాని కృష్ణయ్య తండ్రి సుబ్బయ్య	బీడు
7.	625-2	0.30	పట్టా మెట్ట	మదమంచి శ్రీరాములు తండ్రి వెంకటయ్య	మదమంచి శ్రీరాములు తండ్రి వెంకటయ్య	సాగు, జటిల్‌వేర్ మొక్కలు, 6-వేప
8.	624-2	1.55	పట్టా మెట్ట	అన్నెం అంకయ్య తండ్రి ఓబయ్య	అన్నెం అంకయ్య తండ్రి ఓబయ్య	సాగు, జామాయిల్, 10-వేప
9.	615-2	0.45	పట్టా మెట్ట	మదమంచి రత్నం తండ్రి రమణయ్య	మదమంచి రత్నం తండ్రి రమణయ్య	బీడు
		0.60	పట్టా మెట్ట	కట్టంరెడ్డి రవికుమార్‌రెడ్డి తండ్రి జయరామిరెడ్డి	కట్టంరెడ్డి రవికుమార్‌రెడ్డి తండ్రి జయరామిరెడ్డి	సాగు, నిమ్మతోట, 28-నిమ్మ, 4-చింత, 28-టేకు, 1-సపోటా, 1-జామ, 1-వేప, 4-చిన్న నిమ్మ మొక్కలు
10.	535-2	0.34	పట్టా మెట్ట	కట్టంరెడ్డి సురేఖ భర్త రవికుమార్‌రెడ్డి	కట్టంరెడ్డి సురేఖ భర్త రవికుమార్‌రెడ్డి	సాగు, నిమ్మతోట 20-నిమ్మ
		0.03	పట్టా మెట్ట	పొత్తూరు రమేష్‌బాబు తండ్రి నరసయ్యచౌదరి	పొత్తూరు రమేష్‌బాబు తండ్రి నరసయ్యచౌదరి	సాగు, నిమ్మతోట
11.	535-4	0.69	పట్టా మెట్ట	కట్టంరెడ్డి సురేఖ భర్త రవికుమార్‌రెడ్డి	కట్టంరెడ్డి సురేఖ భర్త రవికుమార్‌రెడ్డి	సాగు, నిమ్మతోట, 60-నిమ్మ, 23-వేప, 1-సుబాబుల్, 1-కుంకుడు
12.	538-2	0.71	పట్టా మెట్ట	మదమంచి వెంకటేశ్వర్లు తండ్రి సుబ్బయ్య	మదమంచి వెంకటేశ్వర్లు తండ్రి సుబ్బయ్య	సాగు, 87-నిమ్మ, 40-వేప, 1-జామ
		0.31	పట్టా మెట్ట	గోనుగుంట రాములమ్మ భర్త రమణయ్య	గోనుగుంట రాములమ్మ భర్త రమణయ్య	సాగు, 52-నిమ్మ, 18-టేకు, 3-వేప
13.	539-1బి	0.50	పట్టా మెట్ట	మదమంచి శ్రీనివాసులు తండ్రి శేషయ్య	మదమంచి శ్రీనివాసులు తండ్రి శేషయ్య	సాగు, 39-నిమ్మ, 17-వేప
14.	539-2బి	0.01	పట్టా మెట్ట	మదమంచి చిరంజీవి తండ్రి రామచంద్రయ్య	మదమంచి చిరంజీవి తండ్రి రామచంద్రయ్య	బీడు
15.	539-3బి	0.54	పట్టా మెట్ట	పొత్తూరు పెంచలయ్య తండ్రి నరసయ్య	పొత్తూరు పెంచలయ్య తండ్రి నరసయ్య	సాగు, ఉలవ
16.	540-2	0.28	పట్టా మెట్ట	పొత్తూరు పెంచలయ్య తండ్రి నరసయ్య	పొత్తూరు పెంచలయ్య తండ్రి నరసయ్య	సాగు, ఉలవ
		0.66	పట్టా మెట్ట	నెట్టెం ప్రభాకర్ తండ్రి ఆంజనేయులు	నెట్టెం ప్రభాకర్ తండ్రి ఆంజనేయులు	సాగు, ఉలవ
		0.03	పట్టా మెట్ట	నెట్టెం శివరావమ్మ భర్త శేషయ్య	నెట్టెం దశయ్య తండ్రి లేట్ శేషయ్య	సాగు, ఉలవ
		0.03	పట్టా మెట్ట	నెట్టెం శివరావమ్మ భర్త శేషయ్య	నెట్టెం శ్రీనివాసులు తండ్రి లేట్ శేషయ్య	సాగు, ఉలవ
17.	542-1బి	0.52	పట్టా మెట్ట	నెట్టెం వెంకటేశ్వర్లు తండ్రి నరసయ్య	నెట్టెం వెంకటేశ్వర్లు తండ్రి నరసయ్య	సాగు, 58-నిమ్మ, 25-టేకు, 13-తాటి, 1-చింత, 2-కుంకుడు
18.	542-2బి	1.06	పట్టా మెట్ట	నెట్టెం పెంచలయ్య తండ్రి నరసయ్య	నెట్టెం పెంచలయ్య తండ్రి నరసయ్య	సాగు, 1-బోరు, 122-నిమ్మ, 1-మర్రి, 1-చింత, 1-తాటి
19.	346-2బి	0.87	పట్టా మెట్ట	చిక్కసాని భువేనమ్మ భర్త పెంచలయ్య	చిక్కసాని భువేనమ్మ భర్త పెంచలయ్య	సాగు, పచ్చిశనగ
20.	342-4బి	1.37	పట్టా మెట్ట	మదమంచి రమణయ్య	మదమంచి విజయబాబు తండ్రి రమణయ్య	సాగు, పొగాకు
21.	342-5ఎ	0.11	పట్టా మెట్ట	మదమంచి రమణయ్య తండ్రి రామనుజయ్య	మదమంచి రమణయ్య తండ్రి రామనుజయ్య	సాగు, పొగాకు
22.	339-1బి	0.36	పట్టా మెట్ట	గోనుగుంట రామ్‌మోహన్ తండ్రి వెంకటయ్య	గోనుగుంట రామ్‌మోహన్ తండ్రి వెంకటయ్య	బీడు
		0.08	పట్టా మెట్ట	గోనుగుంట వెంకటరత్నం తండ్రి రమణయ్య	గోనుగుంట వెంకటరత్నం తండ్రి రమణయ్య	సాగు, పచ్చి శనగ 3 - తాటి
23.	339-2బి	0.46	పట్టా మెట్ట	గోనుగుంట వెంకటరత్నం తండ్రి రమణయ్య	గోనుగుంట వెంకటరత్నం తండ్రి రమణయ్య	సాగు, పచ్చి శనగ
		0.20	పట్టా మెట్ట	గోనుగుంట రామ్‌మోహన్ తండ్రి వెంకటయ్య	గోనుగుంట రామ్‌మోహన్ తండ్రి వెంకటయ్య	సాగు, పచ్చి శనగ
24.	334-1ఎ	0.01	పట్టా మెట్ట	గోనుగుంట పెంచలయ్య తండ్రి రోశయ్య	గోనుగుంట పెంచలయ్య తండ్రి రమణయ్య	సాగు, పచ్చి శనగ
25.	334-2బి	0.33	పట్టా మెట్ట	గోనుగుంట వెంకటరత్నం తండ్రి రమణయ్య	గోనుగుంట వెంకటరత్నం తండ్రి రమణయ్య	బీడు
26.	268-2బి	0.06	పట్టా మెట్ట	మదమంచి ఆంజనేయులు తండ్రి పెంచలయ్య	మదమంచి ఆంజనేయులు తండ్రి పెంచలయ్య	సాగు, పచ్చి శనగ
27.	268-3బి	0.39	పట్టా మెట్ట	మదమంచి మారుతి తండ్రి వెంకటేశ్వర్లు	మదమంచి మారుతి తండ్రి వెంకటేశ్వర్లు	సాగు, పచ్చి శనగ
		0.25	పట్టా మెట్ట	గుత్తా రామకృష్ణయ్య తండ్రి రామానాయుడు	గుత్తా రామకృష్ణయ్య తండ్రి రామానాయుడు	సాగు, పచ్చి శనగ, 1-వేప
28.	263-2బి	0.48	పట్టా మెట్ట	మదమంచి రాములమ్మ భర్త పెద్దసుబ్బారాయుడు	మదమంచి రాములమ్మ భర్త పెద్దసుబ్బారాయుడు	సాగు, పచ్చి శనగ, 1-వేప
		0.86	పట్టా మెట్ట	మదమంచి ప్రమోద్ కుమార్ తండ్రి శ్రీనివాసులు	మదమంచి ప్రమోద్‌కుమార్ తండ్రి శ్రీనివాసులు	సాగు, పచ్చి శనగ
29.	271-1బి	0.41	పట్టా మెట్ట	మదమంచి శ్రీనివాసులు తండ్రి శేషయ్య	మదమంచి శ్రీనివాసులు తండ్రి శేషయ్య	సాగు, పచ్చి శనగ
30.	271-2ఎ	0.02	పట్టా మెట్ట	మదమంచి శ్రీనివాసులు తండ్రి శేషయ్య	మదమంచి శ్రీనివాసులు తండ్రి శేషయ్య	సాగు, పచ్చి శనగ
31.	272-2	0.82	పట్టా మెట్ట	మదమంచి వినోద్‌కుమార్ తండ్రి శ్రీనివాసులు	మదమంచి వినోద్‌కుమార్ తండ్రి శ్రీనివాసులు	సాగు, పచ్చి శనగ
		0.46	పట్టా మెట్ట	గోనుగుంట పెంచలయ్య తండ్రి నరసయ్య	గోనుగుంట పెంచలయ్య తండ్రి నరసయ్య	సాగు, పచ్చి శనగ
32.	274-2	0.48	పట్టా మెట్ట	గోనుగుంట రత్నం తండ్రి రోశయ్య	గోనుగుంట రత్నం తండ్రి రోశయ్య	సాగు, పచ్చి శనగ
33.	284-1బి	0.17	పట్టా మెట్ట	మదమంచి వెంకటరమణమ్మ భర్త చిన సుబ్బారాయుడు	మదమంచి వెంకటరమణమ్మ భర్త చిన సుబ్బారాయుడు	బీడు
		0.35	పట్టా మెట్ట	మదమంచి చిరంజీవి తండ్రి రామచంద్రయ్య	మదమంచి చిరంజీవి తండ్రి రామచంద్రయ్య	బీడు, 2-తాటి
34.	284-2ఎ	0.22	పట్టా మెట్ట	మదమంచి వెంకటరమణమ్మ భర్త చినసుబ్బారాయుడు	మదమంచి వెంకటరమణమ్మ భర్త చినసుబ్బారాయుడు	బీడు, 1-తాటి
		0.01	పట్టా మెట్ట	మదమంచి చిరంజీవి తండ్రి రామచంద్రయ్య	మదమంచి చిరంజీవి తండ్రి రామచంద్రయ్య	సాగు, పచ్చిశనగ
35.	284-3బి	0.31	పట్టా మెట్ట	మదమంచి మాధురి భర్త ప్రసాద్	మదమంచి మాధురి భర్త ప్రసాద్	బీడు, 7-తాటి, 1-వేప
36.	282-2	0.67	పట్టా మెట్ట	పమిడి చైతన్య తండ్రి మధుసూదనరావు	పమిడి చైతన్య తండ్రి మధుసూదనరావు	సాగు, జామాయిల్
37.	293-1బి	0.39	పట్టా మెట్ట	పమిడి జగదీశ్ తండ్రి మధుసూదనరావు	పమిడి జగదీశ్ తండ్రి మధుసూదనరావు	సాగు, జామాయిల్
38.	295-2	0.10	పట్టా మెట్ట	అమ్మినేని శ్రీరాములు తండ్రి ఆంజనేయులు మరియు ఇతరులు	అమ్మినేని శ్రీరాములు తండ్రి ఆంజనేయులు మరియు ఇతరులు	బీడు
39.	296-2	1.49	పట్టా మెట్ట	పమిడి జగదీశ్ తండ్రి మధుసూదనరావు	పమిడి జగదీశ్ తండ్రి మధుసూదనరావు	సాగు, జామాయిల్
40.	292-2	0.03	పట్టా మెట్ట	పమిడి జగదీశ్ తండ్రి మధుసూదనరావు	పమిడి జగదీశ్ తండ్రి మధుసూదనరావు	సాగు, జామాయిల్
41.	537-1	0.08	పట్టా మెట్ట	సింగమనేని యానాదయ్య తండ్రి పెంచలయ్య	సింగమనేని యానాదయ్య తండ్రి పెంచలయ్య	బీడు
		24.72				

ఈ భూముల ప్లాన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ. సే), తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు యూనిట్ వారి కార్యాలయములో వుంచబడినది. దానిని కార్యాలయము పనివేళల్లో ఏ సమయములో అయినా తనిఖీ చేసుకొనవచ్చును. ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన వారు ఎవ్వరును లేరు.

బొగ్గు గనులు, ఖనిజాలు, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో కానీ వుంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణము కొరకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వుట గాని తొలగించుట గాని చేయవలెను.

సం/- శ్రీమతి సదా భార్గవి ఎం.ఎ., ప్రత్యేక కలెక్టరు, తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు

సమర్థంగా ఎన్నికల నిర్వహణ

- మావోయిస్టుల చర్యలకు అడ్డుకట్ట
- సరిహద్దు నేరాల నియంత్రణకు చర్యలు
- డీజీపీ ఆర్.పి.ఠాకూర్ వెల్లడి
- తిరుపతిలో ఆరు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ డీజీపీ ఆర్పీ ఠాకూర్. చిత్రంలో తమిళనాడు డీజీపీ టీకే రాజేంద్రన్, కర్ణాటక డీజీపీ నీలమణి రాజు, ఛత్తీస్‌గఢ్ డీజీపీ డీఎం అవస్థీ, ఆయా రాష్ట్రాల హోం సెక్రటరీలు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: రానున్న లోక్‌సభ ఎన్నికలను దక్షిణాదిన సమర్థంగా నిర్వహించేందుకు అనువుగా పొరుగు రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుంటామని రాష్ట్ర డీజీపీ ఆర్.పి.ఠాకూర్ స్పష్టీకరించారు. మంగళవారం తిరుపతిలో ఆంధ్రప్రదేశ్ డీజీపీతోపాటు తమిళనాడు, కర్ణాటకల డీజీపీలు టి.కె.రాజేంద్రన్, నీలమణిరాజు, తెలంగాణ, ఏపీల హోమ్ సెక్రటరీలు రాజీవ్ త్రివేది, ఎ.ఆర్.అనూరాధ, ఐబీ జాయింట్ డైరెక్టర్ ఆర్.ఎ.చంద్రశేఖర్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పర్యవేక్షణ, నక్సలైట్లను ఎదుర్కోవడం, మద్యం అక్రమ రవాణాను అడ్డుకోవడంపై చర్చించారు. అనంతరం విలేకరుల సమావేశంలో డీజీపీ ఠాకూర్ మాట్లాడుతూ.. 'పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులతో చర్చించాం. అక్రమ మద్యం, ఎర్రచందనం తరలింపు నియంత్రణ ప్రధాన అంశంగా మాట్లాడాం. మావోయిస్టుల కదలికల సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని నిర్ణయించాం. ఎన్నికల్లో హెలికాప్టర్లు, ఎయిర్ అంబులెన్స్‌ల వినియోగం, భద్రతా బలగాల తరలింపుపై చర్చించామ'ని వివరించారు. తాజా సమావేశాలను రాష్ట్రాల స్థాయి నుంచి జిల్లాలు, మండలాల స్థాయికి తీసుకెళ్లి స్థానిక అధికారులు కూడా భేటీ అయ్యేలా చర్యలు తీసుకుంటామని డీజీపీ ఠాకూర్ వెల్లడించారు. తమిళనాడు డీజీపీ టి.కె.రాజేంద్రన్ మాట్లాడుతూ తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రధానంగా నాటుసారా, అక్రమ మద్యం సరఫరా జరుగుతోందన్నారు. ఎన్నికల్లో వీటిని అరికట్టడంపై ప్రధానంగా చర్చించామని తెలిపారు. కర్ణాటక డీజీపీ నీలమణి రాజు మాట్లాడుతూ.. అన్ని రాష్ట్రాల పోలీసు అధికారులు అక్కడి పరిస్థితులు, తీసుకుంటున్న భద్రతా చర్యలను ప్రస్తావించారని, ఉత్తమమైన వాటిని మిగిలిన రాష్ట్రాల్లో అమలు చేసేందుకు ఈ సమావేశం దోహదపడుతుందని అన్నారు.

జగన్ ఆరోపణలను పత్రికల్లోనే చూశా

- కులాన్ని పక్కన పెట్టే పోలీసునయ్యా
- డీజీపీ ఆర్.పి.ఠాకూర్

తనపై రాష్ట్ర ప్రతిపక్ష నేత, వైకాపా అధినేత జగన్ చేసిన ఆరోపణలపై డీజీపీ ఆర్.పి.ఠాకూర్ తీవ్రంగా స్పందించారు. పోలీసులకు కులం ఉండదని, తమది ఖాకీకులం మాత్రమేనని వ్యాఖ్యానించారు. ఇటీవల 35 మంది సీఐల పదోన్నతులకు సంబంధించి జగన్ చేసిన ఆరోపణలపై ఆయన మంగళవారం తిరుపతిలో విలేకరుల సమావేశంలో స్పందించారు. 'హైకోర్టు నిర్దేశించినట్లుగానే పోలీసులపదోన్నతులపై చర్యలుతీసుకున్నాం. దీనిపై న్యాయ పరిశీలన కూడా ఉంటుంది. రాష్ట్రంలో నాకులం వారెవరూలేరు. కులాన్ని పక్కనపెట్టే పోలీసు ఉద్యోగానికివచ్చాను. డీజీగా ఉన్నప్పటి నుంచీ నేనంటే ఏంటో అందరికీ తెలుసు. నిజాయతీగా పనిచేస్తున్న సంగతి తెలుసుకోవాల'ని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఎన్నికలుసజావుగా, నిష్పక్షపాతంగా జరగాలంటే డీజీపీ, ఇంటెలిజెన్స్ ఏడీజీలను ఆ బాధ్యతల నుంచి తప్పించాలని జగన్ ఎన్నికల సంఘాని(ఈసీ)కి ఫిర్యాదు చేయడంపై ఠాకూర్ స్పందించారు. ఫిర్యాదు సంగతి పత్రికల్లోనే చూశానన్నారు. ఈసీ, హోంశాఖ నుంచి తనకెలాంటి తాఖీదులు అందలేదని స్పష్టం చేశారు.

పసికందు పొట్టపై వాతలు!

- ఊబగుడ్డి గ్రామంలో దురాచారం



రోజుల బిడ్డ పొట్టపై సూది కాల్చి పెట్టిన వాతలు

సాలూరు, న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతికతతో ఆరోగ్య రంగంలోనూ అద్భుత ఫలితాలు సాధిస్తోన్న నేటి సమాజంలోనూ కొందరు మూఢవిశ్వాసాల్ని వీడటం లేదు. విజయనగరం జిల్లా సాలూరు నియోజకవర్గంలోని గిరిజన ప్రాంత ప్రజల్లో కొందరి తీరు ఇందుకు అద్దం పడుతోంది. బొడ్డూడని పసికందులతో పాటు పిల్లలకు ఎలాంటి రోగాలు సోకినా వారికి చెడు జరగకూడదంటూ శరీరంపై వాతలు పెట్టే దురాచారం కొనసాగుతోంది. పాచిపెంట మండలం ఊబగుడ్డి గ్రామానికి చెందిన పాడి నర్సమ్మ గర్భిణి. నెలలు నిండటంతో సాలూరులోని గర్భిణుల వసతిగృహంలో ఉంచి ప్రసవం చేశారు. ఆపై స్వగ్రామానికి పంపించారు. శిశువు పుట్టిన ఐదో రోజునే కడుపు, చేతులపైన కుటుంబ సభ్యులు సూది కాల్చి వాతలు పెట్టారు. రెండురోజుల తర్వాత అక్కడ సెప్టిక్ అయ్యింది. ఇది తగ్గకపోవడంతో మంగళవారం సాలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. మంగళవారానికి శిశువు వయసు 11 రోజులకు చేరినట్లు ఆసుపత్రి వర్గాలు చెప్పాయి. ప్రాణాపాయ స్థితి లేదని, చికిత్స అందిస్తున్నామని వైద్యుడు ప్రవీణ్‌కుమార్ చెప్పారు.

నీట మునిగిన బల్లకట్టు

- సురక్షితంగా బయటపడిన 60 మంది



పంటులోకి చేరుతున్న నీటిని పరిశీలిస్తున్న వాహన చోదకులు

చందర్లపాడు, న్యూస్‌టుడే: సామర్థ్యానికి మించి వాహనాలు, ప్రయాణికులను ఎక్కించుకొని బయలుదేరడానికి సిద్ధమవుతున్న బల్లకట్టు(పంటు) నీట మునిగింది. నాసిరకం పంటును యథేచ్ఛగా తిప్పడం వల్లే ఈ ఘటన చోటుచేసుకుంది. 60 మంది ప్రయాణికులు ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారు. లారీ, సరకులు రవాణాచేసే ఆటో, రెండు ద్విచక్రవాహనాలు పంటుతో సహా మునిగిపోయాయి. కృష్ణా జిల్లా చందర్లపాడు మండలం గుడిమెట్ల, గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం పుట్లగూడెంరేవుల మధ్య కృష్ణా నదిలో నిర్వహిస్తున్న బల్లకట్టు గుడిమెట్ల సమీపంలో నది ఒడ్డున మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. గుడిమెట్ల రేవులో 60 మంది ప్రయాణికులతోపాటు 20 ద్విచక్రవాహనాలు, ఖాళీ ఆటో, లోడు లారీని పంటుపై ఎక్కించారు. కొద్ది నిమిషాలకే బల్లకట్టు నుంచి ఒడ్డుకు కట్టిన రెండు మోకుల్లో ఒకటి తెగటంతో పంటు నీటిలో పక్కకు ఒరిగింది. ప్రయాణికులు భయంతో వెంటవెంటనే దిగిపోయారు. రెండు మినహా ద్విచక్రవాహనాలనూ దించేశారు. పంటుపైకి నీరు చేరి క్రమేణా మునిగింది. నదిలో రోజూ నిర్వహిస్తున్న బల్లకట్టు స్థానంలో చిన్న బల్లకట్టును వారం నుంచి నడుపుతున్నారనే ఆరోపణలున్నాయి.

ఛాంపియన్స్

స్వదేశంలో మెరుపులు మెరిపించి.. కఠినమైన విదేశీ పర్యటనల్లో తేలిపోవడం టీమ్‌ఇండియా బలహీనత. కానీ ఈ మధ్య ఆ బలహీనతను అధిగమించి విదేశాల్లోనూ అదరగొడుతోంది. ప్రపంచకప్ సమీపిస్తుండగా.. ఆస్ట్రేలియా గడ్డపై అద్భుత విజయాలు నమోదు చేసిన భారత్.. న్యూజిలాండ్‌లోనూ సత్తా చాటుతోంది. ఇప్పటికే వన్డే సిరీస్‌లో ఘనవిజయం సాధించిన టీమ్‌ఇండియా.. ఇక టీ20లపై కన్నేసింది. ప్రపంచకప్ ముంగిట భారత్ ఆడబోయే చివరి విదేశీ సిరీస్ ఇదే. దీన్ని కూడా గెలిచేసి సగర్వంగా స్వదేశానికి చేరాలని భావిస్తోంది జట్టు. వన్డే సిరీస్ మధ్యలో కోహ్లి నుంచి పగ్గాలందుకున్న రోహిత్.. టీ20 సిరీస్‌లో పూర్తి స్థాయిలో జట్టును నడిపించనున్నాడు. కొంత విరామం తర్వాత ధోని మళ్లీ టీ20ల్లో ఆడబోతుండగా.. అతడి వారసుడిగా పరిగణిస్తున్న రిషబ్ పంత్ సైతం ఈ సిరీస్‌లో బరిలోకి దిగుతుండటం విశేషం.

టీ20లకు మిథాలీ గుడ్‌బై!

దిల్లీ: టీమ్‌ఇండియా వన్డే సారథి, సీనియర్ క్రీడాకారిణి మిథాలీ రాజ్ టీ20 క్రికెట్‌కు గుడ్‌బై చెప్పనుంది. సొంతగడ్డపై ఇంగ్లాండ్‌తో సిరీస్ అనంతరం పొట్టి క్రికెట్ నుంచి మిథాలీ తప్పుకోనుంది. టీ20 క్రికెట్‌కు దూరమైనా.. 36 ఏళ్ల మిథాలీ వన్డేల్లో కొనసాగుతుంది. మరోవైపు బుధవారం వెల్లింగ్టన్‌లో న్యూజిలాండ్‌తో 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభంకానుండగా.. తుదిజట్టులో మిథాలీ ఉంటుందా అన్నదానిపై స్పష్టత లేదు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు మిథాలీని ఎంపిక చేసినా.. 3 మ్యాచ్‌ల్లో తను ఆడేదీ అనుమానమే! "2020 టీ20 ప్రపంచ కప్‌కు హర్మన్‌ప్రీత్ జట్టును సిద్ధం చేసుకుంటుందన్న సంగతి మిథాలీ అర్థం చేసుకోగలదు. ఆ టోర్నీలో ఆమె ఆడకపోవచ్చు. ఐతే మిథాలీ వంటి దిగ్గజ క్రీడాకారిణికి ఘనంగా వీడ్కోలు పలకాలి" అని బీసీసీఐ అధికారి తెలిపారు. టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్ తుది జట్టులో మిథాలీని చేర్చకపోవడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్‌లో భారత్ ఓడింది.



బరిలో అమ్మాయిలూ..

నేడే కివీస్‌తో తొలి టీ20

ఉ. 8.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌ను గెలిచి ఊపు మీదున్న భారత అమ్మాయిల జట్టు మరో సిరీస్‌పై కన్నేసింది. బుధవారం జరిగే తొలి టీ20 మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌లో శుభారంభం చేయాలని హర్మన్‌ప్రీత్ సేన భావిస్తోంది. వన్డే సిరీస్‌ను 2-1తో నెగ్గిన భారత్.. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ సాధించాలనే పట్టుదలతో ఉంది. ఓపెనర్ స్మృతి మంధాన జోరు మీదుండడం భారత్‌కు కలిసొచ్చే అంశం. వన్డే సిరీస్‌లో పెద్దగా ఆడని హర్మన్‌ప్రీత్ రాణించడం కూడా జట్టుకు ఎంతో అవసరం. వన్డే సిరీస్‌లో నెమ్మదిగా ఆడిన మిథాలీరాజ్ టీ20ల్లో గేర్లు మార్చాల్సిన సమయం వచ్చింది. ప్రియా పునియా అరంగేట్రం చేసే అవకాశం ఉంది. ఈ మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో సత్తా చాటితే రాబోయే టీ20 ప్రపంచకప్‌కు ముందు టీమ్‌ఇండియా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.



అశ్విన్ కాదు.. కుల్‌దీప్

వెల్లింగ్టన్: ప్రస్తుతం టెస్టుల్లో భారత జట్టుకు తొలి ప్రాధాన్య స్పిన్నర్ కుల్‌దీప్ యాదవే అని కోచ్ రవిశాస్త్రి అన్నాడు. చాలా ఏళ్లుగా అశ్వినే భారత ప్రధాన స్పిన్నర్‌గా ఉంటున్నాడు. ఐతే ఇటీవలి ప్రదర్శనతో కుల్‌దీప్.. అతడిని దాటేశాడని రవిశాస్త్రి చెప్పకనే చెప్పాడు. "ప్రస్తుతం భారత జట్టులో ప్రధాన స్పిన్నర్ కుల్‌దీప్ యాదవే. అతను విదేశాల్లో టెస్టులాడాడు. ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. టెస్టుల్లో మున్ముందు ఒక స్పిన్నర్‌నే ఎంచుకోవాల్సి వస్తే.. కుల్‌దీప్‌కే అవకాశం దక్కుతుంది. ఆస్ట్రేలియాలో అతడి బౌలింగ్ నన్నెంతగానో ఆకట్టుకుంది. ఆ ప్రదర్శన చూశాక అతనే భారత నంబర్‌వన్ స్పిన్నర్ అన్నది రూఢి అయింది" అని రవిశాస్త్రి చెప్పాడు.

విరాట్.. ఇమ్రాన్‌లా!

కెప్టెన్ కోహ్లిని దిగ్గజ ఆటగాళ్లు వివియన్ రిచర్డ్స్, ఇమ్రాన్ ఖాన్‌లతో పోల్చాడు రవిశాస్త్రి. "ఈ ఏడాది ఐసీసీ వ్యక్తిగత అవార్డుల్ని కోహ్లి క్లీన్‌స్వీప్ చేశాడు. ఇలా ఇంకెవ్వరూ చేయలేరేమో. నాయకత్వం తాలూకు ఒత్తిడిని తట్టుకుంటూ అవార్డులన్నింటినీ సొంతం చేసుకోవడం మామూలు విషయం కాదు. బ్యాటింగ్‌లో కోహ్లి.. రిచర్డ్స్ స్థాయిలో ఆధిపత్యం చలాయిస్తున్నాడు. అలాగే చాలా విషయాల్లో ఇమ్రాన్ ఖాన్‌ను గుర్తుకు తెస్తాడు. ఇమ్రాన్ లాగే అతను ఆట విషయంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పాడు. జట్టును ముందుండి నడిపిస్తాడు" అని రవిశాస్త్రి అన్నాడు.

చిన్నదీ చిక్కేనా!

- **జోరుమీద టీమ్‌ఇండియా**
- **కివీస్‌తో నేటి నుంచే మూడు టీ20ల సిరీస్**
- **అందరి కళ్లూ ధోని, పంత్‌ల మీదే**

మ॥ 12.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో



● భారత్ తన చివరి పది టీ20 సిరీస్‌ల్లో ఒక్కటి కూడా ఓడిపోలేదు.

వెల్లింగ్టన్

గత ఏడాది ఆరంభంలో దక్షిణాఫ్రికా సిరీస్‌తో మొదలుపెట్టి వరుసగా విదేశాల్లో పర్యటిస్తున్న టీమ్‌ఇండియా.. ఈ పరంపరలో తన చివరి సిరీస్‌కు సిద్ధమైంది. న్యూజిలాండ్‌తో మూడు టీ20ల సిరీస్‌ను భారత్ బుధవారమే ఆరంభిస్తోంది. ఇప్పటికే ఐదు వన్డేల సిరీస్‌లో 4-1తో ఘనవిజయం సాధించిన టీమ్‌ఇండియా.. రెట్టించిన ఉత్సాహంతో ఈ చిట్టి ఫార్మాట్‌లోకి బరిలోకి దిగుతోంది. ఫామ్, బలాబలాల పరంగా భారతే ఈ సిరీస్‌లో ఫేవరెట్ అనడంలో సందేహం లేదు. కానీ పొట్టి క్రికెట్లో న్యూజిలాండ్ తక్కువ జట్టేమీ కాదు. పైగా ఈ ఫార్మాట్లో ఎప్పుడు ఎలాంటి ఫలితం వస్తుందో చెప్పడం కష్టం. కచ్చితమైన ఫేవరెట్ అంటూ ఎవరూ ఉండరు! నాలుగో వన్డేలో చిత్తయిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని.. సిరీస్‌లో కొంచెం జాగ్రత్తగా ఆడాల్సిందే. చక్కటి ఫామ్‌లో ఉన్న కివీస్‌కు వన్డే సిరీస్ ఫలితం, ప్రదర్శన మింగుడు పడనిదే. టీ20ల్లో అయినా గట్టిగా పుంజుకుని సిరీస్ గెలవాలని ఆతిథ్య జట్టు పట్టుదలతో ఉంది. ఓపెనర్ గప్తిల్ గాయంతో దూరం కావడం ఆ జట్టుకు ఎదురు దెబ్బే. అయితే కెప్టెన్ విలియమ్సన్, విధ్వంసక ఓపెనర్ మన్రో, సీనియర్ ఆటగాడు రాస్ టేలర్, ఆల్‌రౌండర్ నీషమ్ లాంటి ఆటగాళ్లు సత్తా చాటితే కివీస్.. భారత్‌కు దీటుగా నిలవగలదు.

తుది జట్టులో ముగ్గురు వికెట్ కీపర్లు?: దశాబ్దంన్నర కాలంగా భారత పరిమిత ఓవర్ల క్రికెట్ జట్టులో ధోనీనే వికెట్ కీపర్. గాయంతోనో, విశ్రాంతి కోసమో ధోని దూరమైతే తప్ప అతనే కీపర్‌గా ఉంటున్నాడు. ఐతే ఇప్పుడు ధోని కెరీర్ చరమాంకానికి వచ్చాడు. బహుశా రాబోయే వన్డే ప్రపంచకప్పే అతడి చివరి టోర్నీ కావచ్చు. ధోని వారసుడిగా యువ సంచలనం రిషబ్ పంత్ పేరు వినిపిస్తోంది. ఇప్పటికే టెస్టు జట్టులో అతను పాతుకుపోయాడు. వన్డేల్లో ధోని స్థానం ఖాళీ అవ్వగానే అతను భర్తీ చేయడం లాంఛనంగా కనిపిస్తోంది. ఐతే టెస్టుల్లో పంత్ ఫామ్ చూశాక.. ఒక బ్యాట్స్‌మన్‌గా అయినా అతడిని ప్రపంచకప్‌కు ఎంపిక చేయాలన్న డిమాండ్లు పెరిగాయి. సెలక్టర్లు కూడా ఈ విషయాన్ని సీరియస్‌గానే పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. కివీస్‌తో మూడు టీ20ల సిరీస్‌లో ధోని, పంత్.. ఇద్దరూ తుది జట్టులో ఉండే అవకాశముంది. మరి ఈ ఇద్దరిలో ఎవరెలాంటి ప్రదర్శన చేస్తారన్నది ఆసక్తికరం. మరో వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ దినేశ్ కార్తీక్ ప్రపంచకప్ ప్రణాళికల్లో ఉండటంతో అతడిని కూడా ఈ సిరీస్‌లో ఆడిస్తున్నారు. మొత్తానికి ముగ్గురు వికెట్ కీపర్లు తుది జట్టులో ఉంటే అది అరుదైన విషయమే. చివరి రెండు వన్డేల్లో విఫలమైనప్పటికీ యువ ఆటగాడు శుభ్‌మన్‌కు ఈ సిరీస్‌లోనూ అవకాశం దక్కొచ్చు. విరాట్ లేని నేపథ్యంలో తాత్కాలిక కెప్టెన్ రోహిత్.. తన భాగస్వామి ధావన్‌తో ఎలాంటి ఆరంభాన్నిస్తాడన్నది కీలకం. బౌలింగ్‌లో పేస్ విభాగం కొంత బలహీనంగా ఉంది. భువనేశ్వర్‌తో కలిసి ఖలీల్ అహ్మద్ కొత్త బంతిని పంచుకోనున్నాడు. హార్దిక్ పాండ్య వీరికి సహకారమందించనున్నాడు. స్పిన్‌లో భారత్‌కు కావాల్సినన్ని వనరులున్నాయి. చాహల్, కుల్‌దీప్ మంచి ఫామ్‌లో ఉన్నారు. వీరిలో ఒకరే తుది జట్టులో ఉంటారు. బ్యాటింగ్ కూడా చేయగల కృనాల్ పాండ్య, జాదవ్‌ల్లో ఒకరిని ఎంచుకునే అవకాశముంది.



పంత్

పరుగుల వరదేనా?

తొలి టీ20కి ఆతిథ్యమివ్వనున్న వెస్ట్‌పాక్ స్టేడియం పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలమని అంచనా. చివరగా ఇక్కడ జరిగిన టీ20లో న్యూజిలాండ్ 196 పరుగులు చేసింది. బదులుగా ఇంగ్లాండ్ కూడా 184 పరుగులు చేయగలిగింది. బుధవారం మ్యాచ్‌లోనూ పరుగుల వరద ఖాయమంటున్నారు. ఇరు జట్లలోనూ హిట్టర్లుండటంతో భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశముంది. మ్యాచ్‌కు వర్షం బెడదేమీ లేదు. మంచు కారణంగా బౌలర్లకు బంతిపై పట్టు చిక్కడం కొంచెం ఇబ్బంది కావచ్చు.

12 రోహిత్ నాయకత్వంలో భారత్ ఆడిన టీ20లు. 11 మ్యాచ్‌ల్లో నెగ్గి, ఒక్కటే ఓడింది.

2 న్యూజిలాండ్‌లో టీమ్‌ఇండియా ఆడిన టీ20ల సంఖ్య. రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది.

తుది జట్లు (అంచనా): భారత్: రోహిత్ (కెప్టెన్), ధావన్, శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్, దినేశ్ కార్తీక్, ధోని (వికెట్ కీపర్), హార్దిక్, కేదార్ జాదవ్/కృనాల్, భువనేశ్వర్, ఖలీల్ అహ్మద్, చాహల్/కుల్‌దీప్

న్యూజిలాండ్: విలియమ్సన్ (కెప్టెన్), మన్రో, టిమ్ సీఫర్ట్ (వికెట్ కీపర్), రాస్ టేలర్, నీషమ్, గ్రాండ్‌హోమ్, శాంట్నర్, స్కాట్ కగిలీజిన్, బ్రాస్‌వెల్, లాకీ ఫెర్గూసన్/సౌథీ, ఇష్ సోధి



నువ్వా.. నేనా

రసవత్తరంగా రంజీ ఫైనల్

నాగ్‌పుర్: రంజీ ఫైనల్ రసవత్తరంగా సాగుతోంది. ట్రోఫీ కోసం సౌరాష్ట్ర, విదర్భ నువ్వానేనా అన్నట్టుగా పోరాడుతున్నాయి. మ్యాచ్‌లో మూడు రోజుల ఆట ముగిసినా రెండు జట్లు దాదాపుగా సమాన స్థితిలో ఉన్నాయి. తొలి ఇన్నింగ్స్‌లో సౌరాష్ట్రపై 5 పరుగుల స్వల్ప ఆధిక్యం సంపాదించిన విదర్భ మంగళవారం, మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 55/2తో నిలిచింది. మొత్తంమీద ఆ జట్టు 60 పరుగుల ఆధిక్యంలో ఉంది. అనుభవజ్ఞుడైన వసీం జాఫర్ (5)కు తోడుగా గణేశ్ సతీష్ (24) క్రీజులో ఉన్నాడు. పిచ్ పూర్తిగా స్పిన్‌కు అనుకూలంగా మారుతోన్న నేపథ్యంలో విదర్భ ప్రత్యర్థి ముందు ఎంత లక్ష్యం ఉంచుతుందనేది ఆసక్తికరంగా మారింది. ఓవర్‌నైట్ స్కోరు 158/5తో ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్ర లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ పోరాడడంతో విదర్భ స్కోరుకు దగ్గరగా వచ్చింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ ప్రేరక్ మన్కడ్ (21) త్వరగానే నిష్క్రమించాడు. ఆ తర్వాత స్నెల్ పటేల్ (102) సెంచరీ చేసుకున్న తర్వాత ఔటయ్యాడు. అప్పటికి జట్టు స్కోరు 184/7. ఐతే చివరి నలుగురు బ్యాట్‌మన్ మక్వానా (27), ధర్మేంద్ర సింగ్ జడేజా (23), ఉనద్కత్ (46), సాకరియా (28) విలువైన భాగస్వామ్యాలు చేయడంతో సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 307 పరుగులు చేసింది. సౌరాష్ట్ర వికెట్లలో తొమ్మిది స్పిన్నర్ల ఖాతాలోకే చేరాయి. ఆదిత్య సర్వాతె (5/98), అక్షయ్ వఖారె (4/80) ప్రత్యర్థి జట్టును కట్టడి చేశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన విదర్భ కూడా పరుగులు సాధించేందుకు తీవ్రంగా ఇబ్బందిపడింది. ఓపెనర్లు ఫయాజ్ ఫజల్ (10), సంజయ్ (16)లను లెఫ్టార్మ్ స్పిన్నర్ ధర్మేంద్ర సింగ్ ఔట్ చేశాడు. ఇప్పుడు విదర్భ ఆశలన్నీ జాఫర్ పైనే. అతడు ఎన్ని పరుగులు సాధిస్తాడన్న దానిపైనే విదర్భ అవకాశాలు ఆధారపడివున్నాయి. స్పిన్‌కు దాసోహమంటున్న ఈ పిచ్‌పై 200 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడం కూడా కష్టమే. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 312 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.



కాలికట్ చేతిలో ముంబా ఓటమి

కోచి: ప్రొ వాలీబాల్ లీగ్‌లో కాలికట్ హీరోస్ జోరు కొనసాగుతుంది. ఆ జట్టు ఈ లీగ్‌లో వరుసగా రెండో విజయం సాధించింది. మంగళవారం జరిగిన పోరులో కాలికట్ 15-10, 12-15, 15-13, 14-15, 15-9తో యు ముంబా వాలీని ఓడించింది. కాలికట్ తరపున అజిత్‌పాల్ (16) మరోసారి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. కెప్టెన్ దీపేశ్ కుమార్ (11 పాయింట్లు) కూడా సత్తా చాటాడు. బుధవారం జరిగే పోరులో కోచి బ్లూ స్పైకర్స్.. అహ్మదాబాద్ డిఫెండర్స్‌తో తలపడనుంది.

శ్రీలంక కెప్టెన్ చండిమాల్‌పై వేటు



కొలంబో: నిన్నటిదాకా శ్రీలంక కెప్టెన్‌గా ఉన్న దినేశ్ చండిమాల్ ఇప్పుడు ఏకంగా జట్టులోనే చోటు కోల్పోయాడు. దక్షిణాఫ్రికాలో పర్యటించే శ్రీలంక టెస్టు జట్టులో అతడికి స్థానం దక్కలేదు. ఆస్ట్రేలియా చేతిలో శ్రీలంక ఓడిన రెండు టెస్టుల్లో వరుసగా 5, 0, 15, 4 పరుగులు చేసిన నేపథ్యంలో అతడిపై వేటు పడింది. చండిమాల్ 17 టెస్టుల్లో లంకకు సారథ్యం వహించాడు. ఆఫ్‌స్పిన్నర్ దిల్రువాన్ పెరీరా, మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ రోషన్ సిల్వా కూడా ఉద్వాసనకు గురయ్యారు. నలుగురు కొత్త ఆటగాళ్లు లసిత్ ఎంబుల్‌దెనియా, మహ్మద్ షిరాజ్, ఏంజెలో పెరీరా, ఒషాదా ఫెర్నాండోలకు జట్టులో చోటు దక్కింది. దక్షిణాఫ్రికాతో ఫిబ్రవరి 13న ఆరంభమయ్యే రెండు టెస్టుల సిరీస్‌లో శ్రీలంకకు దిముత్ కరుణరత్నె నాయకత్వం వహిస్తాడు.

రాయుడు పాఠాలు నేర్చుకున్నాడు

వీవీఎస్ లక్ష్మణ్


ఆఖరి వన్డేలో, పరీక్షించే పరిస్థితుల్లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోవడం ద్వారా రోహిత్ శర్మ తన జట్టుకు సవాలు విసరడం సంతోషాన్నిచ్చింది. కివీస్ పేసర్ల ధాటికి హామిల్టన్‌లోలాగే టాప్ ఆర్డర్ బోల్తా కొట్టింది. కానీ ఆ మ్యాచ్‌లోలాగ కాకుండా.. మిడిల్ ఆర్డర్ అద్భుతంగా ఆడడంతో భారత జట్టు కోలుకుంది. అంతకుముందు మ్యాచ్ నుంచి రాయుడు పాఠాలు నేర్చుకున్నట్లు కనిపించాడు. నాలుగో వన్డేలో అతడు ఎదురుదాడికి దిగి 11వ ఓవర్లో వెనుదిరిగాడు. కానీ వెల్లింగ్టన్‌లో తగినంత సమయం తీసుకున్నాడు. పరిస్థితులకు తగినట్లుగా జాగ్రత్తగా ఆడాడు. రాయుడు చాలా తేలికగా గేర్లు మార్చగలడు. నిలదొక్కుకున్నాక అతడు అదే చేశాడు. ఆరంభంలో దెబ్బతిన్నాక విజయవంతం కావడానికి టీమ్ ఇండియా సూత్రం కనిపెట్టింది. ఆఖర్లో చెలరేగేందుకు చేతిలో వికెట్లు ఉంచుకోవడం మంచి ఆలోచన. భారత జట్టు మంచి ఫామ్‌తో టీ20 సిరీస్‌లో అడుగుపెట్టనుంది. కోహ్లి గైర్హాజరీలో దినేశ్ కార్తీక్ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగాలన్నది నా ఉద్దేశం.

సర్ఫ్‌రాజే పాక్ కెప్టెన్!



కరాచి: ప్రపంచకప్‌లో పాల్గొనే పాకిస్థాన్ జట్టుకు సర్ఫ్‌రాజ్ అహ్మదే కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని పాక్ క్రికెట్ బోర్డు తెలిపింది. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో జాతి వివక్ష వ్యాఖ్యలు చేసినందుకు ఐసీసీ అతనిపై నాలుగు వన్డేల నిషేధం విధించిన సంగతి తెలిసిందే. "ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌ను నడిపించేది సర్ఫ్‌రాజే అనే విషయంలో సందేహం లేదు. దానికన్నా ముందు ఆస్ట్రేలియాతో సిరీస్‌లోనూ అతనే కెప్టెన్" అని పీసీబీ ఛైర్మన్ ఎహ్‌సాన్ మణి అన్నాడు.

కెప్టెన్‌నే సస్పెండ్ చేస్తారా?



దుబాయ్: స్లో ఓవర్‌రేట్‌కు కెప్టెన్లను సస్పెండ్ చేసే విధానాన్ని సమీక్షించాలని వెస్టిండీస్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు డేవ్ కామెరాన్.. ఐసీసీని కోరాడు. ఇదే కారణంతో విండీస్ కెప్టెన్ హోల్డర్ సస్పెండైన నేపథ్యంలో అతడు ఇలా అన్నాడు. ఇంగ్లాండ్‌తో రెండో టెస్టులో విండీస్ బౌలర్లు మందకొడిగా బౌలింగ్ చేయడంతో ఐసీసీ.. హోల్డర్‌పై ఓ టెస్టు మ్యాచ్ సస్పెన్షన్ విధించింది. "సిరీస్‌లో కీలక దశలో అలాంటి చర్యలు ఆటకు మేలు చేస్తాయా? విండీస్ ఆటగాళ్ల అద్భుతమైన ఆట వల్ల కాకుండా.. ఐసీసీ తీసుకున్న నిర్ణయం వల్ల ఈ సిరీస్ గుర్తుండిపోతే అది సిగ్గుచేటే" అని కామెరాన్ అన్నాడు.

ఏపీఎస్‌ఆర్టీసీలో సమ్మె లేదు

- 25 శాతం తాత్కాలిక ఫిట్‌మెంటుకు ప్రభుత్వం అంగీకారం
- తర్వాత ఎన్జీవోలు, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులతో సమానంగా అందజేత
- రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక సంఘాల ఐకాసల చర్చలు ఫలప్రదం

ఈనాడు - అమరావతి

ఏపీఎస్‌ఆర్టీసీలో బుధవారంనుంచి జరగాల్సిన నిరవధిక సమ్మెను ఆర్టీసీ కార్మిక సంఘాల ఐకాస విరమించుకుంది. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు ఫలప్రదం కావడంతో సమ్మెకు వెళ్లడం లేదని ప్రకటించింది. రవాణాశాఖ మంత్రి అచ్చెన్నాయుడు నేతృత్వంలో మంగళవారం విజయవాడలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఐకాసతో చర్చలు జరిగాయి. ఆర్టీసీ యాజమాన్యం తరఫున ఛైర్మన్ వర్ల రామయ్య, ఎండీ సురేంద్రబాబు హాజరుకాగా.. ఐకాస నుంచి వై.వి.రావు, పలిశెట్టి దామోదరరావు, సీహెచ్ సుందరయ్య, వి.వరహాలనాయుడు తదితరులు చర్చల్లో పాల్గొన్నారు. సమ్మె డిమాండ్లలో కీలకాంశమైన 50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాల్సిందేనని తొలుత ఐకాస నాయకులు పట్టుబట్టారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అంత మొత్తం సాధ్యపడదంటూ సంస్థ ఆర్థిక పరిస్థితిని మంత్రి వివరించారు. ప్రస్తుతానికి తాత్కాలిక ఫిట్‌మెంటు ఇస్తామని, తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్జీవోలకు ఎంత శాతం ఫిట్‌మెంటు ప్రకటిస్తామో అంతే ఆర్టీసీ కార్మికులకు కూడా వర్తింపజేస్తామని చెప్పారు. తాత్కాలిక ఫిట్‌మెంట్ అయినా 27 శాతానికంటే తగ్గేది లేదంటూ ఒకానొక దశలో ఐకాస నాయకులు పట్టుబట్టారు. ప్రస్తుతానికి 25 శాతం తాత్కాలిక ఫిట్‌మెంటు ఇస్తామని మంత్రి ప్రతిపాదించటంతో ఐకాస నేతలు అంగీకరించారు. ప్రస్తుతం ప్రకటించిన తాత్కాలిక ఫిట్‌మెంట్ వల్ల ఆర్టీసీపై ఏటా అదనంగా రూ.750 కోట్ల భారం పడుతుందని అచ్చెన్నాయుడు చెప్పారు. చర్చల అనంతరం మంత్రి, ఐకాస నాయకులు కలిసి విలేకరులతో మాట్లాడారు.



మంత్రి అచ్చెన్నాయుడు, ఆర్టీసీ యాజమాన్య ప్రతినిధులతో కార్మిక నేతలు

- ✦ గత వేతన సవరణ బకాయిలు రూ.420 కోట్లు, 2015 ఏప్రిల్ ఒకటినాటికి జరగాల్సిన వేతన సవరణకు సంబంధించిన బకాయిలన్నీ కలిపి మూడు, నాలుగు విడతల్లో 2020 జూన్‌లోగా చెల్లించాలని నిర్ణయం. ఈ ఉగాది నాటికి తొలి విడత చెల్లించేందుకు అంగీకారం.
- ✦ ప్రకటించిన ఫిట్‌మెంటును ఏప్రిల్ ఒకటో తేదీన చెల్లించే మార్చి నెల వేతనంనుంచి వర్తింపజేస్తారు.
- ✦ పల్లెవెలుగు బస్సులపై వస్తున్న నష్టాల్లో ప్రభుత్వం ఎంతవరకు భరించగలదో అంచనా వేసి ఆ మేరకు సొమ్మును ఆర్టీసీకి ప్రభుత్వమే చెల్లిస్తుంది.
- ✦ బాగా నష్టాలు వస్తున్న సర్వీసులపై మోటారు వాహనాల పన్ను(ఎంవీ ట్యాక్సు) మినహాయించే ప్రతిపాదనపై సీఎంతో మాట్లాడి తుది నిర్ణయం.
- ✦ ఆర్టీసీ కార్మికుల కుటుంబసభ్యులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా.
- ✦ ఆర్టీసీకి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించే అంశంపై సీఎంతో మాట్లాడి నిర్ణయం.

నేడు విజయోత్సవాలు

ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతన సవరణ ఇప్పించిన ఘనత ఎంప్లాయీస్ యూనియన్, ఐకాసదే. ఐకాసను విమర్శించే నైతిక హక్కు నేషనల్ మజ్దూర్ యూనియన్‌కు లేదు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, యూనిట్లలో ఐకాస ఆధ్వర్యంలో విజయోత్సవాలు చేపడతాం.

– ఆర్టీసీ కార్మిక సంఘాల ఐకాస కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు
ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు వై.వి.రావు

బ్లాక్‌డే పాటిస్తాం

25 శాతం ఫిట్‌మెంటుకు అంగీకరించి ఐకాస పేరిట ఎంప్లాయీస్ యూనియన్ కార్మికులకు తీరని ద్రోహం చేసింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై ఎలాంటి ప్రస్తావన లేకుండానే చర్చలను ముగించింది. దీనికి నిరసనగా బుధవారం బ్లాక్‌డే పాటిస్తాం. అన్ని డిపోల్లో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో ధర్నాలు చేస్తారు.

– చల్లా చంద్రయ్య, శ్రీనివాసరావు, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

ఏపీకి రూ.16,989 కోట్లు.. తెలంగాణకు రూ.19,588 కోట్లు

ఎస్‌జీఎస్‌టీ వసూళ్లలో ఆరో స్థానంలో తెలంగాణ, తొమ్మిదో స్థానంలో ఏపీ

ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్‌జీఎస్‌టీ వసూళ్లలో తెలంగాణ ఆరో స్థానంలో, ఏపీ తొమ్మిదో స్థానంలో నిలిచాయి. 2018-19 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఎస్‌జీఎస్‌టీ కింద రూ.4.26 లక్షల కోట్లు వసూలుకాగా.. అందులో తెలంగాణకు 19,588 కోట్లు (4.58%), ఏపీకి రూ.16,989 కోట్లు (3.97%) వచ్చింది. ఈ పది నెలల్లో మహారాష్ట్ర ఖజానాకు అత్యధికంగా రూ.70,792 కోట్లు చేరింది. అన్ని రాష్ట్రాల ఆదాయంలో 16.58% ఈ ఒక్క రాష్ట్రానికే దక్కుతోంది. ఆ తర్వాతి స్థానాల్లో రాజస్థాన్ (రూ.38 వేల కోట్లు), కర్ణాటక (రూ.35 వేల కోట్లు), తమిళనాడు (రూ.34 వేల కోట్లు), పశ్చిమబెంగాల్ (రూ.22 వేల కోట్లు), తెలంగాణలు ఉన్నాయి. జీఎస్‌టీ ప్రారంభమైన తర్వాత గత 18 నెలల్లో సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ, ఐజీఎస్‌టీ కింద నెలకు సగటున రూ.94.03 వేల కోట్ల చొప్పున రూ.16,92,624 కోట్లు వసూలైంది. ఇదే సమయంలో తెలంగాణకు నెలకు రూ.1,814 కోట్ల చొప్పున ఎస్‌జీఎస్‌టీ రూపంలో రూ.32,661 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు సగటున రూ.1,545 కోట్ల చొప్పున మొత్తం రూ.27,815 కోట్లు వచ్చింది. కేంద్రం నెలకు రూ.5,354 కోట్ల చొప్పున ఇప్పటివరకు అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకూ కలిపి రూ.96,380 కోట్ల పరిహారం చెల్లించింది. మంగళవారం రాజ్యసభలో వైకాపా సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివప్రతాప్ శుక్లా ఈ మేరకు సమాచారం ఇచ్చారు.

గిరిజన వర్సిటీ ఏర్పాటులో జాప్యం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. మంగళవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో తెదేపా ఎమ్మెల్సీ గుమ్మడి సంధ్యారాణి వేసిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ ఇటీవలే కేంద్ర విశ్వవిద్యాలయాల (సవరణ) బిల్లు-2018ను పార్లమెంటులో ప్రవేశపెట్టినట్లు కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలియజేసిందని పేర్కొన్నారు. భాజపా సభ్యుడు సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో ప్రహారీలు నిర్మించి.. గిరిజన విశ్వవిద్యాలయానికి చెందిన భూమి ఇది అని బోర్డు పెడితే కేంద్రం నిధులు విడుదల చేస్తుందని చెప్పారు. పీడీఎఫ్ సభ్యుడు విటపు బాలసుబ్రమణ్యం తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ గిరిజన విద్యార్థులపై చిన్నచూపు తగదన్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో శాశ్వత ప్రాతిపదికన అధ్యాపకులను నియమించే అంశంపై ఎమ్మెల్సీ డా.ఏ.ఎస్.రామకృష్ణ వేసిన ప్రశ్నకు మంత్రి గంటా సమాధానం ఇస్తూ న్యాయస్థానంలో పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి తీర్పునకు లోబడి ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు.

- ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గంలో జాతీయ పెట్టుబడి, తయారీ జోన్ (నిమ్జ్) ఏర్పాటుకు 2015లో తుది ఆమోదం తెలిపిన కేంద్రం నిధులు కేటాయించడం లేదని తెదేపా ఎమ్మెల్సీ కరణం బలరామకృష్ణమూర్తి వేసిన ప్రశ్నకు పరిశ్రమలశాఖ మంత్రి ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి బదులిచ్చారు.

సభాహక్కుల ఉల్లంఘన కింద ఎంపీ జీవీఎల్‌పై చర్య తీసుకోండి

తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ డిమాండ్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావుపై సభాహక్కుల ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ కోరారు. మంగళవారం ఉదయం శాసనసభలో వ్యవసాయంపై స్వల్పకాలిక చర్చ అనంతరం ఆయన ఈ విషయాన్ని లేవనెత్తారు. 'అసెంబ్లీలో భాజపా శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు, మాణిక్యాలరావుతో సీఎం చంద్రబాబు ప్రవర్తించిన తీరు చూస్తే పిచ్చి పీక్స్‌కు చేరినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ రౌడీలా ప్రవర్తించారు.' అంటూ ఈ నెల 2వ తేదీన జీవీఎల్ ట్విటర్ ద్వారా వ్యాఖ్యానించారని శ్రావణ్‌కుమార్ వివరించారు. తన వ్యాఖ్యల ద్వారా ఆయన సీఎం చంద్రబాబునే కాదు శాసన వ్యవస్థనే అవమానించారని శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. దీనికి సంబంధించి నోటీసు అందిందని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని సభాపతి కోడెల శివప్రసాదరావు ప్రకటించారు.

అవినీతి కప్పిపుచ్చుకొనేందుకే సోదాలు వ్యతిరేకిస్తున్నారు: జీవీఎల్

ఈనాడు, దిల్లీ: అవినీతి, అక్రమాలు కప్పిపుచ్చుకొనేందుకే ఏపీ సీఎం చంద్రబాబు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ సీబీఐ, ఈడీ, ఐటీ సోదాలను వ్యతిరేకిస్తున్నారని భాజపా ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. మంగళవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పుతో చంద్రబాబు, మమతా బుద్ధి తెచ్చుకోవాలన్నారు. అసెంబ్లీలో భాజపా సభ్యులను తిరగనివ్వమని ఏపీ సీఎం బెదిరించారని, ఇది అసెంబ్లీ నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో చెక్కులు ఇస్తామని ఏపీ ప్రజల్ని మోసం చేస్తున్నారని జీవీఎల్ ఆరోపించారు.

సభ ఆమోదానికి ఏడు బిల్లులు

ఈనాడు, అమరావతి: శాసనసభలో మంగళవారం ఏడు బిల్లులను ప్రవేశపెట్టారు. శ్రీ సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పంచగ్రామాలు(గృహాల, ఇంటిస్థలాల ఆక్రమణల క్రమబద్ధీకరణ), ఆంధ్రప్రదేశ్‌లోని చుక్కల భూముల (పునఃపరిష్కార దస్త్రంలో ప్రస్తుత పరిస్థితికి అనుగుణంగా మార్పులు, సవరణ)బిల్లు, ఏపీ అసైన్డ్ భూముల (బదిలీల నిషేధ (సవరణ)) బిల్లు, శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ విశ్వవిద్యాలయ సవరణ బిల్లు, కర్మాగారాల బిల్లు, పారిశ్రామిక వివాదాల బిల్లు, కార్మిక శాసనాల బిల్లులను సభాపతి ఆమోదం మేరకు ఆయా శాఖల మంత్రులు సభలో ప్రతిపాదించారు.

రామ్‌కో సిమెంట్స్‌కు 500 ఎకరాలు

ఈనాడు, అమరావతి: కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల మండలం కాల్వతల గ్రామంలో 500 ఎకరాలను రామ్‌కో సిమెంట్స్ సంస్థకు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రీన్‌ఫీల్డ్ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకుగాను ఎకరా ఒక్కింటికి రూ.2 లక్షల చొప్పున షరతులతో సంబంధిత భూమిని కేటాయిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రత్యేకహోదా ఆంధ్రుల హక్కు

- జంతర్ మంతర్ దీక్షలో ఎంపీ మాగంటి బాబు
- సంఘీభావం తెలిపిన తెదేపా ఎంపీలు



దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మంగళవారం 'ధర్మ పోరాట దీక్ష'లో మాట్లాడుతున్న తెదేపా ఎంపీ మాగంటి బాబు, వెనుక పార్టీ నాయకులు

ఈనాడు, దిల్లీ: 'ప్రత్యేక హోదా- ఆంధ్రుల హక్కు' నినాదాలతో జంతర్‌మంతర్ హోరెత్తింది. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తెదేపా ఎంపీ మాగంటి బాబు తన పుట్టిన రోజును పురస్కరించుకొని మంగళవారం దిల్లీలోని జంతర్ మంతర్‌లో ధర్మ పోరాట దీక్ష నిర్వహించారు. ఏలూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి తరలి వచ్చిన కార్యకర్తల నినాదాలతో ప్రాంగణం హోరెత్తింది. తెదేపా లోక్‌సభ, రాజ్యసభ సభ్యులంతా వచ్చి సంఘీభావం తెలిపారు. ఇదే ఉత్సాహంతో చంద్రబాబును మరోసారి ఎన్నుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మాగంటి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ తిరుమల శ్రీవారి సాక్షిగా ఇచ్చిన హామీలు కూడా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో తిరుపతిలో హామీలిచ్చి అమలు చేయని వారి గతే ప్రధాని మోదీకి కూడా పడుతుందన్నారు.

చంద్రబాబు ఆశ అడియాశే: జేసీ

తెదేపా ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాహుల్‌ను ప్రధానిని చేయాలన్న సీఎం చంద్రబాబు ఆశ అడియాశ అవుతుందన్నారు. ప్రత్యేక హోదా ఇస్తారని రాహుల్ వెంట చంద్రబాబు పడుతున్నారని చెప్పారు. చంద్రబాబు బతికి ఉన్నన్ని రోజులు ఏపీ ప్రజలకు సంక్షేమం అందించే ప్రభుత్వం రాష్ట్రంలో ఉంటుందని పేర్కొన్నారు. కుమారుడిని ప్రధానిని చేయడానికి రాష్ట్రాన్ని ముక్కలు చేసిన సోనియాగాంధీయే చివరకు ముక్కలైందని జేసీ అన్నారు. మోదీ ఫ్యాక్షన్ లీడర్‌లా వ్యవహరిస్తున్నారన్నారు. మరోవంక కేంద్రం వైఖరిని నిరసిస్తూ పార్లమెంటు ప్రాంగణంలోని గాంధీ విగ్రహం, గేటు నంబరు 1 వద్ద తెదేపా ఎంపీల ఆందోళన మంగళవారమూ కొనసాగింది.

కేంద్ర బడ్జెట్లో న్యాయం జరగలేదు: మురళీమోహన్

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయడంలో కేంద్రం విఫలమైందని, ఎన్డీయే ప్రభుత్వ చివరి బడ్జెట్‌లోనైనా న్యాయం జరుగుతుందని చూసిన రాష్ట్రానికి ఎలాంటి ఫలితం దక్కలేదని తెదేపా ఎంపీ మాగంటి మురళీమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా ఇవ్వకపోవడంపై రాష్ట్ర ప్రజలు అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. మంగళవారం లోక్‌సభ శూన్యగంటలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక హోదా కోసం ప్రధాని మోదీని, కేంద్ర మంత్రులను ఏపీ సీఎం చంద్రబాబు పలుమార్లు కలిసి అభ్యర్థించారని, విభజన హామీలు అమలు చేయాల్సిందిగా కోరారని గుర్తుచేశారు. కేంద్రం తీరుతో రాష్ట్ర ప్రజలు ఎంతో నిరుత్సాహం చెందారన్నారు.

బోయలను ఎస్టీల్లో చేర్చాలి: ఆంధ్రప్రదేశ్‌లోని బోయలను ఎస్టీల్లో చేర్చాలని కర్నూలు ఎంపీ బుట్టా రేణుక డిమాండు చేశారు. మంగళవారం లోక్‌సభ శూన్యగంటలో ఆమె మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బోయలు కొన్ని రాష్ట్రాల్లో ఎస్సీలుగా, మరికొన్ని రాష్ట్రాల్లో ఎస్టీలుగా గుర్తిస్తున్నారని, ఏపీలో మాత్రం వారిని ఓబీసీలుగా పరిగణిస్తున్నారని తెలిపారు.

సీఎంను కలిసిన కేఈ సోదరులు

వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లపై స్పష్టత కోసమే!

ఈనాడు, అమరావతి: కర్నూలు జిల్లాలో వచ్చే ఎన్నికల్లో తమ కుటుంబానికి కేటాయించే శాసనసభ టిక్కెట్లపై స్పష్టత ఇవ్వాల్సిందిగా కోరేందుకు ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి తన సోదరులను వెంటబెట్టుకుని మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. అప్పటికే కోల్‌కతా వెళ్లే హడావుడిలో ఉన్న ముఖ్యమంత్రి.. బుధవారం మాట్లాడదామని చెప్పి పంపించారు. రాజకీయంగా తమకు ప్రత్యర్థులైన మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి తెదేపాలోకి రావడంపై కేఈ వర్గం అంత సుముఖంగా లేదు. సూర్యప్రకాశ్‌రెడ్డి తనకు కర్నూలు ఎంపీ టిక్కెట్‌తో పాటు తన భార్యకు డోన్ అసెంబ్లీ టిక్కెట్ అడుగుతున్నట్టు సమాచారం. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని.. తన కుమారుడికి పత్తికొండ, తన సోదరుడు ప్రతాప్‌కు డోన్ టిక్కెట్ ఇవ్వాలని కృష్ణమూర్తి అడుగుతున్నారు. గత ఎన్నికల్లోనూ డోన్ నుంచి కేఈ ప్రతాప్ పోటీ చేశారు. అదే టిక్కెటును ఇప్పుడు కోట్ల వర్గం కోరుతుండటంతో ముఖ్యమంత్రి వద్దే దీనిపై తేల్చుకోవాలని కేఈ సోదరులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోరేందుకు వెళ్లామని, ఆయన బుధవారం రమ్మని చెప్పారని కేఈ కృష్ణమూర్తి విలేకరులకు తెలిపారు.

యువతను నాయకులుగా మలచడమే లక్ష్యం: పవన్

ఈనాడు, అమరావతి: సమాజానికి ఏదైనా చేయాలన్న తపన ఉన్న యువతను ప్రభావశీలమైన, శక్తిమంతమైన నాయకులుగా మలిచి రాబోయే తరాలకు అందించాలన్న లక్ష్యంతో జనసేన పార్టీ ప్రెసిడెంట్స్ లీడర్‌షిప్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో జనసేన కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రెసిడెంట్స్ లీడర్‌షిప్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. నర్సీపట్నానికి చెందిన లాలం జోగినాయుడిని కార్యక్రమ కన్వీనర్‌గా నియమించారు. మరో ఐదుగురు సభ్యులకు సమన్వయ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ పార్టీకి చెందిన అన్ని విభాగాల్లో యువ నాయకత్వాన్ని తీసుకొచ్చేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు కొత్త ఎస్పీలు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో నలుగురు నాన్ క్యాడర్ ఎస్పీలను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. వీరిలో ఇద్దరిని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు ఎస్పీలుగా నియమించింది. ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప వద్ద ఓఎస్డీగా పనిచేస్తున్న అడ్డాల వెంకటరత్నంను శ్రీకాకుళం ఎస్పీగా, విశాఖ కమిషనరేట్‌లో నేర విభాగం డీసీపీగా పనిచేస్తున్న ఏ.ఆర్.దామోదర్‌ను విజయనగరం ఎస్పీగా నియమించింది. విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంటు విభాగం విశాఖపట్నం, విజయవాడ ఆర్‌వీఈవోలుగా పనిచేస్తున్న డొక్కా కోటేశ్వరరావు, వి.హర్షవర్ధన్‌లను విజయవాడ నగర పోలీసు కమిషనరేట్‌లో పరిపాలన, శాంతిభద్రతల డీసీపీలుగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

సీఆర్ఐఎస్ ప్రాంతీయ జీఎంగా రవిప్రసాద్ పాడి

ఆదేశాలు జారీ చేసిన రైల్వే బోర్డు



ఈనాడు, హైదరాబాద్: దక్షిణమధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ ఆపరేషన్ మేనేజర్ రవి ప్రసాద్ పాడి కీలకమైన సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టం (సీఆర్ఐఎస్) ప్రాంతీయ జనరల్ మేనేజర్ (ఆర్‌జీఎం)గా పదోన్నతిపై నియమితులయ్యారు. ఈ మేరకు రైల్వే బోర్డు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్‌కోస్టు రైల్వే, సౌత్ ఈస్టు సెంట్రల్ రైల్వే పరిధిలో ఆయన సీఆర్ఐఎస్ కార్యకలాపాలను పర్యవేక్షించనున్నారు. ఈ సంస్థ ప్రయాణికుల ఆన్‌లైన్ రైల్వే టిక్కెటింగ్‌తోపాటు ఆన్‌లైన్ వ్యవస్థలో పరిశోధన చేసి సరికొత్త విధానాలను ప్రవేశపెడుతుంది. రైల్వేల పరంగా ఎంతో కీలకమైన సీఆర్ఐఎస్‌లో దక్షిణమధ్య రైల్వే అధికారికి కీలక బాధ్యతలు అప్పగించారు. భారతీయ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ 1998 బ్యాచ్‌కు చెందిన రవి ప్రసాద్ గతంలో గుంటూరు, నాందేడ్ డివిజన్లలో సీనియర్ డివిజనల్ ఆపరేషన్ మేనేజర్‌గా, దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ విజిలెన్సు అధికారిగా పని చేశారు.

సొంత రాష్ట్రానికి బదిలీ చేయండి

- తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్ర ఉపాధ్యాయుల దీక్ష


అలంకార్ కూడలి (విజయవాడ), న్యూస్‌టుడే: తెలంగాణలో పని చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులను వెంటనే ఆంధ్ర రాష్ట్రానికి బదిలీ అవకాశం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు డిమాండ్ చేశారు. నాన్ లోకల్ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఉపాధ్యాయులు విజయవాడ ధర్నాచౌక్‌లో మంగళవారం నుంచి న్యాయ పోరాట దీక్ష పేరిట ఐదు రోజుల నిరసన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆంధ్ర పౌరులైన ఉపాధ్యాయులు పలు ఇబ్బందులు పడుతూ తెలంగాణలో విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణకు వెళ్లేందుకు ఆంధ్రా కేడర్‌లో పనిచేస్తున్న 200మంది ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారని, అక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సినవారు 426 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఆర్థిక భారమనే అంశం కాకుండా మేధావి వర్గానికి ఇచ్చే గౌరవంగా భావించి, రెండు రాష్ట్రాల ఉద్యోగులను సర్దుబాటు చేసుకుని ఒక్క పర్యాయం అంతర్‌రాష్ట్ర బదిలీలకు అవకాశం ఇవ్వాలని కోరారు. సంఘం అధ్యక్షుడు మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు రామునాయుడు, కోశాధికారి ఉమామహేష్, సభ్యులు సూర్యనారాయణ, జి.మాధవరావు, ఉపాధ్యాయినులు లక్ష్మి, ఇందిరా, లావణ్య, ధనలక్ష్మి, జానకి తదితరులు దీక్షలో పాల్గొన్నారు.



దీక్ష చేపట్టిన ఉపాధ్యాయులకు మద్దతుగా ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

పోలీసుల ముందడుగు



'అంతాపోయిన తర్వాత పోలీసులు వస్తారు!'.. అనేది పాత సినిమా డైలాగ్ మరికొత్త డైలాగ్ ఏంటో? 'నేరం జరగక ముందే పోలీసులు వస్తారు!' అదెలా? వాళ్లకు జరగబోయే నేరాల గురించి ముందే తెలిసిపోతుందా! నిజమే నేరం జరిగే ప్రాంతం, సమయం కూడా ముందుగానే తెలిసిపోతాయి. ఇలా తెలిసిపోవడాన్నే 'ప్రిడెక్టివ్ పోలీసింగ్' అంటారు. ఇదెలా సాధ్యం అనుకుంటున్నారా? కృత్రిమమేధ, కంప్యూటర్ అల్గారిథమ్స్ కలిపి చేస్తున్న మహత్మ్యమే ఇది..

అయిదో సింహం.. అల్గారిథమ్స్


ఫలానా ప్రాంతంలో నేరం జరిగింది అని సమాచారం అందగానే పోలీసులు వెంటనే అక్కడకు వెళ్లి ప్రాథమిక విచారణ చేస్తారు. ముఖ్యమైన ఆధారాలు, సాక్ష్యాలు సేకరించి పెట్టుకుంటారు. అన్నింటికీ మించి తమకున్న అనుభవంతో నేరం జరిగిన తీరు ఆధారంగా నేరస్తుడు ఎవరై ఉంటాడనే విషయంలో ఒక అంచనాకు వస్తారు. ఆ అనుభవం, సాక్ష్యాలు, అంచనాలు నేరస్తుడిని ఒక్కోసారి ఇట్టే పట్టుకునేలా చేస్తాయి. ఒక్కోసారి ఆ అనుభవం కూడా పనికిరాక పోవచ్చు. అందుకే ఏళ్లు తరబడినా చిక్కుముడి వీడకుండా మిస్టరీగానే ఉండిపోతాయి. ఇలా కోకొల్లలుగా పేరుకుపోయిన కేసుల సంగతేంటి? ఎప్పటికైనా వాటికి ఓ పరిష్కారం ఉంటుందా, ఉండదా? అసలు నేరం జరిగేంతవరకూ ఆగకుండా ముందుగానే పసికట్టేస్తే! ఈ విషయంలో బ్రిటన్, అమెరికా పోలీసులు కంప్యూటర్ అల్గారిథమ్స్ సాయం తీసుకుని పెద్దమార్పుకే శ్రీకారం చుడుతున్నారు. నేరం జరిగిన తర్వాత కాకుండా జరక్కముందే పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకునేలా ప్రత్యేకమైన 'ప్రిడెక్టివ్ పోలీసింగ్' విధానాన్ని అనుసరిస్తున్నారు.

బ్రిటన్ వంటి దేశాల్లో...

బ్రిటన్ పోలీసులు 20 ప్రాంతాల్లో ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో ఆత్మహత్యల శాతం సైతం తగ్గిందట. శిక్షల ఖరారులో న్యాయమూర్తులు తమ వ్యక్తిగత అభిప్రాయాలని, మనస్తత్వవేత్తలని నమ్మడం కాకుండా ఆల్గారిథమ్స్ ఇచ్చిన స్కోర్ ఆధారంగా శిక్షలు ఖరారు చేసే విధానం కూడా ఇక్కడ అమల్లోకి తీసుకొస్తున్నారు. పాత రికార్డులని పరిగణలోకి తీసుకోవడం వల్ల కొన్ని జాతులు లేదా ప్రాంతాలు ఈ విధానంలో ఎక్కువగా నష్టపోయే అవకాశం ఉందనేది నిపుణుల వాదన.

ప్రిడెక్టివ్ పోలీసింగ్ అంటే..

నేరం ఎక్కడ జరగబోతోంది?, ఎన్నింటికి జరగబోతోంది..?, ఏ తరహా నేరం? వంటి వివరాలని ముందే తెలుసుకోవడాన్నే ప్రిడెక్టివ్ పోలీసింగ్ అంటారు. బ్రిటన్‌లోని కెంట్ పోలీసులు ఈ విధానాన్ని ఇప్పటికే పాటించి నేరాలని అదుపులో ఉంచడం, తగ్గించడంలో విజయవంతం అయ్యారు. గత కొన్నేళ్లలో జరిగిన నేరాలు, వాటికి సంబంధించి పోలీసు రికార్డులు, ఇతర అంశాలను ఆధారంగా చేసుకుని రూపొందించిన ప్రత్యేకమైన 'ప్రెడ్‌పోల్' సాఫ్ట్‌వేర్‌ని అక్కడి పోలీసులు వాడుతున్నారు. గతంలో పోలీసులు సేకరించిన నేరాల సమాచారంతోపాటు, నిఘాడ్రోన్‌లు, రహస్య కెమెరాలు, ఫేస్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్‌లు అందించిన సమాచారం, శాటిలైట్ సమాచారాలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుని విశ్లేషించుకుంటూ నేషనల్ సైన్స్ ఫౌండేషన్, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ఈ ప్రెడ్‌పోల్ సాఫ్ట్‌వేర్‌ని రూపొందించాయి. ఈ సాఫ్ట్‌వేర్ నేరం జరగబోయే ప్రాంతాలని గూగుల్ మాప్స్‌లో డిజిటల్ 'హాట్‌స్పాట్'ల రూపంలో పోలీసులకు ముందుగానే తెలియచేస్తుంది.



పోలీసుల చేతిలోని స్మార్ట్‌ఫోన్లలో బీప్ బీప్ మనే అలెర్టులు. తెరపై గూగుల్‌మాప్స్.. ఆపై ఎర్రగా బ్లాకుల మాదిరిగా వెలిగి ఆరుతున్న సూచనలు. దీని అర్థం ఎక్కడో ఏదో నేరం జరగబోతుందని. ఇలా వెలిగీ ఆరే ప్రాంతాలనే హాట్ స్పాట్స్ అంటారు. ఇవి నేరం జరిగే ప్రాంతాన్ని, సమయాన్ని కూడా కచ్చితంగా చెబుతాయి. ఆ జరగబోయే నేరం దోపిడీనా, దొమ్మీనా వంటి వివరాలు కూడా ఇస్తాయి. దాంతో పోలీసులు తక్షణం స్పందించి నేరానికి అడ్డుకట్ట వేస్తారు.

హాట్‌స్పాట్స్‌ని ఎలా రూపొందిస్తారు: గతంలో నేరపూరిత ప్రాంతాలుగా గుర్తించినవి, నేరస్తుల వివరాలు, ఇటీవలే బెయిల్‌పై విడుదలయి బయటకు వెళ్లిన వారి వివరాలు, నేరస్వభావులతో స్నేహం చేసేవాళ్లు, నేర చరిత్ర ఉన్నవారి ఇరుగుపొరుగు ఇళ్లు, పోలీసులు తమకున్న వ్యక్తిగత నెట్‌వర్క్‌లు, చివరికి గాలివార్తలు వంటి అన్ని విషయాలని సమగ్రంగా కృత్రిమ మేధ సాయంతో విశ్లేషిస్తారు. ఆ తర్వాత ఈ హాట్ స్పాట్స్ గుర్తించి పెడతారు.

అసలు నేరం నిరూపితం అవుతుందా లేదా?

జరగబోయే నేరాల గురించి పక్కన పెడితే జరిగిన నేరాల్లో ఎన్నింటిని ఛేదించడానికి అవకాశం ఉంది అనే దిశగా ఈ కృత్రిమమేధ లేదా ఆల్గారిథమ్స్‌ని పోలీసులు సమర్థంగా వాడుకుంటున్నారు. ఒక కేసులో నేరం నిరూపితం అవుతుందా లేదా అనే విషయాన్ని అల్గారిథమ్స్ ఎనిమిది విషయాల ఆధారంగా నిర్ధరిస్తాయి. సాక్ష్యాలు, సీసీటీవీ ఫుటేజీలు, నేరారోపణ ఎదుర్కొంటున్న వ్యక్తుల మనస్తత్వాలు, వాళ్ల స్నేహితుల వివరాల ఆధారణంగా కేంబ్రిడ్జి యూనివర్సిటీలోని కెంట్‌మెక్‌ఫెడ్జ్ అనే శాస్త్రవేత్త రూపొందించిన విధానమే ఈబిట్(ఎవిడెన్స్ బేస్డ్ ఇన్వెస్టిగేషన్ టూల్). దీనికి కృత్రిమమేధని జోడించి కేసులని ఛేదించాలని చూస్తున్నారు. ఈ విధానంలో పోలీసులు దగ్గర ఉన్న ఆధారాలు కేసు విచారణకు ఉపయోగపడతాయా? లేదా కేసుని ఛేధించడం అసాధ్యమా వంటి విషయాలని కృత్రిమ మేధ చెప్పేస్తుంది. దీనివల్ల సమయం, డబ్బు కూడా ఆదా అవుతాయని అంటున్నారు నిపుణులు.

దిల్లీ పోలీసులు సైతం: దిల్లీపోలీసులు ఇస్రోతో కలిసి సీమ్యాప్స్(క్రైమ్ మ్యాప్స్)ని రూపొందించారు. శాటిలైట్ పరిజ్ఞానం వల్ల కేసు వివరాలని, ఆధారాలని సంఘటనా స్థలం నుంచి పోలీస్‌స్టేషన్‌కి పట్టుకెళ్లి తీరిగ్గా విశ్లేషించి నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదు. అక్కడికక్కడే కేసు నమోదు అయి నేర సమాచారాన్ని మొత్తాన్ని డిజిటల్ రూపంలో సేకరించి, దాచిపెడుతుంది.

అలర్ట్

ప్లస్.. మైనస్సే

డేటా బ్యాకప్ ఎలా?

ఫేస్‌బుక్‌కి పోటీగా 2011లో గూగుల్ పరిచయం చేసిన గూగుల్ ప్లస్ కథ కంచికి చేరింది. ఇకపై ఎవరూ కొత్త ప్రొఫైల్‌ని క్రియేట్ చేయలేరు. ఇప్పటికే సభ్యులైనవారు ఏప్రిల్ 2 నాటికల్లా 'ప్లస్'లో అప్‌లోడ్ చేసిన డేటాని బ్యాకప్ తీసుకోవాలి. లేకుంటే ఇక ఎప్పటికీ గూగుల్ ప్లస్‌లోని యూజర్ డేటా, పేజెస్‌ని తిరిగి పొందడం సాధ్యం కాదు. ఎందుకంటే.. 'ప్లస్' సేవల్ని గూగుల్ మూసేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. మరి, మీ మొత్తం డేటాని (ఫొటోలు, వీడియోలు, పేజీలు) బ్యాకప్ తీసుకోవడం ఎలా?



- గూగుల్ ప్లస్‌లోకి లాగిన్ అవ్వగానే అలర్ట్ కనిపిస్తుంది. దాంట్లోని 'లెర్న్ మోర్'పై క్లిక్ చేయండి.
- కొత్త ట్యాబ్‌లో ప్లస్ సర్వీసు 'షట్‌డౌన్'కి సంబంధించిన అన్ని వివరాలు కనిపిస్తాయి.
- వాటిల్లో 'డౌన్‌లోడ్ అండ్ సేవ్' పేర్లతో హైలైట్ అయ్యి లింక్ కనిపిస్తుంది. క్లిక్ చేయగానే మరో పేజీ ఓపెన్ అవుతుంది. దాంట్లో 'డౌన్‌లోడ్ యువర్ డేటా' కనిపిస్తుంది.
- లింక్‌పై క్లిక్ చేస్తే మొత్తం డేటా కలెక్ట్ అవుతుంది. తర్వాత నెక్స్ట్‌పై క్లిక్ చేసి డేటాని జిఫ్ ఫైల్ రూపంలో పొందొచ్చు.
- మెయిల్ రూపంలో డౌన్‌లోడ్ కాపీని పొందొచ్చు.

ఆడేద్దాం!

నత్తకి నడక నేర్పండి


నెమ్మదిగా నడిచే నత్తని మెరుపు వేగంతో జారేలా చేసే ఆట ఒకటుంది తెలుసా? అదే Snail Ride. పొడవైన కాండంపై నత్త నడక సాగుతుంది. ఎదురుగా ఎన్నో అవాంతరాలు. అన్నింటినీ దాటుకుని మెరుపు వేగంతో నత్త నడక సాగాలంటే? మీ సాయం కావాలి. ఒక చేత్తోనే సులువుగా ఆడేలా గేమ్‌ని రూపొందించారు. దారి పొడవునా ఎదురయ్యే బబుల్స్, పవర్ బూస్టర్స్‌ని తీసుకుంటూ వెళ్లాలి. ఎదురుగా వచ్చే పెంకుపురుగులు, పదునైన మేకులు చాలా ప్రమాదకరం. వాటి నుంచి తప్పించడమే ఓ సవాల్.



☛ డౌన్‌లోడ్ లింక్: https://goo.gl/uA9QUe

ట్రెండీ ఇయర్‌ఫోన్

వచ్చేవన్నీ బ్లూటూత్ ఇయర్‌ఫోన్‌లే. మెడకు చుట్టుకుని పని చేసేవి కొన్నియితే.. చెవుల్లో ఇయర్‌బడ్స్‌లా దూరి మాటలు, పాటల్ని చేరవేసేవి ఇంకొన్ని. ఈ నేపథ్యంలో సరికొత్త లుక్‌తో 'పీట్రాన్ టాన్‌జెంట్ ప్రో' అందుబాటులోకి వచ్చింది. సౌకర్యంగా మెడకు చుట్టుకుని ఇయర్‌ఫోన్స్‌ని నిత్యం అందుబాటులోకి ఉంచుతుంది. దీంతో మీరు నడుస్తున్నా.. జాగింగ్ చేస్తున్నా.. ప్రయాణాల్లో ఉన్నా హాయిగా ఫోన్ కాల్స్ మాట్లాడొచ్చు. పాటలు వినొచ్చు. అయస్కాంతంతో ఇయర్‌ఫోన్‌లు రెండూ అతుక్కుంటాయి. దీంతో బ్లూటూత్ ఇయర్‌ఫోన్‌ల సెట్ మొత్తం మెడపై నక్లెస్ మాదిరి కనిపిస్తుంది. పలు రకాల కంట్రోల్ బటన్‌లతో (ప్లే, పాజ్, వాల్యూమ్, నెక్స్ట్...) వాడుకునే వీలుంది. అంతేకాదు.. మ్యూజిక్ ప్రియులు సంగీతాన్ని ఆస్వాదించేలా 'బాస్'ని ఫోన్‌లకు జోడించారు. ఒక్కసారి ఫుల్ ఛార్జ్ చేసి 6 గంటల పాటు పాటలు వినొచ్చు. బ్యాటరీ సామర్థ్యం 140ఎంఏహెచ్.



☛ ధర రూ.999

☛ ఇతర వివరాలకు https://goo.gl/fPGvHQ

గ్యాడ్జెట్ గురూ!

గేమింగ్ ప్రియులకు..

స్మార్ట్‌ఫోన్‌లు గేమింగ్ అడ్డాలుగా మారిపోతున్నాయ్. ఆట మధ్యలో ఎలాంటి బ్రేక్‌లు, హ్యాంగ్‌అప్‌లు లేకుండా మెరుపు వేగంతో పని చేసే ఫోన్‌లు గ్యాడ్జెట్ ప్రియుల్ని ఆకట్టుకుంటున్నాయి. లావా కంపెనీ కొత్తగా మార్కెట్‌లోకి ప్రవేశపెట్టిన 'జెడ్92' కూడా అలాంటిదే. 6.22 అంగుళాల తాకేతెరతో ముందుకొచ్చింది. నాచ్ డిస్‌ప్లే మరో ప్రత్యేకత. 'ఏఐ గేమింగ్ మోడ్'తో ఫోన్‌ని ప్లే గ్రౌండ్‌లా మార్చేయొచ్చు. 'ఏఐ స్టూడియో మోడ్'తో ఫొటోలకు జీవం పోయొచ్చు. ఇన్ని సౌకర్యాలు ఉన్నాయంటే ఖరీదు ఎక్కువేమో అనుకోవక్కర్లేదు. బడ్జెట్‌లోనే లావా అందిస్తోంది. పీ22 ఆక్టా-కోర్ ప్రాసెసర్. ర్యామ్ 3జీబీ. ఇంటర్నల్ మెమొరీ 32జీబీ. కావాలంటే 256జీబీ వరకూ మెమొరీ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. డ్యూయల్ కెమెరాలు ఉన్నాయి. ముందు 8 మెగాపిక్సల్, వెనక 13 మెగాపిక్సల్. రెండింటికి ఎల్ఈడీ ఫ్లాష్ సౌకర్యం ఉంది. బ్యాటరీ సామర్థ్యం 3260ఎంఏహెచ్.



☛ ధర రూ.9,999 ☛ ఇతర వివరాలకు https://goo.gl/axNTmk

రిలాక్స్ అడ్డా

'సైటే'ద్దాం!

గ్యాడ్జెట్‌ల గేలానికి.. కోడింగ్ కొక్కెంలకి చిక్కుకుని ఒత్తిడికి లోనయ్యేవాళ్లు ఎందరో. అలాంటి వారు కచ్చితంగా సందర్శించాల్సిన వెబ్ అడ్డానే 'మైండ్‌స్పేస్'. 'ఆరోగ్యమే మహాభాగ్యం!' అనే సూత్రాన్ని తప్పక పాటించేందుకు అనువైన మార్గాల్ని అన్వేషించొచ్చు. ధ్యాన సాధనకి తగిన చిట్కాల్ని నేర్చుకునేందుకు తగిన ఆన్‌లైన్ వేదిక. యాప్ రూపంలోనూ ఫోన్‌లో ఒదిగిపోతుంది.



☛ వెబ్‌సైట్: www.headspace.com

గూగుల్ బాగోగుల్



'పై'లో పక్కాగా..

మీరు సరికొత్త ఆండ్రాయిడ్ ఓఎస్ వెర్షన్ '9 పై'తో ఫోన్ వాడుతున్నారా? అయితే, గూగుల్ ప్రత్యేకంగా 'డిజిటల్ వెల్ బీయింగ్ డ్యాష్‌బోర్డు' సౌకర్యాన్ని అందిస్తోంది. దీంతో ఫోన్‌కి బానిస అవుతున్నారో లేదో తెలుసుకోవచ్చు. ఏయే యాప్‌లను ఎంతెంత సమయం వాడుతున్నారో లెక్కిస్తుంది. ఎన్ని సార్లు మీరు ఫోన్‌ని అన్‌లాక్ చేశారో కూడా తెలుసుకోవచ్చు. ఏవైనా యాప్‌లకు బానిసైనట్టుగా అనిపిస్తే 'యాప్ టైమర్'ని పెట్టుకోవచ్చు. రోజులో ఏయే యాప్‌లను ఎంత సమయం వాడాలన్నది ముందే నిర్ణయించొచ్చు. దీంతో నిర్ణీత సమయాన్ని దాటగానే యాప్ డిసేబుల్ అయ్యి రంగు మారిపోతుంది. తర్వాతి రోజు యాప్ సాధారణ స్థితిలో కనిపిస్తుంది. అలాగే, రాత్రి నిద్రించే సమయానికి 'విండ్ డౌన్ మోడ్'తో ఫోన్‌ని ఆటోమాటిక్ 'డు నాట్ డిస్టర్బ్' మోడ్‌లో పెట్టేయొచ్చు. నిద్రలోకి జారుకునేటప్పుడు గూగుల్ అసిస్టెంట్‌కి 'గుడ్‌నైట్' చెబితే చాలు. ఫోన్ 'మోనోక్రోమ్'లోకి (నలుపు, తెలుపు) మారిపోతుంది.

గూగుల్ వై-ఫై వాడితే..

నెట్టింట్లోకి ప్రవేశించేందుకు మీరు గూగుల్ వై-ఫై వాడుతున్నట్లయితే సులువైన పద్ధతిలో నెట్ వాడకాన్ని మానిటర్ చేయొచ్చు. రోజంతటిలో ఎప్పుడెప్పుడు విరామం తీసుకోవాలో ముందే నిర్దేశించొచ్చు. దీంతో సెట్ చేసుకున్న సమయానికి నెట్ ఆఫ్ అవుతుంది. అంతేకాదు.. భోజన సమయంలో, నిద్రిస్తున్నప్పుడు వై-ఫై సర్వీసుని టెంపరరీగా (పాజ్) నిలిపేయొచ్చు.

యూట్యూబ్ చూస్తున్నారా?

ఏదో టైమ్‌పాస్‌కని మొదలు పెట్టి యూట్యూబ్‌లో అదేపని వీడియోలు చూస్తున్నారా? అయితే, రోజులో ఎంత సమయం యూట్యూబ్‌తో గడిపేస్తున్నారో తెలుసుకోవాలంటే? థర్డ్‌పార్టీ యాప్‌లతో పని లేదు. యూట్యూబ్ మొబైల్ యాప్‌లోనే బిల్ట్‌ఇన్‌గా ఆప్షన్ ఉంది. యాప్ ఓపెన్ చేసి కుడివైపు పై భాగంలో కనిపించే ప్రొఫైల్ పిక్‌పై క్లిక్ చేయండి. వచ్చిన మెనూలో 'టైమ్ వాచ్‌డ్' ఆప్షన్ కనిపిస్తుంది. సెలెక్ట్ చేస్తే మొత్తం చిట్టా కనిపిస్తుంది. ఏ రోజు ఎంత సమయం వీక్షించామనే వివరాల్ని బ్రౌజ్ చేసి చూడొచ్చు. రోజూ సగటున ఎంత సమయం చూస్తున్నారో లెక్కించి చెబుతుంది. ఒకవేళ మీరేదైనా పరిధిని పెట్టుకోవాలంటే అందుకు తగిన ఆప్షన్లు ఉన్నాయి. రిమైండర్‌ని పెట్టుకుని బ్రేక్ తీసుకోవచ్చు. అంతేకాదు.. నిర్ణీత సమయానికి వీడియోని ఆగిపోయేలా (పాజ్) చేయొచ్చు.

మీది 'గూగుల్ హోమా'?

కుటుంబ సభ్యులతో పాటు ఇళ్లల్లోకి 'వాయిస్ అసిస్టెంట్‌లు' వచ్చేస్తున్నాయి. అందరితో ముచ్చట్లు పెడుతున్నాయ్. మరి, మీ ఇంట్లో గూగుల్ హోం అసిస్టెంట్ ఉన్నట్లయితే అవసరం లేనప్పుడు మ్యూట్‌లో పెట్టేయడం మంచిది. రాత్రి నిద్రించడానికి ముందు 'గుడ్‌నైట్' చెప్పడం ద్వారా గదిలో లైట్స్ ఆఫ్ అయ్యేలా.. స్పీకర్ నుంచి చక్కని మ్యూజిక్ ప్లే అయ్యేలా చేయొచ్చు. అంతేకాదు.. 'హే గూగుల్, టర్న్ ఆన్ డు నాట్ డిస్టర్బ్' అని చెప్పడం ద్వారా 'హోం'కి కనెక్ట్ అయి ఉన్న అన్ని పరికరాల నోటిఫికేషన్స్‌ని మ్యూట్ అయ్యేలా చేయొచ్చు. ఉదాహరణకు మీ ఫోన్‌ని వాయిస్ అసిస్టెంట్‌తో జత చేసినట్లయితే ఫోన్‌ని ముట్టకుండానే అన్ని మ్యూట్ అవుతాయన్నమాట.


'క్యాలెండర్'లో ఇలా..

గూగుల్ క్యాలెండర్ యాప్‌ని వాడుతున్నట్లయితే రిమైండర్స్, ఈవెంట్‌లను పెట్టుకోవడమే కాదు. దైనందిన జీవితాన్ని మెరుగు పరుచుకునేలా 'గోల్స్'ని పెట్టుకునేందుకు వీలుంది. ఉదాహరణకు రోజూ వ్యాయామం చేయాలనుకుంటే గోల్‌ని పెట్టుకోవచ్చు.

క్రోమ్‌కి ప్రత్యేకం

వెబ్ విహారం అంతా బ్రౌజర్‌లోనే! గంటల తరబడి ఒక లింక్ నుంచి మరో లింక్‌కి వెళ్తూ ట్యాబ్‌ల్లోనే కాలం గడిచిపోతుంది. అలా కాకుండా ఎప్పటికప్పుడు మీరు స్పృహతో నెట్టింట్లో విహరించేందుకు తగిన సూక్తులు, ఇతర ప్రేరణాత్మక అంశాల్ని అందిచేందుకు క్రోమ్ వెబ్ స్టోర్‌లో 'మైండ్‌ఫుల్ బ్రేక్ ఎక్స్‌టెన్షన్ ఉంది. బ్రౌజర్‌కి జత చేస్తే చాలు. మీరు ఎంచుకున్న సమయానికి రిమైండర్ రూపంలో చక్కని కొటేషన్స్‌ని చూపిస్తుంది. సెట్టింగ్స్‌లోకి వెళ్లి కావాల్సిన మార్పులు చేయొచ్చు. ☛ డౌన్‌లోడ్ లింక్: https://goo.gl/3a5Gdu

ఈనాడు సినిమా



ప్రపంచ ప్రసిద్ధ రామోజీ ఫిలింసిటీ అగ్రతారల పోరాటాలకు వేదికైంది. రామ్‌చరణ్ ఓ పక్క, ప్రభాస్ మరో పక్క వీరోచితంగా పోరాడుతున్నారు. వీళ్ల ఫైటింగుల మధ్యలో నందమూరి బాలకృష్ణ 'మహానాయకుడు' ర్యాలీ చేస్తున్నాడు. మరి ఆ సంగతేంటో ఒక్కసారి చదివేద్దాం.

రామోజీ ఫిలింసిటీలో అగ్రతారల డిష్యుం డిష్యుం


'బాహుబలి 2' తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న 'ఆర్ ఆర్ ఆర్'పై భారీ అంచనాలున్నాయి. రామ్‌చరణ్, ఎన్టీఆర్ కలసి నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ రామోజీ ఫిలింసిటీలో జరుగుతోంది. రామ్‌చరణ్‌తో పాటు వందలాదిమంది ఫైటర్లపై కీలక పోరాట ఘట్టాలను తెరకెక్కించే పనిలో ఉన్నారు జక్కన్న. పోలీస్ చెక్‌పోస్ట్ నేపథ్యంగా సాగే పోరాటమిది. డి.వి.వి దానయ్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

సాహో ముగింపు పోరాటం: ప్రభాస్ నుంచి రాబోతున్న 'సాహో' కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సుజీత్ తెరకెక్కిస్తోన్న ఈ సినిమా చిత్రీకరణ ఫిలింసిటీలో జరుగుతోంది. ముగింపు సన్నివేశాల్లో భాగంగా కీలకమైన పోరాట ఘట్టాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సెట్‌ను రూపొందించారు. ఫైట్స్ పూర్తయ్యాక ఇక్కడే పాటల చిత్రీకరణ చేయనున్నారు. యువీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది.

మహానాయకుడి ర్యాలీ: 'ఎన్టీఆర్' జీవిత కథతో తెరకెక్కుతోన్న 'మహానాయకుడు'కు సంబంధించిన బ్యాలెన్స్ సన్నివేశాలను ఫిలింసిటీలో తెరకెక్కించారు. దాంతో చిత్రీకరణ పూర్తయింది. ర్యాలీ నేపథ్యంలో ఈ సన్నివేశాలు సాగనున్నాయి. బాలకృష్ణ తన తండ్రి పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి క్రిష్ దర్శకుడు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది చిత్రబృందం.

అభిమానులకు ఓ లేఖ

కథానాయకుల దృక్పథం మారుతోంది. పరాజయం పలకరించినప్పుడు కుంగిపోవడం లేదు. పైగా 'మీ అంచనాలకు తగ్గట్టుగా సినిమా తీయలేకపోయాం' అని ధైర్యంగా ఒప్పుకుంటున్నారు. ఫ్లాప్ సినిమాని రుద్దడానికి కూడా ప్రయత్నించడం లేదు. తప్పుల్ని నిజాయతీగా అంగీకరిస్తున్నారు. ఇటీవల ఆమీర్‌ఖాన్ నటించిన 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్' చిత్రం ఘోర పరాజయం పాలైంది. వెంటనే ఆమీర్ స్పందించాడు. అభిమానులకు బహిరంగంగానే క్షమాపణ చెప్పాడు. ఇప్పుడు రామ్‌చరణ్ కూడా అదే బాట పట్టాడు. ఈ సంక్రాంతికి చరణ్ నటించిన 'వినయ విధేయ రామ' విడుదలైంది. అయితే.. ఈ చిత్ర ఫలితం అభిమానుల్ని తీవ్రంగా నిరాశపరిచింది. ఇప్పుడు చరణ్ ఈ పరాజయంపై స్పందించాడు. అభిమానులకు ఓ లేఖ రాశాడు. "మా 'వినయ విధేయ రామ' కోసం రేయింబవళ్లు కృషి చేసిన సాంకేతిక నిపుణులందరికీ మా ధన్యవాదాలు. మీ అందరికీ నచ్చి, మిమ్మల్ని వినోదింపచేసే సినిమా కోసం మేమంతా ఎంతగానో శ్రమించాం. దురదృష్టవశాత్తూ మేం అనుకున్న విధంగా ఓ మంచి సినిమాని అందించలేక మీ అంచనాల్ని అందుకోలేకపోయాం. మీరు చూపించే ఆదరణ, అభిమానాన్ని ప్రేరణగా తీసుకుని భవిష్యత్తులో మీకు నచ్చే, మీరు మెచ్చే సినిమాలు చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాం" అని ఆ లేఖలో రాసుకొచ్చాడు చరణ్.



రామ్



పూరి జగన్నాథ్

కాస్ట్లీ కాఫీ!

రెస్టారెంట్‌కి వెళ్లి ఓ కాఫీ తాగితే... అటూ ఇటుగా వంద రూపాయల బిల్లు వస్తుంది! అది చూసే 'అమ్మో... మరీ ఇంతా?' అని ఆశ్చర్యపోతుంటాడు మధ్యతరగతి మానవుడు. అదే రోడ్డు పక్కన అయితే.. ఇరవై రూపాయలకే ఘుమఘుమలాడే కాఫీ దొరికేస్తుంది. స్థాయి పెరిగే కొద్దీ, తాహతు కొద్దీ కాఫీ రేట్లలో మార్పు కనిపిస్తుంటుంది. బరిస్టా లాంటి కాఫీ షాపులకెళ్తే... బిల్లు భరించడం సగటు జీవి వల్ల కాదు. అయిదొందల నోటుకి రెక్కలొచ్చినట్టే. అలాంటిది ఓ కప్పు కాఫీ విలువ రూ.2 వేల వరకూ ఉంటుందంటే నమ్మగలమా? ఇప్పుడు పూరి జగన్నాథ్ తాగుతున్న కాఫీ అంతకంటే ఖరీదు. ఆయన 'లువాక్' అనే బ్రాండు కాఫీ తాగుతున్నారు. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కాఫీ పొడరు.. లువాక్. కిలో కాఫీ పొడరు కావాలంటే దాదాపుగా రూ.60 వేల నుంచి 70 వేలు ఖర్చు పెట్టాల్సిందే. ప్రముఖ కథానాయకుడు రామ్.. పూరికి ఈ ఖరీదైన కాఫీ పొడరుని బహుమతిగా ఇచ్చారు. ఆ కాఫీని ఆస్వాదిస్తూ పూరిజగన్నాథ్ ఓ ఫొటోని ట్విటర్‌లో అభిమానులతో పంచుకున్నారు.

ఏమిటీ విశిష్టత?

లువాక్ అనేది అరుదైన కాఫీ బ్రాండ్. దీని పూర్తి పేరు కోపీ లువాక్. ఇండోనేషియాలోని ద్వీపాల్లో ఈ కాఫీని ఎక్కువగా పండిస్తుంటారు. దీని తయారీ కూడా విచిత్రంగా ఉంటుంది. లువాక్ గింజల్ని సివెట్ అనే అడవిజాతికి చెందిన పిల్లికి ఆహారంగా వేస్తారు. ఆ పిల్లి ఈ గింజల్ని తిని విసర్జించిన తరవాత అందులో మిగిలిపోయిన గింజల్ని సేకరించి ఈ కాఫీ తయారు చేస్తారు. అందుకే దీన్ని సివెట్ కాఫీ అని పిలుస్తారు. ఈ కాఫీ పొడరునే పూరికి రామ్ బహుమతిగా ఇచ్చారు. వీరిద్దరి కాంబినేషన్‌లో 'ఇస్మార్ట్ శంకర్' అనే చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. నిధి అగర్వాల్, నభా నటేష్ కథానాయికలు.



సల్మాన్ ఖాన్

ప్రేమ్ మళ్లీ వస్తున్నాడా!

మరోసారి ప్రేక్షకులను ప్రేమలో ముంచెత్తడానికి ప్రేమ్ రాబోతున్నాడట!. ఇంతకీ ఈ ప్రేమ్ ఎవరు అంటారా?... ఆ ప్రశ్న బాలీవుడ్ ప్రేక్షకులను అడిగితే సల్మాన్ ఖాన్ అని టక్కున చెప్పేస్తారు. సల్మాన్‌కు అంతగా అచ్చొచ్చిన పేరు... ఆయన్ను యువతరానికి దగ్గర చేసిన పిలుపు అదే మరి. సల్మాన్‌కు తొలినాళ్లలో 'మైనే ప్యార్ కియా', 'హమ్ ఆప్కే హై కౌన్', 'హమ్ సాథ్ సాథ్ హై' లాంటి కుటుంబ ప్రేమకథా చిత్రాలు ఘన విజయాలను అందించాయి. వాటన్నింటిలో సల్మాన్ పాత్ర పేరు ఒకటే.. అదే ప్రేమ్!. ఆ చిత్రాలకు దర్శకుడూ ఒకరే... ఆయనే సూరజ్ బర్జాత్యా. సల్మాన్, సూరజ్‌ల కలయికలో 2015లో వచ్చిన 'ప్రేమ్ రతన్ ధన్ పాయో'లోనూ కథానాయకుడి పేరు ప్రేమ్. ఆ చిత్రమూ మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు మళ్లీ తన దర్శకత్వంలో సల్మాన్ నటించడానికి సంసిద్ధత వ్యక్తం చేశారని సూరజ్ వెల్లడించినట్లు ఓ బాలీవుడ్ మీడియా పేర్కొంది. అది కూడా తమ కలయికలో వచ్చిన గత చిత్రాల్లాగే కుటుంబ బంధాల నేపథ్యంలో సాగుతుందని సూరజ్ చెప్పినట్లు వెల్లడించింది. "నేను కథాలోచనను సల్మాన్‌తో పంచుకున్నాను. భావోద్వేగాలతో సాగే సంగీతభరిత కుటుంబ కథ అది. పూర్తి స్క్రిప్టుతో ఎప్పుడు వస్తే అప్పుడు నటించడానికి సిద్ధంగా ఉంటానని సల్మాన్ మాటిచ్చారు. ఇది నాకు పూర్తి సంతృప్తిని ఇచ్చే చిత్రమవుతుంద"ని సూరజ్ తెలిపారట. ఆ చిత్రంలోనూ సల్మాన్ పాత్రకు ప్రేమ్ అనే పేరే పెడతారేమో. అన్నీ కుదిరితే వచ్చే ఏడాది ఆ చిత్రం సెట్స్ మీదకు వెళ్తుందని తెలుస్తోంది.

ఈ జోడీ మరోసారి?



సమంత



బెల్లంకొండ సాయిశ్రీనివాస్

'అల్లుడు శీను'లో ఆడిపాడారు బెల్లంకొండ సాయిశ్రీనివాస్ - సమంత. ఆ జోడీ మరోసారి కలసి నటించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. 'ఆర్.ఎక్స్.100'తో విజయాన్ని అందుకొన్న అజయ్ భూపతి దర్శకత్వంలో బెల్లంకొండ కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కబోతోంది. అందులో కథానాయికగా సమంతని ఎంపిక చేసుకొనే ప్రయత్నాల్లో చిత్రబృందం ఉన్నట్టు సమాచారం. సమంతతో ప్రస్తుతం కథా చర్చలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. బెల్లంకొండ సినిమాల్లో కథానాయికలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటారు. తొలి సినిమా నుంచి అగ్ర నాయికలతో ఆయన సందడి చేస్తున్నారు. ప్రస్తుతం 'సీత'లో కాజల్‌తో కలసి నటిస్తున్నారు బెల్లంకొండ.

పంచ్ డైలాగ్

ఈ ప్రపంచంలో అత్యంత విలువైనది కృతజ్ఞత.
చిత్రం: కాంచన
- పంపినవారు: షేక్ బాజ్జీ, ఊబలంక

మెయిల్ ఐడీ:
cinema@eenadu.net

హుషారు తీసుకొచ్చింది



బెక్కం వేణుగోపాల్, దిల్‌రాజు, ప్రియా వడ్లమాని, శ్రీహర్ష

"ఈ రోజుల్లో విజయవంతమైన చిత్రాలు తెరకెక్కించడం చాలా కష్టం. అందులోనూ చిన్న సినిమాలకు విజయాలు దక్కడం లేదు. అలాంటి పరిస్థితుల్లో 'హుషారు' యాభై రోజులు ఆడడం గొప్ప విషయం" అన్నారు ప్రముఖ నిర్మాత దిల్‌రాజు. శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వం వహించిన చిత్రమిది. బెక్కం వేణుగోపాల్ నిర్మాత. ఇటీవల 50 రోజుల మైలు రాయి అందుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో అర్ధ శతదినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన దిల్ రాజు మాట్లాడుతూ "కొత్త దర్శకుడు, నూతన నటీనటులు, సాంకేతిక నిపుణులతో కథను నమ్మి నిర్మాతలు ఈ చిత్రాన్ని నిర్మించారు. అంతా ఏకాగ్రతతో కష్టపడి విజయాన్ని అందుకున్నార"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ప్రతి మనిషి జీవితంలోనూ జ్ఞాపకాలుంటాయి. వాటిని గుర్తుకు తెచ్చుకునేలా ఈ చిత్రాన్ని వినోదాత్మకంగా మలిచాం. యువతరం నెత్తిన పెట్టుకుంది. మా అందరి జీవితాల్లోనూ కొత్త హుషారు తీసుకొచ్చింద"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "పని చేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు తెచ్చిన సినిమా ఇది" అన్నారు. తేజ్, దినేష్ తేజ, తేజస్, ప్రియా వడ్లమాని, దక్ష నగార్కర్‌లతో పాటు కమల్, ప్రమోదిని, హనుమంతరాజు, జితేంద్ర, కె.కె, లక్ష్మీనారాయణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రద్ధా కపూర్



వరుణ్ ధావన్

రోడ్డు మీద నడవకండి డ్యాన్స్ చేయండి

వరస విజయాలతో జోరుమీదున్నాడు బాలీవుడ్ యువ కథానాయకుడు వరుణ్ ధావన్. ప్రస్తుతం రెమో డిసౌజా దర్శకత్వంలో 'ఏబీసీడీ' సిరీస్‌లో వస్తోన్న మూడో చిత్రంలో నటిస్తున్నాడు. ఈ సినిమాకు 'స్ట్రీట్ డ్యాన్సర్' అనే పేరుని ఖరారు చేశారు. ఈ విషయాన్ని వరుణ్ ట్విటర్ ద్వారా వెల్లడించాడు. "రోడ్లపై నడవడం ఎందుకు? డ్యాన్స్ చేయండి. రూల్స్ బ్రేక్ చేయడానికి స్ట్రీట్ డ్యాన్సర్ నవంబరు 8న మీ ముందుకు వస్తాడు" అని ట్వీటాడు. ఈ చిత్రంలో శ్రద్ధాకపూర్ కథానాయిక. పాకిస్థాన్ డ్యాన్సర్ పాత్రలో ఆమె కనిపించనుంది. పంజాబ్‌కు చెందిన డ్యాన్సర్‌గా వరుణ్ పాత్ర ఉండనుంది. ఈ సినిమాలో వరుణ్, శ్రద్ధా కపూర్‌ల ఫస్ట్‌లుక్‌లను చిత్రబృందం విడుదల చేసింది. అవి అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

పేరులోనే కథ



అశ్విని

ధ్రువ, అశ్విని నాయకానాయికలుగా నటించిన చిత్రం 'యమ్ 6'. జైరామ్ వర్మ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విశ్వనాథ్ తన్నీరు నిర్మాత. ఈ నెల 8న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "హారర్ కామెడీ కథతో తెరకెక్కిన చిత్రమిది. ప్రేక్షకుల్ని థ్రిల్‌కి గురిచేస్తుంది. 'యమ్ 6' అనే పేరులోనే కథ ఉంది. అదెలా అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. కథలో వచ్చే మలుపులు, విజయ్ బాలాజీ స్వరాలు చిత్రానికి ప్రధాన బలం. ఇలాంటి చిత్రాల్ని ఆదరించినప్పుడే కథాబలమున్న మరిన్ని సినిమాలు రూపుదిద్దుకుంటాయి. నాకు దర్శకత్వ శాఖలో పనిచేసిన అనుభవం ఉంది. త్వరలోనే స్వీయ దర్శకత్వంలో ఓ సినిమాని తీయబోతున్నా" అన్నారు. తిలక్, సాధన, అప్పలరాజు, హరిత తదితరులు నటించారు.



ధన్య బాలకృష్ణ, త్రిధా చౌదరి, సిద్ధి ఇద్నానీ, కోమలి

చలో గోవా

త్రిధా చౌదరి, ధన్య బాలకృష్ణ, సిద్ధి ఇద్నానీ, కోమలి ప్రసాద్ ప్రధాన పాత్రధారులుగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. బాలు దర్శకుడు. హిమబిందు వెలగపూడి నిర్మిస్తున్నారు. తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయింది. త్వరలోనే గోవాలో కీలక సన్నివేశాల్ని తెరకెక్కించబోతున్నారు. దర్శకుడు మాట్లాడుతూ "స్వతంత్ర భావాలున్న నలుగురమ్మాయిల కథే ఈ చిత్రం. వాళ్ల జీవితాల్లో ఏం జరిగిందనేది తెరపైనే చూడాలి. కథలో వచ్చే మలుపులు ఆకట్టుకుంటాయి. గోవాలో జరిగే షెడ్యూల్‌లో సన్నివేశాలతో పాటు రెండు పాటలు, యాక్షన్ ఘట్టాల్ని తెరకెక్కిస్తాం. మేలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం రఘు కుంచె.

మీరు రచయితలా?

మీరు సినిమాలకు చక్కటి కథలు వ్రాయగలరా? మీ ప్రతిభకు తగిన ప్రోత్సాహం కోసం ఎదురు చూస్తున్నారా? అయితే ఈ అవకాశం మీ కోసమే. తెలుగు చిత్ర రంగంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన ప్రముఖ నిర్మాణ సంస్థలు త్వరలో నిర్మించబోయే చిత్రాలకు వినోదాత్మకమైన కుటుంబ కథలు కావాలి. ఆసక్తి కలిగిన రచయితలకు ఇదే ఆహ్వానం. మీ వివరాలతో బాటు రెండు పేజీలకు మించకుండా సంక్షిప్త కథను వ్రాసి

బాక్స్ నెం.386, C/o ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 చిరునామాకు పంపగలరు.

దేశానికి రక్షణ... సేవకు హర్షిత!

బరువు తగ్గాలని ఎన్‌సీసీలో చేరిన 'రక్షణ' ఇప్పుడు ఏకంగా జాతీయస్థాయి గుర్తింపు తెచ్చుకుంది. చదువు - సేవను సమన్వయం చేసుకుంటూ పెరిగిన 'హర్షిత' ఐక్యరాజ్య సమితి ఆహ్వానాన్ని అందుకుంది. ఆ గుర్తింపు, ఈ ఆహ్వానం ఆషామాషీగా రాలేదు. రక్షణ అనుక్షణం కష్టపడితే... హర్షిత ఎన్నో ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టింది. ఇంతకీ వాళ్లెవరూ... ఏమేం చేశారో చూద్దామా!

స్నేహితురాలి సలహాతోనే...

ఆరేళ్ల నుంచే హర్షితా చింతం తన పాకెట్ మనీని ఐరాసకు పంపేది. పెద్దయ్యాక సమాజాన్ని నవనిర్మాణ దిశగా ఎలా నడిపించాలో సలహాలిచ్చింది. అదే ఆమెకు ఐక్యరాజ్య సమితి యూత్ అసెంబ్లీకి ఎంపికయ్యేలా చేసింది.





చిన్నప్పుడు మా అమ్మానాన్న వారాంతంలో ఇంట్లో ఏదో ఒక పని చేయించి... ఎంతో కొంత డబ్బులు ఇచ్చేవారు. అది అమ్మానాన్నల దృష్టిలో పాకెట్ మనీ. నాకు మాత్రం దాన్ని కష్టాల్లో ఉన్నవారికి సాయంగా ఇవ్వాలని ఉండేది. ఆరో తరగతిలో ఉన్నప్పుడు... ఐరాస గురించి పాఠం విన్నా. ఐరాస ఫండ్ గురించి అప్పుడే తెలిసింది. అలా నా పాకెట్ మనీని ఆ ఫండ్‌కి పంపడం మొదలుపెట్టా. ఏడో తరగతిలో ఉన్నప్పుడు ఐరాస కార్యాలయం నుంచి నన్ను పొగుడుతూ ఉత్తరం వచ్చింది. దాన్ని ఇప్పటికీ దాచుకున్నా.

ఐక్యరాజ సమితి నుంచి ఆహ్వానం వచ్చినందుకు చాలా గర్వంగా ఉంది. నేరుగా ఐరాస కార్యాలయం నుంచే ఫోన్ వచ్చింది. 'ఫిబ్రవరిలో జరిగే యూత్ అసెంబ్లీకి రావాలి...' అని చెప్పారు. ఈ నెల 15 - 17 వరకూ అక్కడ జరిగే యూత్ అసెంబ్లీలో నేను 'సస్టెయినబుల్ సిటీస్ అండ్ కమ్యూనిటీస్' అనే అంశంపై మాట్లాడాలి. మన గ్రామాల్లోని జీవనవిధానం, స్వయం సమృద్ధి మార్గాలు...ఇలా పలు అంశాలకు సంబంధించి బృంద చర్చల్లోనూ పాల్గొనాలి. నేను మొదటినుంచీ రకరకాల స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేశా. నా గురించి తెలిసిన ఓ స్నేహితురాలు... యుఎన్‌ఓ యూత్ అసెంబ్లీ గురించి చెప్పింది. అలా నవంబర్‌లో దరఖాస్తు చేశా. కొన్నిరోజులకు నేను చేసిన పనిని గురించి రాయమన్నారు. అదయ్యాక నాలుగైదు సార్లు ఇంటర్వ్యూలు చేశారు. నేను చేసిన సేవ, దానివల్ల దేశానికి, ప్రజలకు కలిగిన ఉపయోగం... వంటివన్నీ రాశా.

సఫాలో భాగమై... నేను శ్రీనిధి ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ పూర్తి చేశా. అదయ్యాక ఐఎమ్‌టీ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ)లో ఎంబీఏ చేసి ఐటీసీ ప్రయివేట్ లిమిటెడ్స్‌లో బిజినెస్ ఎక్సలెన్స్ ఆఫీసర్‌గా చేస్తున్నా. ఎంబీఏ చేసేటప్పుడు హైదరాబాద్‌లో సఫా అనే ఎన్జీవోలో భాగం అయ్యా. నాతో యూనివర్సిటీ ఆఫ్ కొలంబియా విద్యార్థులు కూడా కలిశారు. సఫా కార్యక్రమాల్లో భాగంగా ఆ మహిళల్ని చదువు దిశగా, వ్యక్తిత్వం పరంగా చైతన్యపరచడం, పిల్లల్ని బడిబాట పట్టించేందుకు తల్లిదండ్రుల్ని ఒప్పించడం, వారి ఆరోగ్యం, హక్కుల గురించి ఏం చెప్పాలి... వంటివన్నీ ఓ ప్రాజెక్టులా డిజైన్ చేసి ఇచ్చా. నేనూ వాళ్లతో కలిసి పలు ప్రాంతాలకు వెళ్లా. ఆ క్రమంలో మహారాష్ట్రకు చెందిన జాగృతి యాత్ర అనే స్వచ్ఛంద సంస్థ గురించి తెలిసింది. దీని ద్వారా 20 నుంచి 27 ఏళ్ల లోపు వారు రైలు ప్రయాణం ద్వారా దేశంలోని పలు ప్రాంతాలకు వెళ్లి... గ్రామీణ ప్రజలను కలుస్తారు.

నేనూ అలా దిల్లీ నుంచి కన్యాకుమారి వరకూ పదిహేను రోజులు... ఎనిమిది వేల కిలోమీటర్లు ప్రయాణించా. ధర్మశాల, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా, అసోం, రాజస్థాన్.. ఇలా పలు ప్రాంతాల్లోని మారుమూల గ్రామాలకు వెళ్లా. ఇందుకు సంబంధించిన సమాచారమంతా రాష్ట్రపతికి సమర్పించా.

ఆ గ్రామం చూసి... ఈ యాత్రలో భాగంగా రాజస్థాన్‌లోని థార్ ఎడారి సమీపంలో థిలోనియా అనే గ్రామం చూసినప్పుడు నాకు ముచ్చటేసింది. అక్కడ పంటలు పండవు. నీటి వసతి సరిగా ఉండదు. అయితే వాళ్లంతా ఆర్థికంగా పరిపుష్టమయ్యారు. సౌరవిద్యుత్తుని జీవనాధారం చేసుకోవడమే దానికి కారణం. అందుకు సంబంధించిన ఉత్పత్తులు తాము వాడటంతోపాటు... తయారు చేస్తున్నారు. దాదాపు వెయ్యి కుటుంబాలున్న ఈ గ్రామంలో ప్రతి ఒక్కరూ సోలార్ ఉత్పత్తులు తయారు చేసి, దేశవిదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అక్కడ నేను దాదాపు నాలుగైదు రోజులుండి... ఓ డాక్యుమెంటరీ తీశా. అలానే ఉత్తరప్రదేశ్‌లో లింగవివక్ష ఎక్కువ. అక్కడ ఆడవాళ్లు బయటకు రారు. అందుకే అక్కడ కొన్ని గ్రామాల్లోని మహిళలు... టైలరింగ్, రకరకాల హస్తకళలు చేస్తుంటారు. వారికి నేను ఇంటి వద్ద నుంచే ప్రపంచాన్ని విస్తరించుకునే మార్గాలు వివరించా. ఫ్యాషన్ డిజైనింగ్ నేర్చుకుని రకరకాల దుస్తులు డిజైన్ చేయడం... ఆకట్టుకునేలా హస్తకళలు రూపొందించడం... నెట్ ఎలా వాడాలి... సామాజిక మాధ్యమాల్లో మార్కెటింగ్ చేసుకోవడం వంటివెన్నో వివరించా.

కష్టం దోచుకోకుండా: ఉత్తర భారతదేశంలో కొన్ని ప్రాంతాల్లో పసుపు బాగా పండుతుంది. కానీ రైతులు ఆ పంటని దళారీలకు అమ్మేసి నష్టపోతారు. అది తెలిసి రైతులే స్వచ్ఛంగా పసుపు మార్కెటింగ్ చేసేలా వాళ్లతో ప్రాసెసింగ్ యూనిట్ పెట్టించా. పైగా మార్కెట్‌లోకి రసాయనాలు కలపని తాజా పసుపు వస్తుంది. ఇలానే ప్రాంతాన్ని బట్టి అక్కడి వారికి సమాజంలో వేగంగా ఎదిగేలా అవగాహన కల్పించా. అలా ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా చైతన్యం తీసుకొచ్చా. ఇవే కాదు... మేక్ ఏ విష్, మరికొన్ని స్వచ్ఛంద సంస్థలతోనూ కలిసి పనిచేస్తున్నా. ఇవన్నీ కలిపే నాకు అవకాశాన్ని తెచ్చిపెట్టాయి.

బరువు తగ్గాలనే ఎన్‌సీసీలో...



అధిక బరువును తగ్గించుకోవాలనుకుని ఎన్‌సీసీలో చేరిందా యువతి. ఆ కష్టం ఇప్పుడు ఆమెను ఉత్తమ క్యాడెట్‌గా నిలిపింది. దేశవ్యాప్తంగా వేలాదిమందితో పోటీ పడి, జాతీయస్థాయిలో విజేతగా గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆమే రక్షణ సురేష్ ప్రభు.

రక్షణది చెన్నై. ఎంఓపీ వైష్ణవ కాలేజీలో బీఎస్సీ, సైకాలజీ రెండో ఏడాది చదువుతోంది. రక్షణ తండ్రి వ్యాపారి. తల్లి గృహిణి. చదువులో ముందుండే ఆమె ఐఏఎస్ కావాలనుకుంది. డిగ్రీ తరువాత సివిల్స్ రాయాలనుకునేది.



జాతీయ స్థాయిలో సీనియర్ వింగ్ కేటగిరీలో సైనికవిభాగంలో ఉత్తమ క్యాడెట్‌గా నిలిచా. ప్రధాని చేతుల మీదుగా అవార్డును, ప్రశంసలను అందుకున్నా. ప్రధానితో కలిసి ర్యాలీలో పాల్గొనే గౌరవాన్ని కూడా పొందా. పుదుచ్చేరి గవర్నరు కిరణ్‌బేడీ కూడా ప్రశంసించారు. ఇప్పుడు నా లక్ష్యం సైన్యంలోకి వెళ్లడం. అందు కోసం ఇకపై కృషి చేస్తా.

అయితే ఆమె అధిక బరువే, ఆమెకో లక్ష్యాన్ని అందించింది. 'చిన్నప్పుడు బొద్దుగా ఉండేదాన్ని. కాలేజీకి వచ్చేసరికి ఇంకా బరువు పెరిగా. ఏకంగా 90 కేజీలు. అందరూ లావుగా ఉన్నావు... జిమ్‌కి వెళ్లొచ్చు కదా అని అనేవారు. వాళ్ల మాటలు విన్నాక ఎలాగైనా బరువు తగ్గాలనుకుని జిమ్‌లో చేరాలనుకున్నా. మా కాలేజీలో స్పోర్ట్స్, ఎన్‌సీసీ వంటి వాటికి ప్రాధాన్యమెక్కువ. అందుకే 2017లో ఎన్‌సీసీలో చేరా. మొదట వాళ్లు చెప్పిన వ్యాయామాల్ని కష్టపడి చేసేదాన్ని. బరువు తగ్గాలనేదే నా లక్ష్యంగా పెట్టుకున్నా. అయితే నాకు తెలియకుండానే ఎన్‌సీసీలో పూర్తిగా నిమగ్నమయ్యా' అని అంటుంది రక్షణ.

ఎన్నో గంటల సాధన... కాలేజీ తరపున పెరేడ్‌లో పాల్గొన్న రక్షణ ఆ తరువాత రాష్ట్రం నుంచి ప్రదర్శనలకు ఎంపికైంది. దీంతో వేకువజామున నాలుగు నుంచి అర్ధరాత్రి రెండు గంటల వరకు ప్రాక్టీసు చేసేది. వారంలో రెండు రోజులపాటు ఎన్‌సీసీ క్యాడెట్‌గా బిజీగా ఉండేది. 'పెరేడ్ పేరుతో గంటల తరబడి శిక్షణ ఉండేది. దీంతో శారీరకంగానే కాదు, మానసికంగా కూడా దృఢంగా మారా. ఏదైనా సాధించాలనిపించింది. గణతంత్ర దినోత్సవాల సందర్భంగా దిల్లీలో జరిగే ర్యాలీలో పాల్గొనాలనుకున్నా. నా దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టా. జాతీయ స్థాయిలో ఎన్‌సీసీ తరపున ప్రతీ ఏటా ఉత్తమ క్యాడెట్‌ను ఎంపిక చేసే పోటీలుంటాయి. దేశవ్యాప్తంగా 14.2 లక్షల మంది ఎన్‌సీసీ క్యాడెట్లున్నారు. వాళ్లలో వేలాదిమంది ఈ పోటీకి దరఖాస్తు చేసుకుంటారు. నేను కూడా దిల్లీ పోటీలకు తమిళనాడు రాష్ట్రం తరపున ఎంపికయ్యా. అలా గతేడాది డిసెంబరు 30 నుంచి ఈ ఏడాది జనవరి 30 వరకు పలు రకాల పరీక్షల్లో పాల్గొన్నా. నెల రోజులపాటు తీవ్రంగా కృషి చేశా. విజేతను అయ్యా. ఇప్పుడు 64 కేజీలకు బరువు కూడా తగ్గా..' అని చెబుతుంది రక్షణ.

నజరానా

లిప్‌స్టిక్ వేసుకున్నాక... పెదాలకు కొద్దిగా లిప్‌బామ్ కూడా అద్దండి. లిప్‌స్టిక్ ఎక్కువసేపు నిలిచి ఉంటుంది. పెదాలు మృదువుగానూ కనిపిస్తాయి.







బ్యాగుకి ఉండాలి చార్మ్స్!

ఆఫీసుకెళ్లినా, కాలేజీకి వెళ్లినా, ఆఖరికి విహార యాత్ర అయినా సరే... వెంట హ్యాండ్‌బ్యాగు ఉండాల్సిందే. ఇది అవసరం మాత్రమే కాదు... అమ్మాయిల స్టైల్ స్టేట్‌మెంట్ కూడా. హోబో, స్లింగ్, టోటే... ఇలా ఏ బ్యాగు పేరు చెప్పినా రంగులు, ఆకృతులు మారతాయే కానీ ఇంచుమించు ఒకేలా కనిపిస్తాయి. అందుకే.... ఇప్పుడు యువత తమ బ్యాగ్‌ని అభిరుచికి తగ్గట్లు చార్మ్స్‌తో తీర్చిదిద్దుకుంటోంది. హృదయం, పామ్‌పామ్ బాల్స్, తాళాలు, జంతువులు, బార్బీబొమ్మలు... ఒకటేమిటి? నచ్చినదాంతో బ్యాగ్‌ని అలంకరించేస్తున్నారు. అలాంటివే ఇవి కొన్ని...









జాలీగా... సరదాగా!

వయసు పైబడే కొద్దీ మనలో చాలా మందికి ఏం చేయాలో తెలియదు. పిల్లలు ఉద్యోగాలని ఊరికి దూరంగా వెళ్తారు. దీంతో ఇంట్లో ఒంటరి జీవితం గడపాల్సిన పరిస్థితి. దీని నుంచి బయట పడి, రోజంతా ఉత్సాహంగా గడిపేందుకు కొన్ని సూత్రాలు పాటించండి.

- ఏదో ఆలోచిస్తూ ఎప్పుడూ ఇంట్లోనో ఒంటరిగా ఉండకండి. ఎందుకంటే ఒంటరితనం... నిరాశ, కుంగుబాటుకు కారణం కావొచ్చు. మీ చుట్టు పక్కల, మీ కాలనీలోని వయసు వాళ్లందరూ కలిసి ఒక బృందంగా ఏర్పడండి. రోజూ ఒకే చోట కూర్చొని మీ రోజులు ఎలా ఉండేవో, ఇప్పుడు ఎలా ఉన్నాయో గుర్తుచేసుకోండి. దీనివల్ల మీరు ఒంటరి అనే భావన ఏర్పడదు. మీరంతా కలిసి లాఫింగ్ క్లబ్ కూడా ఏర్పాటు చేసుకోవచ్చు.



- కుదిరినప్పుడల్లా అంతా కలిసి... రకరకాల పదార్థాలు చేసుకుని ఒకచోట చేరండి. కబుర్లు చెప్పుకుంటూ భోంచేయండి. అలాగే ఓ బృందంగా మారి ఒకటిరెండు రోజులు విహారయాత్రకు కూడా వెళ్లిరావొచ్చు.
- వయసు పెరిగే కొద్దీ చాలామంది వ్యాయామంపై శ్రద్ధపెట్టరు. అనేక అనారోగ్యాలకు అదే కారణం. మీ స్నేహితులంతా కలిసి ఉదయం, సాయంత్రం కాసేపు నడవండి. దీని వల్ల వ్యాయామం చేసినట్టవుతుంది. మానసిక ఉల్లాసం కూడా.
- వయసు పెరిగేకొద్దీ మెదడు పనితీరు మందగిస్తుంది. మతిమరుపు పెరుగుతుంది. దీన్నుంచి బయటపడాలంటే తరచూ కొత్త విషయాలు నేర్చుకుంటూ ఉండండి. భాషలు, పుస్తకాలు చదవడం నిరంతరం చేయడం వల్ల మెదడు చురుగ్గా ఉంటుంది.
- ఇతరులకు సాయం చేస్తే వారి దగ్గరి నుంచి వచ్చే స్పందన లెక్కలేనంత మానసిక సంతృప్తినిస్తుంది. కాబట్టి కనీసం నెల్లో ఒకసారి ఏదయినా సేవాకార్యక్రమాన్ని ఎంచుకోండి. స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొనే వారు మిగిలిన వారి కంటే ఐదేళ్లు ఎక్కువ బతకడానికి 44 శాతం అవకాశం ఉందని సర్వేలు చెబుతున్నాయి.

డ్రైఫ్రూట్స్ లడ్డు



అమ్మచేత కమ్మగా

కొందరు చిన్నారులు డ్రైఫ్రూట్స్ అస్సలు ఇష్టపడరు. అలాంటి చిన్నారుల చేత వాటిని తినిపించాలంటే ఒకే ఒక్క మార్గం లడ్డూనే. రోజుకొకటి బాక్సులో పెట్టిచ్చినా చాలు... పోషకాలు అందుతాయి.

కావల్సినవి: యాభై గ్రాముల చొప్పున బాదం, కాజు, పిస్తా, వాల్‌నట్స్, కిస్‌మిస్, అంజీరా, ఖర్జూరం, నెయ్యి - అర కప్పు, యాలకుల పొడి - పెద్ద చెంచా.

తయారీ: మొదట పొయ్యి మీద పాన్ పెట్టి చెంచా నెయ్యి వేసి అది వేడయ్యాక అందులో బాదం, కాజు, పిస్తా, వాల్‌నట్స్ వేసి వేయించాలి. ఆ తరువాత వాటిని మిక్సీలోకి తీసుకుని మరీ మెత్తగా కాకుండా కాస్త బరకగా పొడి చేసుకోవాలి. ఇప్పుడు పాన్‌లో మరోసారి చెంచా నెయ్యి వేసి కిస్‌మిస్, అంజీరా, ఖర్జూరం వేయించుకోవాలి. వీటిని కూడా మిక్సీ పట్టాలి. ఈ పదార్థాలన్నింటినీ ఒక గిన్నెలోకి తీసుకుని బాగా కలపాలి. తరువాత మిగిలిన నెయ్యి, యాలకుల పొడి వేసి ఉండల్లా చేసుకోవాలి. అంతే రుచికరమైన, ఆరోగ్యాన్నిచ్చే డ్రై ఫ్రూట్స్ లడ్డూలు రెడీ.

చెప్పకుండా చేసుకున్నా... విడాకులు ఇమ్మంటున్నారు!

? నేను ఐదేళ్లుగా మా క్లాస్‌మేట్‌తో ప్రేమలో ఉన్నా. మేమిద్దరం కొన్ని నెలల క్రితం ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నాం. మాది కులాంతర వివాహం. మా పెద్దవాళ్లని ఒప్పించిన తరువాత కలిసి ఉందాం అనుకున్నాం. అప్పటివరకూ ఇద్దరి ఇళ్లల్లోనూ చెప్పకూడదనుకున్నాం. కానీ వాళ్లని ఒప్పించడం కుదరలేదు. ఇప్పుడు మా విషయం తెలిసిపోయింది. మా ఇద్దరికీ విడాకులు ఇప్పించాలనుకుంటున్నారు. ఒకవేళ అతడితో వెళ్లిపోతే... ఆస్తిలో ఎటువంటి భాగం రాదని లాయర్ ముందే రాసి సంతకం పెట్టమని ఒత్తిడి చేస్తున్నారు. పోలీసు ఫిర్యాదు చేద్దామని వెళితే... మా కుటుంబ పలుకుబడితో సర్దిచెప్పి పంపేశారు. ఇప్పుడు నేనేలా ఈ సమస్య నుంచి గట్టెక్కగలను? - ఓ సోదరి.

✔ మీరు ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్న తరువాత దానిని కూడా రిజిస్టర్ కూడా చేయించుకుని ఉండాల్సింది. పెళ్లి చేసుకున్నాక అయినా ఆ విషయాన్ని రెండు కుటుంబాల్లోనూ తెలియచేయాల్సింది. ముందు మీ ఇద్దరూ కలిసి ఒక ఇల్లు తీసుకుని కలిసి ఉండటానికి ప్రయత్నించండి. ఎందుకంటే మీ ఇద్దరూ పెళ్లి చేసుకున్న విషయం సమాజానికి కూడా తెలిసే అవకాశం ఉంది. ఇక మీరు కూడా మీ కుటుంబం మీద కేసులు పెట్టడం వల్ల గొడవలు పెరుగుతాయే తప్ప తగ్గవు. ఇప్పటికైనా మించిపోయింది లేదు... మీరిద్దరూ మీ పెద్దల్ని ఒప్పించడానికి ప్రయత్నించండి. మధ్యవర్తుల సాయం తీసుకోండి. ఎందుకంటే ఇన్నాళ్లు ప్రేమగా వారు మిమ్మల్ని పెంచుకున్నారు. మీరు చెప్పకుండా చేసిన ఈ పని వారికి బాధని కలిగించి ఉంటుంది. దాంతో పంతాలు, పట్టింపులు మొదలవుతాయి. ఈ మధ్య జరుగుతోన్న పరువు హత్యలు అందుకే దారితీస్తున్నాయి. ఇక, మీకు మీ భర్త ఎక్కువ అనుకున్నప్పుడు తల్లిదండ్రుల ఆస్తి ముఖ్యమేమీ కాదు కదా! అలాగే... మీకు రావలసిన ఆస్తి కులాంతర వివాహం చేసుకున్నంత మాత్రాన ఎక్కడికీ పోదు. మీకు ఆస్తులు కంటే వారి ప్రేమాభిమానాలు ముఖ్యమనే విషయం వారికి తెలియచేయండి. మీకు రావలసిన ఆస్తి మీద మీకు గల హక్కులు భవిష్యత్తులో తేల్చుకోవచ్చు. ఎవరి ఒత్తిడికీ లొంగి సంతకాలు చేయాల్సిన అవసరం లేదు. ముందు మీరు కాపురం పెట్టి మీ మధ్య అనుబంధాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించండి. మీరిద్దరూ సంతోషంగా ఉన్నారని తెలిశాక వాళ్లు మారే అవకాశం ఉంటుంది. మరీ పరిస్థితి తీవ్రంగా ఉంటే... మహిళా కమిషన్‌కి ఫిర్యాదు చేయండి. లేదా మహిళా పోలీసుల సాయం తీసుకుని కౌన్సెలింగ్ ఇప్పించండి.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

– మీ సందేహాలను, సమస్యల్ని vasulegal@eenadu.net కు పంపించగలరు.

చదువు

5జీకి దీటుగా కొత్త కోర్సు

టెక్నాలజీ రోజు రోజుకీ వేగంగా మారిపోతోంది. దానికి దీటుగా నిపుణులు మాత్రం అందుబాటులో ఉండటం లేదు. 3జీ, 4జీలు దాటి 5జీ వైపు దూసుకెళుతుంటే.. తగిన టెక్నీషియన్లు లేక టెలికాం సంస్థలు తడబడుతున్నాయి. ఈ నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ కొత్త కోర్సుకు శ్రీకారం చుట్టింది. అందుకు హెచ్‌సీయూ సాయం తీసుకుంది.



బీఎస్ఎన్ఎల్, హెచ్‌సీయూల ఆధ్వర్యంలో పీజీ డిప్లొమా

టెలికాం రంగంలో అపార అవకాశాలున్నా.. సంబంధిత నైపుణ్యాలున్నవారు తగినంతగా లేరు. 3జీ, 4జీలు వచ్చిన నేపథ్యంలోనే నిపుణులకు ఇంత గిరాకీ ఉంటే.. 5జీ అందుబాటులోకి వస్తే ఈ పరిస్థితి మరింత పెరుగుతుంది. ఉద్యోగ అవకాశాలు భారీగా ఉన్నా నిరుద్యోగులకు అవగాహన, తగిన శిక్షణ లేక వీటిని అందిపుచ్చుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో బీఎస్సీ లేదా ఇంజినీరింగ్ చేసినవారికి పీజీ డిప్లొమాను అందించటానికి బీఎస్ఎన్ఎల్ నిర్ణయించింది. హెచ్‌సీయూ (హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం)తో ఒప్పందం చేసుకొంది. దూరవిద్య ద్వారా అందించే ఈ కోర్సు పూర్తి చేసినవారు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు దక్కించుకునే అవకాశం ఉంటుంది.

పీజీ డిప్లొమా ఇన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కోర్సులో టెక్నాలజీ, ఫైనాన్స్, మార్కెటింగ్, కస్టమర్ రిలేషన్స్ అంశాలుంటాయి. దేశవ్యాప్తంగా ఇలాంటి కోర్సు ఇప్పటివరకూ మరే విశ్వవిద్యాలయం రూపొందించలేదు. 5 జీ వస్తున్న నేపథ్యంలో టెలికాంలో రానున్న నిపుణుల కొరతను దృష్టిలోపెట్టుకొని పట్టాలెక్కుతున్న కోర్సు ఇది. ప్రయోగాత్మకంగా బీఎస్ఎన్ఎల్ దీన్ని రూపొందించింది.

టెలికాం రంగంలో ఉన్న అవకాశాల దృష్ట్యా అదనపు అర్హతగా పీజీ డిప్లమో కోర్సు ఉపయోగపడుతుంది. ఇప్పటికే చిన్న ఉద్యోగాల్లో చేరినవారికి కూడా ఈ కోర్సు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నారు. దూరవిద్య ద్వారా అందిస్తున్న ఈ కోర్సుకు వారాంతాల్లో (శని, ఆది) తరగతులు నిర్వహిస్తారు. మిగతా రోజుల్లో పాఠ్యాంశాలకు సంబంధించిన మెటీరియల్ ఇస్తారు. ఖాళీ సమయాల్లో వీటిని చదువుకోవాల్సి ఉంటుంది. సెమిస్టర్ విధానంలో ఏడాదిలో రెండుసార్లు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. వీటితోపాటు ప్రయోగ పరీక్షలు ఉంటాయి. వీటిల్లో ఉత్తీర్ణత సాధిస్తే హెచ్‌సీయూ గుర్తింపుతో పట్టా వస్తుంది. ఈ కోర్సు పూర్తి చేసేనాటికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన పలు సంస్థలు ప్రాంగణ ఎంపికలు నిర్వహించే అవకాశం ఉండచ్చని నిర్వాహకులు వివరిస్తున్నారు.

ముఖ్యాంశాలు

- పీజీ డిప్లమో ఇన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్-2019 (పీజీడీటీటీఎం)
- దూరవిద్య విధానంలో తరగతులు నిర్వహిస్తారు.
- ప్రతి ఆరు నెలలకు పరీక్షలు ఉంటాయి.
- ప్రతి సెమిస్టర్‌కు రూ.20 వేల ఫీజు
- హైదరాబాద్ గచ్చిబౌలిలోని రీజనల్ టెలీకం ట్రైనింగ్ సెంటర్ (ఆర్‌టీటీసీ)లో తరగతులు
- హైదరాబాద్ నాంపల్లిలోని హెచ్‌సీయూ దూరవిద్యకేంద్రంలో జూన్, డిసెంబరుల్లో 6 రోజులు పరీక్షలు ఉంటాయి. 4 రోజులు ప్రయోగపరీక్షలు నిర్వహిస్తారు.

దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 28, 2019

కోర్సు కాలం: ఏడాది

అర్హతలు: బీఎస్సీ (ఫిజిక్స్, మేథ్స్), బీటెక్.

వెబ్‌సైట్: www.natfm.bsnl.co.in

- చిత్తులూరి మురళీకృష్ణ, ఈనాడు, హైదరాబాద్

మలి గెలుపు మార్గం!

జేఈఈ - 2019

తొలి విడత ప్రశ్నపత్రాల విశ్లేషణ

దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి జేఈఈ మెయిన్స్ ఏటా రెండుసార్లు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్న అనంతరం మొదటిసారి గత జనవరిలో పరీక్ష జరిగింది. విభిన్న ప్రమాణాలతో కూడిన ప్రశ్నల స్థాయులు సులభంగా, మధ్యమంగా ఉన్నాయి. మొదటి పరీక్ష తీరుతెన్నులను గ్రహించి మలి విడత విజయానికి మార్గాలు వేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నల సరళిని గ్రహిస్తే ఏప్రిల్‌లో జరగబోయే పరీక్ష ప్రిపరేషన్‌కు మరింత పదును పెట్టుకోవచ్చు.

ఈ ఏడాది నుంచి జేఈఈ మెయిన్ ఆల్ ఇండియా ర్యాంకులను మార్కులపై కాకుండా వాటి పర్సంటైల్‌పై ఇచ్చారు. దీంతో ఈసారి ఈ పరీక్ష ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. ఆల్ ఇండియా టాప్ 100 పర్సంటైల్ సాధించినవారిలో తెలుగు రాష్ట్రాల నుంచి ఆరుగురికిపైగా ఉండటం మన ఘనతకు నిదర్శనం.

జేఈఈ - 2019 మొదటి విడత దరఖాస్తు చేసిన వారు 9,29,198. పేపర్-1కి హాజరైనవారు 8,74,469. పేపర్-2 (బీఆర్క్)కి హాజరైనవారు 1,45,386.

ఎలా ఉన్నాయ్?

జేఈఈ మెయిన్-2019 మొదటి విడత జనవరి 8 నుంచి 12 తేదీల్లో కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించారు. అందులో జనవరి 8న పేపర్-2 (బీఆర్క్)ను నిర్వహించగా, జనవరి 9-12 తేదీల్లో రోజుకు రెండు షిఫ్టుల్లో నాలుగు రోజుల్లో 8 ఆన్‌లైన్ పేపర్ల ద్వారా జేఈఈ మెయిన్-19 పేపర్-1ను నిర్వహించారు. మొత్తంగా నాలుగు రోజుల్లో 8 విభిన్న ప్రశ్నపత్రాల్లో ఆన్‌లైన్ విధానంలో విద్యార్థులు పరీక్ష రాశారు.

8 పేపర్లూ వేటికవే ప్రత్యేకంగా సబ్జెక్టులు, ప్రశ్నలు, వాటి ఆప్షన్లన్నీ జంబ్లింగ్ విధానంలో ఉన్నాయి. అయితే విభిన్న ప్రమాణాల్లో ఈ ప్రశ్నపత్రాలున్నాయి. వీటి వల్ల విద్యార్థులకు అన్యాయం జరగకుండా ఉండటానికి మార్కులపై పర్సంటైల్ విధానంలో ఫలితాలను ప్రకటించారు.

పర్సంటైల్ ఇలా లెక్కిస్తారు

$$\text{విద్యార్థి మార్కులపై పర్సంటైల్} = \frac{B \times 100}{A}$$

A = పరీక్షకు హాజరైన విద్యార్థులు (పేపర్-1కు 8,74,469 మంది, పేపర్-2కు 1,45,386 మంది)

B = ఆ పరీక్షలో అతని మార్కులు లేదా అంతకన్నా తక్కువ మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య

దీనిని జేఈఈ మెయిన్‌లో ఆ విద్యార్థి సాధించిన మొత్తం మార్కులపై, అతని మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ మార్కులపై కూడా విడివిడిగా లెక్కించి వాటి ఆధారంగా అఖిల భారత స్థాయి ర్యాంకులను ప్రకటిస్తారు.

ఆలిండియా ర్యాంకు లెక్కించాలంటే?

ఒక విద్యార్థి సాధించిన పర్సంటైల్ స్కోరు నుంచి అతని అఖిల భారత ర్యాంకును లెక్కించడానికి ఈ సూత్రాన్ని ఉపయోగిస్తారు.

$$\text{విద్యార్థి ఆలిండియా ర్యాంకు} = \frac{(100-B) \times A}{100}$$

A = పరీక్షకు హాజరైన విద్యార్థులు (పేపర్-1: 8,74,469; పేపర్-2: 1,45,386)

B= విద్యార్థి సాధించిన పర్సంటైల్

ఏ స్థాయిలో ఉన్నాయి?

మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ .. అన్ని పేపర్లలోనూ తేలిక, మధ్యమ స్థాయి ప్రశ్నలకే పెద్దపీట వేశారు. చాలావరకూ రెండేళ్ల ఇంటర్మీడియట్ సిలబస్‌ను క్షుణ్ణంగా చదివిన ప్రతి విద్యార్థికీ జేఈఈ మెయిన్‌లో మంచి మార్కులు తద్వారా మంచి పర్సంటైల్ సాధించే దిశగానే పేపర్ల స్థాయి ఉంది. ఎక్కువ శాతం ప్రశ్నలన్నీ సిలబస్‌కు లోబడి, అందులోని మౌలిక (బేసిక్) అంశాలపై, వాటి సమీకరణాలు, అప్లికేషన్స్‌పై విద్యార్థుల గ్రహణ, సృజనాత్మక శక్తులను వెలికితీసేలా ఇచ్చారు.

ఇవి గుర్తుంచుకోండి!

ప్రశ్నపత్రాల సారూప్యత: పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షలో 8 ప్రశ్నపత్రాల్లో సారూప్యతను గమనించొచ్చు. ఒక తేదీలో ఒక స్లాట్‌లో ఇచ్చిన ప్రశ్నపత్రంలోని ప్రశ్నల మాదిరిగానే మిగిలిన ప్రశ్నపత్రాల్లోని ప్రశ్నలు పోలి ఉన్నాయి. అంటే రేపు ఏప్రిల్‌లో నిర్వహించే జేఈఈ మెయిన్ రెండో దఫా పరీక్షను ఎదుర్కొనే విద్యార్థులు జనవరిలో నిర్వహించిన మొదటి దఫా ఎనిమిది ప్రశ్నపత్రాలను దగ్గర ఉంచుకుని అదే తరహా ప్రశ్నలను ప్రతి సబ్జెక్టులో సాధన చేయడం మేలు.



జనవరిలో నిర్వహించిన మొదటి విడత పరీక్ష ఎనిమిది ప్రశ్నపత్రాల ఆధారంగా అదే తరహా ప్రశ్నలను విద్యార్థులు సాధన చేయడం మంచిది.

సిద్ధాంత, సమీకరణ మిళిత అంశాలు: జనవరిలో నిర్వహించిన పరీక్షలో ఎనిమిది పేపర్లలో ముఖ్యంగా కెమిస్ట్రీ, ఫిజిక్స్‌ల్లో ఎక్కువ ప్రశ్నలు సిద్ధాంతపరమైన, డైరెక్ట్ ప్రశ్నలు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల అంశాలపై అడిగారు. ఫిజికల్ కెమిస్ట్రీలో సుమారు 7 నుంచి 8 ఫార్ములా ఆధారిత ప్రశ్నలు, ఇనార్గానిక్ కెమిస్ట్రీలో సుమారు 6-8 ప్రశ్నలు నేరుగా థియరీ ఆధారితమైనవీ ఉన్నాయి. అలాగే ఫిజిక్స్‌లో సుమారు 15 ప్రశ్నలకుపైగా డైరెక్ట్ ఫార్ములా, కనీసం 5 సిద్ధాంతపరమైనవి ఉన్నాయి. కాబట్టి, ఆ దిశగా సన్నద్ధమవ్వాలి. మ్యాథ్స్‌లో ఎక్కువ శాతం తేలిక, మధ్యమ స్థాయి ప్రశ్నలున్నాయి. అందులోనూ ఎక్కువ శాతం ఒకే టెక్నిక్, ఒకే కాన్సెప్ట్ సంబంధిత ప్రశ్నలు ఉన్నాయి.


★ ఇంటర్ ద్వితీయ సంవత్సర సిలబస్‌కు ప్రాధాన్యమివ్వాలి. ★ కనీసం రోజుకు ఒక ఆన్‌లైన్ ప్రశ్నపత్రాన్ని సాధన చేయాలి. ★ పాత జేఈఈ మెయిన్ ప్రశ్నపత్రాలు, జనవరిలో నిర్వహించిన వాటినీ సాధన చేస్తే కచ్చితంగా రెండో దఫా మెయిన్ పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయి.

- ఎం. ఉమాశంకర్, శ్రీచైతన్య విద్యాసంస్థలు

సబ్జెక్టులవారీగా ప్రశ్నల స్థాయి పట్టికలు, పర్సంటైల్ విశ్లేషణ వివరాలను www.eenadupratibha.net లో చూడవచ్చు.

ఎక్కువ ప్రశ్నలు వేటిలో?

నాలుగురోజుల్లోనూ జరిగిన అన్ని పరీక్షలనూ పరిశీలించి మూడు సబ్జెక్టుల్లో ఎక్కువ శాతం ప్రశ్నలు ఏ విభాగాల్లో వచ్చాయో గమనించాలి. ద్వితీయ సంవత్సరం సిలబస్ నుంచే అధిక ప్రశ్నలు వచ్చాయి.



మ్యాథ్స్ బైనామియల్ థీరమ్, మ్యాట్రిసెస్, డిటర్మినెంట్స్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, సీక్వెన్సెస్ అండ్ సిరీస్, పర్మ్యుటేషన్స్ అండ్ కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, స్ట్రయిట్ లైన్స్ అండ్ పెయిర్ ఆఫ్ స్ట్రయిట్ లైన్స్, సర్కిల్స్ అండ్ సిస్టమ్ ఆఫ్ సర్కిల్స్, పారాబోలా, లిమిట్స్, మొనాటానసిటీ అండ్ మ్యాక్సిమా మినిమా, మీన్ వాల్యూ థీరమ్స్, డెఫినిట్ ఇంటిగ్రేషన్, ట్రిగనామెట్రిక్ ఈక్వేషన్స్ వంటి చాప్టర్ల నుంచి కనీసం రెండు ప్రశ్నలు వచ్చాయి. ఇవి కాకుండా మిగిలిన చాప్టర్లలో ఒక్కో ప్రశ్న వచ్చింది. కాబట్టి, కచ్చితంగా రెండు ప్రశ్నలు వచ్చే అంశాలపై ఎక్కువ దృష్టిసారిస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇందులో ఎక్కువశాతం ప్రశ్నలు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఇంటర్ ద్వితీయ సంవత్సర సిలబస్ నుంచే ఉన్నాయి.



ఫిజిక్స్ యూనిట్స్ అండ్ మెజర్‌మెంట్స్, కైనమాటిక్స్, లాస్ ఆఫ్ మోషన్, వర్క్, పవర్ అండ్ ఎనర్జీ, రొటేషనల్ మోషన్, గ్రావిటేషన్, థర్మోడైనమిక్స్, కైనెటిక్ థియరీ ఆఫ్ గ్యాసెస్, సిపుల్ హార్మోనిక్ మోషన్, జామెట్రికల్ అండ్ ఫిజికల్ ఆప్టిక్స్, ఎలక్ట్రో స్టాటిక్స్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, మాగ్నటిక్ ఎఫెక్ట్స్ ఆఫ్ కరెంట్, ఎలక్ట్రో మాగ్నటిక్ ఇండక్షన్, ఏసీ వంటి చాప్టర్ల నుంచి కనీసం రెండు ప్రశ్నలు అడిగారు. మిగిలిన అధ్యాయాల నుంచి కనీసం ఒక ప్రశ్న వచ్చింది. ఇంటర్ ద్వితీయ సంవత్సర సిలబస్‌లోని అంశాలపైనే ఎక్కువ శాతం ప్రశ్నలు అడిగారు. కాబట్టి, ద్వితీయ సంవత్సర సిలబస్‌పై కచ్చితమైన పట్టు ఉంటే ఫిజిక్స్‌లో మంచి మార్కులతోపాటు మంచి పర్సంటైల్‌నూ సాధించవచ్చు.



కెమిస్ట్రీ ఫిజికల్ కెమిస్ట్రీ నుంచి అటామిక్ స్ట్రక్చర్, స్టాయికియోమెట్రీ, థర్మోడైనమిక్స్, కెమికల్ ఈక్విలిబ్రియమ్, సాలిడ్ స్టేట్స్, ఎలక్ట్రో కెమిస్ట్రీ చాప్టర్ల నుంచి రెండు ప్రశ్నల చొప్పున అడిగారు. మిగిలిన అధ్యాయాల నుంచి ఒక ప్రశ్నను మాత్రమే అడిగారు.

ఇనార్గానిక్ కెమిస్ట్రీ నుంచి ఎస్, పి బ్లాక్ ఎలిమెంట్స్, ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ, మెటలర్జీ, హైడ్రోజన్స్ అండ్ కాంపౌండ్స్ నుంచి ఎక్కువ శాతం ప్రశ్నలను అడిగారు. అది కూడా ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ నుంచి సిద్ధాంతపరమైన ప్రశ్నలను అడిగారు.

ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఆల్కైల్ హాలైడ్స్, కార్బాక్సిలిక్ యాసిడ్స్ అండ్ డెరివేటివ్స్, నైట్రోజన్ కంటైనింగ్ కాంపౌండ్స్ వంటి అంశాల నుంచి కనీసం రెండు నుంచి మూడు ప్రశ్నలవరకు ఎక్కువగా సిద్ధాంతపరమైనవి, మెకానిజమ్స్‌పై ప్రశ్నలను ఇచ్చారు. పై మూడు విభాగాల నుంచి కూడా ఎక్కువశాతం ప్రశ్నలు ద్వితీయ సంవత్సరం సిలబస్ నుంచే ఉన్నాయి.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎన్ఏఆర్ఎఫ్‌బీఆర్‌లో టెక్నికల్ పోస్టులు

హైదరాబాద్‌లోని జాతీయ జీవ వైద్య పరిశోధన జంతు వనరుల సంస్థ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు: టెక్నికల్ అసిస్టెంట్- 04, ల్యాబ్ అటెండెంట్- 12, మల్టీ టాస్కింగ్ స్టాఫ్- 04. మొత్తం ఖాళీలు- 20. **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **ఎంపిక:** రాత పరీక్ష ఆధారంగా. **ఆఫ్‌లైన్ దరఖాస్తు చివరితేది:** 25.02.2019. **వెబ్‌సైట్:** www.narfbr.org

సీడ్యాక్‌లో ప్రాజెక్ట్ ఇంజినీర్లు

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టు-ఖాళీలు:** ప్రాజెక్ట్ ఇంజినీర్(డెవలపర్/ ఐఎస్ఎస్/ హైస్పీడ్ నెట్‌వర్కింగ్)- 07, ప్రాజెక్ట్ ఆఫీసర్(ఈ లెర్నింగ్)- 01. **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/ బీటెక్, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 37 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేది:** 15.02.2019. **వెబ్‌సైట్:** https://cdac.in/

అర్హత పరీక్ష

సీటెట్-జులై 2019

జాతీయస్థాయిలో ఉపాధ్యాయ ఉద్యోగాల అర్హతకు నిర్వహించే సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్-జులై 2019 ప్రకటనను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) విడుదల చేసింది. **అర్హత:** పేపర్ 1, 2 పరీక్షను అనుసరించి సీనియర్ సెకండరీ, బ్యాచిలర్ డిగ్రీతో పాటు డీఈఎల్ఈడీ/ బీఈఎల్ఈడీ/ డీఎడ్(స్పెషల్ ఎడ్యుకేషన్)/ బీఈడీ/ బీఎడ్(స్పెషల్ ఎడ్యుకేషన్) ఉత్తీర్ణత. బీఎడ్/ డీఎడ్ చివరి సంవత్సరం చదువుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: దీనిలో రెండు పేపర్లు ఉంటాయి. 1-5 తరగతుల(ప్రైమరీ స్టేజ్) అభ్యర్థులకు పేపర్ 1, 6-8 తరగతుల(ఎలిమెంటరీ స్టేజ్) అభ్యర్థులకు పేపర్ 2 రాయాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా మొత్తం 97 నగరాల్లో ఈ పరీక్ష జరుగనుంది. **రాతపరీక్ష తేది:** 07.07.2019.

ఫీజు: జనరల్/ ఓబీసీలకు ఒక పేపర్‌కు అయితే రూ.700, రెండింటికి రూ.1,200; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఒక పేపర్‌కు రూ.350, రెండింటికీ రూ.600. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభ తేది:** 05.02.2019. **చివరితేది:** 05.03.2019. **దరఖాస్తు ఫీజు చెల్లింపు చివరితేది:** 08.03.2019. https://ctet.nic.in/

యూజీసీ నెట్- జూన్ 2019

దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు, జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ అర్హత కోసం నిర్వహించే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (యూజీసీ నెట్) జూన్-2019కు సంబంధించిన సంక్షిప్త ప్రకటనను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసింది. **అర్హత:** సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత. **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్షలో పేపర్-1, 2 ఉంటాయి. **రిజిస్ట్రేషన్ తేదీలు:** 2019 మార్చి 1 నుంచి 30 వరకు. **ప్రవేశ పత్రాల డౌన్‌లోడింగ్ తేది:** 15.05.2019. **పరీక్ష తేదీలు:** 2019 జూన్ 20, 21, 24, 25, 26, 27, 28. **ఫలితాలు:** 2019 జులై 9. **వెబ్‌సైట్:** https://ntanet.nic.in/

అప్రెంటిస్‌షిప్

మజ్‌గావ్ డాక్ షిప్‌బిల్డర్స్

ముంబయిలోని మజ్‌గావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్(ఎండీఎస్ఎల్) అప్రెంటిస్ శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్- 73, డిప్లొమా అప్రెంటిస్- 07. **ఇంజినీరింగ్ విభాగాలు:** కెమికల్, కంప్యూటర్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్, మెకానికల్, ప్రొడక్షన్. **శిక్షణా కాలం:** ఏడాది. **అర్హత:** సంబంధిత విభాగంలో ఇంజినీరింగ్ డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణత.

ఎంపిక: విద్యార్హత మార్కుల ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** 10.02.2019. **వెబ్‌సైట్:** http://mazagondock.in/